# జీవన పోరాటం

నవల

– మంథా భానుమతి



శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 71

కౌముది మాసపత్రికలో

జనవరి 2012 సంచిక నుంచి డిసెంబర్ 2013 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# 1

**ర్యాలి గ్రామం, మార్చ్,1947:**

గున్నమామిడి చెట్టుమీద కోయిల కుహు కుహూ రాగాలు పలికిస్తోంది. కొద్దిగా గట్టిపడుతున్న మామిడిపిందెలు కొరకడానికి రాచిలుకలు ఎర్రటిముక్కులతో ప్రయత్నిస్తూ నేస్తాలతో ఊసులాడుతున్నాయి. సూర్యోదయం అయి మూడు గంటలయింది. ఆకు ఆకునీ పలుకరిస్తూ పైపైకి నడుస్తున్నాడు సూరీడు. మామిడి తోటంతా పిందెలతో కళకళ్ళాడుతోంది.

గిరిధారి పిల్లంగ్రోవి ఊదుకుంటూ కొమ్మలమీద ఊగుతున్నాడు.. ప్రపంచంలో తనకెదురే లేదన్నట్లుగా.. మధ్యలో మామిడికాయ కొరుకుతూ. నీరెండలో మామిడి చిగురురంగులోకి మారిన మొహం నల్లని ఉంగరాలజుట్టులోంచి మేఘాల మధ్యన ఉదయిస్తున్న సూర్యబింబంలా ఉంది.

"గిరిధారీ! పరీక్షలు దగ్గరకొస్తుంటే నువ్వీ మావిడితోటలో ఏం చేస్తున్నావూ? గట్టిగా నాలుగు ముక్కలొస్తేనే గదరా.. నాలుగు వేళ్ళూ నోట్లోకెళ్ళేది. తోటల్లో దొడ్లల్లో వేళ్ళాడ్డం తప్పుతే అక్షరమ్ముక్క నేర్చుకుందావనుందా లేదా.." అంతూ దరీలేకుండా వాయిస్తున్న బంగారత్తని చూసి ఒక్క దూకు దూకి పరిగెత్తబోయాడు గిరి.

"ఆగరా.. ఆగు. నేన్నీతో సమంగా పరుగెత్తలేను. కాకపోతే.. మీ ఇంటికొచ్చి నీ నిర్వాకాలు చెప్పలేననుకున్నావా? దొడ్లో ఒక్క మావిడిపిందేనా, జాంపిందేనా ఉంచుతున్నావ్రా.."

ఠక్కున ఆగిపోయాడు గిరిధారి. అసలు బంగారత్త కంఠవే చాలు. ఇంక ఇంటికొచ్చిందంటే.. గిరికి చెమట్లు ధారగా కారాయి. అదును చూసుకుని, జుట్టు పట్టుకుని బరబరా ఇంట్లోకి లాక్కెళింది.

బంగారత్త గిరికి బంధువేం కాదు. ఆ మాటకొస్తే ఆవిడంటే గిరి ఇంట్లో వాళ్ళకి అంత సదభిప్రాయం కూడా లేదు. బ్రాహ్మణ పుట్టక పుట్టి.. మాటలు రాని మొగుణ్ణి పక్కనబెట్టి, అతని వాటాకొచ్చిన ఆస్థిని పంచెయ్యమని పేచీపెట్టి, మగరాయుడ్లా పొలం పనులు చూసుకుంటుంది. బావగారని కూడా లెక్కచెయ్యకుండా ఎదురుగా నిలబడి మాట్లాడేస్తుంది. మొగుడు ఆవిడ ఏది చెప్తే అది వింటాడు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ. ఇవన్నీ మంచినీళ్ళ బావి దగ్గర అందరూ మాట్లాడుకుంటుంటే గిరి చెవిన పడుతుంటాయి.

గిరికి మాత్రం బంగారత్త అంటే చాలా ఇష్టం. దెబ్బలాడి వేరే వెళ్ళింది కనకే స్వతంత్రంగా వాళ్ళకిష్టమొచ్చినవి చేసుకు తింటూ హాయిగా ఉన్నారు. కలిసున్నప్పుడైతే బంగారత్త ఎప్పుడూ వంటింట్లో తడి చీర కట్టుకుని వంట చేస్తూ.. చివరాకరికి అంతా తినేశాక పెచ్చుకట్టిన అన్నం, అడుగంటిన పప్పు వేసి, నీరుకావి పంచ కట్టుకున్న మావయ్యకి పెట్టి అదే కంచంలో నాలుగు ముద్దలు తినేది. ఒంటిగంట భోయనానికి వెళ్ళినప్పుడు గిరి చూస్తుండేవాడు. ఇపుడైతే మావయ్య ఎప్పుడూ నీలిమందు పెట్టి చలువ చేసిన గ్లాస్కో పంచ లాల్చీతో హుషారుగా ఉంటున్నాడు. ఇంక అత్తయ్య అయితే చెప్పక్కర్లేదు. జరీఅంచు కనిపించేలా గోచీ పోసి కట్టుకున్న నూరోనంబరు నేతచీరతో, తెల్లని మల్లు జాకెట్టుతో ఎప్పుడూ నవ్వుతూ కళకళ్ళాడుతూ ఉంటోంది.

"పంచాయితీ పెట్టించి వెధవపని చేసి, వీధికెక్కింది కనకే పిల్లల్లేరు. ఏం చేసుకుంటుందో ఆస్థంతా.." బంగారత్త తోటికోడలు మెటికలు విరుస్తుంటే గిరికి వింతగా ఉంటుంది. బంగారత్తకి ఎప్పట్నుంచో పిల్లల్లేరు కదా.. వేరుపడి రెండేళ్ళుకూడా అవలేదు. గిరికి గుర్తే.. వాడు నాలుగో క్లాసులో ఉన్నప్పుడు ఒకరోజు బంగారత్త తన పెళ్ళిచీర గోచీపోసి కట్టుకుని, మొగుడి చెయ్యి పట్టుకుని బరబరా లాక్కెళ్ళి కరణంగారింటికి విసవిసా నడుచుకుంటూ వెళుతుంటే చూసి, కూడా వెళ్ళాడు. ఎప్పుడూ భయంగా, బెదురుచూపులు చూస్తూ నూద్దగ్గర బియ్యంకడుగుతూనో, అంట్లు తోముతూనో.. బట్టలుతుకుతూనో కనిపించే బంగారత్తని అంత కోపంగా చూడ్డం అదే గిరీ వాళ్ళకి, బంగారత్తవాళ్ళ పాత ఇంటికి కలిపి ఒకటే నుయ్యి.. సరిహద్దులో ఉంటుంది.

"చూడండి కరణం గారూ! ఇది ఊరా వల్లకాడా! మూగాడయితే అయ్యాడు.. ఈయనా వాళ్ళబ్బకి పుట్టినాయనే కదా.. ఆయనకి నోరులేదుకదాని, నేనుకూడా నోరుమూసుకుని చాకిరీ చేస్తూ, పడేసే మెతుకులు తింటూ కాలక్షేపం చేస్తున్నాను. ఒక్కినరంలా ఉన్న మనిషిని గొడ్డును బాదినట్లు బాదేస్తే ఎందుకు భరించాలి చెప్పండి. పెద్దలంతా కలిసి మావాటా మాకిప్పిస్తే కలో గంజో కాచుకుని నేనూ నా మొగుడూ బతుకుతాం. మీరేం చెయ్యలేనంటే చెప్పండి.. ఇద్దరం కల్సి ఇలాగే ఎన్ని కోసులైనా నడిచి గోదాట్లో దూకేస్తాం." కరణంగారి అరుగు మీద కూర్చున్న పెద్దమనుషులందరితో గట్టిగా అనేసింది.

బంగారత్త మొగుడి ఒంటి మీదున్న వాతలు చూసి ఊరి పెద్దమనుషులెవరికీ నోట్లో మాట రాలేదు. రక్తాలు కారిపోతున్నాయి. దెబ్బలు తిన్నాయన వాటిని చూసుకుంటూ, కళ్ళల్లో కారే నీటిని కుడిచెయ్యి వెనక్కి తిప్పి తుడుచుకుంటూ వెర్రిగా చూసి నవ్వాడు.

కొంగు నిండుగా కప్పుకుని, రోషంగా, ఎర్రని కళ్ళతో.. తల కొద్దిగా వంచుకున్నా స్థిరంగా స్పష్టంగా అడుగుతున్న బంగారత్త.. నరకాసురుడ్ని చంపడానికి లేచిన సత్యభామలా ఉంది.

కరణంగారు వెంటనే పాలేరును పిలిచి బంగారత్త బావగారిని పిలిపించారు. ఆయన ఠీవిగా నడుచుకుంటూ వచ్చి, అక్కడున్న పెద్దమనుషులందర్నీ చూసి ఖంగుతిని కనుబొమ్మలు ముడిచారు.

"నోరులేని వాడ్ని ఎందుకు కొట్టాల్సి వచ్చింది చెప్పండి శర్మగారూ?"

శర్మగారికి అంతమందిలో నోరు పెగల్లేదు. క్రోధంగా మరదలుకేసి చూశారు. ఇంత బరితెగింపా.. ఇంటికి పద.. నీక్కూడా వడ్డిస్తే కానీ.. అటు తమ్ముడేమో దీనంగా, భయంగా చూస్తున్నాడు.. ఏం చెప్పాలి? అసలు ఈ మూగవెధవని కన్న తండ్రిననాలి. ఎందుకూ కొరగాని పింజారీ వెధవ..

"శర్మగారూ.." ఆవూరికల్లా పెద్ద మోతుబరి రాజుగారు పిలుస్తుంటే ఉలిక్కి పడ్డాడు శర్మగారు.

"బాబుగారూ! ఆయనేం అంటారు.. నేను చెప్తా వినండి. ఆవు దూడలు రెండూ తాళ్ళు తెంచుకుని తల్లుల దగ్గర్నుంచి పాలు తాగేశాయి. అవి అరిచి అల్లరి చేస్తుంటే ఈయనగారికి చెవుడు కూడా ఉంది కదా.. వినిపించలేదు. మామూలుగా నేను చూసుకుంటాను. ఇవేళ ఈ రాజుగారి భార్య పురిటినొప్పులు పడుతుంటే సాయానికి వెళ్ళాను. అందుకనండీ.. రోజూ ఎంత హీనంగా చూస్తున్నా సర్దుకు పోతున్నావండి. ఇంక మా వల్ల కాదు. తిండికి లేక మావాళ్ళు ఈయని కిచ్చి కట్టబెట్టారు. ఆయన్ని బతికించుకోడం నా బాధ్యత కాదండీ!"

బంగారత్త మాటలకి రాజుగారు వెంటనే స్పందించారు. ఊళ్ళో ఆయన మాటంటే వేదవాక్కే. పైగా పొద్దున్నే సూర్యోదయంతోనే వంశోద్ధారకుడు పుట్టాడని మహా సంతోషంగా ఉన్నారు. మూగపంతులుకి న్యాయం చెయ్యవలసిందే. ఆ దంపతులకి జరుగుతున్న అన్యాయాలు ఆయన చెవిన పడుతూనే ఉన్నాయి. వాళ్ళ కుటుంబ వ్యవహారాలజోలికి ఎందుకెళ్ళడవని ఊరుకున్నారిన్నాళ్ళూ. ఇప్పుడు పంచాయితీకొచ్చింది కనుక అవకాశం వచ్చింది.

"చూడండి శర్మగారూ.. మన ఊరికి కొన్ని కట్టుబాట్లున్నాయి. అన్నదమ్ములు విడిపోవలసి వస్తే అందరం కూర్చుని న్యాయంగా ఎవరి వాటా వారికి ఏర్పాటు చెయ్యాలి. ఆ విధంగా జరిగితేనే ఊరంతా ఒక తాటిమీదున్నట్టు. ఏవంటారు?"

ఏవంటారు శర్మగారు.. బంగారత్తని కొరకొరా చూస్తూనే ఆ మధ్యాన్నవే ఆస్థి పంపకాలు చెయ్యడానికొప్పుకున్నాడు. లేకపోతే ఇహనేవన్నాఉందా? వెలి వేసినట్లే అయిపోతారు. చెన్నపట్నంకోర్టుకెళ్ళినా మూగ వెధవ వాటా వాడికివ్వాల్సిందే కద!

అలా.. తోట, తోటలో బంగాళా పెంకులిల్లు, పదెకరాల వరిపొలం, ఒక ఆవు పాడి బంగారత్త వాటాకి రావడం గిరి ఆనందంగా చూశాడు. అప్పట్నుంచీ గిరికి తోటలో బంగాళాపెంకుల ఇంట్లోకెళ్ళి కబుర్లు చెప్పడం, అత్తయ్య చూసీచూడకుండా కాయలు కోసుకోడం అలవాటయింది.

తోటలోంచి గిరిని ఇంట్లోకి లాక్కొచ్చి ఉయ్యాలబల్లమీద కూలేసింది బంగారత్త.

"ఏవిరా మాట్లాడవూ.. బడేవయిందీ? పొద్దున్నించీ తిండేవయినా తిన్నావా?"

చేతిలో ఉన్న మావిడిపిందె చూపించాడు గిరి.

"అఘోరించినట్టేఉంది. దాంతో కడుపు నిండుతుందా! పద అన్నం పెడతాను. కూరముక్కైపోయిందనుకో.. పప్పూ, పులుసు ఉన్నాయి. నూర్దగ్గరకెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కునా."

నట్టింట్లో పీటవేసి, అరటి పాయలో అన్నం, పప్పు వేసి, పులుసు, మజ్జిగ, నేతి గిన్నెలు పక్కన పెట్టుకుని గిరి పక్కనే కూచుంది బంగారమ్మ. పప్పు, పులుసూ కలుపుకుని, తలెత్తకుండా పెద్ద పెద్ద ముద్దలు తీసుకుని తినసాగాడు గిరి. బంగారమ్మకి తను ఉమ్మడిలో ఉన్నప్పటి అనుభవంలా అనిపించి కడుపు తరుక్కుపోయింది. ఆవిడకి ఆకలి బాధ ఎలాంటిదో ఎవరూ చెప్పక్కర్లేదు. మజ్జిగా అన్నం తనే కలిపి, ఆకులో వేసి మాగాయపేడు పక్కనేసింది.

"నిమ్మళంగా తిన్నా వెధవన్నా! డెక్కువస్తుంది. ఈ నీళ్ళు తాగు ముందు."

తృప్తిగా భోంచేసిన గిరిని ఉయ్యాలబల్లమీద పక్కన కూర్చోపెట్టుకుని బడి గురించి అడిగింది నెమ్మదిగా.

"మరేమో బంగారత్తా.. బళ్ళో జీతం మూణ్ణెళ్ళనుంచీ కట్టలేదని పేరు తీసేశారు. అయినా వెళ్ళి వెనకాల కూర్చునే వాణ్ణి. ఇవేళ అది కూడా కుదరదని గెంటేశారు."

బంగారమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మీ తాతగారు నెలకి అర్ధరూపాయి కట్టలేకపోయ్యారా? ఒక్కగానొక్క మనవడివి.."

"తాతగారిచ్చారు అత్తా. కానీ.." గిరి నేలచూపులు చూశాడు.

"అర్ధవైందిలే. మీ పిన్ని లాగేసుంటుంది. ఏబ్రాసి, కక్కుర్తి మొహాలు. దాంతో మేడలు కడుతుందా.."

"అమ్మన్న జుట్టు పీచులా అయిపోతోందని కొబ్బరినూనె తెమ్మంది."

"ఐతే మాత్రం పిల్లాడి చదువు మానిపిస్తారా ఎవరైనా? నువ్వు కూడా మీ నాన్నలా పనీ పాటూ లేకండా తిరగాలా?"

బంగారత్తని రోషంగా చూశాడు గిరి.

"సరే సరే.. మీ వాళ్ళనేం అనన్లే. ఎన్ని నెల్ల జీతం అన్నావూ.. ఇదిగో ఈ రెండ్రూపాయలూ తీసుకెళ్ళి కట్టేయ్. వద్దులే, నేను కూడా వస్తా. ఎలాగా మగరాయుడని పేరొచ్చింది కదా నాకు." బంగారమ్మ లేచి గిరి వెంట బయలుదేరింది.

●●●

జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఉషోదయ కాంతులు ప్రాకారంలోనికి చొచ్చుకొనిపోయి వింతకాంతులు వెదజల్లుతున్నాయి. ప్రధాన పూజారి రామదీక్షితులు బ్రాహ్మీ ముహూర్తంలో లేచి స్నానం, సంధ్యావందనం చేసి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ గుడికి బయలుదేరారు.

రామదీక్షితులు దబ్బపండు వంటి శరీరచ్ఛాయతో నుదుట నామంతో, విష్ణుసహస్రనామాలు వల్లెవేస్తూ, డెబ్బైయ్యేళ్ళు పైబడి పండుతమలపాకులా మెరిసిపోతూ ఉంటారు. ర్యాలి గ్రామంలోనే కాదు.. ఆ చుట్టుప్రక్కల పల్లెల్లో కూడా ఎవరికి ఏ శుభకార్యానికి ముహుర్తం పెట్టాలన్నా, జాతకచక్రాలు వెయ్యాలన్నా, దీక్షితులుగారి దగ్గరికి రావలసిందే. శాస్త్రపరంగా ఎవరికి ఏ సందేహం వచ్చినా ఆయన్ని సంప్రదించవలసిందే.

"తాతగారూ! ఆగండి. మీ అంత గబగబా నే నడవలేనుకదా!" ఆరేళ్ళ మనవరాలు అమ్మన్న ఆయాసపడుతూ వెంటపడింది.

"ఇంత పొద్దున్నే నువ్వుకూడా ఎందుకు తల్లీ.. స్నానం అయిందా?"



కౌముది

"బామ్మ చేయించింది తాతగారూ! నేను రాకపోతే దేవుడికి పువ్వులు మాల ఎవరు కడతారూ? అందుకనే తొందరగా లేచేశాను చూశారా.. బామ్మ తర్వాత వస్తానంది."

దీక్షితులు నవ్వుతూ అమ్మన్న చేతిని పట్టుకుని నెమ్మదిగా నడవసాగాడు.

తెలతెల వారుతుండగా భక్తులు రావడం మొదలు పెడతారు. ఆ లోపుగానే దీక్షితులు ఆలయం తోటలో ఉన్న అన్ని రకాల పూలు కోసి, అలంకరించి నిత్య పూజ చేసేస్తారు.

దీక్షితులుకి తాతముత్తాతల నుంచి సంక్రమించిన ఆస్థి బాగానే ఉండేది. ఆరుగురు కూతుళ్ళు. ఒక్కొక్క ఆడపిల్ల పెళ్ళికీ రెండేసి ఎకరాల చొప్పున అమ్మేశారు. మిగిలిన కొద్ది భూమి మధ్య మధ్య మేట వేసేస్తుంటుంది.. గోదావరి వరదలొచ్చినప్పుడల్లా.

ఒక్కడే కొడుకు.. కేశవుడు. వాడికి స్మార్తం వంటబట్టలేదు. ఎవరైనా పిలుస్తే భోక్తగా వెళ్ళడం తప్ప వేరే వ్యాపకం లేదు. ముప్పై ఏళ్ళుంటాయి. కేశవుడి మొదటిభార్య కొడుకే గిరిధారి. గిరి పుట్టినప్పుడే వాడి తల్లి బాలింత జబ్బుతో కన్ను మూసింది. రావులపాలెంలో యాయవారం చేసుకునే బీదబ్రాహ్మడి కూతురు సూరమ్మ నిచ్చి కొడుక్కి రెండో పెళ్ళి చేశారు రామదీక్షితులు.

చాలీ చాలని ఆదాయం.. గుళ్ళో వచ్చేది అంతంతమాత్రం. నిత్యం ఆరుగురికీ నాలుగు వేళ్ళూ లోపలికి వెళ్ళడం జగన్మోహినీ కేశవస్వామి కటాక్షం ఉంటేనే.

"అన్నయ్య ఏం చేస్తున్నాడమ్మా?" చిన్ని చిన్ని చేతులతో, బామ్మ ఇచ్చిన సూదీ దారంతో తెల్లగన్నేరు పువ్వులు గుచ్చుతున్న అమ్మన్నని మురిపెంగా చూస్తూ అడిగారు దీక్షితులు.

అమ్మన్న కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వణుకుతున్న పెదవుల్తో ఏదో చెప్పబోయి ఆగిపోయింది. కడుతున్న పువ్వులమాలని అరిటాకులో పెట్టేసి వెక్కుతోంది.

"అరే! ఏమయింది తల్లీ? అన్నయ్య నిన్నేమైనా కొట్టాడా?" గుడి అరుగుమీద అమ్మన్న పక్కనే కూర్చుని అడిగారు దీక్షితులుగారు, కడుతున్న తులసి ఆకుల మాలని ఒకచేత్తో పట్టుకుని, ఇంకొక చేత్తో అమ్మన్న తల నిమురుతూ.

"లేదు తాతగారూ! అమ్మే అన్నయ్యని కొట్టింది. అప్పుడు.. అన్నయ్య రుబ్బుగుంట మీద పడిపోయాడు. రక్తంకూడా వచ్చింది. పొద్దున్నే చల్లన్నం లేదా అని అడిగాడు అన్నయ్య. అంటే.. వెధవా.. తిండికోసమే పుట్టావా.. ఇంటిడుమందీ ఒకెత్తూ, నువ్వొక్కడూ ఒకెత్తూ అంటూ.." భోరుమంది అమ్మన్న.

దీక్షితులు తులసిమాల కింద పడేసి స్తంభానికి ఆనుకుని కూర్చుండిపోయారు.

"అన్నయ్య ఎక్కడున్నాడమ్మా?"

"ఏమో తాతగారూ.. నిన్న పొద్దుట్నించీ కనిపిస్తేగా! మీరు చూడ్లేదా? నేను మనింటి వెనకాలే తోటలో కెళ్ళాడేమో చూశా.. ఇంకా చెరువు దగ్గర క్కూడా వెళ్ళా. నిన్నంతా గుడి క్కూడా రాలే.."

దీక్షితులు ఆలోచనలో పడ్డారు. నిన్న రాత్రి పొద్దుపోయి వచ్చాడతను ఇంటికి. పిఠాపురం రాజా వారు వేద సభలు నిర్వహిస్తుంటే మూడు రోజులాయి అక్కడే ఉండి పోయారు. ఇంటి వద్ద ఏం జరిగిందో తెలియ లేదు. అప్పటికే ఇంట్లో అందరూ కాసిని నూకలుంటే జావలా కాచుకుని తాగేసి పడుకున్నారు. రాజాగారు వారానికి సరిపోయే సంభారాలు ఇచ్చి పంపించారు. సంతోషంగా సెలవు తీసుకుని బస్సు దిగి మర్లపాలెం నుంచి బండి కట్టించుకుని మరీ వచ్చారు ఇంటికి.

అమ్మన్న చెప్పిన వార్తతో ఆనందం అంతా ఆవిరైపోయింది. సంభారాలు తాను తీసుకొస్తాడని తెలుసు కదా కోడలికి.. ఇంక ఆ బక్క వెధవనెందుకూ కొట్టడం. వాడు లేకపోతే రెట్టింపు రోజులొచ్చేవి కదా అనుకునుంటుంది. కడుపు దగ్గరకొస్తే.. స్వార్ధం వెయ్యితలలు వేస్తుంది.

"తాతగారూ! అమ్మకి అన్నయ్యంటే ఎదుకు కోపం?"

ఏం చెప్తారూ ఎవరైనా! సవతి తల్లి మాత్సర్యం అలాగే ఉంటుందని పసిదానికి ఎలా చెప్పడం? దానికి తోడు బీదరికం. మూడు పూటలూ కడుపునిండా తిన గలిగితే ఎలా ఉండేదో మరి. దీక్షితులు నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయారు.

ఇంట్లో రోజూ జరిగే భాగవతమే అది. గిరికి ఒడుగయింది కనుక అప్పుడప్పుడు ఎవరైనా స్వయంపాకం ఇవ్వడమో, బ్రహ్మచారి కింద పిలవడమో చేస్తుంటారు. ఎప్పుడైనా.. ఆ బంగారమ్మ ధర్మమా అని ఆవిడ చూసినప్పుడల్లా తీసుకెళ్ళి కడుపు నింపుతుంది. కానీ.. రోజూ ఆకలి తీర్చడానికి అదే మాత్రం.. దరిద్రుడికి ఆకలెక్కువన్న సామెతలా గిరి ఎంత తింటాడో వాడికే తెలిదు. సూరమ్మ అన్నది కూడా నిజమే కొంత వరకూ.

ఎంత చురుకైన వాడో గిరి.. వాడి భవిష్యత్తు ఎలా ఉంటుందో! ఊర్లో అందరికీ జాతకాలు చూసే దీక్షితులుగారు, తన ఇంట్లో వాళ్ళకి చూడడానికి ఇష్టపడరు. కర్మానుసారం జీవితం గడిచిపోతుందని అనుకుంటారు.

"తాతగారూ! అన్నయ్య ఇంక ఇంటికి రాడా?" అమ్మన్న గట్టిగా పిలిచింది.

ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బైట పడ్డారు దీక్షితులు.

"వచ్చేస్తాడమ్మా అన్నయ్య. ఎక్కడి కెళ్తాడూ? అత్తయ్యలందరివీ అంతంత మాత్రం బ్రతుకులే. అందరూ అనకాపల్లి అవతలే ఉన్నారు. ఒక్క సుబ్బులే కాస్త నయం.. దగ్గర్లో ఉంది.. అయినా గోదారి దాటి ఎలా వెళ్తాడులే.. డబ్బు కావద్దూ?" సుబ్బులు, దీక్షితులు పెద్ద కూతురు.. ధవళేశ్వరంలో ఉంటుంది.. తనలో తనే గొణుక్కుంటూ లేచి గర్భ గుడిలోకి నడిచారు.

అమ్మన్నకి తాతగారేమంటున్నారో ఏమీ అర్ధం అవలేదు. పూలు గుచ్చుతూ కూర్చుంది.

●●●

ముందురోజు...

పొద్దున్నే పొగమంచుతో ఊరంతా కప్పడి పోయింది. చెట్లు, కొమ్మలనూపుతూ మంచు బిందువుల్ని విదుల్చుకుంటున్నాయి. గోదారి ఇవతలొడ్డున ఇంకా చలితగ్గకుండా వణికెత్తిస్తోంది. గిరిధారి చాపమీద కాళ్ళు రెండూ ముడిచిపెట్టుకుని, చాలీ చాలని బొంతలోకి దూరి పక్కకి తిరిగాడు.

నీరసంతో కళ్ళు మూసుకుపోతున్నాయి. రాత్రి తాగిన జావ నాలికని కూడా తడపలేదు. లేస్తే కళ్ళు తిరుగుతాయేమోనని అలాగే పడుక్కున్నాడు గిరి. అంచు ఊడిపోయి బయటికి వెళ్ళుకొచ్చిన చాప పుల్లలు డొక్కలో గుచ్చుకుంటున్నాయి.

"మహారాజా వారు శయన గృహంలోంచి బయటికి వేంచేస్తే రాచకార్యాలు నిర్వర్తించచ్చు." చీపురు తీసుకుని, వీధరుగు మీద పడుక్కున్న గిరికి తగిలేలా తుడుస్తూ సూరమ్మ మేలుకొలుపు పాడుతుంటే నులుము కుంటూ కళ్ళు తెరిచి పిన్నిని చూడబోయాడు. అంతలో ధడేల్మని చేతిలో చెంబు అరుగుమీంచి గిరాటేసి, మెట్ల కిందికి దిగింది. వీధరుగు, మెట్లు అంతా పెచ్చులూడిపోయి మట్టి, సున్నం బైటికి వచ్చేశాయి. తడీపొడి సున్నం బిళ్ళ కసిక్కిన సూరమ్మ కాల్లోకి దిగింది.

ఇంక.. శివాలెత్తిపోయి గట్టిగా, వీధంతా వినిపించేలా అరుస్తున్న పిన్ని కేకలకి ఉలిక్కి పడి చాపమీదనుంచి లేచాడు గిరి. తల గిర్రున తిరిగింది. కళ్ళు మసక మసగ్గా కనిపిస్తున్నాయి. ఏం జరిగిందో.. పిన్ని ఎందుకు కేకలు పెడ్తోందో అర్ధం అవలేదు. స్తంభం పట్టుకుని నిల దొక్కుకుని నెమ్మదిగా చాప, బొంత తీసుకుని ఇంట్లోకి నడిచాడు గిరి.

"వెధవ సంత.. వెధవ సంతాని. ఈ దరిద్రపు మేళానికి చాకిరీ చెయ్యమని ఇక్కడికి తగలేశారు. ఇంక ఈ ముదనష్టం బ్రతుకింతే.. ఈ ముష్టి వెధవలకి వండీ వార్చీ మేపేసరికి నాదీ, నా కూతురుదీ బతుకులు తెల్లారి పోతాయి." సూరమ్మ కేకలు, ఎక్కడో తోటలో బచ్చలాకులు కోస్తున్న యగ్గమ్మగారికి వినిపించాయి.

యజ్ఞమ్మ, దీక్షితులు ధర్మపత్ని. అందరి నోళ్ళలో నాని నాని యగ్గమ్మగా మారిపోయింది. వరుస కానుపులతో, పెళ్ళిళ్ళు, ఆడపిల్లల పురుళ్ళతో.. ఆఖరికి తిండికి కరవై.. జవసత్వాలుడిగిపోయిన యగ్గమ్మ నిస్సహాయంగా.. తన పని తను చేసుకుపోతోంది.

యగ్గమ్మకే కాదు.. ఆ వీధిలో వారందరికీ ఆ బొబ్బలు, పొలికేకలూ అలవాటే. అవేవీ తనకి సంబంధించనట్లు పందుంపుల్ల తీసుకుని నములుతూ బామ్మ దగ్గరికి వచ్చాడు గిరి.

"ఏవయిందిరా?" నిర్లిప్తంగా అడిగింది యగ్గమ్మ.

"సున్నంపెచ్చు కాల్లో దిగిందిలే. కొంపేం మునిగలేదు. అవునూ.. బామ్మా! తాతగారు ఎప్పుడొస్తున్నారూ.. రాజావారు చాలా సంభావనలిస్తారేమో కదూ!" నవులుతున్న వేప్పుల్ల తియ్యగా అనిపించి నోరూరింది గిరికి, తినబోయే సిద్ధాన్నం తలుచుకుని.

"అయ్యో! అంత తీరిగ్గా చెప్తావేంట్రా.. చూసొస్తా ఉండు." కాళ్ళూ చేతులూ కూడదీసుకుని వంకర టింకరగా అడుగులు వేస్తూ వీధిలోకి నడిచింది యగ్గమ్మ.

అప్పటికే సూరమ్మ ఇంట్లోకి వచ్చేసి, వంటింట్లోకి వెళ్ళి, ఇంత పసుపు కాలికి అద్ది కట్టుకట్టుకుంటోంది.

"ఏవయిందే తల్లీ.. చూసుకోవద్దమ్మా. మోపు చేసిందంటే నడవలేవు. మొత్తం చెక్కించేసి మెట్లకైనా గిలాబా చేయిద్దామంటే కుదరట్లేదమ్మా. ఎప్పటికి తీర్తాయో ఇక్కట్లు.." అత్తగారు దగ్గరగా వచ్చి చూడబోతే కాలు వెనక్కి జరిపేసుకుంది సూరమ్మ.

"అదేవీ నేను బతికుండగా జరిగే పని కాదులే.. అనవసరంగా సానుభూతి ఒలకపోసి ప్రయాస పడకండి. చెప్పాకదా.. ఈ జన్మకింతే.."

ఏది చెప్పబోయినా నిష్ఠూరంగా మాట్లాడే కోడలితో ఇంకేమనాలో తెలియక, నోరుమూసుకుని వంటింట్లోంచి బైటికి నడిచింది యగ్గమ్మ, పాము కరిచి అర్ధాయుష్షులో అంతర్ధానమైన మొదటి కోడల్ని తలుచుకుని నిట్టూరుస్తూ. ఎంత ఒబ్బిడిగా ఉండేది.. విస్తట్లో అన్నం వడ్డించి పిలిచేది. అప్పుడు ఇంత కటకట కూడాలేదు. దేనికైనా ప్రాప్తం ఉండాలి..

వీధి గుమ్మం నుంచీ వంటింటి వరకు ధారగా ఎర్రటి రక్తం మరకలు. మరకల సంగతెలా ఉన్నా ఎంత రక్తం పోయిందో.. పిల్ల ఎంత నీరసించిపోతుందో! వేడిగా ఏదయినా తాగడానికిస్తే బాగుండు.. చేతికందిన గిన్నుచ్చుకుని పెరట్లోకి వెళ్ళి, వెనుకనున్న బందులూడిపోయిన తలుపుని జాగ్రత్తగా తీసి, పక్కింటి రాజుగారి పెళ్ళాన్ని పిలిచింది.

"సత్యవతమ్మగారూ! ఓ సారిలా వస్తారా?"

"ఏటండి యగ్గమ్మగారూ! ఇవేళ్టప్పుడు బైటికొచ్చేశారూ.. అంతా కులాసానే కదా?" తోటలో అటూ ఇటూ తిరుగున్న సత్యవతి తలుపు తీసుకునొచ్చింది.

"కొంచెంగా పాలుగానీ ఉంటే ఇస్తారా? మా కోడలికి శోషొచ్చేలా ఉంది.. కాలికి దెబ్బతగిలిందందుకనీ.." మొహమాటంగా అడిగింది. నయం దీక్షితులు లేరు. ఉంటే గొడవ పెట్టేసి ప్రాయోపవేశం చేసినంత పని చేస్తారు. ఉత్తినే ఎవరిదగ్గరా.. నీళ్ళయినా సరే తీసుకోకూడదని నియమం.

"అయ్యయ్యో! ఎంతమాటండీ.. బోలెడు పాడి.. అస్సలు రోజా పోయిస్తామంటే అయ్యవారొప్పుకోరు గానీండీ.." గిన్నె తీసికెళ్ళి నిండా చిక్కటి పాలు తెచ్చిఇచ్చింది.

"ఇవేళ తదియా, శుక్రవారం. భరణీ నక్షత్రం.. వర్జ్యం నడుస్తోంది. ఇంకో అరగంటలో వెళ్ళిపోతుంది."

"అలాగేనండి అమ్మగారూ! రాజుగారికి చెప్తాను, ఇంకో గంటక్కానీ ఇల్లు కదలొద్దని."

తిథి, వార నక్షత్రాలైనా చెప్తే తీసుకున్న వాటి ఋణం ఉండదని నమ్మకం. అందులో పాడికి సంబంధించినవాటిని మళ్ళీ ఇస్తే తీసుకోరు.

యగ్గమ్మ పొయ్యి అంటించి, పాలగిన్నె దానిమీద పెట్టి తడి బట్ట తీసుకుని వెళ్ళింది రక్తం మరకలు తుడవడానికి.

"బామ్మా! నే తుడిచేశా. వీధి గుమ్మాలు కూడా కడిగేసి ముగ్గెట్టేశా. పిన్ని పడుకుంది గదిలోకెళ్ళి." నవ్వుతూ తడి బట్ట తీసుకుని పెరట్లోకి వెళ్తున్న గిరి అన్నాడు.

వీడికి నవ్వు ఎక్కడ్నుంచొస్తుందో! ఆశ్చర్యంగా చూసింది యగ్గమ్మ. కడుపు వీపుకి అంటుకుపోయింది. పక్కటెముకలు ఎన్నున్నాయో చులాగ్గా లెక్కపెట్టేయచ్చు. గాఢంగా నిట్టూర్చి వంటిల్లనబడే పాకలోకి నడిచింది యగ్గమ్మ.

"బామ్మా! పాలెవరికీ.. ఎక్కడివీ?" పొంగుతున్న పాలని చూస్తూ ఆశ్చర్యంగా అన్నాడు గిరి.

"పిన్నికి రక్తం చాలా పోయిందిరా. సత్యవతిగారిని అడిగి కాసిని పాలు తెచ్చాను. పందార వేసిస్తే కాస్త ఓపికొస్తుందనీ.."

"నాకియ్యి బామ్మా. నేను తీసుకెళ్ళి పిన్ని కిస్తా." ఎలాగయినా పిన్నిని మంచి చేసుకోవాలని గిరి తాపత్రయం. యగ్గమ్మ ఇచ్చిన కంచుగ్లాసు అంగోస్త్రంతో జాగ్రత్తగా పట్టుకుని సూరమ్మకిచ్చాడు.

కష్టం మీద లేచి గోడకానుకుని కూర్చుని ఊదుకుంటూ పాలన్నీ తాగేసి, లేచి నిలబడింది సూరమ్మ.

ఎంతో ఆప్యాయంగా, పిన్నికి ఎలా ఉందోనని ఆదుర్దాగా చూస్తున్న గిరిని పట్టించుకోకుండా వంటింట్లోకి నడిచింది సూరమ్మ, కుంటుతూ.

"ఎలా ఉంది పిన్నీ! నొప్పిగా ఉందా?"

"అబ్బే.. గెంతులెయ్యాలన్నంత ఉత్సాహంగా ఉందిరా!" పిన్ని వ్యంగ్యం అర్థం చేసుకోకుండా వెనుకే వెళ్ళాడు గిరి.

"గిరిబాబూ! కాసిని పాలున్నాయి తాగుతావేరా? మజ్జిక్కి తోడెట్టేశాలే." అడుగుల చప్పుడు విని వెనక్కి తిరిగిన యగ్గమ్మ, సూరమ్మని చూసి పక్కకి తిరిగిపోయింది.

"పిన్నీ కొంచెం చద్దన్నం ఉందా? ఆకలేస్తోంది."

చంటిది అమ్మన్న ఉండగా, గిరిగాడిని పాలు తాగమంటోంది ముసలమ్మ.. కుతకుతా ఉడికి పోతున్న సూరమ్మ అంతెత్తున ఎగిరింది.

"చద్దన్నం ఎందుకురా.. మీ బామ్మ పరవాన్నం వండి పెడుతుంది తాగు. చంటిముండ రాత్రి తాగిన గంజినీళ్లు తప్ప ఏవీ ఎరగదు. నీకేమో పంచ భక్ష్యాలూ కావాలా.. రా ఇస్తా వెధవానీ.." వెనుకే వస్తున్న గిరిని ఆగ్రహావేశాలతో చూసి జుట్టు పట్టుకుంది.

గిరి బిత్తరబోయి తల విదిల్చాడు, విడిపించుకుందామని.

"ఆగవే సూరం.. పిల్లాడ్నేం చెయ్యకే. అమ్మన్నకి కూడా అట్టేపెట్టానే పాలు. నే చెప్పేది వినవే తల్లీ.." యగ్గమ్మ, వణుకుతున్న కంఠంతో..

అత్తగారి మాట వినబడనట్లే.. గిరి రెండు చెంపలూ వాయించి, ఒక్క తోపు తోసింది సూరమ్మ. అప్పుడే నిద్ర లేచి వస్తున్న అమ్మన్న బెదిరిపోయి ఏడుపు లంకించుకుంది.

గిరి పక్కనే ఉన్న రుబ్బుగుంట మీద పడి బంతిలా లేచాడు. పళ్ళు కింద పెదవికి గుచ్చుకుపోయి రక్తం చివ్వున చిమ్మింది. కళ్ళు పెద్దవి చేసి వణుకుతున్న చేతులతో మూతి దగ్గర తుడుచుకుంటూ, పరుగెత్తుకుంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ కొక్కేనికున్న తన చొక్కా తొడుక్కుని భుజానికున్న అంగోస్త్రంతో కళ్ళూ మొహం తుడుచుకుంటూ బామ్మని చూశాడు.

ఉక్రోషం, నిస్సహాయత, ఆవేశం, ఆకలి, నిరుత్సాహం కలగలిపిన ఆ చూపు అంత్యకాలం వరకూ యగ్గమ్మ మనసులో అలా నిలిచిపోయింది.

ముందురోజు బ్రహ్మచారిని పెట్టుకుని రాజుగారి భార్య స్వయంపాకంతో ఇచ్చిన రూపాయి తప్ప ఇంకేమీలేదు గిరి దగ్గర. స్వయంపాకానికి ఇచ్చిన సరుకులతో నిన్న మధ్యాన్నం సూరమ్మ వండితే తిన్న అన్నం. ఆకలి చచ్చిపోయిన గిరి, మర్లపాలెం కేసి నడిచాడు. ఎలాగైనా గోదారి దాటి రాజమండ్రి వెళ్ళాలి.. వెళ్ళి ఏం చెయ్యాలీ.. నావ దిగాక ఎక్కడికెళ్ళాలీ.. అక్కడికెళ్ళాక చూసుకోవచ్చు. ముందు ఈ నరకం నించి బైటపడితే!

ఆ సమయంలో బంగారత్త దగ్గరికి వెళ్తే గిరిధారి జీవితం ఎలా ఉండేదో.. కానీ అన్యాయాన్నెదురుకోడానికి వెళ్తున్న బంగారత్త మొహంలోని ధ్రుఢనిశ్చయం మాత్రం గిరికి గుర్తుకొచ్చింది. బంగారత్తని ఆశ్రయించి ఆవిడలా పంచాయితీలో పెట్టాలనే ఆలోచన రావడానికి గిరిధారికి అంత వయసు లేదు. ఉక్రోషంతో, అవమానంతో భారమైన మనసులోకి ఆ ఆలోచనా రాలేదు. ఆవిడ తెగువ మాత్రం ఆదర్శమయింది, భవిష్యత్తులో ఏ ఇక్కట్లు వచ్చినా!

అమాయకత్వం, మొండితనం, తండ్రినుంచి వారసత్వంగా వచ్చిన బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం.. తాతగారిలా అందరికీ సహాయపడాలనే తత్వం, సంతోషపెట్టాలనే స్వభావం.. పరస్పర వ్యతిరేక లక్షణాలున్న గిరి తెగిన గాలిపటంలా ఇంట్లోనుంచి బయటికొచ్చాడు.

చొక్కా అంచుతో కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు గిరిధారి, వెనకనుంచి వినిపిస్తున్న అమ్మన్న పిలుపుని పట్టించుకోకుండా.. ఆ వెళ్ళడం వెళ్ళడం.. ఎన్ని కష్టాలు పడినా, ఎంత వ్యధ అనుభవించినా మళ్ళీ ర్యాలి గ్రామంలో అడుగు పెట్టలేదు.

●●●

"ఎక్కడికి పోతాడూ అర్భకం వెధవ.. చేతిలో రొక్కంలేకండా ఎంతదూరం వెళ్ళగలడూ! ఏవిటో.. స్మార్తం రావట్లేదని తెలుసుకున్నప్పుడు రాజమండ్రీయో విజయనగరవో పంపించి ఇంగ్లీషు చదువులన్న చెప్పించాల్సింది కేశవుడికి. అప్పటికైనా కాస్త బాధ్యత తెలుసుకుని కొడుకుని చూసుకునేవాడేమో! అయినా వాడి రాత అలా ఉంటే ఏం చేసి ఏం లాభం?" దీర్ఘాలోచనలో ఉన్న దీక్షితులుగారికి భక్తులు వచ్చిన సవ్వడి వినిపించలేదు.

"గురువుగారూ! అష్టోత్తరం సేయిస్తారా.. మా చిన్నరాజుకి రెండేళ్ళు నిండుతాయివ్వేళ.." రాజుగారు సతీ సమేతంగా వచ్చి గర్భగుడి తలుపుకవతల నిల్చున్నారు.

"అయ్యో.. తప్పకుండా నండి. ఏదో పరధ్యాన్నంలో ఉన్నా.."

రాజుగారు పూజ అయి వెళ్ళేటప్పుడు స్వయంపాకం, పదహారు రూపాయలు దక్షిణ ఇచ్చారు. అదేవీ పట్టించుకోకుండా దీక్షగా జగన్మోహనుడ్ని చూస్తూ కూర్చున్నారు దీక్షితులు. ఈ సుందరమూర్తికి సేవ చేసే అవకాశం వంశంలో తనతోనే అంతరించిపోతుందా?

జగన్మోహినీకేశవస్వామి ఇక్కడికి ఏవిధంగా వేంచేశారూ.. తమ వంశీకులు ఎక్కడో దక్షిణాదినుంచి ఈ గ్రామానికి వచ్చే అవసరం ఏం వచ్చిందీ? మరి ఏ బంధువులూ లేకుండా తమ కుటుంబం ఒక్కటే ఇక్కడెందుకుందీ..

రామదీక్షితులు ఒక్కసారిగా తన తాతగారు చెప్పిన గతంలోకి వెళ్ళిపోయారు.

●●●

**రాజమహేంద్రవరం, పదకొండవ శతాబ్దం ప్రారంభం:**

చాళుక్య సోమేశ్వరుడ్ని ఓడించి వేంగీ రాజ్యాన్ని కైవసం చేసుకున్న కొద్దిమాసాలకి, చోళ చక్రవర్తి విక్రమదేవుడు వేంగి రాజ్యం వేంచేశారు.

రాజమహేంద్రవరం వద్ద గోదావరి పాయలుగా విడిపోతుందనీ, అక్కడ అడవిలో అన్ని రకముల వన్యమృగములు స్వేచ్ఛగా విహరిస్తుంటాయని విని ఉన్నారు. వేటకి వెళదామని నిశ్చయించారు.

అంతే రాజు తల్చుకుంటే కొరతేముంది.

"ప్రభూ! గోదావరీ నది ఈ సమయంలో అనూహ్యంగా పొంగుతూ ఉంటుంది. క్షేమం కాదేమో!" రాజమందిరంలోని చిత్రపటాన్ని పరికిస్తున్న మహారాజుకి, సేనాపతి భయపడుతూనే సలహా ఇచ్చాడు.

"ఫరవాలేదు. మన నావికులు -- సమర్థులే. నావల్ని, సైనికుల్ని సిద్ధం చేయండి. ఈ చిత్ర పటం చూస్తుంటే వేట అనేకాదు ఆ సీమ అందాలు కూడా చూడాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది." నిజమే చోళరాజుల నావికాబలం ఎన్నదగింది.

ఎటువంటి తుఫాన్లనైనా ఎదుర్కొనగలిగిన పటిష్ఠమైన నావలూ.. అంతే పటిష్టమైన నావికాసైన్యమూ తూర్పు హిందూ మహా సముద్రంలోని దీవులని కూడా చోళుల కైవసం చేసింది.

వేంగి రాజ్యంలోని ఆస్థాన చిత్రకారుడు గీసిన చిత్రం అది. గోదావరి పాయలైన వశిష్ఠ, గౌతమిల మధ్యనున్న ప్రాంతం. చిత్రకారుని విహంగ వీక్షణా రూపకల్పన అత్యద్భుతం.

"ఆహా! ఈ అఖండ గోదావరి పాయల మధ్యలో ఉన్న ఈ కోన ఎంత రమణీయంగా ఉంది?" ప్రాతఃకాలముననే అలంకరించిన నావలో ఆసీనుడైన విక్రమదేవుడు ప్రసన్నంగా అన్నాడు.

అరుణకాంతుల వెలుగులో నదీమ తల్లి చక్రవర్తికి ఎర్రతివాచీ పరచినట్లు స్వాగతం పలుకుతోంది. ఒడ్డునే ఉన్న తంగేడు, పారిజాతం, పున్నాగ, పొగడ వృక్షాలు కొమ్మలు విదిల్చి గోదారమ్మకి పుష్పాభిషేకం చేస్తున్నాయి. రాలిన పూలు నదిలో తేలుతూ రంగురంగుల ఆకృతులు దాల్చి, తివాచీ మీది అద్దకంలా ఉన్నాయి. చల్లగా వీస్తున్న మలయమారుతం. నారి కేళవృక్షాల ఆకుల్లో నుంచి దూసుకుపోతున్న ప్రభాతకిరణాలు. ఓహ్! విక్రమ దేవచోళుని మది ఆనంద తరంగాలలో తేలియాడసాగింది.

"నిజమే ప్రభూ! ఇక్కడ వృక్ష సంపద కన్నుల విందు. ఇంక మృగాలంటారా. ఒక్క రోజు వేటకి వెళితే, వేంగి రాజ్యమంతా విందు భోజనం ఏర్పాటు చెయ్యవచ్చు." సైన్యాధిపతి వినయంగా సెలవిచ్చాడు.

"ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం సేనాపతీ!"

ఆవలి ఒడ్డుకు చేరగానే విక్రమదేవుడు ఒక్క అంగలో నావలో నుండి ఒడ్డుకు దుమికాడు, సైనికులు చేయి అందించేలోగానే.

చదునుగా ఉన్న నేల చూసుకుని, కొద్దిమంది శిబిరాలు ఏర్పాటుచేస్తుండగా, విక్రమదేవుడు, మిగిలిన సైనికులని తీసుకుని వేటకి బయలుదేరాడు. జంతువులని మించిన వేగంతో మహారాజు వేటాడాడు.

కుందేళ్ళ వెనుక చిన్న పిల్లవాడివలె పరుగులు పెట్టాడు. ఏనుగుల మంద వెంట వెళ్ళి, అవి తొండాలతో నీళ్ళు పోసుకుంటుంటే చెట్ల చాటునుంచి చూసి ఆనందించాడు. చివరగా ఒక లేడి దొరికినట్లే దొరికి, నాలుగు దిక్కులా పరుగెత్తించింది.

"ఇంక చాలు మహారాజా! చీకటి పడుతోంది. పాములతో ప్రమాదం. ఇక్కడ విషజంతువులూ అధికమే" సేనాపతి హెచ్చరిస్తే, తప్పదన్నట్లు, శిబిరం చేరాడు విక్రముడు.

కడుపు నిండా తెలుగు వారి కమ్మని భోజనం తినగానే అలసి సొలసిన శరీరం విశ్రాంతి కోరుతుండగా మేనువాల్చిన మరుక్షణం గాఢ నిద్రలోకి వెళ్ళిపోయాడు విక్రముడు.

●●●

ఘల్లు.. ఘల్లు.. ఘల్లు.. ఘల్లు.. వీనులవిందుగా, లయబద్ధంగా మువ్వల సవ్వడి. సుగంధ సుమన వీచికలతో పులకిస్తున్న ప్రకృతి. క్షీరసాగర మధనం, అమృత వితరణ సంతృప్తిగా పూర్తిచేసిన శ్రీ మహావిష్ణువు ఆనందంతో జగన్మోహినీ రూపంలో నాట్యం చేస్తున్నాడు.

ఆది విష్ణువు నాట్యం ఆరంభం అవగానే అసంకల్పితంగా విరించి మృదంగం, సరస్వతీదేవి వీణాగానం లయ కనుగుణంగా ప్రారంభించారు.

కనులు మూసుకుని తపస్సులో నిమగ్నమైన నటరాజు శరీరం పులకించింది.

మనో నేత్రంతో వీక్షించగా కనుల ముందు నిలిచింది.

గగనంలో అద్భుత లావణ్య మోహన రూపంతో నాట్యమాడుతున్న స్త్రీ.

స్వల్పంగా కంపిస్తున్న శరీరం.

దక్షిణ హస్తంతో వామభాగాన్ని తడిమాడు పరమ శివుడు.

అర్ధాంగి అవసర కార్యం మీద ఎచటికో వెడలినట్లుంది. శిరసున గంగ.. మధనంతో అల్లకల్లోలమైన సాగరుని శాంతింప జేయుటకై వెడలింది. కన్ను మూసి తెరిచేలోగా, సమ్మోహితుడై జగన్మోహిని దరిచేరి అడుగులు కలిపాడు నటరాజు. నాట్యం చేస్తూనే సయ్యాటలు, కవ్వింపులు మొదలు పెట్టి పశుపతిని పరవశింప చేస్తున్నాడు చిలిపి విష్ణువు. రాబోయే కృష్ణావతారంలోని మాయలకిది నాంది కాబోలు.

ఆదమరచి నృత్యకేళిలో నిమగ్నమైన వేళ, జగన్మోహిని జడనుండి విడివడిన దేవ పుష్పం గగన సీమనుండి రాలి నేలమీద పడింది. ఆది దేవుని ఆట ఆగింది.

రాలుతున్న పుష్పము నుండి సుగంధ భరిత సువాసనలు జగమెల్లా వ్యాపించాయి. ఆహ్లాదకరమైన ఆ సౌరభాన్ని ఆఘ్రాణించిన ముక్కంటి కనురెప్పలు అల్లల్లాడాయి. జగన్మోహినీ రూపం క్రమంగా మందస్మిత వదనారవిందుడైన మహా విష్ణువు రూపంగా మార్పు చెందింది.

వెనుక భాగంలో మాత్రం స్త్రీ మూర్తి స్థిరపడిన స్వయంభు శిలయై పూవురాలినచోట భూస్థాపితమయింది.

నీలమేఘశ్యామునితో నాట్యమాడిన నీలకంఠుడిని బ్రహ్మదేవుడు తన కమండలాకార లింగంగా రూపొందించాడు.

విక్రమదేవ చోళుడు స్వప్నంలో జరుగుతున్నదంతా చూస్తున్నాడు.

"రాజా!" ప్రసన్నంగా పిలుస్తున్నారెవరో..

కళ్ళుమిరుమిట్లు కొలిపే కాంతి.. చతుర్బాహువై శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చాడు. చేతులు జోడించి నిలుచున్నాడు విక్రమదేవుడు.

"చెక్కతో చేసిన రథాన్ని నీవు పరుండిన పొన్న చెట్టుకింద నడిపించు.

ఎక్కడ రథ చక్రం శీలకిందపడుతుందో.. అక్కడ తవ్వించు.

స్వయంభు జగన్మోహినీ కేశవ విగ్రహం దొరుకుతుంది.

ఆలయం నిర్మించి ధన్యుడవు కమ్ము."

చెదిరిన స్వప్నంలో నుండి ఉలిక్కిపడి లేచాడు విక్రమదేవుడు.

మరునాడు రథాన్ని రాజమహేంద్ర వరము నుండి రప్పించడానికి ఏర్పాట్లు చేశాడు. అతి చరుతులైన నావికులు రెండు నావలలో నిలబెట్టి రథాన్ని అద్దరికి చేర్చారు.

రథానికి పూజచేసి అవిఘ్నమస్తు అంటూ గణపతిని తలచుకుని రథాన్ని స్వయంగా నడిపారు విక్రమదేవుడు. స్వప్నంలో శ్రీహరి చెప్పినట్లే రథచక్రం మేకు దిగింది.

ఆ చోట తవ్విస్తే, ఐదడుగుల పొడవూ, మూడడుగుల వెడల్పూ ఉన్న సాలగ్రామ శిల్పం దొరికింది.

జీవకళ ఉట్టిపడుతున్న ఆ శిల్పాన్ని చూసి అక్కడ ఉన్న ఆబాలగోపాలం ధన్యులమైనామని ఆనందించారు. చేతి, కాలివేళ్ళగోళ్ళ దగ్గర్నుంచీ స్పష్టంగా, ప్రస్ఫుటంగా ప్రతీ అంగమూ చెక్కడం మానవ మాత్రుల సాధ్యం అయేపనికాదు. నిస్సంశయంగా స్వయంభూ శిల్పమే!.

వెనువెంటనే ఆలయం ఏర్పాటు శంకుస్థాపన జరిగింది.

నిర్మాణానికి కావలసిన సరుకులన్నీ రాజమహేంద్రవరం నుంచి తీసుకుని వెళ్ళి నిర్మించారు. విగ్రహప్రతిష్ఠ అయిన వెంటనే, సాగరుని శాంతింప చేసిన గంగమ్మ, జగన్మోహినీ కేశవస్వామి విగ్రహాన్ని చూసి, తన్మయత్వం చెంది తన అంశని స్వామి పాదాలవద్ద వదిలింది.

స్వామి పాదాలనుంచి నిత్యం ఆగని గంగా స్రవంతిని వీక్షించి భక్తులు పరవశులవుతుంటారు.

దేవ పుష్పం రాలిన ప్రదేశం. "ర్యాలి" గ్రామం అయింది.

జగన్మోహినితో దీటుగా నాట్యం సలిపిన నటరాజు, కేశవుని గుడికి ఎదురుగా "ఉమాకమండలేశ్వరస్వామి" రూపంలో వెలిశారు .

●●●

**తంజావూరు, పదకొండవ శతాబ్దం రెండో దశకం:**

రాజేంద్ర చోళ చక్రవర్తి అనుంగు కుమార్తె అమ్మంగ దేవి అత్తవారింటికి వెళ్ళే సమయం ఆసన్నమయింది. అంతఃపురమంతటా విషాద ఛాయలు కమ్ముకున్నాయి.

చెలికత్తెలు విచారంగా రాకుమారిని అలంకరిస్తున్నారు.

అమ్మంగ దేవి పరిచారికలని ఎంతో ఆప్యాయంగా చూస్తుంది.

చిన్ననాటినుండి ఆడిపాడిన చెలులని వదిలి వెళ్ళాలంటే ఎంత కష్టం?

కావేరీ నదీ జలాల సన్నిధి నుండి గోదావరీ సలిల ప్రవాహాల వరకూ పయనం. చక్రవర్తి కుమార్తె అయినా ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళక తప్పదు కదా!

వేంగీ రాజ్యాధిపతి రాజరాజనరేంద్రుని పరిణయమాడిన సంతోషాన్ని, పుట్టిపెరిగిన పరిసరాలనీ.. ఆత్మీయులని వదిలి వెళ్ళాలనే తలపు హరించివేస్తోంది.

ఉండుండి చెమ్మగిల్లిన కళ్ళతో అంతఃపురాన్ని పరికిస్తోంది అమ్మంగ దేవి.

తాను కూర్చున్న రత్న ఖచిత ఆసనం దుఃఖభారంతో కుంగినట్లు అనిపించింది.

పెంపుడు చిలుకలు చేతిమీద వాలి ముక్కులతో రాస్తున్నాయి.

రాకుమారి హృదయ భారం మరింత ఎక్కువయింది.

అమ్మంగ దేవి మేనత్తకుందవ దేవి పరిణయం తూర్పు చాళుక్య రాజు విమలాదిత్యునితో జరిగాక చోళరాజ్యానికీ, సామంత వేంగీ రాజ్యానికీ మధ్య సత్సంబంధాలూ, ప్రేమాదరణలూ నెలకొనడం ఇంకొక ఎత్తు. మేనత్త కొడుకయిన రాజరాజనరేంద్రుని, అమ్మంగదేవి మనఃస్ఫూర్తిగా వరించడానికి ముఖ్యకారణం, చాళుక్య రాజుకి కవులమీదా, కవిత్వం మీదా ఉన్న అంతులేని అభిమానం, అభిరుచి. రాజరాజ నరేంద్రుడు తన సింహాసనాన్ని సవతి సోదరుడి నుంచి కాపాడుకోవడానికి నిరంతరం పోరాటం చెయ్యవలసి వచ్చింది.

మేనల్లుడు ఆ క్లిష్ట పరిస్థితి ఎదుర్కోవాలంటే ఏం చెయ్యాలి.

చోళ చక్రవర్తి రాజేంద్రుడికి వేంగీయులతో మళ్ళీ వియ్యమందడం ఒకటే పరిష్కారంగా అనిపించింది.

అంగరంగ వైభవంగా అమ్మంగ దేవి వివాహం జరిగింది. నును సిగ్గులు బుగ్గలలో ప్రతిఫలిస్తున్న కోడల్ని కుందవదేవి అక్కున చేర్చుకుంది. అమ్మంగదేవిని సాగనంపడానికి తంజావూరు తరలి వెళుతుందా అన్నట్లు ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. తన పరిచారికలనే కాదు. ఎంతో ఇష్టులైన కవులను వారి కవితా గోష్టినీ ఎలా వదిలివెళ్ళడం? అమ్మంగదేవి కన్నులు చెమ్మగిల్లాయి. అంతఃపురం ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది.

చక్రవర్తి వేంచేస్తున్నారనే వార్త విని రాకుమారి చెలులందరూ పక్కకి తప్పుకున్నారు. సారెకి తీసుకెళ్ళే సామాన్లని సర్దుతున్న ముఖ్యపరిచారికలు ఆసనాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకున్నారు. అమ్మంగదేవి అవనత వదనయై నిలబడి నేలని చూస్తోంది. కనులలో నుంచి రాలిన నీటి బిందువులు పైటని తడిపేస్తున్నాయి.

"ఎందుకు తల్లీ! నీకు చిన్ననాటినుండి తెలిసిన అత్తమామలేకదా! ఇంక రాజరాజుశూరత్వం, అందచందాలూ.. ఆత్మీయతా నీకు ఎరుకే. సంతోషంగా వెళ్ళమ్మా! మేము వస్తూనే ఉంటాము. మీరు కూడా" అంతటి చక్రవర్తికీ మాటలు కరవైపోయాయి. కంఠం జీరపోయింది. "ఇంకా ఏమయినా కావాలా తల్లీ. చెలులతో విహారానికి కావేరిని తలపించే గోదావరి ఉండనే ఉంది. అన్నట్లు నువ్వు వెంట తీసుకెళ్ళదలచిన చెలులని ఎన్నిక చెయ్యి. కుటుంబాలతో వారిని కూడా తరలిద్దాం."

అమ్మంగదేవి అప్పుడు తల ఎత్తింది. నీళ్ళు నిండిన పెద్దకళ్ళతో చూస్తూ నవ్వింది.

"నిజంగానా తండ్రీ! అయితే నారాయణ భట్టు వంటి కవులను కూడా.."

"ఓహ్! అవా నీ సందేహ సంకోచాలు తల్లీ.

తప్పక పద్దెనిమిది గోత్రాల ద్రావిడ పండితులనూ, వారి కుటుంబాలనూ కూడా నీ వెంట పంపుతాను. నీతో అనుదినం సాహిత్య గోష్టిచేస్తారు.

సంతోషమేనా అమ్మంగా!"

అమ్మాయిని అక్కున చేర్చి తల నిమిరి చక్రవర్తి వెడలిపోయారు.

●●●

**రాజమహేంద్రవరం:**

అమ్మంగదేవి అసహనంగా అంతఃపురంలో తిరుగుతోంది.

రాజరాజనరేంద్రుడు తీసుకున్న నిర్ణయంతో కలతపడిన మనసును ఊరడింపజేయడానికి ప్రయత్నం చేస్తోంది. తను ఇతర కార్యాలలో పడి, తనని నమ్ముకుని వచ్చిన పండితులను విస్మరించిందా?

సవతి మరిదిగారి దండయాత్రలూ, బెదిరింపులూ ఎదుర్కొనడంతోనే రాచకుటుంబం సతమతమవుతోంది. అమ్మంగ దేవి అత్తవారింటికి వచ్చిన కొత్తలో ఎంతో వైభవంగా కవిసమ్మేళనాలు జరిగేవి. రాజరాజు తెలుగు భాష మీది మమకారంతో నన్నయ భట్టారకుని, మహాభారతం తెనిగించమని కోరారు. సమీప బంధువూ, సన్నిహితుడూ అయిన నారాయణ భట్టు సహారాకంతో రెండున్నర పర్వాలు రచించడం కూడా అయింది.

పిదప నన్నయ భట్టారకుని అనారోగ్యంతో అరణ్య పర్వం సగంలోనే ఆ మహాకావ్యం నిలిచిపోయింది. అదంతా వేరే సంగతి. ప్రస్తుత సమస్య అదికాదు.

అరవ, కన్నడ దేశాల నుంచి వచ్చిన కవిపండితులను తెలుగు కవులు నిరసించడం. అడుగడుక్కీ అడ్డు తగులుతుండడం అమ్మంగ దేవి చెవిన పడుతుండడం ప్రారంభమయ్యాయి.

చోళ సైన్యం సహకారంతో సోదరుడ్ని ఎదుర్కొంటున్న రాజరాజనరేంద్రుడు. ఆ చోళ రాజ్య పండితులనే ఊరు వదిలిపొమ్మన్నారుట.

ఆలి వంక వారికి అగ్రస్థానమిచ్చి తమని అవమానిస్తున్నారని తెలుగు పండితులు రాజు మనసు విరిచేశారు. నిరంతర యుద్ధం.

రాజ్యరక్షణతో తలమునకలై ఉన్న రాజు ఆస్థాన కవుల కోరిక మన్నించవలసి వచ్చింది. స్థానబలిమి అటువంటిది.

అమ్మంగ దేవి చెప్పబోతే..

"రాచకార్యాలలో అనేక నిర్ణయాలు తీసుకొనవలసి ఉంటుంది. అర్ధం చేసుకోదేవీ" అని ఊరడింపు. తను మాత్రం ఏమి చెయ్యగలదు.

జరుగుతున్న పరిణామాల నిస్సహాయంగా వీక్షించడం తప్ప.

గోదావరి తీరం దాటి ఆవలి ఒడ్డున, విక్రమదేవులు కట్టించిన ర్యాలి గ్రామం తరలి వెళ్ళిపోయారు ద్రావిడ పండితులు. ఎక్కడో అక్కడ సుఖంగా ఉన్నారులే అని అమ్మంగ దేవి ఊరట పడుతున్న వేళ..

ఒకరోజు.

"అమ్మా! మీరేదిక్కు తల్లీ" రోదిస్తూ కాళ్ళమీద పడిపోయారు, ర్యాలి నుంచి కట్టుబట్టలతో వచ్చేసిన పండిత కుటుంబాలలోని ఆడవారు. భోజనం చేసి కూడా రెండు దినాలయిందిట.

"ముందు స్నానాలాచరించి రండమ్మా"

పిల్లాపాపలతో ఉన్న ఇరవై పైగా కుటుంబాలకి భవనం వెనుక చావడిలో ఆశ్రయమిచ్చి పంపింది అమ్మంగదేవి.

●●●

"దేవీ! మీ పరివారం మరలా విచ్చేశారా? మాకు ఉన్న సమస్యలు చాలవనా?

కించిత్కోపంతో, మరింత ఆవేదనతో అడిగారు రాజరాజనరేంద్రుడు.

మామగారి సహాయం తీసుకుంటూ వారు కుమార్తె వెంట పంపిన కుటుంబాలని ఇక్కట్లపాలు చెయ్యడం కష్టంగానే ఉంది వేంగిరాజుకి.

కానీ. తెలుగు వారితో సఖ్యంగా లేకపోతే,

రాజ్యాన్ని కబళించడానికి సిద్ధంగా ఉన్న సోదరునికి ప్రజలందరూ అండపలికే ప్రమాదముంది. రాజుది కూడా నిస్సహాయస్థితే. ఆ విషయం అమ్మంగదేవికి కూడా తెలుసు. "మీ సమస్య నాకు తెలుసు ప్రభూ! కానీ కన్నడ, తమిళ పండుతులకి ర్యాలి గ్రామంలో కూడా కష్టాలే ఎదురయ్యాయి. అక్కడి వారు కూడా, మా పుట్టింటివారు కట్టించిన గ్రామంలో గోదావరి ఆవలి ఒడ్డున యుద్ధభయాలేమీ లేకుండా నిశ్చింతగా జీవిస్తున్నామనే కృతజ్ఞత అయినా లేకుండా వీరిని తరిమి కొడుతున్నారు.

భరించలేని పరిస్థితులలో వారి తాటాకు కొంపలని వారే కాల్చేసుకుని, మిట్టమధ్యాన్నం కట్టుబట్టలతో ఊరొదిలి వచ్చేశారు.

నన్ను నమ్ముకుని వచ్చిన నావారికి నేను ఏమీ చెయ్యలేకపోతున్నాను. అప్పుడు ఇక్కడికి కొత్తపెళ్ళికూతురుగా వచ్చే ముందే నేను నా మనసుని కాస్త సంబాళించుకుని ఉండగలిగితే ఇంతవరకూ వచ్చేది కాదు. వారి స్వంత దేశంలో నీడయినా ఉండేది. ఇప్పుడు వెనక్కి పంపే ప్రయత్నం చేద్దామంటే పశ్చిమాన యుద్ధవాతావరణం.."

"ఆగండి దేవీ! అంత నిష్ఠూరంగా పలుకవద్దు. ర్యాలి గ్రామానికి ఇంకా లోపలికి గోదావరీ నది సముద్రంలో కలిసేలోపు చాలా నేల ఉంది. అక్కడి నందంపూడి గ్రామాన్నీ ఆ చుట్టుపక్కల ఊర్లనీ ద్రావిడ పండుతులకి అరణంగా ఇస్తాము.

ఇప్పుడే శాసనం తయారు చెయ్యమని నన్నయభట్టారకునికి చెపుతాను.

ఆయన అనారోగ్యంతో ఉన్నా, నామాట తప్పక మన్నిస్తారు.

కాలువలు తవ్వించి అక్కడి భూమిని సస్యశ్యామలం చేసే ఏర్పాట్లు కూడా చేస్తాము. మీరు ఊరడిల్లండి"

మహారాజు అన్నమాట నిలబెట్టుకున్నారు.

నందంపూడిని నారాయణ భట్టుకి చెందేలా...

అక్కడి భూములన్నీ ద్రవిడ పండితులకి చెందేలా శాసనం తయారు చెయ్యడమయ్యింది పండిత కుటుంబాలకి సైనికులని తోడిచ్చి గోదావరి కొనకున్న కోనసీమ అగ్రహారాలని నిర్మించుకునేలా గజరాజు ఏర్పాటు చేశారు.

అమ్మంగదేవికి అప్పటికానీ హృదయం కుదుటపడలేదు.

●●●

**పదిహేనవ శతాబ్దంలో నాలుగవ దశకం, నందంపూడి గ్రామం:**

"దీక్షితుల కుటుంబం ర్యాలిలో ఉండిపోయింది. వెళ్ళి రమ్మని చెప్దామా?" అవధాని అమాయకంగా అడిగాడు.

ద్రావిడ పండితులు కోనసీమలో స్థిరపడి రెండు తరాలు గడిచాయి.

భట్టుగారికి ఒళ్ళు మండిపోయింది.

"నీకేమయినా మతిపోయిందేవిటోయ్. ఊరందరిదీ ఒకదారి ఉలిపికట్టది వేరేదారి అన్నట్లు.. ఆనాడు మనవారితో చేరి రాక సుఖంగా ఉండిపోయారు కదూ. ఏమొహం పెట్టుకుని వెళతావూ? సిగ్గూ శరం ఉండక్కర్లే."

"అదికాదండీ భట్టుగారూ! వేదవేదాంగ పండితులు ఆ అన్నదమ్ములు. విసిరేసినట్టు అట్టే ఉండిపోయారక్కడ. పాపం కదండీ. పైగా మన పిల్లలకి వేదం నేర్పించడానికి మంచి ఆచార్యులు కూడానూ!"

అవధాని చెపుతున్నది పూర్తి అవకుండానే శాస్త్రులు, శర్మ, యాజులు వచ్చేశారు. రాజరాజ నరేంద్రుడు అగ్రహారాలు ఇచ్చాక ఆర్థికంగా బాగా కుదుటపడ్డారు ద్రావిడులు. మహారాజు మీద భయంకొద్దీ అక్కడ ఉన్న కొద్దిమంది స్థానికులూ అనుకూలంగానే స్పందించారు.

దీక్షితుల కుటుంబాలు రెండూ ర్యాలిలోనే ఉండిపోయాయి. రామ, శివదీక్షితులు అన్నదమ్ములు.

అరవదేశంనుంచి వచ్చిన పండితులకి లభిస్తున్న గౌరవం జీర్ణించుకోలేని ఊరి ప్రజలు, వారిని వెళ్ళగొట్టేవరకూ నిద్రపోలేదు.

కానీ వేదంతో పాటుగా వైద్యంలో నిష్ణాతులైన దీక్షితుల్ని ఇద్దర్నీ గ్రామంలో నిర్బంధించారు. గ్రామానికో పండిత కుటుంబం ఉండకపోతే ఎలాగా? జగన్మోహినీ కేశవస్వామి, కమండలేశ్వరుల ఆలయాలకి అర్చకులు కూడా కావాలికదా!

రామ, శివదీక్షితులకి మిగిలిన విషయాలెల ఉన్నా స్వయంభు వెలిసిన వైష్ణవ, శివ ఆలయాల్లో అర్చకత్వం మాని వెళ్ళడానికి మనస్కరించలేదు.

నందపూడిలో ఉన్న భట్టుగారికి అదేకోపం.

ఎంత నిర్భందిస్తే మాత్రం, వీలు చూసుకుని వచ్చేస్తే ఇక్కడికొచ్చి తలతీసి మొలేస్తారా?

రాజుగారు మన పక్షాన ఉన్నారన్న వార్తలు వెళ్ళే ఉంటాయికదా!

"ఇంక నుంచీ దీక్షితుల కుటుంబాలకి మనకి సంబంధ బాంధవ్యాలుండకూడదు."

ఏకగ్రీవంగా నిర్ణయించి. దీక్షితులకి ఫర్మానా పంపారు పెద్దలంతాకలిసి.

తరతరాలుగా ఆమాట మీదే నిలబడి దీక్షితుల వంశీయులతో కోనసీమలోని ఏ కుటుంబంవారూ వివాహాది శుభకార్యాలు చేసుకోలేదు. వెలివేసినట్లు అయిపోయింది.

అందువలననే కథాకాలం నాటి దీక్షితుల వంశీయులు, తమ కూతుళ్ళకి తూర్పు సంబంధాలు చెయ్యవలసివచ్చింది.

కాలచక్రంలో శివదీక్షితుల కుటుంబం అంతరించి పోయింది.

●●●

"తాతగారూ!"

అమ్మన్న గట్టిగా కుదుపుతుంటే రామదీక్షితులు ఉలిక్కిపడి కళ్ళు తెరిచారు. ఇంచుమించు వెయ్యి సంవత్సరాల చరిత్ర కళ్ళముందు కదిలింది.

"వచ్చేస్తున్నా తల్లీ. ఆకలేస్తోందా? పద."

"మరి అవో" చిట్టి చేత్తో సంభారాలని చూపించింది అమ్మన్న.

"మర్చిపోయాను తల్లీ ఉండు."

అన్నీ అంగ వస్త్రంలో మూట కట్టి అమ్మన్న చెయ్యిపట్టుకుని అడుగువేశారు దీక్షితులు. ఈ పాటికి గిరి వచ్చేసుంటాడు.

ప్రతి నిత్యం తను చేసే పూజలకి తను నమ్ముకున్న స్వామి తనకి పరీక్ష పెట్టడు కదా! మొహమాటం వదిలేసి, రాజుగారి సహాయం తీసుకుని, వీలయితే బంగారమ్మగారిని కూడా దేహి అని అడిగి, గిరిధారిని ఏ విజయనగరవో పంపి చదివించాలి.

అక్కడున్న రెండో అమ్మాయి తప్పకుండా ఉంచుకుంటుంది.

ఒక్కగానొక్క వంశోద్ధారకుడని వాడిని వదిలి ఉండలేక ఇన్నాళ్ళూ ఉపేక్షించాడు. ఇహనైనా ఏదో ఒహటి తేల్చెయ్యాల్సిందే

వంశం అంతరించి పోతుంది ఇంకా ఊరుకుంటే.

దీక్షితులు దృఢ నిశ్చయంతో అడుగులు వేశారు.

కానీ తానొకటి తలిస్తే జగన్మోహినీ కేశవ స్వామి వేరొకటి చేస్తాడు కదా!

●●●

ఎలా తెలిసిందో బంగారమ్మగారికి తెలిసిపోయింది.

ఉరుకు పరుగున వచ్చేసింది దీక్షితులుగారింటికి.

"నే విన్నది నిజవేనా?

మొత్తానికి ఇంట్లోనుంచి వెళ్ళగొట్టే వరకూ ఊరుకోలేదు మహాతల్లి.

ఊరు దాటెరుగని బొడ్డూడని వెధవ. ఏ గోదాట్లో దూకాడో.

నలుగుర్లోకీ పిలిచి నాలుగూ కడిగెయ్యక పోతే చూడు."

గిరిధారి వెళ్ళి రెండురోజులైంది. ఇంట్లో ఎవరికీ కాళ్ళూ చేతులూ ఆడట్లేదు.

ఆఖరికి సూరమ్మ కూడా బిక్కుబిక్కుమని చూస్తూ పెరటి గుమ్మం దగ్గర కూర్చుంది.

"అమ్మా! మీకు వీలయితే మీ పాలేళ్ళని పంపి వెతికించగలరా?

అందరం ఏం చెయ్యాలో తోచక అయోమయంలో పడ్డాం.

ఎవ్వరం మంచి తీర్థం తప్పితే ఇంకేమీ ఎరుగం వాడు వెళ్ళినప్పట్నుంచీ.

అల్లరి పెట్టుకుంటే పిల్లాడు తిరిగొస్తాడా చెప్పండి" దీక్షితులు సౌమ్యంగా, రుద్ధ కంఠంతో అడుగుతుంటే బంగారమ్మ ఏమీ అనలేకపోయింది.

"ఆ పని నాకు వార్త తెలిసిన వెంటనే చేశాను బాబుగారు! రావులపాలెం వరకూ వెళ్ళొచ్చారు. చుట్టుపక్కల రేవు దగ్గరకూడా వెతికించా. ఈతగాళ్ళని కూడా పెట్టి కాలవలోనూ, గోదాట్లోనూ చూడమన్నా. పిల్లాడి జాడేలేదు. సూరమ్మకి అంత కష్టంగా ఉంటేనే నేను దత్తత చేసుకునేదాన్ని కాదూ! బంగారంలాంటి పిల్లాడు. ఆ వర్చస్సు, ఠీవీ. అచ్చు ఆదికవి నన్నయ్యలాగే ఉంటాడు కాదూ. మీ వంశానికొక్కడే అని ఊరుకున్నా కానీ" కొంగు నిండుగా కప్పుకుని అంది బంగారమ్మ.

అంతలో "టెలిగ్రాం" సైకిలు మీద రివ్వున వచ్చి అరిచాడు టెలిగ్రాఫ్ బంట్రోతు.

చేతులు వణుకుతుండగా తీసుకుని పక్కింటి రాజుగారింటికి పరిగెత్తారు దీక్షితులు.

"గిరిని విశాఖపట్నం ఆసుపత్రిలో చేర్చారట. మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మని తంతి ఇచ్చాడు, నరహరి" రాజుగారు చదివి, తర్జుమా చేసి చెప్పారు. దీక్షితులు మొహం తెల్లగా పాలిపోయింది.

"ఏవయిందండీ రాజుగారూ! రాజమండ్రి గోదాట్లో తేలాడా? నరహరికెలా తెలిసిందీ?"

"బాబుగారు! అవన్నీ టెలిగ్రాముల్లో ఉంటాయా? మీరు పదండి. మా బండిలో బొబ్బర్లంక వెళ్ళి రేవు దాటుదురుగాని.

రేపు సాయంత్రానికల్లా విశాఖలో ఉంటారు. "రాజుగారు స్వయంగా దీక్షితుల్ని ఇంటికి తీసుకెళ్ళి, కావలసిన బట్టలూ అవీ సర్దించి, బండెక్కించారు.

"మీరు కాదంటే నామీదొట్టే." అంటూ బండెక్కుతుండగా చేతిలో పాతిక రూపాయలు పెట్టింది బంగారమ్మ. కేశవుడూ, యగ్గమ్మ అరుగు మీద నుంచుని చూస్తూ ఉండిపోయారు.

అమ్మన్న యగ్గమ్మ చెయ్యి గట్టిగా పట్టుకుని నిలుచుంది.

●●●

రాజమండ్రి, మార్చ్, 1947:

పుణ్యగోదావరి నాసిక్ వద్ద ఉద్భవించిన కొండల్లో కోనల్లో ప్రవహిస్తూ ఎన్నెన్నో పల్లెల్నీ పట్టణాలనీ తన పవిత్ర జలాలతో పావనం చేస్తూ, సాగరుడ్ని చేరాలనే ఉత్సాహంతో పాయలుగా విడిపోయిన పుణ్యభూమి.

ఆంధ్రులకి గోదావరి అనగానే జ్ఞప్తికి వచ్చేది రాజమహేంద్రవరమే. వేంగిరాజుల పాలనలో మహాభారత రచనకి, తదుపరి అనేక సాహిత్య ప్రక్రియలకీ ఆలవాలమైన ఆంధ్రుల అభిమాన నగరం. స్వాతంత్ర సాధనకై వాడవాడలా సభలూ, సమావేశాలూ పోరాటాలూ సాగుతూనే నేడో రేపో స్వరాజ్యం వచ్చేస్తుందని ఎదురురుచూస్తున్న రోజులు.. "రశ్మిమంతం సముద్యంతం భాస్కరం భువనేశ్వరం."

నూతిలోంచి చేదతో నీళ్ళు తోడి తలమీదినుంచి పోసుకోగానే మొదలుపెట్టాడు నరహరి. ప్రతీ రోజూ సూర్యోదయంతోనే అతని స్నానం మొదలవుతుంది.

లేలేతకిరణాలు నులివెచ్చగా ఒంటిని తాకుతుంటే స్నానం అయేసరికి ఆదిత్యహృదయం పూర్తయిపోయింది.

సంధ్యావందనం, పూజా ముగించి పెద్ద కంచు గ్లాసు భుజానికున్న అంగోస్త్రంతో పట్టుకుని నిండుగా ఉన్న వేడివేడి కాఫీ ఊదుకుంటూ, పెరట్లో అరుగు మీద కూర్చుని ఆ రోజు చెయ్యాల్సిన పనులు, రాబడి, ఖర్చు వ్యవహారాలు ఆలోచించుకుంటున్నాడు.

మార్చినెల. వసంతం రావడానికి హడావుడీ చేస్తోంది. చలితగ్గింది. వేడి మొదలవలేదు. ఆహ్లాదంగా వీస్తోంది గాలి.

"అదేవిటో ఏనెలా ఏగాణీ మిగలడం చూడట్లేదు. ఎలా ఈదాలే బాబూ ఈ సంసారాన్ని. చూస్తే ఖర్చులు పెరిగేవే కానీ తరిగేవి కాదు." నిట్టూరుస్తూ భార్య, సుందరి దగ్గర వాపోయి, ఇంట్లోకి వెళ్ళి ఆఫీసుగదిలో తన చిట్టా విప్పాడు. ఆఫీసు వ్యవహారాలన్నీ చూసుకుని సరిగ్గా పదింటికి పట్టు పంచెకట్టుకుని భోజనానికి కూర్చోబోతూ పిలిచాడు.

"యమునా! యమునా.. ఎక్కడా?"

అడుగులో అడుగేసుకుంటూ వచ్చింది యమున.

"అరే పిలవగానే ఎలాపడితే అలా వచ్చెయ్యడమేనా? వెళ్ళిబట్టలేసుకో. తల్లోంచి చూడు ఇంకా నీళ్ళు కారుతున్నాయి. అమ్మని పిలు" కేకలు పెడుతున్న నరహరిని చూసి యమున పెదవులు బిగపెట్టింది, ఏడుపు ఆపుకుంటూ.

కూతురి బుంగమూతి చూసి నరహరికి నవ్వాగలేదు. దగ్గరగా వెళ్ళబోయాడు.

"అప్పా అప్పా!" అంటూ వెనక్కి వెనక్కి నడిచింది యమున, తల అడ్డంగా తిప్పుతూ.

"సరే నేను రానులే. ఏంటి కథ"

"ఏముంది? మామూలే. రోజూ నీళ్ళుపోసుకున్నాక బట్టల కోసం తిక్క. చిందులూ!" సుందరి ఆయాసపడుతూ వచ్చింది. ఐదో నెల గర్భిణీ.

"అలాగే వెయ్యొచ్చుకదా! దానికి గోలెందుకు."

తువ్వాలుతో యమున తల తుడుస్తూ అన్నాడు నరహరి.

తనకి అనుకూలంగా మాట్లాడుతున్నాడని గ్రహించి బుద్ధిగా తుడవనిచ్చింది యమున.

"ఊ! బాగుంది సంబరం. అయితే నాలుగు పట్టు పరికిణీలు కుట్టించండి. ఉన్న రెండూ ఉతకడం మర్చిపోతే నా బుర్రతింటోంది."

ఇంకా తడితడిగా ఉన్న పరికిణీ, కుంపటి వేడికి ఆరబెట్టి తొడిగి, తలదువ్వి రెండు జడలువేసి, రిబ్బన్లు పువ్వులా కట్టి, నరహరికి అందించింది.

"కావేరి బడికెళ్ళిందా?" పెద్ద కూతురిగురించి అడుగుతూ, యమునని ఎత్తుకుని, షీకాయ వాసన వేస్తున్న తలమీద ముద్దుపెట్టుకున్నాడు. "అప్ప. అప్ప" అంటూ కేరింతలు కొడుతూ నరహరి మెడచుట్టూ చేతులు వేసింది చిన్నారి యమున. నరహరి జుట్టు పీకుతూ చేత్తో ఏదో చూపిస్తోంది.

యమున చూపిస్తున్న వైపుకి తలతిప్పాడు. దేముడి గది. అందులోకి తీసుకెళ్ళగానే బుజ్జిచేతులు జోడించి కళ్ళుమూసుకుంది. అక్కడున్న కృష్ణుడి విగ్రహం మీదున్న నంది వర్ధనం పువ్వు తీసి తల్లో పెట్టుకోబోయింది. అచ్చు అమ్మలాగే మొహం పెట్టి. నవ్వుకుంటూ పువ్వు కూతురి జడలో గుచ్చాడు నరహరి.

యమునకి రెండు నెలల్లో రెండేళ్ళు నిండుతాయి. రెండక్షరాల మాటలు తప్ప పలకవు. వాటితోనే తనకి కావలసింది సాధించుకుంటుంది. పళ్ళు తోమడం దగ్గర్నుంచీ పడుకునే వరకూ తను అనుకున్నదే జరగాలి. నరహరి బొంబాయిలో ఉన్న పెద్ద మందుల కంపెనీకి సేల్స్ సూపర్ వైజర్. దేశం నలుమూలలకీ బదిలీలు ఉంటాయి. ఐదారేళ్ళు మద్రాసు, బొంబాయి, ఢిల్లీ, ఆగ్రాల్లో చేశాడు.

కంపెనీవాళ్ళు రాజమండ్రిలో బ్రాంచి తెరిచి, నరహరిని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు చూసుకోమన్నారు. పుట్టిపెరిగిన ఊరికి పొమ్మంటే ఇంకే. ఆగ్రానుంచి ఆనందంగా వచ్చేశాడు. నరహరికి ఇద్దరు చెల్లెళ్ళ తరువాత ఇద్దరు తమ్ముళ్ళు. చిన్న తమ్ముడు విష్ణుమూర్తి నరహరి దగ్గరే ఉండి యస్సెల్సి చదువుతున్నాడు. పెద్దతమ్ముడు గోపాలరావు బియస్సీ పాసయ్యాడు.

నరహరి ప్రోత్సాహంతో మందుల కంపెనీల్లో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళకి వెళ్ళిపోయారు. నరహరి తండ్రి బలరామయ్యకి యాభైఏళ్ళుంటాయి. ధవళేశ్వరంలో, అరుగుమీద వీధి బడినడుపుతూ ఉంటాడు.

పిత్రార్జితం ఐదెకరాలు కౌలుకిచ్చి ఆదాయం వస్తున్నప్పుడు బాగానే ఉండేది. ఆడపిల్లల పెళ్ళిళ్ళకి నాలుగెకరాలు హరించుకుపోయింది.

ఉన్న ఎకరం మీద వచ్చే ఆదాయం, బడిపిల్లలిచ్చే నెలజీతాలూ బొటాబొటిగా తిండికి సరిపోతుంది. తమ్ముళ్ళ చదువూ, అడపా తడపా చెల్లెళ్ళకి పెట్టే చీరలూ, సారెలూ.. అన్నీ నరహరి బాధ్యతలే. అర్ధం చేసుకుని అతని అడుగుజాడల్లో నడిచే ఇల్లాలు సుందరి.

యమునని పక్కనే కూర్చోపెట్టుకుని, చిన్న వెండిపళ్ళెంలో పెరుగన్నం కలిపి పెడుతూ భోజనం ముగించాడు నరహరి. మఠం వేసుకుని, ఒక్క మెతుకు కూడా కిందపడకుండా తింటున్న కూతుర్ని చూస్తుంటే, బుద్ధిగా వెన్న తింటున్న బుల్లికృష్ణుడు తలపుకొచ్చాడు. అలాగే హృదయానికి హత్తుకోవాలనిపించింది.

భోజనం అవగానే కంచంలోనే చెయ్యి కడిగేసుకుని, యమునని ఎత్తుకుని పెరట్లోకి వెళ్ళి చేతులూ కడిగి, పెరుగు వాసన వేస్తున్న చిట్టిచేతులతో ముక్కురాసుకుంటూ, పెరట్లో పరుగెడుతున్న ఉడుతల్ని, పిచుకల్నీ చూపిస్తూ తనని తాను మర్చిపోతున్నాడు. సమయం తెలీట్లేదు. "ఇవాళ ఆఫీసు లేదా? తీరుబడిగా ముద్దులూ మురిపాలూ " సుందరి, తనుకూడా అన్నం తినేసి, కంచాలు పట్టుకుని వచ్చింది పెరట్లోకి.

"ఫరవాలేదులే. మనపని మధ్యాహ్నమేగా మొదలయ్యేది" అంటూనే, మెడపట్టుకుని మొరాయిస్తున్న యమునని కిందకి దింపి, తన గదిలోకి నడిచాడు నరహరి.

తెల్లని గ్లాస్కో పంచకట్టుకుని, ఫుల్ హాండ్స్ షర్టు వేసుకుని, క్రాఫులో కనీకనిపించకుండా ఉన్న పిలకని సర్ది, తలదువ్వుకుని తయారయ్యాడు. వీధరుగు మీద కిటికీకి కట్టిన సైకిలు ఒకసారి తుడిచి బైటికి తీసి ఆఫీసుకి వెళ్ళడానికి బాటా జోళ్ళు వేసుకుంటున్నాడు.

"సుందరీ!" నరహరి తల్లి సుబ్బులు, హడావిడిగా పిలుస్తూ వచ్చింది. కొడుకు రాజమండ్రి వచ్చాక, అప్పుడప్పుడు పొద్దున్నే భోజనాలవగానే నడుచుకుంటూ వచ్చేస్తోంది.

"ఎంతరా? నాలుగడుగులేస్తే తిన్నదరుగుతుంది" అంటుంది, జట్కాకట్టించుకోరాదమ్మా అని కేకలేసే నరహరికి.

"నాలుగుమైళ్ళా? నాలుగడుగులా?" నోరు తెరుచుకుని చూసింది సుందరి, మొదటిసారి.

"ఇంకా నలభయ్యో పడే కదే నాలుగుమైళ్ళంటే ఎంతా? పైగా రెండురూపాయలడిగాడు జట్కావాడు. ఉంటే పదిరోజులు కూరల ఖర్చెళ్ళిపోతుంది మరి" సుబ్బులుకి పధ్నాలుగేళ్ళకే నరహరి పుట్టాడు. ఆయాసపడుతున్న అత్తగారికి నవ్వుతూ మంచినీళ్ళందించి, కాఫీకి నీళ్ళు పడేసింది సుందరి, కుంపటంటించి. సుబ్బులుకి కాఫీ ఉంటే ఇంకేమీ అక్కర్లేదు. అది నరహరి చెన్నపట్నం నుంచి తెచ్చిన ఇత్తడి కాఫీ ఫిల్టర్లో దిగిందైతే మరీ శ్రేష్టం

"పోనీ ఈ ఫిల్టరు పట్టుకు పోండత్తయ్యా! నేను ఈసారి ట్రాన్సఫర్ అయినప్పుడు తెచ్చుకుంటాను. అసలు మీకు నచ్చుతుందని తెలిస్తే ఇంకోటి తెస్తాను "

"అప్పుడప్పుడు వచ్చి తాగుతేనే దాని రుచి ప్రత్యేకంగా ఉంటుందే రోజూ పులిహార తినం కనుకే పండుగల్లో చేసినప్పుడు ఊదేస్తాం. అస్తమానూ కనిపిస్తే ఏదయినా అలుసే." ఒక జీవిత సత్యాన్ని కోడలికి వివరించి, సుందరి దగ్గరగా వచ్చి చెవిలో ఏదో చెప్పింది.

"నిజంగానా అత్తయ్యా! మంచివార్త చెప్పారు. బియ్యం నానబెడ్తా ఉండండి. కొద్దిగా చలిమిడి చేద్దాం. మీరు ఇవేళ ఉండిపోరాదూ."

"ఏవిటో అత్తాకోడళ్ళ గుసగుసలు" సైకిలుకి స్టాండేసొచ్చి, నరహరి తల్లిని పలుకరించాడు.

"మీరు మామయ్య అవబోతున్నారు. ఇన్నాళ్ళకి అమ్మాజీ కడుపు పండిందిట." సుందరి సంతోషంగా అంది. అమ్మాజీ నరహరి పెద్ద చెల్లెలు.

సంప్రదాయం ప్రకారం పెద్దమనిషి అవకుండా పెళ్ళిచేశారు.

శారదా యాక్టు ధర్మమా అని యానాం తీసుకెళ్ళి చెయ్యాల్సి వచ్చింది.

పెళ్ళి ఎంత చిన్నప్పుడయినా కాపురానికి వెళ్ళే పదేళ్ళయింది. అందరూ ఆశ వదిలేసుకున్నారు.

అమ్మాజీ అత్తగారయితే కొడుక్కి రెండో పెళ్ళి గురించి ఆలోచిస్తోందని వినికిడి. ఇప్పుడు ఈ వార్త. మరి ఆనందం కాక!

"చాలా సంతోషం. అమ్మా! తాపేశ్వరం నుంచి కాజాలూ, ఆత్రేయపురం నుంచి పూతరేకులూ తెప్పిస్తాను. సారె ఇచ్చిరండి. నువ్వు ఈవేళ ఉండిపో. నాన్నగారికి కబురుపంపిస్తాను. ఆయన అత్తెసరు పడేసుకోగలరు కదా!"

●●●

యమున ఆనందంతో ఉరకలు వేస్తూ, తడబడుతున్న అడుగులతో వీధివాకిలి దగ్గరకి వచ్చింది.

సిరిసిరిమువ్వలు సన్నగా శబ్దం చేస్తుంటే అటూ ఇటు చూస్తూ చిన్నారి పాదాన్ని జాగ్రత్తగా గడప మీద పెట్టబోయింది.

అబ్బబ్బా! ఈ గడప ఇంతెత్తుగా ఎందుకుపెడతారో?

గుమ్మం పట్టుకుని మళ్ళీ ప్రయత్నించింది.

నున్నగా పాలిష్ చేసిన వెడల్పాటి టేకు గుమ్మం..

రెండు చేతులూ కలిపినా పట్టుకోలేకపోయింది.

పైగా అదిమిన కొద్దీ చేతులు జర్రున జారిపోతున్నాయి.

ఏం చెయ్యాలో తోచక గుమ్మం ముందు మోకాళ్ళు వెనక్కి మడిచి కూర్చుని, గడపకి వేసిన ముగ్గుల్ని చేత్తో చెరపాలని చూసింది. పచ్చగా, ఎర్రగా తెల్లగా, ఎంతబాగున్నాయో! కొంచెం కూడా చేతులోకి రాలే. గోళ్ళతో గోకింది.

అమ్మ పొద్దున్నే నీళ్ళోసిన వెంటనే గోళ్ళన్నీ పళ్ళతో కొరికేసింది. ఇంకెలా?

ఈ అమ్మలు ఎందుకు అర్ధం చేసుకోరో? నోరుగడప మీద పెట్టి నాకుదామని చూసింది.

అంతలో.. వీధిలో గణగణా గంటలు మోగాయి. రెండెడ్ల బండి. నిండుగా ధాన్యం బస్తాలతో వెళ్ళిపోతోంది.

యమున కళ్ళు పెద్దవి చేసి తెల్లని ఎద్దుల్ని చూసింది. అప్పుడు గుర్తుకొచ్చింది. అవునూ! వీధి తలుపు తీసుందని కదా ఇంతదూరం వచ్చింది. అసలు పని మర్చిపోతే ఎలా? తల తిప్పి వెనక్కి చూసింది.

అమ్మ ఎక్కడా కనుచూపు మేరలో లేదు. దూరంగా పెరట్లో రోకలి పోట్లు వినిపిస్తున్నాయి.

అమ్మయ్య కొంచెం సేపు కష్టపడితే, తను అనుకున్న పనిచేసెయ్యచ్చు. కష్టపడి ఎత్తైన గడప మీదినుంచి పాకి వీధి గుమ్మం దాటింది. అటూ, ఇటూ ఎత్తు అరుగులు.. మధ్యలో మెట్లు. ఈ మెట్లు కూడా ఇంతెత్తు ఎందుకు పెట్టారో?

యమునకి ఏడుపొచ్చింది. ఏదో ఉపాయం ఆలోచించాల్సిందే.

కూచుని నెమ్మదిగా, జాగ్రత్తగా ఒక్కొక్క మెట్టే జారుతూ దిగింది. మధ్యలో పట్టుపరికిణీ కాళ్ళలో పడింది.

అమ్మతో పేచీ పెట్టి పరికిణీ ఎందుకు తొడుక్కున్నానా అని ఒక్క నిముషం విచారించింది. హా! ఎలాగయితేనేం ఎవరూ చూడకుండా వీధిలోకి వచ్చేసింది. ఎంతసేపు. ఎప్పుడూ అమ్మ ఎత్తుకుని చకచకా నడుస్తుంటే ఎంత తొందరగా వెళ్ళిపోతాం. పరుగెట్టేస్తే సరి.

యమున బుడి బుడి అడుగులు గబగబా వెయ్యసాగింది, కళ్ళు పెద్దవి చేసి చుట్టూ పరికిస్తూ. నీలం పట్టు పరికిణీ మీద తెల్లని ముగ్గు మరకలు. మెట్లమీద ముగ్గుని రాసుకుంటూ దిగిపోయింది మరి.

ఢాం..ఢాం..

పెద్దచప్పుడు. ఉలిక్కిపడి చూసింది యమున.

మెడ బాగా పైకి ఎత్తి చూస్తేనే కానీ కనిపించట్లేదు. పెద్ద బుడగలబండి.

ఒక బుడగ పేలిపోయినట్లుంది. రంగు రంగుల బుడగలు. ఆగిపోయి ఆశగా చూసింది. బుడగలవాడు పెద్ద మీసాలతో చూస్తూ దగ్గరగా వచ్చేస్తున్నాడు.

భయం వేసి బిక్కమొహం వేసింది. కళ్ళనిండా నీళ్ళు.

అమ్మకోసం అటూ ఇటూ చూసింది. ఎక్కడా కనిపించదే! కాళ్ళు పీకుతున్నాయి.

కాలికి రాయి తట్టుకుని పడబోయింది. రోడ్డు, పైకి కొండమీదికి వెళుతున్నట్లుంది. ఆయాసపడుతూ రెండు అడుగులు వేసి, నేలమీద కూలబడి పాకసాగింది.

చిన్న చిన్న కంకర్రాళ్ళు మోకాళ్ళకి గీసుకుపోయి పరికిణీ అంతా రక్తం మరకలు పడుతున్నాయి. యమునకి ఏడుపు వచ్చేస్తోంది. ఎలాగయితేనేం. గోదారొడ్డుకెక్కేసింది. కొంచెం దూరం వెళితే చాలు.

అమ్మయ్యా! రోడ్డు మామూలుగా అయింది. లేచి మళ్ళీ నడక. పాకుతూ, నడుస్తూ. ఎంతదూరం నడిచినా రాదే! అదిగో కొద్దిగా కష్టపడి ఎత్తు ఎక్కుతే కనిపిస్తుంది. కిలకిలా నవ్వుతూ మెట్టుమీద కూర్చుని కాళ్ళు కిందికి జారేసింది, ఆయాసపడుతూ. రెండు మెట్లు దిగి దేకుతూ పక్కకి జరిగింది. తనకి కావలసింది అక్కడే ఉంది.

చిన్ని చేతులు రెండింటితో గోడపట్టుకుని పక్కకి తిరిగి నెమ్మదిగా మెట్లు దిగసాగింది. ఇంక కొన్నే ఉన్నాయి. ఎలాగో దిగేస్తే ఎంచక్కా నీళ్ళతో ఆడుకోవచ్చు.

ఆఖరి మెట్టు. యమున మొహంలో అవధుల్లేని ఆనందం. కేరింతలు కొడుతూ కూర్చుని, కాళ్ళు నీళ్ళలోకి పెట్టి, తపాతపా కొడుతూ చేతులు కూడా పెడదామని వంగింది.

కాళ్ళకి నేల అందలేదు. గోదావరి ఉధ్ధృతంగా పారుతోంది.

దూరంగా వెళుతున్న పడవ చుక్కాని.

అక్కడక్కడ ఒడ్డున నడుస్తున్న మనుషులు తప్ప దగ్గర్లో ఎవరూ లేరు.

అపరాహ్ణం దాటింది మరి.

గోడపక్కనే గోదావరితో ఊసులాడుతున్న యమున ఎవరికీ కనిపించే అవకాశమే లేదు. ఎండకి పైకి వచ్చిన చేపలు మళ్ళీ నీళ్ళలోకి జారుకుంటున్నాయి.

ఒక చేప యమున కాళ్ళని ముద్దుపెట్టుకుని వెళ్ళింది.

యమున ఉలిక్కిపడి చేతులు పైకి తీసేసింది. కాళ్ళు కూడా పైకి లేవబోయాయి.

ఒక్క క్షణం ఆగితే నీళ్ళలోకి జారిపోయేదే!

నీళ్ళలో నిలబెట్టిన చెక్కకి ఉన్న మేకు పరికిణీ అంచుకి తగులుకుని ఆపింది.

నీళ్ళలో దిగినప్పుడు పట్టుకోడానికి వీలుగా మెట్ల పక్కనే కర్రలు పాతారు. ఆ కర్ర ఎక్కడిదో దానికి మేకు ఉండడం.

యమునకి ఒక్కసారి భయం వేసింది. ఆ కర్రనే పట్టుకుని నిల్చోబోయింది.

కాళ్ళు జారిపోతున్నాయి.

"అమ్మాయిగారూ! మీరేనా. ఇక్కడేం చేత్తన్నారండీ. అమ్మగారేరీ? మీరొక్కరేనా. అయ్యబాబోయ్!"

బిత్తరపోయిన యమున గట్టిగా ఏడుపు మొదలెట్టింది.

అటుగా వెళుతూ కాళ్ళు కడుక్కుందామని రేవుకొచ్చి చాకలి నర్సన్న చేతిలో ఉన్న బట్టల మూటపక్కన పడేసి యమునని పైకి లేపి ఎత్తుకున్నాడు.

●●●

అదే సమయానికి.

"యమునా యమునా! అయ్యో పిల్లేదే? కనిపించట్లేదూ. ఎక్కడా అలికిడి లేదు. ఏ గదిలోనైనా దూరి అందినవన్నీ పీకేస్తోందేమో. ఓసారి చూసొస్తా ఉండు. నువ్వు రోకలి పోటాపకే."

పనిమనిషి అప్పాయమ్మకి చెప్పి సుబ్బులు ఇంట్లోకి పరుగెత్తింది, చీరకొంగుతో చెమట తుడుచుకుంటూ.

"నిజమే. కావేరి ఇంట్లో ఉంటే చూసుకునేది. ఎక్కడా చప్పుడూ లేదంటే ఏదో తగలేస్తోందనే. కాఫీ కూడా కలపాలి. కాసేపాగవే అప్పీ!" పెరట్లో రోలు పక్కన పెద్ద బట్ట పరిచి పిండి జల్లిస్తున్న సుందరి కూడా లేచింది చీర దులుపుకుంటూ.

"పిల్ల ఎక్కడాలేదే సుందరీ. వీధి తలుపు కూడా బార్లా తీసుంది."

ఏడుపు గొంతుతో ఆదరా బాదరా ఎదురొచ్చింది సుబ్బులు.

"అయ్యో! ఎక్కడికెళ్ళిపోయిందో. మంచం కింద చూశారా?" గాభరాగా పడగ్గదిలో, నీళ్ళగదిలో. అంతా వెతికి, రోడ్డు మీదికి పరుగెత్తింది సుందరి. కాళ్ళకి జోళ్ళయినా లేకుండా.

"అప్పీ! ఒకసారి ఆ పనాపి నువ్వు కూడా అమ్మాయితో వెళ్ళు. ఉండండి. నేనిటెళ్తా. మీరటు వెళ్ళండి." పెరట్లో దంచుతున్న. జల్లిస్తున్న పిండి మీద చీరలు కప్పి, ఇల్లు తాళం వేసి వచ్చింది సుబ్బులు.

"మేం గోదారికేసి వెళతాం. మీరు అటువేపు వెళ్ళండి." అప్పిని త్వరగా నడవమని తను పరుగెడుతున్నట్లు అడుగులు వేస్తోంది సుందరి.

"అమ్మాయ్! జాగ్రత్త. నేలమీద చూసుకో. రాళ్ళు రప్పలూ ఉంటాయి. చంటిది ఎక్కువ దూరం వెళ్ళలేదులే."

గట్టిగా కోడలికి ధైర్యం చెపుతూనే పార్కుకేసి నడిచింది సుబ్బులు.

"పాపిష్టిదాన్ని. వీధి తలుపు వేసుందో లేదో చూసుకోవద్దూ! ఎడ్లబళ్ళూ, గుఱ్ఱబ్బళ్ళూ. సైకిళ్ళూ. పిల్లదేనికిందేనా పడలేదు కదా!

మీ అయ్యగారు ఎప్పుడొస్తారో ఏమిటో. ఎలాగే బాబూ"

అప్పితో గొడవ పెడుతూనే అడుగేస్తోంది సుందరి.

కళ్ళలో నీళ్ళు ధారలా కారిపోతున్నాయి. చేతులు వణుకుతున్నాయి.అప్పుడే కదలడం మొదలు పెట్టిన కడుపులో పాపాయి, తనక్కూడా భయం వేస్తోందన్నట్లు బిగుసుకుపోయింది.

"చిన్నమ్మాయి గోరు ఎల్లాగైనా దుందుడుకండి. జాగ్రత్తగా కాచుకోవాలి. ఎంతదూరం నడుత్తారేటండి. సరిగ్గా నడకరాదు గందా!" అప్పి ధైర్యం చెపుతూ, అటూ ఇటూ చూస్తూ వెళ్తోంది.

"అయ్యబాబోయ్!" చటుక్కున ఏదో గుర్తొచ్చింది సుందరికి.

"ఏటండీ. ఏవయ్యిందీ?"

"పాపాయి మెళ్ళో వాళ్ళ నాన్నమ్మిచ్చిన గొలుసుండే. పొద్దున్న అల్మారులో చూసి ఏడ్చి తగిలించుకుంది.

దానికోసం ఎవరైనా ఎత్తుకు పోలేదుకదా?" రోడ్డు పక్కనే ఎవరిదో ఇంటరుగు మీద కూలబడి ఘొల్లుమంది సుందరి.

"ఫర్లేదమ్మగారూ! మీరు ఖంగారుపడి నన్నెట్టేయకండి. ముందు చూద్దాం. ఆ తర్వాత కావాలంటే పోలీసులకి చెపుదాం." అప్పాయమ్మ, సుందరిని లేపి నెమ్మదిగా నడిపించింది.

"అమ్మగారు! అదిగో. అటు చూడండి."

అప్పాయమ్మ చూపించిన వేపు చూసింది సుందరి.

చాకలి నర్సన్న భుజమ్మీద కూర్చుని, వీపుకున్న మూటతో ఆడుకుంటూ చేతులు తిప్పుతూ తన భాషలో ఏదో చెపుతోంది యమున. అంతలోనే అమ్మని చూసి దూకెయ్య బోయింది.

"అరే! పాపగారూ. పడిపోతారండి. ఆగండి" నర్సన్న జాగ్రత్తగా దింపాడు. చేతులు రెండూ చాపి పరుగెత్తుకుంటూ వచ్చి అమ్మకాళ్ళు పట్టేసుకుంది. సుందరి గుండె రోకలి పోటులా శబ్దం చేస్తోంది. చటుక్కున ఎత్తుకుని, యమున వీపు మీద దెబ్బలు వేస్తూ అరిచింది.

"దొంగముండా! ఎప్పుడైనా చెప్పకుండా వెళతావా. ఎంతగాభారా పెట్టేశావే. ఇంటికి పద నీ పనిచెప్తా?" ఎప్పుడూ కొట్టని తల్లి దెబ్బలకి బిత్తరపోయింది యమున. ముందు ఏం జరుగుతుందో అర్ధం అవలేదు.

తెలియగానే రౌద్రాకారంలో ఉన్న అమ్మని చూసి భయం. వీపుమీద నొప్పి. గుక్క తిప్పుకోకుండా ఏడుపు మొదలెట్టింది.

"అయ్యో! చంపేస్తారా అమ్మగారూ!" అప్పి బలవంతంగా లాక్కుని, యమున మొహం చీర కొంగుతో తుడిచి, భుజం మీద పడుకోబెట్టుకుని ఇంటికేసి నడిచింది. వెనకాలే కాళ్ళు ఈడ్చుకుంటూ సుందరి.

"అమ్మాయ్! చంటిదెక్కడా?"

వీధరుగు మీద నుంచుని ఆదుర్దాగా చూస్తున్న సుబ్బులు అరుగు మీంచి దూకి అప్పి చేతిలో పిల్లని అందుకుంది ఆత్రంగా. యమున వెక్కుతూనే నిద్రపోయింది. తలుపు తాళం తీసి హాల్లో ఉయ్యాలలో యమునని పడుకోబెట్టి అప్పుడు గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు అందరూ.

●●●

నరహరి ఇంటికొచ్చేసరికి రాత్రి పదిదాటుతుంది.

డాక్టర్లందరి దగ్గరికీ వెళ్ళిన రిప్రజెంటేటివ్‌లని తన ఆఫీసులో కలుసుకుని ఆ రోజు ఎవరెవరు ఎక్కడి కెళ్ళారో ఎంతమందిని కలుసుకున్నారో అన్నీ తన ఫైల్లో రాసుకుని, మర్నాడు చెయ్యవలసిన విజిట్‌ల ప్రోగ్రాములు ఇస్తాడు ఒక్కొక్కళ్ళకి.

ఒక నెలలో జరిగిన విజిట్లూ, మెడికల్ షాపుల దగ్గర్నుంచి తమ కంపెనీకి వచ్చే ఆర్డర్లూ పోల్చి చూసుకుని, ఏమయినా మార్పులూ చేర్పులూ ఉంటే పై ఆఫీసుకి సిఫారసు చేస్తాడు. అందుకనే అతని పని మధ్యానం నుంచీ మొదలవుతుంది. రాత్రి ఇంటికొచ్చేసరికి పదిదాటుతుంది. ఆ రోజు మాత్రం తొందరగా ఎనిమిదింటికే వచ్చేశాడు ఆదుర్దాగా! వస్తూనే కాళ్ళు, చేతులూ కడుక్కుని, ఉయ్యాల్లో ముడిచి పెట్టి పడుక్కున్న యమునని లేపి ఎత్తుకుని, ఒళ్ళంతా తడిమాడు.

"ఏమయిందే? చిట్టితల్లి ఏదో సాహసకార్యం చేసిందిట. మోకాళ్ళు ఎలా గీరుకుపోయాయో! ఏం రాశారూ?" అట్టకట్టిన మోకాళ్ళని పరీక్షగా చూశాడు.

"అప్పుడే నీవరకూ వచ్చిందిరా? దేవుడి దయ. అదృష్టం బాగుందనుకో! పిల్ల దక్కాల్సిందికాదు. శుభ్రంగా కడిగి సల్ఫర్ మాత్ర పొడిచేసి రాశాను. పైపైనేలే. అంత బెంగేం లేదు." సుబ్బులు మాటలు కొంత పశమనం కలిగించాయి.

"నర్సన్న ఆఫీసు మీదుగా వెళుతూ నా చెవినవేశాడు. అయినా వీధి తలుపు బార్లా తీసిపెడతారే అమ్మా? పాపాయికేం తెలుసూ. అది అసలే ఎలా తప్పించుకుని వెళదామా అని దార్లు వెతుకుతుంటుంది. నీ కోడలేదీ?"

"అప్పా! నే హోం వర్క్ చేసేశా చూస్తారా" రెండో క్లాసు చదువుతున్న కావేరి పట్టరాని సంతోషంతో వచ్చి తండ్రి కాళ్ళు పట్టేసుకుంది. దక్షిణాదిన పుట్టి, మాటలొస్తున్నప్పుడు అక్కడే ఉండడంతో "అప్పా" అని పిలవడం అలవాటయింది. అక్కని అనుకరించే చెల్లాయికి కూడా అదే వచ్చింది.

ఆదివారాలు తప్ప కావేరికి అప్పని చూసే అవకాశమే రాదు.

అందుకే ఏదో పెన్నిధి దొరికినట్లు పట్టేసుకుంది.

"అరరే. నీ అంతట నువ్వే చేశావా బంగారం. చూస్తానుండు. చెల్లికి చూశావా ఆయి అయింది."

"అవునప్పా! దెబ్బకొట్టుకుంది. బుద్ధిగా ఇంట్లో ఉండకపోతే ఏమవుతుందీ? నేను బడికెళ్ళాకదా! అంతే మరి. ఎవరు చూస్తారూ" దీర్ఘం తీస్తూ అంది కావేరి, కళ్ళు పెద్దవి చేసి.

"నిజమేరా! బుద్ధిలేనిదాన్ని. తలుపులు బారెట్టి పెరట్లో ఏడిస్తే ఏమవుతుందీ." సుందరి, మంచి నీళ్ళగ్లాసు నరహరికి ఇచ్చి, యమునని ఉయ్యాల్లో పడుకోబెట్టింది. సుందరి మొహం అంతా పీక్కుపోయి, మాట నూతిలోంచి వస్తున్నట్లు నీరసంగా ఉంది. కళ్ళలోంచి ఏ క్షణంలోనైనా నీళ్ళురాలడానికి సిద్ధంగా ఉన్నాయి.

గటగటా  చల్లని నీళ్ళు తాగేసి ఆదుర్దాగా చూశాడు నరహరి.

"అమ్మా! నువ్వు కొన్నాళ్ళు ఇక్కడుండడానికి వీలవుతుందా? అది పిల్లలతో చేసుకోలేకపోతోంది. నాన్నగారిని కూడా వచ్చెయ్యమను. రోజూ జట్కా కట్టించుకుని వెళ్ళచ్చు, బడినడపడానికి."

పెద్దకొడుకు తాపత్రయం చూసి ముచ్చట పడింది సుబ్బులు. "అలాగేలేరా! నాల్రోజులు దొడ్డమ్మ పెడ్తుందిలే అన్నం. మీ నాన్నగారు అటూ ఇటూ తిరగలేరు."

బలరామయ్య అన్నగారు పక్కింట్లోనే ఉంటాడు. తండ్రి ఇచ్చిన పెద్ద మండువా ఇల్లు, మధ్యలో గోడకట్టి రెండు కిందచేసి అన్నదమ్ములిద్దరూ ఉంటున్నారు.

సుబ్బులు మాట నోట్లోనే ఉంది.

"అత్తయ్యా! నువ్విక్కడే ఉన్నావా? నాకు ఇంట్లో ఏం బాగాలేదు. నువ్వే ఏదో చెయ్యాలి. నేనిక్కడికి వచ్చినట్లు ఎవరికీ తెలీదు. నరహరి బావ సాయంచేస్తాడేమో అని వచ్చా!" పరుగెత్తుకునొచ్చి పెద్దగా ఏడుస్తూ కాళ్ళమీద పడ్డాడు పన్నెండేళ్ళ కుర్రాడు. వాడిపై పెదవి చిట్లి రక్తం కారుతోంది. ఒళ్ళంతా ఎర్రటి దుమ్ము కొట్టుకుపోయి ఉంది. ఏడిచి ఏడిచి మొహమంతా చారికలు కట్టేసింది.

అంతా స్థాణువుల్లా నిలబడిపోయారు.

●●●

"గిరీ! లేముందు. ఎక్కడ్నుంచీ? ఆ రక్తం ఏంట్రా?"

సుబ్బులు వెక్కుతున్న కుర్రాడ్ని లేపి, తువ్వాలు తడిపి మొహం తుడిచింది. చల్లని బట్ట పెదవికి తగలగానే కెవ్వుమన్నాడు వాడు.

"ఇంటినుంచే అత్తయ్యా. పారిపోయివచ్చేశా. ఇంక నేను అక్కడుండను. నరహరి బావ ఈసారి బొంబాయి వెళ్ళినప్పుడు నన్ను తీసుకుపొమ్మని చెప్పు. అక్కడ ఏదయినా కూలి పనిచేసుకుని బతుకుతా." కళ్ళు పెద్దవి చేసి గబగబా అన్నాడు. వాడి కళ్ళలో భయం. ఏడుపుతో మాటలు సగం మింగేస్తున్నాడు. కాళ్ళు, చేతులూ వణికిపోతున్నాయి.

"అలాగే వెళుదువుగాని. ముందు అన్నం తిందువుగాని పద. ఎప్పుడు తిన్నావో ఏవిటో" భయంలేదన్నట్లు వాడి భుజాలు పట్టుకుని అంది.

"బావతో తింటాలే అత్తయ్యా. అంత ఆకలి లేదు."

"ఇదిగో ఆయనికి కూడా వడ్డించేశా. రండి. మీరు కూడా కూర్చోండి అత్తయ్యా!" సుందరి వంటింట్లోకి నడిచింది.

"ముందు పిల్లలది కానీ. మనిద్దరం తర్వాత తిందాం."

సుబ్బులు వంటింట్లోకి వెళ్ళి కుంపటి అంటించి ఎసరు పడేసింది. సుందరి ఆశ్చర్యంగా చూస్తూ, నరహరికీ, గిరికీ, కావేరికీ, పీటలు, కంచాలూ పెట్టి వడ్డన మొదలెట్టింది.

సుందరి చూపులు పట్టించుకోకుండా, సుబ్బులు అర్ధశేరు బియ్యం ఎసట్లో పోసింది. ఇంకో కుంపటి మీద, దొడ్లో అరటికాయలు తెంపుకొచ్చి వేయించింది. ఒక్క పదేళ్ళ కుర్రాడు వస్తే, ఇంత హడావుడి చెయ్యాలా.. వాడసలే ఒక్కి నరంలా ఉన్నాడు.

సుందరి తెచ్చి వడ్డిస్తూనే ఉంది. బంగాళాదుంప, ఉల్లిపాయ వేపడం పప్పుచారూ ఒక్కోటీ రెండేసి సార్లు కలిపి, ఇంకోవాయ ఆవకాయ రుద్ది, మజ్జిగలోకి వచ్చాడు గిరి. గిన్నెలన్నీ ఖాళీ. అప్పుడు కానీ అత్తగారి ఆంతర్యం అర్థం అవలేదు సుందరికి. తాము ఇద్దరూ తినగా, మర్నాడు అప్పికి పొద్దున్న చద్దన్నానికి కూడా సరిపోతుంది మామూలుగా.

"పిల్లాడు రెండురోజులయుంటుంది ఇంతవణ్ణం తిని. కడుపు చూడు ఎలా ఆర్చుకుపోయిందో! నీకు తెలీలేదు." కోడలికి, తనకీ లేత అరిటి ఆకుల్లో వేడివేడి అన్నం వడ్డించి అంది సుబ్బులు.

"అసలు ఒక్కడూ ఎలా వచ్చాడో, ఎలా కనుక్కున్నాడో. ఎప్పుడూ రేవు దగ్గరక్కూడా వెళ్ళెరుగనివాడు" సుబ్బులు ఆశ్చర్యపోయింది. అదే సమయానికి హాల్లో కూర్చోపెట్టి, గిరి దగ్గర్నుంచి విషయమంతా గ్రహించాడు నరహరి.

●●●

బొబ్బర్లంక రేవులో పరుగెత్తుకుంటూ వచ్చి పడవనెక్కాడు గిరిధారి, ఆయాసపడుతూ. ర్యాలి గ్రామంలో దీక్షితుల కుటుంబంలోని ఆఖరి తరం వాడు.

నుదుటి మీదనుంచి ధారగా కారిపోతున్నాయి చెమటలు.

ముక్కు ఎగపీలుస్తూ అంగోస్త్రంతో మొహం తుడుచుకున్నాడు.

మర్లపాలెం నుంచి రాజుగారి రెండెడ్ల బండి వస్తుంటే ఎవరూ చూడకుండా బండికున్న చిక్కంలో నక్కి కూర్చున్నాడు. చిక్కం అంతా ఎండుగడ్డి.

అలా మెత్తని గడ్డిమీదికి ఒరిగిపోయాడు. వెంటనే నిద్రపట్టేసింది.

బండి ఆగగానే లేచి కిందికి దూకాడు. బండిలో ఉన్నవాళ్ళు, పక్కనున్న పాకబడ్డీలో దూరినట్లున్నారు. అటూ ఇటూ చూస్తూ నడుస్తున్న గిరికి గోదారొడ్డు కనిపించింది. పక్కకి తిరిగాడు.

రెండు పక్కలా ఎత్తైన గట్లు. మధ్యలో కిందికి దిగిపోతూ రోడ్డు.

నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళాడు.

సూరీడు ఆకాశంలో అటుపక్కకి వాలబోతున్నాడు.

తను ఎక్కడున్నాడో ఒక్క క్షణం అర్థంకాలేదు.

పొద్దున్న జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ కళ్ళలో నీళ్ళు. "అమ్మా! ఎందుకెళ్ళిపోయావమ్మా?" ఆకాశంకేసి చూసి చిన్నగా అడిగాడు. అమ్మ ఎలా ఉంటుందో కూడా తెలీదు. బుద్ధి ఎరిగినప్పట్నుంచీ పిన్ని కోపిష్టి మొహం. ఆవిడ తిట్లూ. ఉన్నట్లుండి కడుపులో పోట్లు మొదలయ్యాయి.

అలా నేలమీద కూర్చుండిపోయాడు గిరి.

ఆ పోట్లు ఎందుకు వస్తున్నాయో వాడికి బాగా తెలుసు. ఆకలి మూడో దశ అది. జేబులో రూపాయి బిళ్ళ చేతికి తగిలింది. ఏదయినా కొనుక్కుంటే.

"ఎక్కడకెల్తన్నారండీ చిన్న పంతులుగారూ అల్లా కూచుండిపోయారేటండి?" రెండరటి గెలలు గడ్డిఆకుల్తో చుట్టి, నెత్తిమీద పెట్టుకున్న తలపాగా అబ్బాయి అడిగాడు, గిరి క్రాపులో ఉన్న పిలకని చూస్తూ.

"రాజమండ్రి వెళ్ళాలని బయల్దేరా. మా అత్తయ్య రమ్మంది. ఎలా వెళ్ళాలో తెలీట్లేదు. అరటిపళ్ళబ్బాయ్! నువ్వు సాయం చెయ్యగలవా?"

తలపాగా వాడి చేతిలోని పళ్ళ అత్తం కేసి చూస్తూ అడిగాడు గిరి.

"దాందేవుందండి పంతులుగారూ!. నేకూడా రాజమండ్రీనేనండి. ఇంతకీ బొబ్బర్లంకకెక్కడ్నుంచొత్తన్నారండీ తమరు?"

ఓహో! అయితే ఇది బొబ్బర్లంకన్నమాట. ఇక్కడ పడవెక్కుతే రాజమండ్రి వెళ్ళిపోవచ్చు. తాతగారు ఎప్పుడూ అంటూ ఉంటారు. "రావులపాలెం నుంచిలే. పడవ్వాడు ఎంతతీసుకుంటాడేటి?" సందేహంగా అడిగాడు గిరి. తన దగ్గర రూపాయే ఉంది.

"ఎంతండీ అర్ధణా ఇస్తే చాలు. మీకు అరటికెట్టే కదండీ. ఇందండి, ఈ పళ్ళు తింటూ వెల్దారి." గిరిచేతిలో రెండు అరటి పళ్ళు పెట్టాడు. గిరికి ప్రాణం లేచొచ్చినట్లయింది. చాలా పెద్దవే. చక్రకేళీలు. తీసుకోవచ్చో లేదో. తాతగారు ఏమంటారో? అనేదేముంది చంపేస్తారు తెలుస్తే.

"ఏం ఫర్లేదండీ. డబ్బులియ్యక్కర్లేదులెండి. గెల్లేశాక బామ్మలకి పళ్ళిచ్చికానీ అమ్మకానికెళ్ళవండి మేం. మీరేవో అచ్చం ఆ వామనమూర్తిలాగే ఎదురొచ్చారు. తీసుకోండి పంతులుగారూ!"

అయితే ఫరవాలేదు. సంభావనలాగే అన్నమాట.

గిరి పళ్ళు తీసుకుని నెమ్మదిగా తింటున్నాడు. చాలా రుచిగా ఉన్నాయి. పైగా పొతకల్లాగ అంతంతున్నాయి. గిరి చెయ్యిపట్టకుండా.

"తొందరగా నడండి పంతులుగారూ. పడవెల్లిపోడానికి సిద్ధంగా ఉంది. అందుకోపోయావంటే మళ్ళీ అరగంటక్కానీ లేదు." అరటిపళ్ళబ్బాయి తొందరపెడుతుంటే, పళ్ళు తినేసి తొక్కలు గిరాటేసి పరుగెత్తుకుంటూ పడవెక్కాడు గిరి.

"రాజమండ్రిలో ఎక్కడికెళ్ళాలో తమరికి తెలుసాండీ?"

పడవ బైల్దేరాక అరటి పళ్ళబ్బాయి అడుగుతుంటే అయోమయంగా చూశాడు గిరి.

ఎక్కడికెళ్ళాలీ? నరహరి బావ ఎక్కడుంటాడో. పెద్ద ఉద్యోగవంట. మిగిలిన అత్తయ్యలంతా సోంపేట, సాలూరు, తునీ, చోడవరం ఎక్కడెక్కడో ఉంటారు. ఎప్పుడూ ర్యాలి రారు. బోలెడు డబ్బయిపోతుందని. ఒక్క సుబ్బులత్తయ్యే ఏడాదికోసారి వస్తుంది. వాళ్ళు కూడా ధవళేశ్వరంలో ఉంటారుట. జేబులో చెయ్యిపెట్టి వెతికినట్లు చేశాడు గిరి. ఒక్కసారి బిక్కమొహం పెట్టాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏటయిందండీ?"

"అత్తయ్య చిరునామా ఉన్న కాయితం కనిపించట్లేదు అరటిపళ్ళబ్బాయ్!" అప్పటికే సగం దూరం వచ్చేశారు. రాజమండ్రి రేవు కనిపిస్తోంది.

"మరెలాగండీ. డబ్బులున్నాయా?"

"పడవ్వాడు రూపాయి తీసుకుని ఏడుబేడలు, ఒక అణా, ఒక అర్ధణా ఇచ్చాడు" జేబుని గలగల్లాడిస్తూ అన్నాడు గిరి.

"నేను కోట గుమ్మం ఎల్తన్నానండి. అక్కడ్నించి ఇన్నీస్ పేట ఎల్తానండి. పాపం మరేం చేత్తారండీ నాతో వచ్చేయండి. ఎవుర్నైనా అడుగుదాం బజార్లో."

పడవదిగి, ఎత్తుగా ఉన్న గోదారిగట్టు మీద ఎక్కుతుంటే గుండె దడదడలాడింది గిరికి. పుట్టి బుద్దెరిగాక ఇవతలొడ్డుకి రాడం ఇదే

నరహరి బావ ఏదో మందులకంపెనీ పనిచేస్తాడు. ఎలాగో పట్టుకోవాలి. సరే ఆ జగన్మోహినీ కేశవస్వామి పళ్ళవాడ్ని పంపించాడు కదా. ఆయన మీదే భారం వేసి చూద్దాం.

గిరి అరటిపళ్ళబ్బాయి వెనుక నడిచాడు. దారిలో ఉన్న తుక్కులన్నీ దాటుకుంటూ.

●●●

గిరి నడుస్తూనే ఉన్నాడు, చేతులు వేళ్ళాడేసి.

కాళ్ళు రెండూ ఎప్పుడో మొద్దుబారిపోయాయి.

కోటగుమ్మం దగ్గర ఒకపళ్ళ కొట్లో గెలలు ఇచ్చేశాడు పళ్ళబ్బాయి.

అక్కడ కొంచెం మంచి బట్టలేసుకున్న ఒకరిద్దర్ని కనుక్కున్నాడు గిరి, నరహరి బావ తెలుసేమోనని.

"ఎవరమ్మా! నరహరా. ఇంటిపేరు? తెలీదా ఇంకెలా కనుక్కుంటావురా? ఏం చేస్తారూ... మందుల కంపెనీయా చాలా బావుంది.

ఎండుగడ్డి మేట్లో ఏగానికోసం వెతికినట్లుంది."

ఉహూ ఇంత పెద్దటౌనులో దొరికే పనే. మెల్లిగా చీకటిపడుతోంది.

మునిసిపల్ బంట్రోతులు వచ్చి వీధి దీపాలు వెలిగిస్తున్నారు.

ఇంతచీకట్లో ఎక్కడని వెతకడం. పగలే దిక్కూ దివాణం లేదు.

గిరికి నీరసం వచ్చింది. రాత్రి ఎక్కడికెళ్ళాలీ?

ఎవరి అరుగుమీదయినా పడుకుంటే ఊరుకుంటారా?

అభిమానం చంపుకుని వెనక్కి వెళితే..టట్. ఛస్తే ఆ పని చెయ్యడు.

ఇన్నీస్ పేటకేసి తీసుకుపోతున్నాడు పళ్ళబ్బాయి. ఇంకా ఎంత దూరం నడవాలో? గిరికి ఏడుపొచ్చేస్తోంది. మళ్ళీ ఆకలేస్తోంది. అసలు ఈ ఆకలెందుకు పెట్టాడో దేవుడు. ఆకాశం కేసి చూశాడు. నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయి.

టక్కున ఆగిపోయాడు గిరి.

"ఏటండి పంతులుగారూ! మీ ఓళ్ళు దొరక్కపోతే బామ్మల సత్రానికి తీసుకుపోతాన్లెండి. దిగులెట్టుకోకండి. మిమ్మల్ని మీవోళ్ళకి అప్పగించేపూచీ నాదీ."

పళ్ళబ్బాయి చెప్పేది వినిపించుకోకుండా అక్కడున్న బోర్డుకేసి చూస్తుండిపోయాడు గిరి. "అది డాట్రుగారి ఆస్పత్రండి. ఒంట్లో బాగోనేదా?" తల అడ్డంగా ఊపాడు గిరి.

"డాక్టర్ గారిని అడిగితే బావగురించి తెలుస్తుందేమో? మందుల కంపెనీలో కదా అతను పన్చేసేది"

"నిజవేనండి. కనుక్కుందాంరండి" ఇద్దరూ లోపలికి నడిచారు.

"ఆగండి. ఇక్కడ రాయించుకుని ఆ బెంచీమీద కూర్చోండి. డాట్రగారు పిలుస్తారు." బైటవరండాలో ఉన్న కాంపౌండర్ ఆపేశాడు.

"అబ్బే! డాక్టరుగారితో పనిలేదండి. మా బావ సంగతి తెలుస్తుందేవోనని వచ్చాం. నరహరి అని మందుల కంపెనీలో పనిచేస్తాడు. వాళ్ళ ఇంటికోసం వెతుకుతున్నాం." కాంపౌండర్ పెదవి విరిచి, పొట్లాలు కట్టుకోడంలో మునిగిపోయాడు. గిరి నిరాశగా వెనక్కి వచ్చేస్తుంటే వినిపించింది.

"బాబూ! ఎవరు కావాలన్నావ్?" తెల్లని పాంటూ, షర్టూ వేసుకుని, చేతిలో తోలు సంచితో ఒకతను.

గిరి చెప్పాడు.

"బొంబాయి కంపెనీలో పనిచేస్తారు. ఆయనేనా? వాళ్ళనాన్నగారు ధవళేశ్వరంలో"

"ఆయనేనండి. మీకు తెలుసా?" గిరికి ప్రాణం లేచొచ్చింది.

"దా నేను చూపిస్తాను. ఆయన నా పై అధికారి. వాళ్ళిల్లు ఇక్కడికి దగ్గరే" పాంటూ, షర్టాయన ఎంతో మంచివాడిలా ఉన్నాడు. దేవుడు ప్రత్యక్షమైనట్టు అనిపించింది గిరికి. బుగ్గలమీదికి జలజలా కారాయి కన్నీళ్ళు.

గిరికి అంతదూరంలోంచే కనిపించింది తీసున్న వీధి తలుపు.

లోపల బావ ఆదుర్దాగా ఏదో మాట్లాడుతున్నాడు. అదృష్టం. అత్తయ్య కూడా ఇక్కడే ఉంది. చేతులు జోడించి నమస్కారం పెట్టాడు గిరి, ఇల్లు చూపించినాయనకీ, పళ్ళబ్బాయికి కూడా.

"బలేవోరండి. పంతులుగారూ! మీరు నాకు దణ్ణవెట్టకూడదండి. మంచోరే ఎళ్ళి నీళ్ళోసుకుని ఇంతముద్ద తినండి. పొద్దున్నించీ కతికిందేం లేదు." సాక్షాత్తూ ఆ రాముడూ, హనుమంతుళ్ళలాగా కనిపించారు వాళ్ళిద్దరూ గిరి కళ్ళకి.

"అత్తయ్యా!" అంటూ తీసున్న తలుపులోంచి పరుగెత్తాడు గిరిధారి. ఆవిధంగా అతని జీవన తొలి ప్రస్థానం ప్రారంభమయింది.

●●●

"అమ్మా!" నరహరి నెమ్మదిగా పిలిచి వంటింటి వైపుగా దారితీశాడు, నిద్రపోతున్న వాళ్ళు లేస్తారేమోనని భయపడుతూ.

సుబ్బులు, మంచం మీదనుంచి లేచి నిశ్శబ్దంగా నరహరి వెనుకే పెరట్లోకి నడిచింది. ఇద్దరూ పెరటరుగు మీద కూర్చున్నారు.

"ఏం చెయ్యడం చెప్పమ్మా? తాతగారికి టెలిగ్రాం ఇవ్వనా?"

గిరి సమస్య ఎలా పరిష్కరించాలో తెలియడంలేదతనికి.

"వద్దు బాబూ! ఆ సూరమ్మ గయ్యాళి గంప. వీడిని వెనక్కి పంపేస్తే, ఇంకా గంగవెర్రులెత్తిపోతుంది. మనమే ఏదో ఆలోచించాలి."

"ఈ పరిస్థితుల్లో ఇంకో మనిషి అంటే వాడి చదువూ, భోజనం" నరహరి ఆపేశాడు.

మీరే దిక్కని గుమ్మం దగ్గరికి వచ్చిన పిల్లవాడిని ఎక్కడికి పంపాలి.

తమవీ బొటాబొటీగా నడిపిస్తున్న సంసారాలు.

"ఫరవాలేదు నాన్నా! ఆ పైవాడే ఏదో దారిచూపిస్తాడు. తెల్లారనీ. ఆలోచిద్దాం. ఆ ఊర్లో బళ్ళో వేశారో లేదో వీణ్ణి. ఏం చదువుతున్నాడో అన్నీ కనుక్కుందాం"

"అమ్మా అయితే వీడి బాధ్యత తీసుకుందామంటావా? భరించగలమా సగంలో వదిలేస్తే అదో అప్రదిష్ట. పైగా తాతగారు ఏమంటారో?"

"ఏమీ అనరు బావా! నన్ను పంపించకండి అత్తయ్యా! పిన్ని చంపేస్తుంది. అంతకంటే గోదాట్లో దూకడం నయం. నేను మీకు ఏ ఇబ్బందీ కలిగించను. రోజుకి ఒకపూటే తింటాను. ఆ వార మీకు ఇంట్లో పనులన్నీ చేస్తాను. అక్కడ బళ్ళో ఐదో క్లాసు పాసయ్యాను. నాకు లెక్కలు బాగావచ్చు. తెలుగు సరేసరి. ఎక్కడికైనా బ్రహ్మచారిగా, భోక్తగా వెళుతుంటాను. లేపోతే బొంబాయేనా, ఎక్కడికైనా పంపించు. ఎవరు ఏ పని చెప్పినా చేస్తాను."

తలుపు వెనుక నుంచి అంతా వింటున్న గిరి మళ్ళీ సుబ్బులు కాళ్ళమీద పడిపోయాడు. కదలకుండా పడున్న ఆ కుర్రాడిని చూసి నరహరి కడుపు తరుక్కుపోయింది.

"అరే! మళ్ళీ ఏవిట్రా. అలాగే నిన్ను ర్యాలి పంపించంలే. వెళ్ళి పడుకో." సుబ్బులు గిరిని నడిపించి తీసుకెళ్ళి తన మంచం పక్కనే వేసిన చాపమీద పడుకోబెట్టింది. కొత్త తుంగ చాప. మెత్తగా ఉంది. నేల అస్సలు తగలట్లేదు.

పైగా పల్చని బూరుగు దూది తలగడా కూడా ఇచ్చారు. సుబ్బులత్తయ్య ఇచ్చిన భరోసా. స్నానం చేయించి విష్ణువి పాత నిక్కరూ, చొక్కా ఇచ్చింది సుందరి.

శుభ్రంగా కలరా ఉండల వాసన వేస్తూ ఉన్నాయవి. గిరి ఒళ్ళెరగకుండా పడుకున్నాడు.

●●●

అప్పుడప్పుడే సూర్యుడు ఉదయించడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు.

చిరు చలికొద్దిగా వణికిస్తోంది.

సుబ్బులు భుజాల మీంచి కొంగు కప్పుకుంటూ లేచి వచ్చింది.

విష్ణుకి యస్సెల్సీ పెద్ద పరీక్షలవుతున్నాయి. సెంటరు దూరంగా ఇచ్చారు.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న ఒక స్నేహితుడి ఇంట్లోకి మకాం మార్చేశాడు విష్ణు.

ఇద్దరూ కలిసి చదువుకుని పరీక్షలు రాస్తున్నారు. పొద్దున్నొకటీ, సాయంత్రం ఒకటి నాలుగురోజుల్లో పరీక్షలయిపోతాయి.

దూరంగా పెరట్లో, నీళ్ళ పొయ్యి దగ్గర ఎవరదీ? విష్ణు ఇంట్లోలేడుకదా!

వాడి బట్టలేసుకుని అచ్చు అలాగే అప్పాయమ్మ రాకుండా పొయ్యెవరంటించారూ.

అప్పుడు గుర్తుకొచ్చాయి సుబ్బులుకి, రాత్రి జరిగిన విషయాలన్నీ. అయితే గిరిగాడు నీళ్ళ పొయ్యి అంటించేశాడన్నమాట. ఫరవాలేదు. చురుకైన కుర్రాడే

"అప్పుడే లేచావురా? ఇంకాసేపు నిద్దరోకపోయావా"

చూరుకి తగిలించిన తాటాకు బుట్టలోంచి పందుపుల్ల తీసుకుంటూ అడిగింది సుబ్బులు.

"నాకు తెల్లార కట్టే లేవడం అలవాటత్తయ్యా! పైగా ఎంచక్కా పడుకున్నాకదా ఇట్టే కోడికుయ్యగానే తెలివొచ్చేసింది. అంత దూరం నడిచానా. కాళ్ళనొప్పులు అస్సలు లేవనుకో అప్పుడే స్నానం చేసి సంధ్యావందనం కూడా చేసేశా."

కళ్ళు పెద్దవి చేసి చెపుతున్న గిరిని ఆప్యాయంగా చూసింది సుబ్బులు.

"వెర్రినాగన్న! అభిమానానికి మొహం వాచిపోయాడు." అనుకుంటూ దంతధావనం ముగించి ఇంట్లోకి నడిచింది సుబ్బులు.

సుబ్బులు ఫిల్టర్ వేసి, పాలుకాచి కాఫీలు కలిపేలోగా అందరూ లేచారు.

యమునని ఎత్తుకుని పెరట్లోకి వచ్చాడు నరహరి.

"పాపాయిని ఇలాగియ్యి బావా! నేను ఆడిస్తా."

నరహరి చేతుల్లోంచి తీసుకున్నాడు గిరి.

యమున కాళ్ళు కొట్టుకుంటూ కిందకి దూకేసింది.

"ఇది ఎవరిచేతుల్లోనూ నిలవదులేరా.. దీనికి చెయ్యవలసిన రాచకార్యాలు చాలా ఉన్నాయి."

నరహరి పెరటరుగు మీద కూర్చుని, నోట్లో పుల్లపెట్టుకుని అన్నాడు.

యమున కిలకిలా నవ్వుతూ అడుగులు వేసుకుంటూ నూతి దగ్గరకి వెళ్ళింది.

"అప్పా! నేకూడా వచ్చేశా."

ఇంకా ఏదో అనబోయిన కావేరి గిరిని చూసి ఆగిపోయింది బిడియంగా చూస్తూ. రాత్రి హడావుడిగా అన్నాలు తినేటప్పుడు చూసినా నిద్రమత్తులో పట్టించుకోలేదు. ఇప్పుడు కళ్ళు విప్పార్చి చూస్తోంది.

"మామయ్యరా! జట్టుంటావా మరీ. ఇంక ఇక్కడే ఉంటాడు. మీ బడికి తీసుకెళ్తావా?" నరహరి నవ్వుతూ అడిగాడు. గిరి మొహం సంతోషంతో వెలిగిపోయింది.

కావేరి కూడా నవ్వుతూ తండ్రి వెనకాల నక్కింది.

అందరూ నవ్వుతుంటే యమున చప్పుడు చెయ్యకుండా అప్పుడే తళతళా తోమి బోర్లించిన బిందె మీద కూర్చుంది. చిన్ని చేతులకి నూతిగట్టు అందింది.

నెమ్మదిగా గట్టు పట్టుకుని బిందెమీద నుంచుని నూతిలోకి చూస్తోంది.

బిందె జారి వెనక్కి జరిగింది.

యమున కెవ్వున కేకేసి కళ్ళు తేలేసి నూతిలోకి పడబోయింది.

గిరి రెండంగల్లో ఎగిరినట్లుగా దూకి తలక్రిందులుగా నూతిలో పడబోతున్న యమునని పట్టుకుని అలాగే జర్రున నూతిపళ్ళెంలోకి జారాడు.

రెండు చేతుల్తో పట్టుకుని హత్తుకోవడం వలన పాపాయికేమీ అవలేదు.

నూతిగట్టు పట్టు దొరికినా పట్టుకోలేక బట్టలుతికే బండ అంచుకి గిరి తల తగిలి చెవిపైన చిల్లుపడి చివ్వున రక్తం చిమ్మింది. బిత్తరపోయి గట్టిగా ఏడుస్తున్న యమునని పట్టుకునే స్పృహ తప్పిపోయాడు గిరిధారి.

●●●

**"బాబూ నరహరీ! పిల్లాడెలా ఉన్నాడా?"** అంత దూరం నుంచి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అడుగుతున్న రామదీక్షితులు కంఠం విని, కింగ్ జార్జ్ ఆసుపత్రి పిల్లలు వార్డు వరండాలో పచార్లు చేస్తున్న నరహరి ఆగిపోయాడు.

రామదీక్షితులు ఆయాసంతో రొప్పుతున్నాడు.

"ఏమీ భయం లేదు తాతగారూ! గండం గట్టెక్కినట్లే - ముందు మీరు కూర్చోండి." దీక్షితుల్ని అక్కడున్న బెంచీ మీద కూర్చోపెట్టి, గదిలోకి వెళ్ళి మరచెంబులోంచి మంచినీళ్ళ గ్లాసులో పోసి తెచ్చిచ్చాడు.

గ్లాసెడు నీళ్ళూ గటగటా తాగి, గట్టిగా నిట్టూర్చారు దీక్షితులు.

"ఏమిటోరా! రాజమండ్రి వచ్చి మీ ఇంటికెళ్దామనుకున్నానా. మెయిలు టైమయిపోతుందని జట్కా కట్టించుకుని స్టేషన్‌కి వెళ్ళి రైలు కోసం కూర్చున్నా - అది రెండు గంటలు లేటు. ఇంక తిరగడానికి ఓపిక లేక అక్కడే కూర్చుని ఆపడంగా మెయిలెక్కి వచ్చేశా. కుర్ర వెధవ ఎలా ఉన్నాడో అని ఒకటే దిగులు పడిపోయాననుకో! ఏదో ఆ జగన్మోహినీ కేశవుడు మన పక్షాన ఉన్నాడు కనక కానీ.."

"తాతగారూ! మీరు ఏమైనా తిన్నారా?" విసినికర్రతో విసురుతూ అడిగాడు నరహరి. అడగ్గానే ఎందుకడిగానా అనుకున్నాడు. తాతగారు ఎక్కడపడితే అక్కడ, స్నానం సంధ్యావందనం అవకుండా, అర్ఘ్యం విడవకుండా తింటారా?

దీక్షితులు, మాట్లాడలేనట్లుగా, చేతిలో సంచీ పక్కన పెట్టి గోడకి వాలి కళ్ళు మూసుకుని కూర్చుండిపోయారు.

"ఇక్కడికి దగ్గర్లోనే.. మహారాణి పేటలో మా కంపెనీ విశాఖ జిల్లా సూపర్ వైజర్ ప్రసాదం అనీ. అతనిల్లుంది. రండి తాతగారూ! వెళ్ళి మీరు కాలకృత్యాలు తీర్చుకుని కాస్త ఎంగిలి పడుదురుగాని. "

"మరి ఇక్కడ ఎవరైనా ఉండద్దూ?" కాస్త సేద తీరాక, కళ్ళు తెరిచి అడిగారు దీక్షితులు.

"ప్రసాదం ఉంటాడు లెండి. అయినా ఇప్పుడు మనం ఇక్కడుండీ చేసే పనేం లేదు. డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడుగారనీ - చాలా పెద్ద పేరున్న ఎముకల డాక్టర్. ఆయన మన వాడ్ని చూస్తున్నారు. పుర్రె ఎముక కొద్దిగా బీట తీసిందిట. తగ్గిపోతుందని చెప్పారు. కుట్లు పడ్డాయి. తల కదలకుండా ఐదువారాలు కాచుకోవాలని చెప్పారు. కాకపోతే అన్నాళ్ళూ ఇక్కడే ఉండాలి."

"అయ్యో! మరెలారా? రొఖ్ఖం అదీ - అసలు ఈ వెధవ తత్తుకొడుకు ఇల్లొదిలి ఎందుకు అఘోరించాలీ. ఇప్పుడు చూడు. అందరివీ అంతంత మాత్రం బతుకులే. నువ్వే ఏదో కాస్త పచ్చగా ఉన్నావనుకుంటే నీ మీద ఇంత భారం.."ఆవేశంతో ఎర్రబారిన దీక్షితులుగారి కళ్ళల్లో నీళ్ళు.

ఎప్పుడూ పరుషవాక్యం నోట్లోంచి రాని తాతగారు. ఏమీ చెయ్యలేని నిస్సహాయత, ఉక్రోషం. నరహరి తాతగారి పక్కన కూర్చుని ఓదార్పుగా భుజం మీద చెయ్యేశాడు. అంత పెద్దమనిషీ మనవడి మీద తలవాల్చి నిశ్శబ్దంగా రోదించారు.

"ఊరుకోండి తాతగారూ! ఆ భగవంతుడే ఏదో దారి చూపిస్తాడు. మీకెందుకు ఈ వయసులో. అసలు మీరు రావడం అనవసరం. చెప్పకుండా ఉండలేక టెలిగ్రాం ఇచ్చాను. అదీకాక అప్పుడు చాలా భయం వేసింది. ఎటుపోయి ఎటు వచ్చినా"

"అదేరా నేననేది. నేరకపోయి కేశవుడికి మళ్ళీ పెళ్ళి చేశాను. వాడు వద్దని అంటూనే ఉన్నాడు. పూజా పునస్కారాలకీ, సంభావనలకి ధర్మపత్ని ఉండాలనీ! పైగా మీ అమ్మమ్మకి కూడా వయసయిపోయింది కదా. చాకిరీ చెయ్యలేదని చేశాను. ఈ గిరిగాడు ఎలాగోలా సర్దుకోవద్దూ! వాళ్ళమ్మ ఉన్నట్టుంటుందా!"

"వాడినేం అనద్దు తాతగారూ! చాలా మంచివాడు. వాడే లేకపోతే యమున ఈ పాటికి" ఆశ్చర్యంగా చూస్తున్న దీక్షితులుకి జరిగిన సంగతి వివరించాడు నరహరి.

"వాడి సంగతి నేను చూసుకుంటాగా. ఇంక మీరేం బెంగ పెట్టుకోవద్దు. నా మీద వదిలేయండి."

●●●

"అయితే మీరూ సరిపెల్ల వారేనన్నమాట. మా ఇంటిపేరూ అదే చూశావా ప్రసాదం బాబూ. ఆ కేశవుడి లీలలు. ఎలా కలుపుతాడో! ఎప్పుడో చోళ రాజు కుమార్తె తీసుకొచ్చిన కుటుంబాలుట మావి. అందుకే కొంత అరవ సాంప్రదాయం కనిపిస్తుంటుంది కట్టు, బొట్టులలో కట్టుబాట్లలో కూడా." రామదీక్షితులు, అభికరించడం అయ్యాక - ఔపోసన పట్టి, అరిటాకు చుట్టూ నీళ్ళు చల్లి, మొదటి ముద్ద ఆకు చివర పెట్టి, మూడుసారులు కొద్దికొద్దిగా అన్నం నోట్లో పెట్టుకుని, పప్పు అన్నం కలుపుతూ అడిగారు.

ప్రసాదం కూడా ఔపోసన పట్టి, అన్నం కలుపుతూ తలూపాడు.

"అవునండీ. మా పూర్వీకులు కూడా చోళదేశం నుంచే వచ్చారుట. ఇక్కడి గుళ్ళు కట్టించిన చోళరాజు అర్చకత్వానికి తీసుకొచ్చారుట, సముద్రం మీదుగా. అందుకనే అయుంటుంది మీవీ మావీ ఇంటిపేర్లూ గోత్రాలూ ఒకటే ఉంటాయి. కొంతమంది రాజమహేంద్రవరం నుంచి కూడా వచ్చారంటారు. ఇదంతా వేంగీ రాజ్యంలోనే ఉండేదిట కదా!"

ప్రసాదం పక్కనే కూర్చుని, మాట్లాడకుండా భోజనం చేస్తున్న నరహరి మనసులో వరుసగా జరిగిన సంఘటనలు కళ్ళముందు తిరిగాయి. రెండు రోజుల తరువాత ఇదే... కూర్చుని సావకాశంగా తింటుండడం.

గిరి నూతిపళ్ళెంలో పడిపోగానే, ఇంట్లోనుంచి అందరూ పరుగెత్తుకునొచ్చారు. సుందరి, యమునని ఎత్తుకుని అరుగుమీదికి తీసుకుని వెళ్ళింది. సుబ్బులు, దణ్ణెం మీద ఆరేస్తున్న అంగోస్త్రం తీసి గిరి తలకి గట్టిగా చుట్టింది, రక్తం ధార ఆగిపోవడానికి. దీక్షితులుగారి కుటుంబంలో అందరికీ వంశపారం పర్యంగా కొన్ని వైద్య చిట్కాలు తెలుసు. నరహరి, గిరిని జాగ్రత్తగా ఎత్తుకొచ్చి అరుగు మీద పడుకోబెట్టి, తనకి తెలిసున్న డాక్టర్ని పిలుచుకొచ్చాడు. ఆయనే కారిచ్చి, వైజాగ్ పంపించే ఏర్పాట్లు చేశారు.

ఆలశ్యం చెయ్యకుండా నరహరి, తాతగారికి టెలిగ్రాం కొట్టి, డాక్టర్‌గారి ఉత్తరం తీసుకుని, గిరిని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. గోదావరి జిల్లాల్లో నరహరికి పెద్ద డాక్టర్ల దగ్గర మంచి పేరుంది. రిప్రజెంటేటివ్‌లని పంపడమే కాకుండా తనుకూడా ప్రతీనెలా కలుస్తూంటాడు.

వెనుక సీట్లో గిరి తలని కదలకుండా పట్టుకుని, నిద్ర ఆపుకుంటూ అలాగే కూర్చున్నాడు. సుందరినీ పిల్లల్నీ వదిలి సుబ్బులు వచ్చే పరిస్థితి లేదు. విష్ణుకి ఇంకా రెండు పరీక్షలుండిపోయాయి. పరీక్షలయ్యాక వాడిని రమ్మంటే సరి.

"ఏమంటావు నరహరీ?" ప్రసాదం అడుగుతుంటే నోట్లో ముద్దతో అయోమయంగా చూశాడు. ప్రసాదం, నరహరీ ఒకేసారి బొంబాయిలో ట్రైనింగ్ అయారు. అప్పట్నుంచీ అప్పుడప్పుడు ఉత్తరల ద్వారా పలుకరించుకుంటూ ఉంటారు. ప్రసాదానిది జమీందారీ కుటుంబం. ముత్తాతగారి కాలంలో వారికింద ఊర్లుండేవిట. ప్రసాదం ఉంటున్న ఇల్లు కూడా పెద్ద దేవిడీలా ఉంటుంది. ముందు పెద్ద భవంతి. వెనుక పెద్ద వంటిల్లు, భోజనాల హాలు ఉంటాయి. ఇప్పటికీ యాభై ఎకరం వరిపొలం, యాభై ఎకరం సరుగుడు తోట ఉన్నాయి.

ఆ రాజసం ప్రసాదం ఇంట్లో కనిపిస్తూ ఉంటుంది. వంటకి అరవదేశం నుంచి వచ్చిన అయ్యరున్నాడు. వడ్డించడానికి ఇక బ్రాహ్మణ ముత్తైదువు వస్తుంది. రోజూ ఇంట్లో వాళ్ళు కాకుండా పదిమంది విస్తళ్ళేస్తారు.

అందరికీ వెండిపువ్వులున్న పీటలు పరిచి, అప్పుడే కోసిన అరిటాకుల్లో వడ్డిస్తారు. భోజనం మాత్రం సాధారణంగా ఉంటుంది. పప్పు, పులుసు, ఒక కూర, పచ్చడి. అంతే - కమ్మటి గడ్డ పెరుగు తప్పకుండా ఉంటుంది.

"అప్పుడే పెరుగులోకి వచ్చేశావా? ఇంకోసారి కూరకలుపుకో. పదేళ్ళనుంచీ వస్త వస్తా అనడం కానీ ఎప్పుడైనా వచ్చావా? మొహమాటపడకుండా తిను. ఇంకొంచెం కూర వడ్డించండి. ఆనపకాయను నూపిండి పెట్టి - కమ్మగా ఉంటుంది. అంటే అది నువ్వనాలనుకో!" నవ్వుతూ అన్నాడు ప్రసాదం.

"అబెబ్బే చాలా బాగున్నాయి పదార్థాలు. తలెత్తకుండా తినేశాం చూడు. రోజూ కంటే నాలుగు ముద్దలు ఎక్కువే తిన్నా - నువ్వేదో అడుగుతున్నావు." పెరుగు అన్నంలో బెల్లం ఆవకాయ నంచుకుంటూ అన్నాడు నరహరి. విశాఖపట్నం వాళ్ళు కోలంగోవా మావిడికాయలతో పెట్టే బెల్లం ఆవకాయ రుచి వేరుగా ఉంటుంది. నరహరి ఇదే మొదటిసారి తినడం. అతనికి చాలా నచ్చింది. గిరికి ఎలా ఉందో.. త్వరగా వెళ్ళాలన్న ఆదుర్దా కానీ లేకపోతే ఇంకో వాయ పెరుగన్నం కలిపి, పొడుగ్గా ఉన్న ఆవకాయ ముక్క నంజుకుని తినేవాడే

"అదే మీ తాతగారిని ఇక్కడ ఉన్నన్నాళ్ళూ మా ఇంట్లో ఉండమంటున్నాం."

"అబ్బే! మీకెందుకు శ్రమ. ఏదయినా సత్రం ఉందేమో చూస్తాను." మొహమాటంగా అన్నాడు నరహరి. ప్రసాదంకీ తనకీ మంచి స్నేహమే. అలా అని వాళ్ళకి భారంగా ఉండకూడదు కదా!

"భలేవాడివి బాబూ! ఒకింటి పేరువాళ్ళం. ఏవన్నా పరాయివాళ్ళా. బాబుగారంటే మాకేవిధమైన ఇబ్బంది లేదు. వారివంటి పండితులు రమ్మంటే వస్తారా చెప్పు. ఏం మొహమాటం పెట్టుకోకుండా బాబుగారి మనవడు మా ఊర్నించి ఆరోగ్యంగా వెళ్ళేవరకూ మీరు మా ఇంట్లోనే ఉండాలి. ఇంకేం మాట్లాడకండి. ముందింట్లో ఒక పక్క వసారా రెండు గదులూ ఉన్నాయి. మీ సామాన్లు ఒక గదిలో పెట్టుకోండి." ప్రసాదం తల్లి విచ్చమ్మగారు అంది, నిండా కొంగు కప్పుకుని, గోడవారగా నుంచుని వడ్డన సరిగ్గా అందుతుందో లేదో అజమాయిషీ చేస్తూ.

ప్రసాదం భార్య మహలక్ష్మి వచ్చి అందరికీ మంచినీళ్ళు పోసింది. ప్రసాదం తండ్రి వరాహ నరసింహంగారు ప్లీడరు. ఇద్దరు గుమాస్తాలు మధ్యాహ్నం వారింట్లోనే భోంచేస్తారు.

ప్లీడరుగారు ఎక్కువగా మాట్లాడరు. మందస్మిత వదనంతో ప్రతీదానికీ తలుపుతూ ఉంటారు.

"మా నాన్న మాట్లాడే పనంతా కోర్టులోనే కానిస్తారు. ఇంట్లో వినడమే. ఏ సమస్య వచ్చినా చివర్లో జడ్జిమెంటివ్వడమే ఆయనపని" ప్రసాదం తన స్నేహితులతో అంటుంటాడు. ప్రసాదం ఏకైక సంతానం. అలా అని ఆస్తిని అనుభవిస్తూ తిని కూచోవాలనుకోడు. కష్టపడి పనిచేస్తాడు. దక్షిణ భారతంలో వాళ్ళు పనిచేసే మందుల కంపెనీలో నరహరి, ప్రసాదం మంచి సూపర్వైజర్లుగా పేరు తెచ్చుకున్నారు.

విశాఖపట్నం. ఆ చుట్టుపక్కల రెండు మూడొందల మైళ్ళ వృత్తంలో అక్కడున్నంత పెద్ద ఆసుపత్రి, పేరుపొందిన డాక్టర్లూ లేరు. ఆస్పత్రికొచ్చిన వాళ్ళూ, కోర్టుపనిమీద వచ్చిన వాళ్ళూ బంధువుల ఇళ్ళలో ఉంటూ తమ పనులు అయిపోగానే వెళ్ళిపోతారు. సరిపెల్ల వరాహ నరసింహంగారి ఇంట్లో మూడువందల అరవై నాలుగురోజులూ ముగ్గురు నలుగురు అతిథులు ఉంటూనే ఉంటారు. అలా ఉండడం మహాభాగ్యంగా భావించే రోజులవి.

"ఏం నరహరీ! మాట్లాడట్లేదూ" భోజనాల పక్కనే ఉన్న వసారాలో తూము దగ్గరున్న బాల్చీలో నీళ్ళతో చేతులు కడుక్కుంటూ అడిగాడు ప్రసాదం.

"ప్రసాదం వరమిస్తానంటే వద్దంటానా.. అలాగే!"

●●●

"బాబుగారూ! మా చిరు సత్కారం మీరు కాదనకూడదు". దీక్షితులు ర్యాలి వెళ్ళేరోజు. ప్రసాదం ఇంట్లో అందరూ కచేరీ హాల్లోకి వచ్చారు.

నాలుగురోజులనుకున్నది, పదిహేను రోజులయింది. గిరికి పూర్తిగా తెలివొచ్చి మనుషుల్లో పడ్డానికే వారం పట్టింది. నరహరి మూడు రోజుల కంటే ఉండలేకపోయాడు.. బొంబాయినుంచి పై అధికారి వస్తున్నాడనీ.. అన్ని ఊర్లనుంచీ ఉద్యోగులని పిలిపించమని టెలిగ్రామ్ వచ్చిందని విష్ణు వచ్చినప్పుడు తెలిసింది. వస్తూ వస్తూ ఆ తంతి కూడా తెచ్చాడు విష్ణు.

విష్ణు మీద పూర్తిగా వదిలెయ్యలేక, దీక్షితులు కూడా ఉండిపోవలసి వచ్చింది.

విచ్చమ్మగారు రోజూ సాయంకాలం ఆరుగంటలకి దీక్షితులుగారిచే భాగవతం పురాణం చెప్పించింది. వాళ్ళ కచేరీ హాల్లోనే. వందమంది వరకూ పడతారు.

పక్కింటి వాళ్ళతో ప్రారంభమయిన పురాణ శ్రవణం మూడు రోజులయ్యేసరికి హాలు నిండిపోయి, వీధి అరుగు మీద కూడా కూర్చోవలసి వచ్చింది.

మంగళం పాడాక హారతి పళ్ళెం తిప్పిస్తే.. పళ్ళెం నిండిపోయేది. ఏ రోజుకారోజు అంతా లెక్కపెట్టి, నోట్ల రూపంలోకి మార్చి భద్రపరచింది విచ్చమ్మ.

శ్రావ్యంగా కృష్ణలీలలు చెపుతుంటే కదలకుండా కూర్చుండిపోయేవారు వచ్చిన వాళ్ళు.

ఆ రోజు దీక్షితులుగారు వెళ్ళిపోతున్నారని పురాణం విన్నవారంతా వచ్చేశారు.

"బాబుగారూ! మీరు శ్రావణమాసంలో మళ్ళీ రావాలండీ. ప్రహ్లాద చరిత్ర చెప్పాలి ఈసారి" డాబాగార్డెన్స్ నుంచి వచ్చిన డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడుగారి బంధువు అన్నారు.

"అవును. అవును. మీరు తప్పకుండా రావాలి. మేము ఎవర్నైనా పంపిస్తాం. మళ్ళీ జాగ్రత్తగా దింపేలా చూస్తాం."

దీక్షితులుగారికి కళ్ళు చెమర్చాయి. ఆనందంతో. ఆహా! ఏమి ఆతిథ్యం. గిరి కూడా బాగా కోలుకుంటున్నాడు. జరిగేది జరక్క మానదు. అదే ర్యాలిలో పడితే ఊహించుకోడానికే భయం వేసింది.

విష్ణు, గిరిని బాగా చూసుకుంటున్నాడు. ప్రసాదం ధర్మమా అని ఆస్పత్రిలో నర్సులు ఎవరో ఒకరు వచ్చి, చిన్న పంతులు దగ్గర ఉంటున్నారు. పగలు దీక్షితులూ, విష్ణూ మార్చి మార్చి ఉంటున్నారు. ప్రసాదం ఇంటినుంచే భోజనం తీసుకెళుతున్నారు.

ఇంక నెమ్మదిగా గిరిని కూర్చోపెట్టచ్చు అని చెప్పాక దీక్షితులు బయలుదేరారు. నరహరి పదిహేను రోజులు సెలవు పెట్టి వచ్చాడు.

ర్యాలిలో కేశవుడు తనకి వచ్చిన విధంగా కేశవనామాలతో స్వామివారికి నిత్యపూజ చేస్తున్నాడు. కానీ తన స్వామిని వదిలి ఇన్ని రోజులుండడమే!

"తప్పకుండా వస్తాను! ఆ కేశవస్వామి అనుగ్రహముంటే.. వారిని స్మరించుకునే అవకాశం వస్తే ఎలా కాదనగలను?" దీక్షితులు గాద్గదికమైన కంఠంతో అన్నారు.

కచేరీ హాల్లో మధ్యలో కుర్చీ వేసి దీక్షితులుగారిని కూర్చోపెట్టారు. ఒక్కొక్కళ్ళే వచ్చి కాళ్ళకి నమస్కరించి, ఆశీర్వాదం పొంది వెళుతున్నారు. కొంతమంది పంచెల చాపూ, చీరా పెడుతున్నారు.

ఆఖరుగా వరాహ నరసింహంగారూ, విచ్చమ్మగారు జరీ పంచలచాపూ, జరీ చీరా పెట్టి కాళ్ళకి నమస్కారం చేశారు.

"ఇది హారతి పళ్ళంలో వచ్చింది బాబుగారూ" రెండు వందల రూపాయలు చేతిలో పెట్టి మళ్ళీ నమస్కరించింది విచ్చమ్మ.

దీక్షితులు సంభ్రమాశ్చర్యాలతో నోటమాట రాకుండా చూస్తుండిపోయారు. ఇది నిజమా! జాగ్రత్తగా వాడుకుంటే నాలుగు నెలలు ఇంటిల్లిపాదీ కడుపు నిండా భోజనం చెయ్యచ్చు. చెమర్చిన కళ్ళలోంచి నీరు బయటికి రాకుండా గొంతు సవరించుకుని నిగ్రహించుకున్నారు దీక్షితులు.

అసంకల్పితంగా సామవేదంలోని పనస అందుకున్నారు. హాలుహాలంతా నిశ్శబ్దం. ఆయన గంభీర కంఠం ప్రతిధ్వనిస్తోంది.

స్టేషనుకి కారిచ్చి పంపిస్తూ అన్నారు వరాహ నరసింహం.

"ఇవేళ మా ఇంట్లో వేదమాత విహరించింది స్వామీ"

●●●

"జాగ్రత్తగా వెళ్ళండి తాతగారూ!" మెడ్రాస్ మెయిల్లో థర్డు క్లాసు బోగీ దగ్గర కిటికీ బైట నుంచుని అన్నాడు నరహరి.

ప్రసాదం వాళ్ళ కారు డ్రైవరు వచ్చి, దీక్షితుల్ని ఎక్కించి బోగీలో వాళ్ళని బ్రతిమాలి, పెద్దాయనకి కిటికీ దగ్గర సీటు సంపాదించాడు. దీక్షితుల ముఖవర్చస్సు చూసి ఎవరూ మాట్లాడకుండా జరిగారు.

"అలాగేరా! ఒక పచ్చకాగితం తీసుకోరా అంటే వద్దంటున్నావు.. అంత ఖర్చూ నువ్వెక్కడ పెట్టుకుంటావు చెప్పు. ఇంతకీ లెక్క దొరికింది కదా అని కానీ. లేకపోతే నా వల్లవుతుందా?"

"ఫరవాలేదండీ. మొన్ననే బోనస్ వచ్చింది. గోపాలావుక్కూడా ప్రసాదం తన ఏరియాలో ఉద్యోగం ఇప్పించాడు. వచ్చేనెల చేరుతున్నాడు. మూడు నెల్లు బొంబాయిలో ట్రైనింగు. ఆ తర్వాత అనకాపల్లిలో ఉద్యోగం. కాస్త వెసులుబాటవుతుంది లెండి. వీలయితే మీక్కూడా పంపుతుంటాను."

దీక్షితులు కళ్ళలో తడి ఆరకుండానే రైలు కదిలింది.

●●●

రాజమండ్రి, మే 10, 1947:

"అమ్మయ్యా వచ్చేశారా? ఉండండి దిష్టి తీస్తాను. వెర్రినాగన్న ఎంత బాధపడ్డాడో" సుబ్బులు ఎర్రనీళ్ళు మూడుసార్లు గిరి తలచుట్టూ తిప్పి వీధిలో పక్కగా పారపోసింది.

గిరి తల అటూ ఇటూ తిప్పకుండా నడిచి లోపలికి వచ్చాడు. విష్ణు, నరహరీ పెట్టెలు తీసుకొచ్చి గదిలో పెట్టారు.

"అలా పడక్కుర్చీలో కూర్చో గిరి! వేడిగా పాలు తీసుకొస్తానుండు" సుందరి భారంగా నడుస్తూ వంటింట్లోకి వెళ్ళింది. ఆరోనెల వచ్చి పదిహేను రోజులయింది.

గిరి నవ్వుతూ, గదిలోంచి పెద్దపెద్ద కళ్ళు విప్పి చూస్తున్న యమునని చేత్తో రమ్మని పిలిచాడు.

యమున గుమ్మానికున్న చెక్కగేటు గట్టిగా కుదిపింది. అప్పుడు చూశారు విష్ణూ, గిరీ. గది గుమ్మానికి అమర్చిన ఊచల గేటు. ఫక్కున నవ్వుతూ అన్నాడు విష్ణు.

"ఏం అల్లరిపిల్లా జైల్లో పెట్టేశారా నిన్ను."

యమున ఉక్రోషంతో వెవ్వే అని ఎక్కిరిస్తూ "నవ్వద్దు" అంది.

"అబ్బో మాటలొచ్చేస్తున్నాయే పాపాయికి" గిరి చిన్నగా మూతి బిగించి నవ్వాడు. గట్టిగా మాట్లాడినా, నవ్వినా ఇంకా నొప్పెడుతోంది.

"అవును. వచ్చేశాయి" ముద్దుగా అంది యమున.

"దీన్ని కాయలేక, ఇలా చేయించేశాంరా. కొంచెం ఏమరుపాటుగా ఉంటే చాలు. ఏదో చేసేస్తుంది గడుగ్గాయి." సుబ్బులు పాలు తీసుకొచ్చి గిరి చేత తాగిస్తూ అంది.

"మీకు ఎంతో శ్రమ ఇస్తున్నా అత్తయ్యా!"

"భలే వాడివేరా. బతికి బైటపడ్డారు నువ్వూ చంటిదీ అంతే చాలు. కొంచెం తగ్గాక ఇంటూ ఫస్ట్ ఫారం పరీక్షలకి చదువుకుందుగాని. మీ మామయ్య చెపుతారు పాఠాలన్నీ - ధవళేశ్వరం వచ్చేయ్ నాతో"

"మీరెలాగంటే అలాగే అత్తయ్యా!" పడక్కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నాడు గిరిధారి.

●●●

రాజమండ్రి, ఆగస్ట్ 15, 1947

దేశమంతా స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో ఉంది. రాజమండ్రి కూడా అందుకు తీసిపోలేదు. ఎక్కడ చూసినా ఉత్సాహం పరవళ్ళు తొక్కుతోంది. బ్రిటిష్ జండా కిందికి దిగి త్రివర్ణపతాకంపైకి లేస్తోంది.

ఆ ఆనంద సందోహంలో సుందరికి నొప్పులు మొదలయ్యాయి. అప్పటికే పదిరోజులు ఆలశ్యమయింది. విశాఖపట్నం కానీ భీమవరం మిషన్ ఆస్పత్రికి కానీ తీసుకెళ్ళాలేమో అనుకున్నాడు నరహరి. అక్కడ పెద్దాపరేషన్ చెయ్యడానికి అన్ని సదుపాయాలూ ఉన్నాయని.

ఆ అవసరం లేకుండానే నొప్పులొచ్చి, మంత్రసాని వచ్చిన రెండు గంటలకే. పొద్దున్నే ఆరుగంటల రెండు నిమిషాలకి యమునకీ, కావేరికీ చిట్టి తమ్ముడు పుట్టాడు.

మంత్రసాని సింహాచలం కొత్తచీరా, పాతికరూపాయలు తీసుకుని వెళ్ళింది.

"ప్రతి ఏడూ మా బుజ్జి తండ్రి పుట్టిన రోజు దేశమంతా చేసుకుంటుంది." సంబరంగా వియ్యపురాలితో అంది సుబ్బులు. మూడో పురుడు అత్తగారింట్లో పొయ్యడం ఆచారం. అందుకే సుందరి తల్లి నరహరి ఇంటికే వచ్చింది.

"నిజవేనండోయ్! స్వతంత్ర భారత్‌లో పుట్టాడువీడు. అందుకోసవే ఇన్నాళ్ళూ ఆగినట్లున్నాడు" మనవడికి స్నానం చేయించి సుబ్బులు చేతికిస్తూ అంది వియ్యపురాలు.

ఇంటిల్లిపాదీ అప్పుడే పుట్టిన పసివాడిని చూస్తూ మురిసిపోతున్నారు. కావేరి కూడా వచ్చేసింది పురిటి గదిలోకి.

"అయ్యయ్యో! పురుడ్రా. అలా ముట్టేసుకున్నారేవిట్రా. వెనక్కి జరగండి" సుబ్బులు కేకలేసింది.

"ఎలాగా వచ్చేశాం కదమ్మా! కొంచెం సేపయ్యాక అందరం స్నానలు చేసేస్తాంలే."

నరహరి పసికందుని పొత్తిళ్ళలోకి తీసుకుని అన్నాడు.

"నక్షత్రం అదీ చూడకుండా."

"ఒకవేళ శాంతి చేయించాల్సొస్తే. చూసినందుక్కూడా శాంతి చేయించేద్దాంలేమ్మా!"

యమున తలుపు దగ్గర్నుంచే చూస్తోంది. చిన్న బొమ్మలా ఉన్నాడు. తను కూడా ఎత్తుకోవచ్చు. కానీ ఎవరూ తన్ని ఎవరూ పట్టించుకోట్లేదే. అప్ప వాడినెత్తుకున్నారు. అమ్మకూడా తనకేసి చూడట్లేదు. బామ్మా, అమ్మమ్మా, విష్ణుబాబాయ్. ఆఖరికి తన్ని ఎప్పుడూ ఆడించే గిరికూడా.

"ఎవరు వీడు. ఎందుకొచ్చాడు ఇంట్లోకి. ఇక అమ్మా, అప్పా నన్ను ఎత్తుకోరా" మిడుకూ మిడుకూ చూస్తోంది యమున.

చిన్నిబుర్రలో ఏం ఆలోచనలు రూపుదిద్దుకుంటున్నాయో

అంతలోనే కెవ్వున కేకేశాడు పసివాడు.

అందరూ హడావుడి పడిపోయారు. సుబ్బులు చటుక్కున పసివాడిని తీసుకుని అందర్నీ కేకలేసింది.

"చూడండ్రా. వాడికి చిరాకు కలిగిస్తున్నారు మీరందరూ కలిసి. వెళ్ళండవతలికి" పసివాడిని తీసుకెళ్ళి సుందరి పక్కన పడుకో పెట్టింది. అమ్మ పక్కన వెచ్చగా పడుకోగానే వాడు ఠక్కున ఏడుపు మానేశాడు.

"నీతో చెప్పాడా బామ్మా అమ్మ పక్కన పడుకోబెట్టమని" కావేరి ఆరిందాలాగా అడిగింది.

"అవునే పిల్లా చెప్పాడు. వాడి భాష నాకొక్కదానికే వచ్చు. మీరంతా ఇంక బైటికెళ్ళండి"

అంటే బామ్మతో వాడు మాట్లాడుతున్నాడా.. ఇంక ఎవరూ తన్ని చూడరు. యమున కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది.

"ఏం చిట్టితల్లీ నువ్వొక్కదానివే మిగిలావు. వచ్చి చూడు. ఏకంగా పెద్దడేయిసాడు నీళ్ళు కాస్తాను. అందరూ స్నానాలు చేద్దురుగాని." సుబ్బులు యమునని పిలిచింది.

యమున అడుగులో అడుగు వేసుకుంటూ గదిలోకి వెళ్ళింది. సుందరి చూసి నీరసంగా నవ్వి దగ్గరకి పిలిచింది.

"దా.. చూడు చిన్ని తమ్ముడు బావున్నాడా? అచ్చు నీలాగే ఉన్నాడు"

తనలాగే ఉన్నాడన్నమాట అర్ధమయింది యమునకి. కాళ్ళెత్తి తమ్ముడిని చూసింది. ముట్టుకోబోయింది. అందలేదు. మునివేళ్ళమీద నిల్చున్నా అందట్లేదు.

సుబ్బులు యమునని ఎత్తుకుని మంచం మీద కూర్చోబెట్టింది.

"ఇప్పుడే ఇంక పురిటి నీళ్ళయే వరకు ఎవరు గదిలోకి రావడానికి వీల్లేదు. తెలిసిందా!"

బామ్మ మాట విననట్లే తమ్ముడ్ని దీక్షగా చూస్తోంది. మెల్లిగా చేతులూ, కాళ్ళూ ముట్టుకు చూసింది. మొహం దగ్గరికి చెయ్యి చాపబోతే సుబ్బులు కేకలేసింది.

"ఏయ్ మొహం మీద చెయ్యి పెట్టకు. కళ్ళలో గుచ్చుకుంటాయి చేతులు."

యమునకి ఉక్రోషం వచ్చింది. చెయ్యి కిందికి దింపి తమ్ముడి తొడమీద ఒక్కట్టిచ్చింది.

ఎంత నొప్పేసిందో పురిటికందు కెవ్వుమని ఏడుపందుకున్నాడు.

●●●

ఒక్కసారిగా అందరూ చేష్టలుడిగినట్లు అయిపోయారు.

అంత చిన్నపిల్లయినా చేతిలో ఎంత బలముందో కానీ ఇంకా ముడుతలు పూర్తిగా విచ్చుకోని లేత చర్మం కమిలి, పొంగిపోయింది. ఎవరికి ఏం చెయ్యాలో ముందు అర్థం అవలేదు.

ముందుగా సుందరి తేరుకుంది. ఓపిక తెచ్చుకుని, లేచి కూర్చుని చంటాడ్ని ఒళ్ళోకి తీసుకుని, కమిలిన తొడమీద సున్నితంగా రాయసాగింది. ఇంకా కళ్ళు పూర్తిగా తెరవలేకపోతున్నాడు. కంఠం మాత్రం సాగదీసి ఏడుస్తున్నాడు. అందులోనే ఊరట ఉంటుందేమో.

సుబ్బులు అందుకుని, ఎత్తుకుని తిప్పడానికి ప్రయత్నం చేసింది. చేతిలో నిలపక అమ్మ పొట్టలో కదిలినట్లు కదులుతున్నాడు. ఎలా ఊరుకోబెట్టడం. ఏం చెయ్యాలి. పాలు తాగడం కూడా నేర్చుకోలేదు. ఎవరూ ఊహించనిది. ఎదురుచూడనిది.

మెత్తని బట్ట తడిపి తీసుకొచ్చి కమిలిన దగ్గిర అద్దింది అమ్మమ్మ. అలిసిపోయో, గొంతురాకో ఉపశమనంగా ఉందో కానీ మూలుగుతూ నిద్రపోయాడు వాడు. యమున .. అదేం చేస్తోంది? దాన్ని కోప్పడాలని కూడా మర్చిపోయారు అందరూ. అసలు ఏం చేసిందో? ఎందుకు చేసిందో దానికి తెలుసా?

తమ్ముడ్ని కొట్టిన వెంటనే మంచం దిగిపోయి హాల్లో ఉన్న పడక్కుర్చీ వెనకాలదూరి కూర్చుని గదిలో జరుగుతున్నదంతా చూస్తోంది. అందరూ అంత ఆందోళన పడుతుంటే తెలిసింది, తను చేసింది తప్పని. గిరి వెళ్ళి బైటికి లాగి పెరట్లోకి తీసుకుపోయాడు.

నరహరి బావా, అత్తయ్యా ఎవరైనా యమునని కొట్టేస్తారని భయపడ్డాడు. ఒకసారి అమ్మన్న పాపాయిగా ఉన్నప్పుడు.. గిరికి ఐదేళ్ళు. తనే పాకుతూ గడపకి తల కొట్టుకుని ఏడుస్తుంటే, చెప్పేది వినిపించుకోకుండా పిన్ని చావబాదిన సంగతి గుర్తొచ్చింది.

యమునకి తమ్ముడ్ని బాగా చూసుకోవాలని నెమ్మదిగా చెపుతున్నాడు.

"కావేరి నిన్నెప్పుడైనా కొట్టిందా యమునా?"

యమున తల అడ్డంగా ఊపింది.

"నీకు పిప్పర మెంటు బిళ్ళలు, బిస్కట్లు ఇస్తుంది కదూ" తల నిలువుగా ఊపింది.

"మరి నువ్వు కూడా తమ్ముడ్ని అలాగే చూసుకోవాలి. తెలిసిందా?" ఒక్కసారి చిన్నబోయిన యమున మొహం విప్పారింది.

"ఉండు పిప్పర్మెంట్ ఇచ్చొస్తా" గౌను జేబులోంచి అట్టకట్టిన బిళ్ళని కష్టపడి తీసి చెంగున లేచింది.

"అయ్యయ్యో అప్పుడే ఇయ్యకూడదమ్మా తమ్ముడు కూడా నీలాగా నడుస్తాడు. అప్పుడు పెట్టాలి. ఇప్పుడు నువ్వు తినేయ్" గిరి, యమునని ఎత్తుకుని ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

"ఇప్పుడు మనకి రెండు సమస్యలు. ఒకటి యమునని కాచుకోడం. రెండు యమున నుంచి చంటాడ్ని కాపాడుకోడం. ఎలాగో అర్థం అవడం లేదత్తయ్యా!"సుందరి ఏడుపు గొంతుతో అంది.

"కొన్నాళ్ళు యమునని నేను తీసుకెళ్తాలే. నువ్వేం బెంగెట్టుకోకు తల్లీ" సుబ్బులు హామీ ఇచ్చేసింది.

●●●

అన్నట్లుగానే సుబ్బులు తీసుకెళ్ళినా అక్కడ యమునని అసలు పట్టుకోలేకపోయింది. బెంగపెట్టుకుని జ్వరం తెచ్చేసుకుంది. సహాయంగా ఉంటాడనుకున్న గిరిని రాజమండ్రిలోనే చేర్పించవలసి వచ్చింది. ఇంకా అప్పుడప్పుడు తలనొప్పి వస్తుండడంతో డాక్టర్‌కి చూపించడానికి వీలవుతుందని.

యమునకి కోపం వచ్చినా, సంతోషం వచ్చినా తమ్ముడి మీద తీర్చుకోడానికి చూస్తుంది.

నరహరి పెద్ద తమ్ముడు గోపాలావు విశాఖపట్నంలో రిప్రజెంటేటివ్‌గా చేరాడు. ప్రసాదం అతని సూపర్ వైజర్. ఉద్యోగంలో చేరగానే పెళ్ళిచెయ్యాలని బలరామయ్య పదిమందికీ కబురందించాడు.

"ఇంకా ఇరవై నిండలేదు. కనీసం ఒక ఏడాదయినా ఆగితే కొంత డబ్బు దాచుకుని కాస్త బాధ్యత తెలుసుకున్నాక చేస్తే బాగుంటుందేమో!" తన మీద ఉన్న భారం తగ్గుతుందని పైకి అనలేని నరహరి నచ్చచెప్పబోయాడు.

"నాకు ఆ వయసుకి నువ్వు పుట్టేశావు తెలుసా. డబ్బంటావా ఎంతుంటే వద్దంటుందీ! మగాడయినా సరే ఒక్కడ్నీ వేరే ఊళ్ళో ఉంచడం మంచిది కాదు" మరో మాటకి అవకాశం ఇవ్వకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు బలరామయ్య.

గాఢంగా నిట్టూర్చాడు నరహరి. భవిష్యత్తు ఎలా గడుస్తుందా అని ఆలోచన లేని వాళ్ళు అదృష్టవంతులు అనుకుంటూ. కనీసం పెళ్ళి ఖర్చు అయినా కావాలి కదా! తండ్రి మాటలకి ఎదురు చెప్పడం అలవాటు లేదు.

గోపాల్రావుకి పెళ్ళవడం రాజమండ్రి బదిలీ అవడం ఒకసారే జరిగాయి. అంటే నరహరి కింద పనిచెయ్యాలి.

"ఎంచక్కా ఇద్దరూ కలిసే ఉండచ్చు." సుబ్బులు అమాయకంగా ఆనందపడిపోయింది.

"కలిసుంటే బాగానే ఉంటుంది కానీ కొత్తగా వచ్చిన పిల్ల ఎటువంటిదో? ఏమనుకుంటుందో. మనమే నిర్ణయం తీసేసుకుంటే మంచిది కాదు."

"దాందేముంది మనవే సర్దుకుంటే పోలా" సుందరి పొద్దున్నే కావేరిని బడికి పంపుతూ, ఆనంద్‌కి పాలు పడుతూ, యమునని సముదాయిస్తూ అష్టావధానం చేస్తూ అంది. గిరి అప్పటికే స్కూలుకి వెళ్ళిపోయాడు.

కానీ. ఏం గొడవలొస్తాయోనని నరహరి భయపడుతూనే ఉన్నాడు.

కొత్త పెళ్ళికూతురికి హారతిచ్చి ఇంట్లోకి తీసుకుని వచ్చాక కానీ నరహరి సందేహంలోని అంతరం బోధపడలేదు అత్తాకోడళ్ళిద్దరికీ.

ఏదయినా అనుభవానికి వస్తే కానీ కొంతమందికి తెలియదు. ఇల్లుచూడ్డానికి పెద్దగా కనిపిస్తుంది. కానీ పడగ్గది ఒక్కటే. పెద్ద హాలు, వసారా, నట్టిల్లు, వంటిల్లూ.. పెరడూ అన్నీ విశాలంగా ఉంటాయి. ఒక్క గదీ కొత్త దంపతులకిచ్చేస్తే నరహరి ఎన్నాళ్ళు హాల్లో గడపగలడు. అతనికీ ఇంకా ముప్పై నిండలేదు. భార్యతో ఏకాంతం కావాలని ఉంటుంది కదా!

మూడు నిద్రలయి మళ్ళీ పుట్టింట్లో మూడు రాత్రులు మణుగడుపులు గడపడానికి వెళ్ళారు, కొత్తదంపతులూ, సుబ్బులూ. సరిగ్గా అప్పుడే నరహరి సమస్యకి చక్కని పరిష్కారం దొరికింది, అతనికి వచ్చిన ట్రాన్సఫర్‌తో గుంటూరు కృష్ణాజిల్లాలకి బదిలీ చేశారు.

పెళ్ళికి వెయ్యిరూపాయలు అప్పుచెయ్యవలసి వచ్చింది నరహరి, ఇచ్చిన కట్నం రెండువేలూ ఖర్చులకి సరిపోక అది తీరడానికి ఎన్ని రోజులు పడుతుందో.. గోపాల్రావు భార్య పేరు లక్ష్మి. కుటుంబానికి ఎంతవరకూ సహకరిస్తుందో? అన్ని ఆలోచనలూ పక్కకి నెట్టి సామాన్లు సర్దమని భార్యకి చెప్పాడు నరహరి.

అప్పుడు గుర్తుకొచ్చింది నరహరికి.. మరి గిరి రాజమండ్రిలో చేరాడు. వాడి మాటేంటి? ఉన్న బాధ్యతలకి తోడు వీడొకడు.

అనవసరంగా వీడి భారం కూడా మీదికెత్తుకున్నానా అని అనుకున్నాడు ఒక్క క్షణం. కానీ వీడే లేకపోతే యమున. అలా అనుకుంటే అసలు వాడు రాకపోతే అలా జరిగేదే కాదేమో!

అసహనంగా తల విదిల్చాడు నరహరి. ఏదయినా మన చేతిలో ఉంటే కదా పైవాడు ఆడించే నాటకంలో పాత్రధారులే అందరూ.

"బావా!" గిరి పక్కనే కూర్చుని పిలిచాడు. నరహరి వాడి మొహంలోకి చూశాడు. పెద్ద కళ్ళు. వాటిలో ఏదో చెప్పాలన్న తపన. నుదుటి మీద పడుతున్న ఉంగరాల జుటు పక్కకి తప్పించి అడిగాడు.

"ఏరా నిన్ను ర్యాలి పంపించేస్తానని భయంగా ఉందా?"

ఏ క్షణానయినా రాలడానికి సిద్ధంగా ఉన్న నీళ్ళు నిండిన కళ్ళతో తలూపాడు గిరి.

"నేను కొంచెం ఎక్కువ తింటాను బావా! ఆ వార బోలెడు పని చేస్తాను ఇంట్లో. గోపాల్రావు బావకి చెప్పి ఇక్కడే" గొంతు పూడుకుపోగా ఆపేశాడు గిరి.

అనిర్వచనీయమైన భావంతో వాడికేసే చూస్తుండిపోయాడు నరహరి.

●●●

"**అక్కా నీళ్ళపొయ్యి అంటించేశాను. కాఫీ డికాషన్ వేసేశాను.**

వెనుక సావిడిమీదికి ఎక్కిన ఆనప్పాదుకి కాయ ఉంటే కోసి పులుసుకి ముక్కలు తరిగేశా. రెండు సోలలు బియ్యం, గ్లాసుడు కందిపప్పు కడిగిపెట్టాను. నేను స్కూలుకి వెళుతున్నా. బావ ఇవేళ వస్తాడనుకుంటా" నిద్రపోతున్న లక్ష్మికి చెప్పి ఇంట్లోంచి బయటపడ్డాడు గిరి.

"ఊ." అంటూ పక్కకి తిరిగి పడుకుంది లక్ష్మి. పక్కలో చంటిపిల్లాడు కేరుమని ఏడుస్తూ పాలకి తడుముతూ బుల్లి చేతుల్ని పొట్టమీద రాశాడు. నిద్రకళ్ళతో వాడిని సముదాయించే లోపు రెండో పిల్లాడు గట్టిగా కెవ్వుమంటూ అందుకున్నాడు.

ఇంక తప్పదనుకుంటూ లేచి ఒళ్ళు విరుచుకుంది లక్ష్మి. నడుం కలుక్కుమంది. అలాగే సవరదీసుకుంటూ జుట్టు దులిపి ముడివేసుకుంటూ పెరట్లోకి నడిచింది. పిల్లల ఏడుపులు సుప్రభాతం పలుకుతుంటే.

గిరి రాజమండ్రి వచ్చి నాలుగేళ్ళయింది. ఫిఫ్త్ ఫారంలోకి వచ్చాడు.

నరహరి గుంటూరులోనే ఉన్నాడు.

గోపాల్రావు నెలకి పదిహేనురోజులు పైగా కాంపులో ఉంటాడు.

నాలుగేళ్ళలో లక్ష్మికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ముగ్గురూ మగపిల్లలే.

మూడోవాడికి రెండు నెలలు నిండాయి. ఎడంలేకుండా పుట్టిన పిల్లల పన్లతో ఏడుపులతో అల్లరితో, నిద్రసరిగ్గా లేక నీరసించిపోయింది. అసలు చురుకుగా పనిచేసుకోగల స్వభావం కాదు.

"లక్ష్మీ ఏం చేస్తున్నావు" సుబ్బులు హడావుడిగా వచ్చింది. వారానికోసారి వచ్చి పిల్లలకి తలంట్లు, ఇంటిపన్లో సాయం.. కాదు, మొత్తం పనిచేసి వెళ్తుంటుంది.

లక్ష్మి మనసులో అమ్మయ్యా అనుకుంది.

"ఏది అత్తయ్యా వీళ్ళు ఇప్పుడే లేస్తున్నారు. నేను పొద్దున్నే లేచి గిరిని బడికి పంపి కొంత పనిచేసుకున్నా. ఇప్పుడే పెద్దాడికి పళ్ళుతోముదామని.."

ఒక్కసారి కోడలి మొహంలోకి చూసింది. అప్పుడే నిద్రలేచినట్లు తెలుస్తూనే ఉంది.

"అలాగటే. ఉండు నేను పెద్దాడి సంగతి చూస్తా. నువ్వు వెళ్ళి చిన్నాళ్ళని చూడు. దారా హరీ!"

నాలుగేళ్ళు నిండిన పెద్దమనవడ్ని తీసుకుని నూతి దగ్గరకి నడిచింది సుబ్బులు. వాడిది నరహరి పేరే.

తండ్రి అన్నగారి పేరు మొదటి కొడుక్కిపెట్టడం కోనసీమ ద్రావిడుల ఆచారం. అలాగే ఆడపిల్లకి అక్కగారి పేరు పెడతారు.

గింజుకుంటున్న హరిని మాటల్లో పెట్టి స్నానం చేయించి తయారుచేసి, పాలుపట్టి, పక్కింట్లో ప్రైవేటు మాష్టారి దగ్గర వదిలింది సుబ్బులు.

"ఏమ్మా గురువుగారు బాగున్నారా? నమస్కారాలు చెప్పండి." అంటూ హరిని దగ్గరగా తీసి పలక చేతికిచ్చాడు పక్కింట్లో అరుగుమీద ప్రైవేట్లు చెప్పుకునే ప్రకాశం మాష్టారు. అతను బలరామయ్యగారి వద్దే చదువుకున్నాడు. స్వతంత్రం వచ్చేవరకూ గాంధీగారి వెంట తిరిగి, అది సాధించాక ఇంటికొచ్చేసరికి ఇల్లు తప్ప ఏం మిగల్లేదు. "ఏదో గడిచిపోతుందిలేవయ్యా" ప్రకాశంకి సమాధానం

చెపుతూనే, అరుగుమీద చివరగా, పక్షవాతంతో పడక్కుర్చీలో కూర్చున్న ప్రకాశం తండ్రిని పలకరించి లోపలికి నడిచింది సుబ్బులు. ముసలాయన మూలుగుతూ, స్వాధీనంలో ఉన్న ఎడం చెయ్యిని తిప్పాడు. కుడిభాగం, నోరు పనిచెయ్యవు.

"బావున్నావా సుబ్బులొదినా! ఇన్నాళ్ళికి గుర్తుకొచ్చామా" ఆప్యాయంగా, నిష్ఠూరంగా అంది ప్రకాశం తల్లి కావుడు. రెండు కుటుంబాలకీ దూరపు బంధుత్వం ఉంది. నిజమే. వారం వారం వచ్చినా ఎక్కీ తొక్కీ అయిపోతుంది సుబ్బులుకి. ఏవో పనులు. సందివేళ అవకుండా వెళ్ళిపోవాలి మళ్ళీ.

"ఏదీ ఇలారావడం అలా వెళ్ళడం అవుతోంది. కులాసానా వదినా!"

"చూస్తున్నావుగా సుబ్బులూ. స్వతంత్ర భారతం అంటూ తిరిగి, చదువు పాడుచేసుకుని, ఉద్యోగం సద్యోగం లేక అలా ఉన్నాడు అబ్బాయి. మీ అన్నయ్య ఇలా. కోడలు పురిటికెళ్ళిందిలే. ఇంట్లోనేనొక్కదాన్నే. ఇవేళ మా ఇంట్లో భోంచేద్దువుగాని. చాలారోజులయింది కబుర్లు చెప్పుకుని" ఆశగా అడిగింది కావుడు.

"ఇంకోసారి వస్తాలే వదినా. లక్ష్మికి కాస్త సాయంచేసి."

" అది చేసేరావమ్మా కోడలు ఆ మాత్రం వడ్డించుకుని తినగలదులే"

సరే అని తలూపింది సుబ్బులు, అసలే అంతంత మాత్రం సంసారం. తను కూడా భారం అనుకుంటూ.

●●●

"వచ్చేప్పుడు కాస్త పనసపొట్టు తెచ్చి ఇక్కడ కూరొండానొదినా. ఆవ ఘాటుగా పడింది. రుచిచూస్తారేమో అని. మడి బట్టతోనే వచ్చాకదా అని తీసుకొచ్చాను. ఇంకా ప్రకాశం తినలేదేమో కదూ"

రోడ్డు మీదకి వెళ్ళక్కర్లేకుండా. పెరట్లొంచే పక్కింట్లోకి వెళ్ళచ్చు.

సుబ్బులు అలాగే వచ్చింది భోజనానికి.

మొదట్లో రాననే చెప్పేద్దామనుకుంది.

కావుడు ఏదో చెప్పాలనుకుంటోందని గ్రహించి తను పని త్వరగా చేసుకుని వచ్చింది. పైగా గిరి సగం వంటకి తయారు చెయ్యనేచేశాడు.

"ఇప్పుడే మీ అన్నయ్యకి తినిపించా. ప్రకాశం ఒంటిగంటక్కానీ రాడు. పదకొండింటికి ఓ గ్లాసు కాఫీ తాగుతాడులే. మనం తినేద్దాం. అప్పుడే పన్నెండవుతోంది. నువ్వు ఇంకా పప్పులు, పోపు గింజలు బాగుచేసుకోవాలేమో " పీటలు, ఆకులు వేస్తూ అంది కావుడు.

సుబ్బులు నవ్వి ఊరుకుంది. నిజమే.

సరుకులు తెచ్చినవి అలాగే అట్టిపెట్టేస్తుంది లక్ష్మి.

సుబ్బులు వచ్చినప్పుడు బాగు చేసి డబ్బాల్లో సర్దివెళ్తుంది.

"ఏమీ చెయ్యలేదొదినా. పప్పు, పులుసు, దొడ్లో చిక్కుడుకాయలు కోసి పులుసు బెల్లం పెట్టివండాను. నెయ్యి నిండుకుంది. ఏమీ అనుకోవు కదాని రమ్మనేశాను."

"బావుంది. ఇంతకంటే ఎవరు మాత్రం ఏం చేసుకుంటారూ. అసలు ఈ పప్పు నూనె ముందు వెన్నకాచిన నెయ్యి కూడా సాటిరాదు.

ఏదైనా చెప్పాలనుకుంటున్నావా వదినా?" పప్పు అన్నంలోనే పులుసు కలిపేసి, నూనె వేసుకుని ముద్దనోట్లో పెట్టుకుంటూ అడిగింది సుబ్బులు.

"అంటే.. అన్నాలు తిన్నాక.." చెప్దామా వద్దా అనుకున్నట్లు గొణిగింది కావుడు.

"నేను ఒంటిగంటకి గిరి వచ్చి వెళ్ళాక వచ్చేదా? కొద్దిగా పని ఉంది, చూసుకుని వస్తాను. కూర చాలా బాగుందొదినా. ఇంట్లో కాసినవంటే అంతే మరి." తేనెలూరుతున్నట్లున్న చిక్కుడు కాయని నవుల్తూ అంది సుబ్బులు.

"పనసకాయకూర మాత్రం అచ్చు పెళ్ళిళ్ళల్లో చేసినట్లు లేదూ."

●●●

"అత్తయ్యా వచ్చావా. అనుకుంటున్నా ఇవేళో రేపో వస్తావని" పెరట్లోకి కాళ్ళు కడుక్కోడానికని వచ్చి సంభ్రమంగా అన్నాడు గిరి.

అత్తయ్య వస్తే రుచిగా దొరుకుతుంది భోజనం. ఒంటిగంటకి వచ్చి అన్నం తినివెళ్తాడు. బడి దూరమే. రానూపోనూ అరగంటపైన పడుతుంది. కానీ తప్పదు. పొద్దున్న తిని వెళ్ళడానికి వంట అవదు.

"బాగా చదువుతున్నావురా. ఉండు నేనొచ్చి పెడతా." గిరిని మురిపెంగా చూస్తూ అంది సుబ్బులు. అంతా తాత పోలిక గిరి. స్ఫురద్రూపి. ఎప్పుడూ చురుకుగా నవ్వుతూ ఉంటాడు.

"ఫరవాలేదు. పాసవుతాన్లే. ఏం వండావు?"

చదువుగురించి అడుగుతే అంతగా నచ్చదు గిరికి.

ఇంట్లో చదువుకోడానికి అస్సలు వీలవదు. గోపాలావులేనప్పుడు, బజారుపని, ఇంటిపని అంతావాడిదే పుస్తకాలు ముందేసుకున్నప్పుడల్లా. ఏదో ఒకపిల్లాడు ఏడుస్తున్నాడని ఆడించమంటుంది లక్ష్మి.

రాత్రి దీపం బుడ్డి ముందు కూర్చుని కష్టం మీద హోం వర్కు పూర్తిచెయ్యగలుగుతాడు.

గోపాలావు ఉండేదే నెలకి వారం రోజులు. ఇంట్లో ఉన్నంతసేపూ గిరీ, గిరీ అంటూ వెనకాలే తిప్పుకుంటాడు.

హాల్లో చాపమీద పడుకున్న లక్ష్మి లేవబోయి, అత్తగారు వడ్డిస్తుంటే పక్కకి తిరిగి మళ్ళీ పడుకుండిపోయింది.

ఇంకొంచెం అన్నం మజ్జిగలోకి వడ్డించబోతే చెయ్యి అడ్డం పెట్టాడు గిరి.

ఆశ్చర్యంగా చూసింది సుబ్బులు. ఇదివరకు తినేదాంట్లో సగం కూడా తినలేదు.

"ఇప్పుడు రెండుపూటలా సుష్టుగా దొరుకుతోంది కదా అత్తయ్యా. అందుకని ఎక్కువ తినలేను. పైగా ఒక మైలు నడవాలి తినగానే. నేను ఆవులాంటివాడిని. మేత దొరకదనుకుంటే లాగించేస్తాను." పకపకా నవ్వి, లేచి కంచం తీసుకెళ్ళి శుభ్రంగా తోమి బోర్లించి, తిన్న దగ్గర నీళ్ళు చల్లి తుడిచి, పుస్తకాల సంచి తీసుకుని వీధిలోకి పరుగెత్తాడు.

పరుగెడుతున్న గిరిని ఓరగా చూసింది, గిన్నెలు వంటింట్లో సర్దుతున్న సుబ్బులు. గుమ్మానికి సరిపోయే పొడుగున్నాడు.

వేసుకున్న నిక్కరు పొట్టిపోతే అంచు దగ్గర కుట్లు తీసేసినట్లున్నాడు.

పీలికలు వేళ్ళాడుతున్నాయి. పొడుగయ్యాడు కానీ అందుకు తగ్గలావు అవలేదు గిరి. చొక్కా వదులుగా సంచి చుట్టుకున్నట్లుంది. గోపాలావుది అయివుంటుంది. కాళ్ళకి చెప్పులు ఎలాగా ఉండవు.

సుబ్బులు గుండె సన్నగా మూలిగింది.

నరహరి దగ్గరుండి ఉంటే ఇంకొంచెం బాగా ఉండేవాడేమో?

ఈసారి పండక్కి వీడికి కొత్తబట్టలు కొనాలి అనుకుంటూ, ఆవాలు, జీలకర్ర, పెసలు ఉన్న పొట్లాలు తీసుకుని పక్కింట్లోకి నడిచింది.

"వదినా. ఇవుండిపోయాయి. మాట్లాడుకుంటూ బాగుచేద్దామని తెచ్చేశాను. కోడలు కునుకు తీస్తోందిలే. చేట, పీట తియ్యి"

సుబ్బులు మాట వింటూనే కావుడు, నట్టింట్లో పీటలు వేసింది.

చాటలో జీలకర్ర పోస్తూ అంది సుబ్బులు.

"ఇప్పుడు చెప్పు. ఏమయిందే?"

పీట చేటలో పెట్టి ఆవాలు దొర్లిస్తూ, ఆగిపోయిన రాళ్ళూ రప్పల్నీ ఏరి పక్కకి పడేస్తూ, ఆలోచనలో పడింది కావుడు. ఎలా మొదలుపెట్టాలా అని.

"నీ కోడలు గురించేనా. ఒంట్లో బాగోలేదా?" సుబ్బులే ఎత్తింది.

"ఒంట్లో బాగానే ఉంది. పురుడు పోసుకుని ఇంక ఇక్కడికి రాదుట. ప్రకాశం ఏమీ పట్టించుకోడు. నిమ్మకి నీరెత్తినట్లు కూర్చున్నాడు. నాకేం చెయ్యాలో పాలుపోవట్లేదు."

రెండు నిమిషాలు, చెరుగుతున్న చప్పుడు తప్ప ఇంకేం వినిపించలేదు. ప్రకాశం భోంచేసి నిద్రపోతున్నట్లున్నాడు.

మళ్ళీ మూడింటికి అతని బడి మొదలవుతుంది.

"ఎందుకనీ" సుబ్బులు నిశ్శబ్దాన్ని ఛేదించింది.

"ప్రకాశం వీధిబడి దానికి నచ్చలేదు. వచ్చే ఆదాయం బొటాబొటీగా సరిపోతుంది. ఎక్కడైనా ఉద్యోగం చూసుకోమంటుంది. ఉన్న ఇంటినుంచి వచ్చిన పిల్లకదా. పెళ్ళికి ముందు ఇదేం కనిపించలేదు.

అప్పుడు నిరాడంబర జీవితం అంటూ కబుర్లు చెప్పుకున్నారు. దిగితేకానీ తెలీలేదు."

సుబ్బులు గట్టిగా నిట్టూర్చింది.

ప్రకాశం భార్య సరోజిని చెన్నపట్నంలో పెద్ద ప్లీడరుగారి అమ్మాయి. ధనవంతులే. గాంధీగారి ఉపన్యాసం విని, ఖద్దరు చీరలు కట్టి, ఒంటిమీదున్న నగలు విరాళం ఇచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరింది. అప్పుడే ప్రకాశం పరిచయం అయ్యాడు.

స్వతంత్రం వచ్చాక ఇంట్లో వాళ్ళని ఎదిరించి మరీ చేసుకుంది.

ఉద్యమంలో ఉండగా ఒకటే దృష్టి, ధ్యేయం. అందరిదీ ఒకేబాట.

అప్పుడు కలిసిన అభిప్రాయాలు. కోరి వివాహం చేసుకున్నా కలవడం మానేశాయి. యస్సెసల్సీతో చదువాపేసి వార్ధా వెళ్ళిన ప్రకాశంకి స్వతంత్ర భారత్‌లో ఉద్యోగం రాలేదు.

ముప్పై ఏళ్ళు నిండి. ఉన్న ఊర్లోనే ఉపాధికావాలనుకుంటే వచ్చే రోజులు కావు.

ఎవర్నీ నోరు తెరిచి అడిగే స్వభావం అసలేకాదు.

అందుకే అరుగు మీద బడి నడపడం ప్రారంభించాడు ప్రకాశం.

కాపురానికి వచ్చిన కొద్దినెలలకే సరోజిని వాస్తవం తెలుసుకుంది.

జీర్ణించుకోలేకపోయింది.

చెన్నపట్నంలో కార్లలో తిరుగుతూ మహిళామండలి, క్లబ్బు అంటూ క్షణం తీరికలేకుండా ఉండేది.

ఇంక ఉద్యమంలో చేరాక అయితే చెప్పనక్కరలేదు.

పెళ్ళిచేసుకున్నాక ఆడవాళ్ళు ఇంట్లోనే ఉండాలనుకునే కుటుంబంలో కాళ్ళూ చేతులూ కట్టేసినట్లయి గిలగిల్లాడిపోయింది.

ఆ సంగతంతా అప్పుడప్పుడు చెవిన పడ్డ వార్తలతో సుబ్బులు గ్రహించ గలిగింది.

"ఇప్పుడేం చెయ్యమంటుంది.?"

ఈ సమస్యకి పరిష్కారం కష్టమేనని తెలుసు సుబ్బులుకి. సరోజిని. పుట్టబోయే పిల్లల్ని తన ఆశలకి అనుకూలంగా ఈ ఇంట్లో అయితే పెంచలేదు.

"మద్రాసు వచ్చెయ్యమంటుంది. అక్కడ వాళ్ళ నాన్న కోర్టులో ఏదో ఒకటి వేయిస్తాడట.

వీడేమో మమ్మల్ని వదిలి వెళ్ళనంటున్నాడు.

కోడలు రాకపోతే అప్రదిష్ట మాట అలా ఉంచి, పిల్లా పాపల్లేకుండా వీడి బతుకు అధ్వాన్నం అయిపోతుందని బెంగనాకు. వాడెళ్ళిపోతే నేను నిభాయించుకురాలేను. మీ అన్నయ్య చూస్తే అలా. ఏం చెయ్యాలో బోధపడట్లేదొదినా" కావుడూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

క్లిష్ట సమస్యే. కావుడికి ఆదుకునే వాళ్ళు ఎవరూ లేరు. అందరివీ అంతంత బతుకులే.

"అందుకే వియ్యానికయినా కయ్యానికైనా సమ ఉజ్జీకావాలంటారు." కావుడే అంది, బాగుచేసిన ఆవాలు డబ్బాలో పోసి, పెసలు పీటమీద పోస్తూ.

"అబ్బ. ఈ జీలకర్రలో తుక్కులెక్కువ సరుకు తక్కువ. దోచేస్తున్నారనుకో వదినా.

పోనీ. కొన్నాళ్ళు ప్రకాశం వెళ్ళి చూస్తే బాగుంటుందేమో?

ఎలాగైనా పిల్లలు బాగుపడ్డం కావాలి కదా మనకి."

"మరి మా మాటేమిటి. అసలు వీడిని ఒప్పించడం ఎలా? ఇంకో నలుసుంటే బాగుండేది వదినా. మొత్తానికి వీడిమీదే పడింది భారం."

"ఉంటే ఇంకో సమస్య వచ్చేదేమో. ఎవరికి తెలుసు.

వచ్చేవారం నరహరి వస్తున్నాడు. రాగానే నిన్ను కలవమని చెపుతాను. ఏదో ఆలోచిద్దాం.

నువ్వేం బెంగపడకు. ప్రకాశం చాలా నెమ్మదస్తుడు. వాడికి ఏ కష్టం రాదు. నన్ను నమ్ము." బాగు చేసిన సరుకుల్ని డబ్బాల్లో పోసుకుని లేచింది సుబ్బులు.

"నీ మాట నిజమైతే అంతకంటే ఏం కావాలి" కావుడు నిట్టూరుస్తూ, సుబ్బులుకి బొట్టుపెట్టి పంపించింది.

●●●

**"యమునా! ఏదీ ఈ పిల్ల. మధ్యాహ్నం నుంచీ కనిపించడంలేదు."**

కంచల్లో అన్నాలు పెట్టి కావేరిని అడిగింది సుందరి.

చీకటి పడి చాలాసేపే అయింది. వీధి దీపాలు వెలిగాయి.

కరెంటు దీపాలు వచ్చి ఏడాది అవుతోంది.

అప్పట్నుంచీ రోడ్ల మీద సందడి ఎక్కువయింది.

దీప స్థంభాల దగ్గర నుంచుని కూరగాయల ధరల దగ్గర్నుంచి రాజకీయల వరకూ చర్చలు చిన్న పిల్లల దొంగా పోలీస్ ఆటలు మాధాకవళం వాళ్ళ కేకలు ఒకటేమిటి, రకరకాలు.

యమునకి ఎనిమిదేళ్ళు నిండాయి.

నరహరి గుంటూరులోనే స్థిరపడినట్లు అయిపోయింది.

పండరీపురంలో చిన్న ఇల్లు కూడా కట్టాడు. ముందు తాటాకులు కప్పిన వరండా, వెనుక పెద్దహాలు, హాలుపక్క గది. హాలు వెనుక మళ్ళీ వరండా ఒక పక్కగా వంటిల్లు. వీధిగుమ్మానికి ఎదురుగా తులసికోట.

ఇంటిముందున్న స్థలంలో, మందార చెట్లు, డిసెంబరు, ముళ్ళగోరింట, చేమంతి మొక్కలు. మల్లి, జాజితీగలు.

క్రోటన్లు ఇంట్లోకి వచ్చే వాళ్ళకి స్వాగతం పలుకుతుంటాయి. పెరట్లో, అరటి, రకరకాల పాదులు, కరివేప, జామచెట్లు. తోట అంతా కావేరి శ్రమ ఫలితమే.

ఆ ఏడే యస్సెల్సీ పరీక్షలు రాసింది కావేరి.

ఖాళీ ఉన్నప్పుడు సుందరి కూడా తోటలోనే ఉంటుంది.

నరహరి, ప్రసాదం, పిళ్ళై అని మద్రాసతను. ముగ్గుర్నీ దక్షిణ భారతం మొత్తనికి వాళ్ళ కంపెనీ సేల్స్ మేనేజర్లుగా నియమించారు. దాంతో కాంపులు ఎక్కువయి పదిరోజులకంటే ఇంట్లో ఉండట్లేదు.

"చిన్నక్కా, నేనూ ఒంటిగంటకే బడి నుంచి వచ్చేశాంగా. నన్ను ఇంట్లో దింపేసి ఎక్కడికెళ్ళిందో ఏమో" చేతులు తిప్పుతూ అన్నాడు ఆనంద్.

బ్రాడీపేటలో ఉన్న పాండురంగ విద్యాలయంలో యమున ఐదు, ఆనంద్ మూడో క్లాసులు చదువుతున్నారు.

చీకటి పడేవరకూ పెత్తనాలు చేసి వస్తుంది యమున. దానికి తోడు సినిమాల పిచ్చి.

ఆ వయసులో కూడా ఒక్కతైనా వెళ్ళిపోగలదు. ఎంతదూరమయినా సరే. తండ్రి ఇంట్లో ఉండడు. అమ్మని ఏమార్చడం ఎంతసేపు. అప్పుడప్పుడు సుందరికి వీరావేశం వచ్చి నాలుగు వాయిస్తుంది.

రెండురోజులు బుద్ధిగా ఉంటుంది. మళ్ళీ మామూలే.

"ఈ పాటికి వచ్చేయాలే" కావేరి స్వగతంలా అనుకుంది.

"ఎక్కడ్నించీ"

"మధ్యాహ్నం పక్కింటి అత్తయ్యగారు వాళ్ళూ సినిమాకి వెళుతుంటే వాళ్ళతో కూడా" కావేరి సణిగింది.

"నాకు చెప్పద్దుటే. ఇంతసేపేంటి. మొదటాట మొదలెట్టి కూడా చాలాసేపయుంటుంది. ఒకసారి వాళ్ళింటికి వెళ్ళిచూడు"

కావేరి పరుగెత్తుతూ వెళ్ళి గోడక్కొట్టిన బంతిలా తిరిగొచ్చింది, ఏడుపు మొహంతో.

"వాళ్ళు వచ్చి చాలాసేపయిందమ్మా. అరడజనుమంది పిల్లలున్నారుట. అరటిక్కెట్టుకి డబ్బులిచ్చి, వాళ్ళతోనే వెళ్ళిందిట. ఇంటికి రాలేదా. వచ్చిందనుకున్నానే. అంటున్నారు అత్తయ్యగారు."

"అయ్యో అయ్యో. పదేళ్ళైనాలేని పిల్ల ఎక్కడి కెళ్ళిపోతుందే? ఇది చిన్నప్పట్నుంచీ అంతే కాల్చుకుతింటోంది. ఎక్కడని వెదకనూ. మగదక్షతలేని ఇల్లైపోయింది" సుందరి కళ్ళలోంచి నీళ్ళు కారిపోతున్నాయి. కంఠం బొంగురుపోయింది.

"ఏ సినిమా కెళ్ళిందో చిన్నక్క. నన్ను పంపమంటే పంపవుకానీ" నిష్ఠూరంగా అన్నాడు ఆనంద్.

"బావుందిరా పెళ్ళి వాళ్ళది పెళ్ళి హడావుడీ, అడుసు కళ్ళవాళ్ళది దోమల హడావుడిలా ఉంది నీ వరస. పిల్లేమయిందో అని నే ఛస్తుంటే"

కావేరికి చటుక్కున తట్టింది.

"ఉండమ్మా ఏ హాలో కనుక్కొస్తాను" పక్కింట్లోకి పరుగెత్తింది.

"హరిహరమహలట. మామయ్యగారు కనుక్కొస్తానని వెళ్ళారు."

సుందరి గట్టిగా నిట్టూరుస్తూ, గేటు దగ్గరకెళ్ళి, అక్కడే నిల్చుంది.

"ఏవనుకోకండి వదినగారూ పిల్లల సందట్లో పడి నేనూ చూసుకోలేదు. ఇంటికి దారి తెలీక హాలు దగ్గరే కూర్చుండిపోయుంటుంది. కూడా మా రెండో వాడు వెళ్ళాడు. వచ్చేస్తుంటారు లెండి."

పక్కింటావిడ సానుభూతి వాక్యాలు పలుకుతోంది.

"అమ్మా అదిగో యమున, మామయ్యగారితో కబుర్లు చెపుతూ వస్తోంది. ఐసు ఫ్రూటుకూడా చప్పరిస్తూ" ఆనంద్ అరిచాడు.

ఏమీ ఎరగనట్లు నవ్వుతూ వచ్చింది యమున.

ఆనంద్ ఉడుక్కుంటుంటే మరింత పళ్ళికిలిస్తూ.

సుందరికి కోపం నషాళానికి కంటింది. కష్టమ్మీద ఆపుకుంది.

"హాల్లో ఖాళీ సీటు మీద నిద్రపోతోందమ్మా. మా వాడు వాళ్ళు కూర్చున్న సీట్లు గుర్తుపెట్టుకున్నాడు కనుక సరిపోయింది. లేకుంటే రాత్రంతా అక్కడే ఉండేదేమో"

పక్కింటాయనకి నమస్కారం పెట్టి కళ్ళతోనే కృతజ్ఞతలు తెలిపి యమునని బరబరా లోపలికి ఈడ్చుకెళ్ళింది సుందరి.

"ఇంకెప్పుడైనా చెప్పకుండా వెళతావా "వీపు మీద ఒక్కటిచ్చి, మూలకి తీసుకెళ్ళి కుదేసింది.

యమునకి సినిమా చూసిన ఆనందం అంతా ఆవిరైపోగా వెక్కుతూ, కాళ్ళు జాపుకుని అలాగే కూర్చుంది, మొండిగా అమ్మకేసి చూస్తూ. సుందరి లోపలికి వెళ్ళి మంచం మీద వాలిపోయింది తల పట్టుకుని. భగవంతుడా ఈ పిల్లని ఎలాగ పెంచడం.!?

ఎంతసేపటికో ఆనంద్ చేతిని తడుతుంటే లేచింది.

కావేరి లైబ్రరీ నుంచి తెచ్చుకున్న నవల చదువుతూ కూర్చుంది.

"అమ్మా! ఆకలేస్తోంది. అన్నం పెట్టవూ?" ఆనంద్ మొహం పీక్కుపోయింది. గోడ గడియారం తొమ్మిది కొట్టింది. సుందరికి కూడా నీరసం అనిపించింది.

కావేరి లేచి పెద్ద కంచంలో పప్పులుసు అన్నం కలిపి, నెయ్యేసి పట్టుకొచ్చింది. సుందరి లేచి మొహం చేతులూ కడుక్కుని, ముద్దలు చేసి పెట్టసాగింది.

"అమ్మా కూరేంలేదా? చిన్నక్క తినొద్దా?"

ఆనంద్ నిద్రకళ్ళతో అడుగుతుంటే గుర్తుకొచ్చింది.

వంటింట్లోంచి అరటికాయవేపుడు ముక్కలు తెచ్చి, గోడకానుకుని, నేలమీదే పడుకుని నిద్రపోతున్న యమునని లేపబోయింది. ఊహూ. తన వల్లకాలేదు. అక్కడే దుప్పటి కప్పి, తలకింద దిండు పెట్టి యమున జుట్టు సవరించింది ప్రేమగా.

"పెంకిపిల్లా ఎలా బ్రతుకుతావే ఎప్పటికొస్తుంది తీరు" అనుకుంటూ లేచింది. కంట్లోంచి రెండు చుక్కలు రాలాయి.

తండ్రి ఇంటిపట్టున ఉండి చూసుకుంటే ఎలా ఉండేదో?

"అమ్మా.. ఇంకా చిన్నపిల్లమ్మ అది. బెంగపెట్టుకోకు. దా నువ్వు కూడా అన్నం తిను. నీకోసమే కూర్చున్నా"

కావేరి తమ్ముడికి తినిపించి పడుకోబెట్టి వచ్చి చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళింది.

●●●

"యమునా ఈలెక్క సరిగ్గా చెయ్యి. ఆన్సర్ తప్పొచ్చింది చూడు. అసలు కుదురుగా కూర్చుని బుర్రకెక్కించుకోవేమే? తమ్ముడు చూడు. ఇలా చెపితే అలా అల్లుకుపోతాడు" కావేరి ఆనంద్‌నీ, యమునని కూర్చోపెట్టి చదివిస్తోంది.

యమున సెకండ్ ఫారం చదువుతోంది.

ఆనంద్ ఇంటూఫస్ట్‌ఫారం పరీక్ష రాసి అందులో చేరాడు. ఒక ఏడు కలిసొస్తుంది. ముందు ముందు ఎందుకైనా పనికొస్తుందని చేర్పేశాడు నరహరి.

"చదివి ఏం చెయ్యాలక్కా? నువ్వు చూడు. యస్సెస్సెల్సీ స్కూలు సెకండ్ వచ్చావు. నిన్ను కాలేజీలో చేర్పించారా? అలాగే నేనూ. పెళ్ళి చదువుకి ఇది చాల్లే."

ఆరిందాలా మాట్లాడుతున్న యమునని తీక్షణంగా చూసింది సుందరి.

అంతకంటే ఏమీ చెయ్యలేదు. యమున చెప్పింది నిజమే. కావేరి పధ్నాలుగేళ్ళకే స్కూలు ఫైనల్ పాసయినా ఇంట్లో కూర్చోపెట్టారు, సంబంధాలు చూద్దామని.

అప్పటి వరకూ కుటుంబంలో ఆడపిల్లలు కాలేజీకి వెళ్ళలేదు మరి. చుట్టుపక్కల అందరాడపిల్లలూ కాలేజీకి వెళుతుంటే కావేరీ లైబ్రెరీ పుస్తకాలతో, ఉషా కంపెనీవాళ్ళు పెట్టిన కుట్టు సెంటర్లో కుట్టు నేర్చుకుంటూ, అమ్మకి వంటలో, ఇంటిపనుల్లో సహాయం చేస్తూ కాలక్షేపం చేస్తోంది.

"నేను మాత్రం నీలాగా అంట్లు తోమనక్కా. టైపు షార్ట్ హేండు నేర్చుకుని ఏదో ఉద్యోగంలో చేరిపోతా. ఇంట్లో మాత్రం కూర్చోను." యమునకి పదకొండేళ్ళకే ఎక్కడ్లేని రోషమూ, అక్కని చదివించట్లేదని కోపమూ.

నరహరి అన్నన్ని ఊళ్ళు తిరిగినా, తండ్రి మాటకాదనలేడు.

గిరి బొటాబొటిగా థర్డ్ క్లాసులో బియ్యే పాసయి రాజమండ్రిలోనే కాలేజీలో ఆఫీసులో పనిచేసి, ఇరవై ఒక్కేళ్ళు నిండాక, నరహరి తన కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా వేయిస్తే అందులో చేరాడు.

పని బాగా చేస్తున్నాడని పేరు తెచ్చుకుంటున్నాడు.

విష్ణు ఇంజనీరింగ్ అయి, బొంబాయిలో ఒక కాంట్రాక్టర్ దగ్గర చేరాడు. అతనికీ పెళ్ళయింది. ముగ్గురమ్మాయిలు. ప్రతీ సంక్రాంతి పండక్కి అందరూ ధవళేశ్వరంలో కలుస్తుంటారు. బలరామయ్యగారికి అరవైఏళ్ళు నిండినా వీధి బడి నడుపుతూనే ఉన్నారు.

అమ్మాజీకి ఆలశ్యంగా కడుపు పండిందికానీ ఆ తరువాత ఐదుగురు పిల్లలు పుట్టారు. ఆఖరి కానుపులో గర్భ సంచి తీసెయ్యవలసి వచ్చింది.

నరహరి చిన్న చెల్లెలు శారదకి నలుగురు పిల్లలు.

అప్పుడప్పుడే ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ల ప్రచారంలోకి వస్తున్నాయి.

శారద భర్త వెళ్ళి ఆపరేషన్ చేయించుకుని వచ్చాడు.

నరహరి ఎవరికీ చెప్పకుండా బొంబాయి ఆఫీసు పనిమీద వెళ్ళినప్పుడు ఆనంద్ పుట్టిన వెంటనే ఆ పనిచేశాడు.

అరవైయ్యో దశకంలో అడుగుపెట్టబోతుండగా అందరికీ కొంత అవగాహన వచ్చింది. కుటుంబాన్ని ఎలా నియంత్రించుకోవాలో.

●●●

ఒక సంక్రాంతికి ధవళేశ్వరంలో అందరూ కలిసినప్పుడు.. ..

కావేరికి పదిహేడేళ్ళు వచ్చేశాయి.

బలరామయ్య తెచ్చిన సంబంధాలు ఏవీ నరహరికి నచ్చట్లేదు.

ఈ మాఘమాసంలో ఎలాగైనా పెళ్ళి చేసెయ్యాల్సిందే అని సుబ్బులు కూడా పట్టుపడుతోంది. యమున థర్డ్ ఫారం చదువుతోంది. పరీక్షలవగానే హైయర్ఫార్మ్స్..

కొత్తబిల్డింగ్‌లో పాఠాలు, చాలా ఉత్సాహంగా ఉంది.

ఆ రోజే భోగిపండుగ.

అప్పుడే భోగి మంటలు అయి, ఒక్కొక్కళ్ళే తలంటి స్నానాలు చేస్తున్నారు. సగం మండువా ఇల్లయినా, పెరటి వరండా చాలా పెద్దది. దానికి కటకటాలు పెట్టించి, ఒక చివర పెద్దగది కట్టించాడు విష్ణు. ఈ చివర్నుంచాచివరికి మండువాలో, కటకటాల్లో పక్కలు

వేసేస్తారు రాత్రి. పగలంతా పిల్లలు పెరట్లోనే ఆటలు, పాటలు. పెద్దడేగిసాడు నీళ్ళు సలసలామరుగుతుంటే ఒకళ్ళ తరువాత ఒకళ్ళు, మగపిల్లలు స్నానాలు అవుతున్నాయి.

బాత్రూం ఒక్కటే ఉంది కనుక ఆడపిల్లలది ఆలశ్యం అవుతోంది.

మంచు తెరలు అప్పుడప్పుడే కరుగుతున్నాయి.

యమున, కావేరి వీధిలో వేసిన ముగ్గులుకి రంగులు అద్దుతున్నారు.

బొంబాయి నుంచి విష్ణు కూతుళ్ళు, లీనా, సోనీ, రాజీ రకరకాల రంగులు తెస్తారు అక్కడ బాగా దొరుకుతాయని. కావేరి గొబ్బిళ్ళు కూడా పెట్టింది.

సంక్రాంతిలక్ష్మి నిండుగా ముస్తాబయి వాకిట్లోకి వచ్చినట్లుగా ఉంది.

గిరి నీళ్ళడేగిసా దగ్గర ఉన్నాడు. వేణ్ణీళ్ళు తీస్తుంటే చన్నీళ్ళతో నింపుతూ కింద మంట సరిచేస్తూ.

అంతలో వీధిలో సైకిలు గంట మోగింది.

నరహరి అప్పుడే స్నానం చేసి తలతుడుచుకుంటూ, వీధరుగు మీద నిలబడి ముగ్గులు చూస్తున్నాడు. ఎవరా అని కళ్ళు చికిలించాడు.

"టెలిగ్రాంసార్."

నరహరి గబగబా మెట్లుదిగి, సంతకం పెట్టి తీసుకుని చదివాడు.

"అమ్మా! తాతగారు ఇంకలేరమ్మా"

సుబ్బులు ఆదరాబాదరా అడుగులు వేస్తూ వచ్చింది.

ఎక్కడి వాళ్ళక్కడ పనులు ఆపేసి అందరూ మండువాలోకి చేరారు. ఏం చెయ్యాలి?

అందరూ వెళితే ర్యాలిలో ఉండడానికి చోటులేదు.

తర్జన భర్జనలు పడి చివరికి సుబ్బులు, నరహరి, గిరి వెళ్ళాలని నిశ్చయించారు.

బలరామయ్యకి అంతకు ముందే జ్వరం వచ్చి తగ్గింది. ప్రయాణించే స్థితిలో లేడు. బయలుదేరబోతుండగా గిరి అన్నాడు.

"అత్తయ్యా నేను రావట్లేదు. తాతగారికి ఇక్కడ్నుంచే దణ్ణం పెడతా"అంటూనే భోరుమని ఏడుస్తూ కింద కూలబడ్డాడు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే గిరిని అలా చూస్తుంటే అందరికీ దుఃఖం వచ్చింది. ఎవరికీ ఏమి చెయ్యాలో అర్థం అవలేదు.

"మావయ్యా! ఏడవకు. నేను కూడా వస్తా ర్యాలి. వెళ్దామా? మీ తాతగారిని మళ్ళీ చూడలేవు కదా?"

యమున వెళ్ళి గిరి భుజం పట్టుకుని అడిగింది అమాయకంగా.

యమునకి గిరి అంటే ప్రత్యేక అభిమానం.

అసలు అందరితో దెబ్బలాడ్డంతో పాటు ఆప్యాయంగా ఉండడం కూడా యమున స్వభావం.

తల అడ్డంగా ఊపాడు గిరి. "నిరుడు, నన్ను పెంచిన నాన్నమ్మ పోయినప్పుడే వెళ్ళలేదు. ఇప్పుడు అక్కడ నాకు ఎవరున్నారని వెళ్ళాలి? నాన్నకి నేను ఉన్నానో లేనో కూడా తెలీదు. నాకు అన్నీ మీరే అత్తయ్యా నన్ను రమ్మనద్దు."

"పసి మనసులో పడిన గాయం ఎప్పటికీ మానదేమో. వెయ్యేళ్ళ నాటి ర్యాలి ఋణం దీక్షితుల కుటుంబానికి తీరిపోయినట్లే. కేశవుడు ఉన్న జాడే ఎవరికీ తెలీదు" అనుకున్నాడు నరహరి.

●●●

నరహరి, సుబ్బులు మాత్రం వెళ్ళారు ర్యాలి.

సాలూరు నుంచి సుబ్బులు ఆఖరి చెల్లెలు రాధ, ఆవిడ కొడుకు శివానందం వచ్చారు.

శివానందానికి ఇరవై ఏళ్ళుంటాయి. కుర్రాడు మంచి వర్చస్సుతో బాగా ఉన్నాడు.

చిన్న దీక్షితులుని చూసినట్లే అనిపించింది సుబ్బులుకి.

కేశవుడు ఇంకొంచెం స్తబ్దుగా తయారయ్యాడు. సూరమ్మ కడవల్తో కన్నీరు కారుస్తోంది. మామగారు లేకపోతే కుటుంబానికి ఆ ఆధారం కూడా లేదు.

అమ్మన్నకి పదిహేనేళ్ళు నిండాయి. పెళ్ళిచెయ్యాలి. ఎవరు చూస్తారు ఇంకా ఇంటినీ, మనుషుల్నీ.

"తిన్నగా ఉంటే ఈపాటికి చేతికందొచ్చిన కొడుకుండేవాడు కదా. చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహదేవ" అనుకుంది సుబ్బులు.

"ఉన్నది ఈ కొంపొక్కటే. ఇది అమ్మేసి రావుల పాలెం వెళ్ళిపోతాం. అక్కడే ఏదో కలో గంజో తాగుతాం" సూరమ్మ ముక్కు చీదుతూ అంది, దీక్షితులుగారి పెద్దదినం నాడు.

"ఆ వచ్చిన డబ్బు హారతి కర్పూరంలా హరించేసుకోక బాంకులో వేసుకో. కొంత కాలక్షేపం అవుతుంది" సుబ్బులు సలహా ఇచ్చింది.

"ఏదో చేసుకుంటాంలెండి వదినగారూ. మమ్మల్ని పట్టించుకునే వాళ్ళెవరున్నారు కనుక. ఇదికూడా తల్లిలేని పిల్లయితే పట్నం తీసుకెళ్ళి ఏదో చేద్దురేమో ఎవరైనా. ఎటూ కాకుండా అయిపోయింది."

సూరమ్మ నిష్ఠూరాలకి సుబ్బులు నిర్ఘాంతపోయింది.

గెంటేసిన సవతి కొడుకుని సాకినందుకు ఇదన్న మాట బహుమానం.

ఇలాంటి వాళ్ళతో మాట్లాడితే అశుద్ధం మీద రాయేసినట్లే.

మారుమాట్లాడకుండా వెనక్కి వెళ్ళిపోయారు నరహరీ, సుబ్బులూ.

అమ్మన్నని చూస్తూనే కడుపు తరుక్కుపోయింది సుబ్బులుకి.

"పిన్నీ మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?" లాంచీలో అడిగాడు నరహరి, సుబ్బులు చెల్లెల్ని.

"ఏవుందిరా బాబూ స్మార్తం నేర్చుకున్నాడు. పౌరోహిత్యం చేస్తున్నాడు విశాఖపట్నంలో. ఈ ఏడు పెళ్ళిచేద్దామనుకుంటున్నాం. పెళ్ళైతే ఇంకా అన్ని శుభకార్యాలకీ వెళ్ళడానికి సులువవుతుంది. బాగనే సంపాదిస్తున్నాడు. సదానంద శాస్త్రిగారని, పెద్దపురోహితుడు. ఆయన దగ్గర శిష్యరికం. జాతకాలు చూడ్డం, ముహూర్తాలు పెట్టడం కూడా వచ్చేశాయి."

తల్లి మాటలకి శివానందం సిగ్గుపడుతూ తలపక్కకి తిప్పాడు.

నరహరికి ముచ్చటేసింది శివానందాన్ని చూస్తే. అప్పుడే అతనికి తట్టింది.

సుబ్బులు కేసి సాలోచనగా చూశాడు. సుబ్బులు తలూపింది.

"పిన్నీ! అమ్మన్నని చూశావుకదా చక్కగా ఉంది. మన శివానందానికి ఈడూ జోడూ. పెళ్ళి బాధ్యత నేనుతీసుకుని చేస్తాను. ఈ ఏడు కావేరి పెళ్ళి చేద్దామనుకుంటున్నాం. అప్పుడే చేద్దాం. కట్న కానుకలు, బైటవాళ్ళలా ఇస్తారో. అలాగే, నేనూ తమ్ముళ్ళూ కలిపిచేస్తాం. తాతగారి ఆత్మశాంతిస్తుంది, నువ్వు ఆదుకుంటే. అదీ పిల్లలకి ఇష్టమైతేనే."

శివానందం మొహం ఎరుపెక్కింది. చూడగానే తెలిసిపోయింది అతనికి ఇష్టమేనని. రాధ మాత్రం ఆలోచించింది.

"మరి మీ బాబాయిని కూడా?"

"ఒప్పుకుంటారు లేమ్మా! పురోహితుల ఇంట్లోంచి వచ్చిన పిల్లైతే మనకి అనుకూలం." చటుక్కున అని శివానందం నాలికి కొరుక్కున్నాడు.

అమ్మన్న కుందనపు బొమ్మలా ఉంటుంది. ఈడూ జోడూ బాగుంటుంది.

రాధకి తెలుసు, ఎవరికీ అభ్యంతరాలు ఉండవని.

అసలు వచ్చేముందే అనుకున్నారు సాలూరులో, సంబంధం కలుపుకుంటే బాగుంటుందని. కొంచెం బెట్టు చేసింది. మగపిల్లవాడి తల్లికదా.

"అయితే, తిరుగు లాంచీలో వెనక్కి వెళ్ళి మాట్లాడదాం. అత్తయ్య వాళ్ళ అన్నయ్యలు కూడా ఉన్నారు కదా! వాళ్ళందరికీ చెప్పి మాట అనేసుకుంటే, కావేరి పెళ్ళి కుదరగానే చేసేద్దాం, ధవళేశ్వరంలోనే."

●●●

బలరామయ్య చాలా ఆనందంగా ఉన్నాడు. పెద్ద మనవరాలికి పెళ్ళి కుదిరింది మరి.

శారద పెళ్ళి తరువాత ఇంట్లో చేసే ఆడపిల్లల పెళ్ళి.

నరహరి మనస్ఫూర్తిగ ఒప్పుకున్న సంబంధం. కట్నకానుకలు కొద్దిగా ఎక్కువే.

అయితేనేం పిల్లాడు బి.ఏ పాసయి బొంబాయిలో ఉద్యోగం. అంతేకాదు. అమలాపురం దగ్గర, ఇందుపల్లిలో పొలాలు కూడా ఉన్నాయి.

యమునకి మాత్రం పెళ్ళికొడుకు వ్యవహారం నచ్చలేదు.

"మొహం ఎప్పుడూ పుట్టి మునిగిపోయినట్లు పెడుతున్నాడక్కా. నువ్వు సరిగ్గా చూశావా? అసలు ఏదో లోకంలో ఉన్నట్లున్నాడు. ఇంకోసారి చూసి"

"అమ్మో ఇంకోసారా? నాన్నగారికి తెలియదా మనకేం కావాలో"

"నాన్నగారా, నువ్వా అతనితో ఉండాల్సింది? అసలు ఎంత బాగా చదువుతావు. పాఠాలు కూడా బాగా చెపుతావు మా లీలా టీచరులాగా. ఎంచక్కా టీచరు చదువక్కా. మాస్కూల్లోనే పనిచెయ్యచ్చు."

" మన ఇంట్లో ఆడపిల్లలకి చదువులు చెప్పించరు కదే. అందుకే నేను ఏం ఆశలు పెట్టుకోలేదు"

"ప్చ్ నేను మగపిల్లాడిలా ఎందుకు పుట్టలేదో. ఇప్పుడు చూడు పెళ్ళయితే ఎక్కడికో వెళ్ళి ముక్కూ మొహం తెలియని వాళ్ళ దగ్గర బతకాలి. దేముడికి పక్షపాతం."

కావేరి నవ్వుకుంది చెల్లెలి అమాయకత్వానికి.

●●●

సూరమ్మ మొదట అత్తారింటి సంబంధం చెయ్యడానికి ఒప్పుకోకపోయినా, అన్నదమ్ములు నచ్చచెప్పారు.

"నాకు కంచి పట్టుచీర కొంటేనే ఈ పెళ్ళి జరుగుతుంది" సూరమ్మ అంటుంటే, అమాయకత్వమో, గడుసుదనమో తెలియలేదు నరహరికి.

"పెళ్ళే ఎవరో పుణ్యానికి చేస్తుంటే, ఏదో ఉద్ధరిస్తున్నట్లు" సుబ్బులు పళ్ళునూరింది.

విష్ణు ఏమయినా ఆదుకుంటాడేమో కానీ గోపాలం మీద ఏమీ ఆశలేదు. భారం అంతా నరహరిదే

"నేను కొంటాలే అత్తా!" శివానందం మాట ఇచ్చాడు.

రాధ అదోలా చూస్తున్నా పట్టించుకోలేదు. సుబ్బులు, నరహరి మెచ్చుకుంటున్నట్లు చూశారు.

కావేరీ, అమ్మన్నల పెళ్ళి జరుగుతున్నంత సేపూ సూరమ్మ గొణుగుతూనే ఉంది. సుందరికున్న నగలు, చీరలు తనకి లేవని.

"మగపెళ్ళి వారికంటే దీన్ని సాగదియ్యడమే ఎక్కువైపోయింది. ఎలా అయితేనేం కార్యాలు గట్టెక్కాయి." సుబ్బులు రాజమండ్రి నుంచి పెళ్ళికొచ్చిన కాముడితో అంది.

ప్రకాశం, సరోజిని, వాళ్ళ పాపకూడా వచ్చారు.

నరహరి కంపెనీలో ప్రకాశానికి ఉద్యోగం ఇప్పించి సరోజినికి నచ్చచెప్పి, రాజమండ్రి తీసుకొచ్చాడు. పుట్టింటినుంచి రావలసిన ఆస్థి తెచ్చుకోమని ఇల్లు ఆధునికంగా బాగుచేయించి కొంత డబ్బు బాంకులో వేయించాడు. ప్రకాశం తండ్రి సంతోషంతో కోలుకుని ఇంట్లో నడవగలుగుతున్నాడు.

●●●

**యమున యస్సెస్సల్సీ పరీక్షలు రాశాక పెద్ద దుమారం లేపింది ఇంట్లో.**

"ఏమయినా సరే నేను కాలేజీలో చేరి తీరుతాను."

బలరామయ్య పోయి ఏడాది అయింది.

ధవళేశ్వరంలో ఇల్లు అమ్మేసి అన్నదమ్ములు పంచేసుకున్నారు.

సుబ్బులు నరహరి ఇంటికి వచ్చేసింది.

"ఇప్పుడు అందరూ చదువుతున్నారు. తప్పేవుంది." సుబ్బులు వంతపాడుతుంటే సుందరి ఆశ్చర్యంగా చూసింది.

"ముందా సినిమాలు చూడ్డం తగ్గిస్తే ఎన్ని చదువులైనా చదవచ్చు."

యమున వచ్చిన సినిమా అల్లా చూడవలసిందే

సుందరికి ఎలాగైనా యమునకి పెళ్ళి చేసెయ్యాలని ఉంది.

నరహరి పనిచేసే మందుల కంపెనీ పరిస్థితి బాగాలేదు.

ఎప్పుడు మానెయ్యమంటారో అని బితుకు బితుకుమంటూ ఉన్నారు.

గిరిలాంటి కొత్త రిప్రజెంటేటివ్‌లని అప్పటికే యాభైమందికి పైగా తీసేశారు.

రాజమండ్రిలో ఒక బట్టల కొట్లో పనిచేస్తున్నాడు, రోజుకింతని ఇస్తారు.

"ముందు పరీక్ష సంగతి తెలియనీ ఆ తర్వాత చూసుకోవచ్చు." సన్నగా అంది కావేరి.

కావేరికి ఇద్దరు మగపిల్లలు పుట్టారు. బొంబాయి కాపురం.

మగమహారాజు ఇంటి సంగతులు పట్టించుకోడానికి తీరికుండదు.

ఉన్న కొంచెం సేపు పెళ్లామ్మీద పెత్తనం చలాయించడానికే సరిపోతుంది. ఎప్పుడైనా విష్ణు ఇంటికి వెళ్లినప్పుడే కాస్త ఊరట.

ఇంట్లో ఉండేదానివేకదా.

ఆ మాత్రం పనిచేసుకోలేవా అంటూ పనిమనిషిని పెట్టనియ్యలేదు శ్రీవారు.

తనకి మాత్రం ఒక్క నిముషం కూడా తేడా రాకుండా నడిచిపోవాలి పనులన్నీ.

మనుషులకి ఇంత కోపాలుంటాయని పెళ్లయ్యాకే తెలిసింది కావేరికి.

పిల్లలతో చాకిరీతో ఎప్పుడూ నిరుత్సాహంగా ఉంటుంది. నవ్వుతూ తుళ్లుతూ, ఆనందమంటే ఇదే అనేలా, పచ్చని చెట్టులా కళకళ్లాడుతూ ఉండే కావేరి, నీరు సూర్యరశ్మి లేక క్షీణించిపోయినట్లుంది.

అక్క కళ్లలో అది వరకటి ఉత్సాహం కరువైనట్లు అనిపించింది యమునకి. రహస్యంగా అడిగింది.

"సంతోషంగా ఉన్నావా? మీ అత్తగారూ వాళ్లూ నీతో బాగా ఉంటారా?"

"ఏమోనే ఆ సంగతి ఆలోచించడానిక్కూడా వీలవదు. అలా రోజులు గడిచిపోతున్నాయంతే."

మూడో పురిటికి కావేరి అత్తగారింటికి వెళ్తూ గుంటూరులో ఆగింది.

"ఇంక పిల్లలు చాలక్కా! ఈసారి ఆపరేషన్ చేయించుకో."

యమునని ఆశ్చర్యంగా చూసింది. పెళ్లికాకుండా ఇలాంటి మాటలు. ఎలా అయినా యమున సంగతే వేరు అనుకుంది కావేరి.

"ఇందుపల్లిలో ఎలా కుదురుతుంది?"

"ఎలా అయిపోతున్నావో చూడు. ఇక్కడే ఉండచ్చు కదా! ఒంట్లో బాలేదని చెప్పు. కదలడానికి లేదంటే చచ్చినట్లు ఒప్పుకుంటారు.

ఇక్కడ డాక్టర్లంతా నాన్నగారికి తెలిసిన వాళ్లే. నువ్వు కొంచెం గట్టిగా ఉండాలక్కా!" చివరికి అదే అయింది.

ఏడోనెల నుంచీ బెడ్‌రెస్ట్ అంటే పిల్లలకీ తల్లికీ చాకిరి చెయ్యలేననేసింది అత్తగారు. గుంటూరు గవర్నమెంట్ ఆస్పత్రిలో సిజేరియన్ చెయ్యాల్సివచ్చింది.

అప్పుడే పిల్లలు పుట్టకుండా చేసేశారు.

"నీ సంగతేమో కానీ నాకిప్పుడు చాలా సంతోషంగా ఉందక్కా. ఇప్పటికైనా నీక్కావలిసిందేమిటో తెలుసుకుని సాధించుకో."

పాపాయిని వళ్లోపెట్టుకుని అంది మెరిసే కళ్లతో యమున. కావేరినీ, పాపాయినీ ఇంటికి తీసుకొచ్చారు. ఆ వేళ పదకొండో రోజు. పసుపురాసుకుని పురిటి స్నానం అయి కావేరి పచ్చగా మెరిసిపోతోంది. కళ్లు మాత్రం తెల్లగా ఉన్నాయి.

ఏమీ తెలియని వాళ్లకి కూడా రక్తం తక్కువగా ఉందని తెలిసిపోతోంది.

పథ్యం తిన్నాక నిద్రపోకుండా కబుర్లు చెప్పమని యమునకి పురమాయించింది సుబ్బులు. మగపిల్లలు నాని, పండులని పెరట్లో ఆనంద్ ఆడిస్తున్నాడు.

నానికి మూడేళ్లు నిండాయి. పండుకి ఏణ్ణర్థం.

వరుస కానుపులు కూడా కావేరిని నిస్తేజం చేసేశాయి.

"నేనా! ఇప్పుడు ఈ పిల్లల్ని సరిగ్గా సాకుతే చాలు. ఏదో సాధించినంత ఫలం."

"అలా నైరాశ్యం వద్దక్కా. ముందు నీ ఆరోగ్యం చూసుకో. వంటవగానే నీ ఆకలి తీర్చుకో. అప్పుడే బలంగా పిల్లలకి పెట్టగలుగుతావు. ఆఖర్నే తినాలీ అని రూలేమైనా ఉందా! బావ ఇంటిసరుకుల గురించి పట్టించుకుంటారా?"

"అదేం లేదు. తనక్కావల్సిన సమయానికి అమరుతే చాలు.

ఏడాదికి సరిపడా సరుకులన్నీ ఇందుపల్లి నుంచి తెచ్చిపడేస్తారు. పాలు, కూరలు, నూనెలాంటివే. కాకపోతే కోపం మాత్రం దూర్వాసుడ్నీ, విశ్వామిత్రుడ్నీ మించిపోయింది. నేను ఇది వరకట్లా చురుకుగా ఉండలేకపోతున్నా. అందులో మనకి అప్పతో అస్సలు అలవాటులేదేమో. "నాలిక్కరుచుకుంది కావేరి. ఇదేంటి ఇలా ఇంటిగుట్టు. కన్నీళ్ళు జలజలా రాలాయి.

చల్లని గాలి తగిలి మేఘంలా బైటపడింది కన్నీటి వర్షం.

"తలనొప్పి వస్తుంది. ఊరుకో అక్కా! ఎవరిదో సమస్య అన్నట్లు మాట్లాడు. అప్పుడు నీకు బాధగా ఉండదు. నువ్వంటే ప్రేమగా ఉంటారు కదా బావ. డబ్బుకేం ఇబ్బందిలేదు. ఇంకేం. నువ్వు చాలా మంది కంటే అదృష్టవంతురాలివే. ఏదో ఉపాయం ఆలోచిద్దాం. పిల్లలు బడికెళ్లే వరకూ తంటాలు పడితే చాలు. నాన్నమ్మ వస్తుందేమో అడుగునీతో. కొంచెం సాయంగా ఉంటుంది."

అక్క హావభావాలు పరికిస్తూ చెప్పసాగింది యమున.

"కానీ. మీ బావ ఒప్పుకుంటారో లేదో"

"అప్పచేత, మీ అత్తగారితో చెప్పిద్దాం. ఇంకొకళ్లు ఉంటే ఆయన కోపం కూడా తగ్గచ్చు. ఏం చెప్పగలం. ఇంకాసిని తమలపాకులకి సున్నం రాసిస్తాను. మళ్లీ తాంబూలం వేసుకో అక్కా. కాల్షియమ్, ఐరన్ బాగా కావాలి ఇప్పుడు. అందుకే మనవాళ్లు ఇవన్నీ తినిపిస్తారు."

"ఇవన్నీ ఎలా తెలుసే నీకూ. ఇంత ఆరిందావెప్పుడయ్యావూ? చీటికి మాటికీ అమ్మతో దెబ్బలు తినే యమునవేనా నువ్వు నమ్మలేకపోతున్నా!" సంభ్రమంగా చూస్తూ అంది కావేరి.

"ఎప్పటికీ ఒక్కలాగే ఉండిపోతారాక్కా! ఇది మాత్రం రేపు పెరిగి పెద్దదవదూ?" ఒళ్లో ఉన్న పాపాయిని చూపించింది యమున.

●●●

యమున అనుకున్నట్లుగానే పి.యు.సిలో చేరింది. ఉమన్స్ కాలేజీలో. నరహరి కంపెనీ మూసేశారు. అన్ని సంవత్సరాలు కలిసి పని చేసినవారందరూ తలో మూలకి వెళ్లిపోయారు. గుంటూరులోనే ఒక పొగాకు కంపెనీలో చేరాడు. జీతం సగానికి సగం.

"తప్పదు. సంసారాన్ని నడపాలికదా" ఎవరితోనో అంటుండగా వింది యమున. ఖర్చులన్నీ తగ్గించుకోడానికి బడ్జట్లు మొదలయ్యాయి. అందులో సుబ్బులు దిట్ట. కానీ తను కావేరితో బొంబాయి వెళ్లింది. ఆ పనంతా యమున మీద పడింది.

"నాకు తెచ్చిన పడేసింది వండడమే కానీ ఇంకేం తెలీదు. సరిగ్గా లెక్కలు కూడా రావు. మీ అప్ప కొత్త ఉద్యోగంలో కాంపులు ఎక్కువయ్యాయి. నువ్వే చూసుకోవాలే"

సుందరి ఒకరోజు యమునని కూర్చోపెట్టి బోధించింది.

దొంగాడికి తాళం ఇచ్చి జాగ్రత్త పెట్టమన్నట్లు అయింది.

యమునకి నెలకో సినిమా చూడ్డానికి కూడా కుదరట్లేదు.

బొటాబొటీగా సరిపోతున్నాయి. మధ్యలో అత్తలొచ్చారు. కావేరి కూతురి పుట్టినరోజు వచ్చింది.

కొద్దిమందిని పిలిచి చేసినా రెండొందలు పైనే అయింది.

ఏది తక్కువ చేసినా ఇప్పుడు అందరూ యమునమీద పడేవాళ్లే. పిచ్చెక్కిపోతోంది. కాలేజీలో ఉన్నా కాసేపూ హాయిగా ఉంటుంది. తొమ్మిదింటికి భోజనం చేసి, నడక మొదలు పెడితే నలభై నిముషాలు పడుతుంది.

మధ్యలో శంకర విలాస్ జంక్షన్‌లో హేమ, రాజ్యం కలుస్తారు. కబుర్లు చెప్పుకుంటూ ఓవర్ బ్రిడ్జి మీద నుంచి, లక్ష్మీ పిక్చర్ పాలస్‌లో ఉన్న సినిమా పోస్టర్లు చూసుకుంటూ నడుస్తుంటే అలసటే తెలీదు. కాలేజీ చదువు అనుకున్నంత సులభంగా లేదు. ఇంగ్లీష్ మీడియం చూస్తుండగా, లెక్చరర్లు చెప్పే ఇంగ్లీషు మాటలు అర్ధం అయేలోగా పదినెల్లూ గడిచిపోయాయి. మార్చ్ నెలవచ్చింది. పరీక్షలు. ఆనంద్‌కి యస్సెస్సల్సీ, యమునకి పియ్యూసీ. అదే సమయంలో సుందరికి అంక పొంకాల మీద జ్వరం. చిన్నమ్మవారు (చికెన్‌ఫాక్స్) వచ్చింది. నరహరికాంపు. బీహార్ వెళ్లాడు. ఎప్పటికొస్తాడో తెలీదు.

యమునకి కాళ్లూ చేతులూ ఆడట్లేదు. ఆనంద్ దీక్షగా చదువుకుంటున్నాడు. రాత్రిళ్లు లక్ష్మీపురంలో ఉన్న ఫ్రెండింటికి వెళ్లిపోతున్నాడు.

పొద్దున్నే లేచి, అమ్మ పడుకున్న గదిలోకి వెళ్లింది యమున.

"దగ్గరగా రాకే. ఇది అంటువ్యాధి"

ఎర్రటి మొహం నిండా పొక్కులతో నీరసంగా అంది సుందరి.

"ఎలాగమ్మా ఏం చెయ్యనూ?" ఏడుపు మొహంతో అంది యమున.

"బాల్చీతో నీళ్లు తెచ్చి తూము దగ్గరపెట్టు. ఎలాగో లేచి మొహం కడుక్కుంటా. కాసిని పాలు కాచి ఇయ్యి. పెరట్లోంచి వేపమండలు కోసుకొచ్చి, గదిగుమ్మానికట్టి కొన్ని ఇలా మంచం మీదకి విసిరెయ్యి."

అమ్మ చెప్పినపనులన్నీ చేసి, పెరటరుగు మీద కూర్చుని భోరున ఏడవసాగింది యమున.

పదహారేళ్లు నిండాయి. అప్పటివరకూ పొయ్యి దగ్గరకి వెళ్లింది లేదు. కుంపటి అంటించడం కూడా సరిగ్గారాదు. ఎలాగో పక్కింటి అత్తయ్యగారి నడిగి, కాసిని నిప్పులు తెచ్చి కుంపటి వెలిగించి పాలు కాచింది. ఇంకముందేం చెయ్యాలి? సుందరి పాలుతాగి, మూసిన కన్ను తెరవకుండా మూలుగుతోంది.

"ఒళ్లంతా మంటలు" అంటూ.

"చిన్నక్కా ఏమయిందీ?" ఎప్పుడొచ్చాడో, ఆనంద్ గాభరాగా అడుగుతున్నాడు. వెక్కుతూనే అంతా చెప్పింది యమున.

"ఓస్. దీనికేనా? ముందు ఏడుపుమాను. నువ్వు పోట్లాడితేనే నాకు బాగుంటుంది. ఏడుపు నీకు సరిపడదు. కాఫీ కలుపుకుని తాగి ఆలోచిద్దాం ఏం చెయ్యాలో."

ఆనంద్ చకచకా ఫిల్టర్లో డికాషన్ వేశాడు. పాలగిన్నె మళ్లీ కుంపటి మీద పెట్టి, పళ్లు తోముకుని, స్నానం చేశాడు.

అంతలో యమున కూడా తేరుకుని మొహం తోముకుని, రేగిపోయి, పిచికలు పీకిన తాట్టెంకలా అయిన జుట్టుకి కొబ్బరి నూనె రాసి దువ్వి ఒక కొలిక్కి తెచ్చింది.

"కాఫీ నువ్వు కలుపుతావా? నేను బియ్యం కడిగి అత్తెసరు పడేస్తాను."

ఇత్తడి గిన్నెలో సోలన్నర బియ్యం కొలుస్తూ అడిగాడు ఆనంద్.

తలూపి కాఫీ కలిపింది. కుంపట్లోబొగ్గులు సర్ది, అన్నం గిన్నె పెట్టి, ఇత్తడి సిబ్బి మూతపెట్టాడు ఆనంద్.

"ఇవన్నీ ఎప్పుడు నేర్చుకున్నావురా?" ఆశ్చర్యంగా అడిగింది యమున గ్లాసులో కాఫీ ఊదుకుంటూ.

"కాఫీ బాగుందక్కా! అనుకుంటాం కానీ అవసరం వస్తే అన్నీ వాటంతటవే వస్తాయి. నువ్వు ఎప్పుడూ సినిమాలూ, ప్రాణ స్నేహితులూ, చింతపిక్కలాటలూ అంటూ తిరుగుతుంటావు. మరి అమ్మ బైటున్నప్పుడు అన్నం ఎలా వస్తుందనుకున్నావ్?"

"పక్కింటి అత్తయ్యగారూ"

"భలేదానివే. అస్తమానూ వండిపెట్టటానికి ఆవిడేమన్నా మన చుట్టమా! నేనే వండుతుంటాను. అమ్మ ఎప్పుడో నాకు నేర్పించింది. వేపడాలు, పప్పుచారూ, ఉప్మాలాంటివి చెయ్యడం, నిన్ను తిడ్తూనే అనుకో" చిరునవ్వు నవ్వాడు ఆనంద్. యమున సిగ్గుతో మొహం దించుకుంది.

తనకంటే రెండేళ్లపైన చిన్నవాడు తమ్ముడు.

చదువులోనే చురుకనుకుంటే అమ్మకి సహాయం కూడా చేస్తున్నాడు.

ఇంటిపనులన్నీ ఆడవాళ్ళకే రాసిచ్చారా.

మగవాళ్లు మంచి నీళ్లు కూడా ముంచుకు తాగరేం అంటూ వాదించే యమునకి ఏం మాట్లాడాలో తెలియలేదు మరి. ఆనంద్‌తో సమంగా అన్నింట్లోనూ ఉండాలికదా! ఆత్మ విమర్శ మొదలయింది. అన్యాయాన్ని ఎదుర్కొనేటప్పుడు ముందు న్యాయం సరిగ్గా ఉందో లేదో చూడద్దూ?

ఇకనుంచీ అమ్మకి చేతికింద సహాయంగా ఉండాలి అని గట్టిగా నిర్ణయం చేసుకుంది.

"చిన్నక్కా! పనిమనిషి వచ్చినట్లు లేదు. గిన్నెలన్నీ తూము దగ్గర అట్లాగే ఉన్నాయి. నువ్వు తోమేస్తావా? లేదా నన్ను"

"వద్దులేరా! నేను తోమి, ఇల్లు ఊడిచేస్తా. నువ్వు అన్నం తిని స్కూలుకి వెళ్లు. హాల్ టిక్కెట్ తెచ్చుకోవాలికదా! నీ పరీక్షల సంగతి చూసుకో.

ఎలాగా నేను పాసవుతానన్న నమ్మకం లేదు. నేను ఇంట్లో ఉంటాలే."

# 8

"అప్పుడే నాకు పెళ్లా? నే చేసుకోను." రోషంగా ముక్కుపుటాలు ఎగరేస్తూ విసురుగా తలెగరేసి అంది యమున.

పి.యు.సీ తప్పగానే అమ్మకి సాయం చెయ్యాలని యమున చేసుకున్న నిర్ణయాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. ఎలాగో డబ్బులు మిగుల్చుకుని బెంచీ టికెట్టయినా కొనేసుకుని ఎవరూ తోడులేకపోతే ఒక్కతే సినిమాలు చూసేస్తోంది. సినిమా పాటల పుస్తకాలు కొని అవి సాధన చెయ్యడం. సాయింత్రాలు వేణుగోపాల స్వామి గుడికి వెళ్లి, అక్కడ బెంచీలమీద కూర్చుని స్నేహితులతో కబుర్లు చెప్పుకోడంతో కాలం గడిచిపోతోంది. హాయిగా ఏ బాదరబందీ లేకుండా. ఇంటి లెక్కలు అవీ చూడ్డం, బజారు పనులు చెయ్యడం మాత్రం తప్పట్లేదు. ఆనంద్ పి.యు.సీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయి మెడికల్ కాలేజీలో చేరాడు.

ఆనంద్ ఒడుగు సందర్భంగా అందరూ గుంటూరులో సమావేశమయ్యారు. పిల్లలందరూ మాటనీ సినిమాకి వెళ్లారు.

పెద్దలంతా భోజనాలయ్యాక తీరుబడిగా హాల్లో కూర్చున్నారు, తాంబూలాలు నవుల్తూ. అప్పుడే వచ్చింది యమునకి పెళ్లి చెయ్యాలీ అనే ప్రస్తావన.

"అసలు ఈ ఒడుగులోనే చెయ్యాల్సింది. సంబంధం కుదరక కానీ. పదిహేడేళ్లు నిండాయి. ఇంకెప్పుడు చేసుకుంటావూ? పోనీ ఇంకేదైనా వ్యాపకం ఉందా. ఉంటే చెప్పు. ఆగుతాము" సుందరి గట్టిగానే అడిగింది. హాల్లో అందర్నీ చూస్తూ గోళ్లుకొరుకుతూ కూర్చుంది యమున. ఎలాగో ఆ పరీక్ష పాసయితే కాలేజీలో చేరిపొయ్యేది. మూడేళ్లు హాయిగా నడిచిపొయ్యేవి. తన చేతకాని తనాన్ని తిట్టుకుంటూ గొణుక్కుంటోంది. పెళ్లయితే ఈ స్వేచ్ఛ పోదూ. నరహరి భారంగా చూశాడు యమునకేసి. పెళ్లి చెయ్యడానికి కూడా డబ్బులేదు. ఇల్లు అమ్మడం ఒక్కటే దారి. పొగాకు కంపెనీలో గీచి గీచి ఇచ్చే జీతం.

నెలగడవడానికి కూడా సరిపోవడంలేదు. పెరిగిపోతున్న ధరలతో. ఆనంద్ చదువు ఆరేళ్లు. ఆ పైనకూడా ఏ స్పెషాలిటీయో చేస్తే కానీ లాభం లేదు. కావేరికి తండ్రిని చూస్తుంటే కడుపులోంచీ బాధ తన్నుకొచ్చింది. జీవనయానంలో తలకి మించిన భారాన్ని మోసిన అలసట అంతా నరహరి మొహం మీద ముడతల్లో తెలుస్తోంది.

మందుల కంపెనీలో బాగా డబ్బు వచ్చినన్నాళ్లూ తమ్ముళ్ల చదువులు, చెల్లెళ్ల పెళ్లిళ్లు, పురుళ్లు అంతా సరిపోయేది. ఆనంద్ జీవితం, పుస్తకాలు ఖర్చులు విష్ణు చూస్తున్నాడు. కొంతలో కొంత నయం.

గోపాల్రావుకి ఏ బాధ్యతా పట్టదు. తనూ, తన సంసారం. అంతే. ఆడపిల్ల పెళ్లంటే కనీసం  పదిహేనువేలయినా కావాలి.

"సంబంధాలేమయినా చూశారా ముందు?" సుబ్బులు ఆరా తీసింది

"బొంబాయిలో మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. మూర్తి అని మనవాళ్ల అబ్బాయే. బియస్సీ పాసయ్యాడు. కుర్రాడు బాగుంటాడు కానీ కట్నం పదివేలు వరకూ ఇవ్వాల్సొస్తుంది" విష్ణు అన్నాడు అన్నగారిని చూస్తూ.

నరహరి ఏమీ మాట్లాడలేదు. కట్నమే అంతుంటే ఇంక పెళ్లి ఖర్చులు. ఎక్కడ్నుంచీ తేవాలీ, తన ఉద్యోగానికి పెన్షన్ కూడా ఉండదు. రిటైరయ్యాక బతకడం ఎలాగా? మొదట్నుంచీ ఖర్చులు నియంత్రించుకోవాల్సింది. ఇప్పుడనుకునేం లాభం?

"కట్నం తీసుకునేవాడ్ని నే పెళ్లిచేసుకోను."

ఆధునిక సాహిత్యం వంట బట్టించుకున్న యమున ఇంకో తూటా వదిలింది.

"ఆ విషయాలన్నీ నీ కెందుకే? పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలూ. ఊరుకుంటుంటే మరీ ఎక్కువైపోతుంది" సుందరి విసుక్కుంది ఒక పక్క మనసులో యమున ధైర్యాన్ని మెచ్చుకుంటూనే. "కట్నం లేకుండా ఎవరు చేసుకుంటారూ. అవన్నీ పుస్తకాల్లో వల్లించేవే. "

"ఏమైనా సరే. విష్ణు బాబాయ్ బొంబాయిలో నాకు ఏదైనా ఉద్యోగం చూడు. యస్సెస్సల్సీతో గుమాస్తా కానీ అటెండర్ ఉద్యోగం కానీ రాదూ? కట్నం అక్కర్లేని వాడు వచ్చినప్పుడు చూద్దాం. అప్పు ఎక్కడ్నుంచి తెస్తారూ అంత డబ్బు? ఇల్లు అమ్మడానికి వీల్లేదు." యమున విసురుగా లేచి అక్కడ్నుంచి వెళ్లబోయింది. తనకి తెలియని ఆర్థికస్థితి కాదు కదా! అసలు ఈ కట్నం అనేది ఎవరు కనిపెట్టారో కానీ కసిగా పళ్లు కొరికింది.

అందరూ ఒక్కసారి మాట్లాడ్డం మొదలు పెట్టారు. ఆడపిల్ల ఉద్యోగం చెయ్యడమా. అసలు తన పెళ్లి గురించిన నదురూ బెదురూ లేకుండా ఇలా మాట్లాడెయ్యడమే.

"బావా! మీ కభ్యంతరం లేకపోతే నేను చేసుకుంటా యమునని. నాకు ఆస్థి, మంచి ఉద్యోగం లేదు కానీ యమునని బాగా చూసుకుంటా. విష్ణు బావని యమునకి కాదు. నాకే ఉద్యోగం చూడమను."

అప్పటివరకూ నిశ్శబ్దంగా పరికిస్తున్న గిరి ఆగి ఆగి అందరికీ వినిపించేలా అన్నాడు. ఒక్కసారిగా హాలు నిశ్శబ్దమైపోయింది.

"తొందరేం లేదు బావా. అందరూ ఆలోచించుకుని నిదానంగా చెప్పండి." గదిలోకి వెళ్లబోతున్న యమున వెనక్కి తిరక్కుండానే ఆగి, గిరిమాటలు వింది. తలతిప్పబోయి, విరమించుకుని గదిలోకి వెళ్లి మంచం మీద వాలిపోయింది. గిరి చెప్పులేసుకుని బైటకి వెళ్లిపోయాడు.

●●●

**అందరిలోకి ముందుగా తేరుకున్నది సుబ్బులు.** ఎక్కువ రోజులు తన దగ్గర ఉంచుకుని, ఫీజులకీ, బట్టలకీ, ఆఖరికి తిండికి కూడా నరహరి డబ్బు పంపితే, గిరి చేత పనిచేయించుకుంటూ వెంటే తిప్పుకున్న గోపాల్రావు అక్కడ్నుంచీ లేచివెళ్ళిపోయాడు పెరట్లోకి. వెనుకే అతని భార్య.

విష్ణు సాలోచనగా చూశాడు.

"నిజమేన్రా! ఏదో వచ్చినంత చదువు చెప్పించి వాడి పొట్ట వాడు పోసుకుంటున్నాడనుకున్నాం కానీ వాడికి ఇరవయ్యారేళ్లు నిండుతున్నాయనీ, పెళ్లి చెయ్యాలనీ మనెవరికీ తట్టలేదు. వాడంతట వాడే చెప్పుకోవలసి వచ్చింది. అదే వాళ్ళమ్మున్నా, నాన్న సయోధ్యుడైనా ఇలా ఉండేదా?" సుబ్బులు బాధగా అంది.

నరహరి తప్పు చేసినవాడిలా తలొంచుకున్నాడు.

"నువ్వెందుకన్నయ్యా తలొంచుకుంటావు? తిండి పెట్టకుండా వాళ్లింట్లో వెళ్లగొడితే ఇంతవాడ్ని చేశావు. ఏదో మన దృష్టిలో పడలేదు నిజమే. అంతమాత్రాన మనం నేరం చేసినట్లు కాదు. ఇప్పుడు వీడికి మాత్రం కట్నం లేకుండా చేసుకుంటారా?

సూరమ్మత్తయ్య అమ్మాయినిస్తాం అని చెప్పడానికి వెళితే చెట్టెక్కి కూర్చోదని గ్యారంటీ ఏమిటి? అయినా యమున ఏమంటుందో" విష్ణు అన్నగారిని సముదాయించాడు. అతను నరహరికి ఏమాత్రం బాధ కలిగినా సహించలేడు.

విష్ణు భార్య లలిత కూడా అవునన్నట్లు చూసింది. లలిత చాలా నెమ్మదస్తురాలు. డిగ్రీ పాసయింది.

తెలివిగా ఆలోచిస్తూ అందరి సమస్యల్నీ అర్థం చేసుకుంటూ సలహాలిస్తుంటుంది. యమునకి ఆవిడంటే చాలా గురి.

"అదీ నిజమేననుకో. మనం గిరికంటే మంచి సంబంధం తేగలమా అని. పిల్లాడు బుద్ధిమంతుడు. మనం అంటే ఇష్టం.

యమునని ప్రాణంలా చూసుకుంటాననడంలో ధోకా లేదు. మిగిలిన విషయాలు. వాడి ఉద్యోగం, సూరమ్మ సంగతీ చూడాలి" సుబ్బులు నరహరిని చూస్తూ అంది.

"ఏదో వేరే వాళ్ళకి ఇద్దామనుకున్నది వాళ్ళకే ఇస్తే సరీ"

నరహరి ఎలాగో గొంతుపెగల్చుకుని అన్నాడు. అతనికి ఏం చెయ్యాలో బోధపడటం లేదు. మందుల కంపెనీ ఉద్యోగం పోగానే మాంద్యంలోకి వెళ్ళిపోయాడతను. కావేరి పెళ్ళప్పటి హుషారు, ఉత్సాహం మచ్చుకైనా కనిపించడంలేదు.

"ముందు యమునని కనుక్కోండత్తయ్యా. కట్నం ఎలా అడుగుతారో నేనూ చూస్తాను. అసలు వాళ్ళెవర్నీ పెళ్ళికి పిలవనక్కర్లేదు. చెప్పే పనికూడా లేదు."

అప్పుడే ఇంట్లోకి వచ్చిన గిరి అన్నాడు.

"అదెలా బావుంటుందీ. పీటల మీద మీ నాన్న కూర్చోవాలి కదా స్నాతకానికి."

"అదంతా తరువాత. నేను రావులపాలెం వెళ్ళి తేల్చుకునొస్తా. ముందు యమున."

"లలితా నువ్వు కనుక్కుంటావా? కుదిరితే అందరూ ఇక్కడే ఉన్నారు కదా. గురువుగారిని ముహూర్తం ఉందేమో చూడమనచ్చు. అసలు సుందరేం మాట్లాడట్లేదు. నీ అభిప్రాయం?"

"ఆలోచిస్తున్నా అత్తయ్యా! అనుకోకుండా వచ్చిన మాటలు కదా రెండురోజులాగి చెప్పచ్చా గిరీ"

"అలాగే అక్కా! తొందరేం లేదు. నేను రాత్రికే బయలుదేరి రాజమండ్రి వెళ్లిపోతున్నాను. ఎల్లుండి ట్రంకాల్చేసి మాట్లాడతా. మీ కందరికీ ఇష్టమైతే రావులపాలెం వెళ్లి సెటిల్చేసేస్తాను."

●●●

"ఇదేమీ బాగోలేదురా గిరీ! ఒక్కసారి వెళ్లి మీ నాన్నతో, పిన్నితో చెప్పి వస్తాం. బ్రతిమాల్తే ఆ మాత్రం వినకపోదు సూరమ్మ. కన్న తండ్రి లేకుండా పెళ్లంటే బంధువుల్లో ఏం బాగుంటుంది చెప్పు. స్నాతకం పీటల మీద కూర్చోడానికి అసలు మగపెళ్ళివారంటూ ఉండద్దా"

సుబ్బులు గిరిని సముదాయించబోయింది.

నాలుగురోజులయ్యాక మళ్ళీ అంతా నరహరి ఇంట్లో సమావేశమయ్యారు.

నరహరి పడక్కుర్చీలో కూర్చుని చిన్నపుస్తకంలో చెయ్యవలసిన పనులు రాసుకుంటున్నాడు.

"చక్కగా ఉంటుందత్తయ్యా! ఆవిడరావటం నాకిష్టంలేదు. మా నాన్నకి పెద్ద తేడా తెలీదు. మావయ్యలూ అత్తయ్యలూ వస్తారు. స్నాతకం బంగారత్త, మామ చేస్తారు. ర్యాలి వెళ్లి చెప్పొచ్చా." గిరి ఈ విషయంలో పట్టుదలగా ఉన్నాడు.

గిరి యమునని పెళ్లి చేసుకుంటానని అడిగిన రోజు రాత్రే, సుందరి నరహరితో మట్లాడింది. వెతుకుతే కొంచెం ఎక్కువ చదువు, ఉద్యోగం ఉన్న వాడు దొరక్కపోడు. గిరి అయితే తెలిసిన కుర్రాడు, కోరి వచ్చాడు. కానీ, బరువు బాధ్యతలన్నీ తమవే అవుతాయి. అత్తిల్లు ఆశలేదు. అయితే యమునని అతనైతే బాగా అర్థం చేసుకుంటాడేమో?

ఏమీ పాలు పోక చివరికి యమున మీద వదిలేశారు. లలిత పిన్ని అడిగినప్పుడు యమున ముందు ఏమీ మాట్లాడలేదు.

ఆలోచిస్తే గిరి ఫరవాలేదనిపించింది. చిన్నప్పట్నుంచీ అతనంటే అభిమానమే ఉండేది.

ముక్కూ మొహం తెలియని వాళ్లకంటే నయమేనేమో.

తొందరలో ఎవరికో ఒకరికిచ్చి పెళ్లి చేసెయ్యడం ఖాయం.

అట్లాంటప్పుడు గిరి మామయ్య అయితేనేం?

అసలు గిరి అడిగినప్పట్నుంచీ ఆలోచిస్తూనే ఉంది.

లలిత చేసుకోమనీ వద్దనీ ఏమీ చెప్పలేదు.

యమునకి తన స్వభావం గురించి బాగా తెలుసు.

తన అభిప్రాయాల్ని ఖచ్చితంగా చెప్పడంలో, అమలు చెయ్యడంలో ఏ మాత్రం సంకోచించదు. ఇప్పుడు తన జీవితంలో ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు సందిగ్ధంలో పడిపోయింది. ఏం చెయ్యాలి.

మరీ చిన్నప్పుడు తమ ఇంట్లో ఉన్నాడేమో కానీ గిరితో పెద్ద పరిచయమేం లేదు. పెళ్లిళ్లకీ, పండగలకీ కలిసినప్పుడు తప్ప, బాబాయిల వెంట నీడలా తిరిగేవాడు. అందరితో సరదాగా కబుర్లు చెప్తూ ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు.

కోపంతో ఎవర్నీ కసరగా తను చూడలేదు. మనిషి బాగానే ఉంటాడు. రెండు మూడుసార్లు సినిమాలకి వెళ్లినప్పుడు అదీ పదిమంది తక్కువకాకుండా నవ్వుతూ, నవ్విస్తూ, ఇంటర్వెల్‌లో సోడాలూ, వేరుసెనక్కాయలూ పట్టుకొస్తూ.. అంతే.

యమునకి ఆ వయసుకి ఒక తోడులో ఉండవలసిన గుణాలన్నీ గిరిలో బాగా కనిపించాయి. తమ సంసారం ఎలా ఉంటుందీ?

ఇంటి యజమానిగా గిరి ఎంతవరకూ సమర్ధించగలడూ? ఒక తండ్రిగా ఏ విధంగా ఉంటాడూ, ఇవన్నీ ఆలోచించే అవగాహనలేదు.

చూడవలసిన పెద్దలు ఆర్ధిక ఇబ్బందులూ, సంసార సాగరం ఈదిన అలసట, కొంత అమాయకత్వంతో ఉదాసీనంగా ఉండిపోయారు.

యమున "సరే" అని తలుపాక, గిరి అత్తయ్యతో వాదన వేసుకున్నాడు, పిన్నిని పెళ్లికి పిలవద్దని.

"సరేరా! నీ ఇష్టం. ఇంక పెళ్లి పదిహేను రోజుల్లో ఉంది. కార్డులు వేయించి ఎవర్ని పిలుస్తావో పిలుచుకో. నీ బట్టలకి రెండువేల రూపాయలిస్తాను. కావలసినవి కొనుక్కో. విష్ణూ! ఇంకా ఏమైనా కావాలేమో చూడు ఈ లిస్టులో" నరహరి విష్ణుకి చేతిలో పుస్తకం ఇచ్చి అన్నాడు. ఆనంద్ ఒడుక్కి వచ్చిన వాళ్లంతా అట్టే ఉండిపోయారు యమున పెళ్లి అయాక వెళ్దామని.

●●●

"గిరిధారీ! ఎక్కడున్నావురా? మగపెళ్లివారం వచ్చాం. సుబ్బులూ మా విడిది ఎక్కడా?" బంగారమ్మగారి హడావుడికి ఇంటిల్లిపాదీ బయటికి వచ్చేశారు. నరహరి ఇల్లు కొత్తగా వేసిన వెల్లలతో సున్నం వాసన వేస్తూ ఘాటుగా ఉంది.

ఇంటిముందు తాటాకు పందిరి వేశారు. పందిరి గుంజలకి అరటిచెట్లూ, ఈ చివర్నుంచి ఆ చివరికి నాలుగువైపులా మావిడి తోరణాలు.

అప్పుడప్పుడే వస్తున్న చామంతి పూలదండలు గేటుకు అలంకరించారు.

గుమ్మాలన్నింటికీ రంగులు, గడపలకి పెయింటింగులూ.

వాకిలంతా ముగ్గులతో కళకళ్లాడిపోతోంది. గిరి నాలుగంగల్లో వీధిలోకి వచ్చాడు. ఆ రోజు పొద్దున్నే అతన్ని పెళ్లి కొడుకుని చేశారు. తన వాళ్లెవరూ రాలేదని లోలోపల చిన్న బుచ్చుకున్న గిరి బంగారత్త మాట వినగానే ఉత్సాహంగా అడుగులు వేశాడు. జీవితంలో అతిముఖ్యమైన రోజు.

అత్తయ్యలంతా వచ్చారు.

అమ్మన్న కూడా ఇద్దరు కూతుళ్లతో వచ్చి హడావుడి చేస్తోంది. అయినా పెళ్లి కొడుకుని చెయ్యగానే స్వంత వాళ్లంటూ లేకపోతే ఎంతలోటూ?

సుబ్బులత్తయ్య ముందుకి రావడానికి లేదుకదా! తను అనాధలా, ఒంటరిగా మనసులో ఏదో మెలిపెడుతున్న బాధ. ఈ బంగారత్త నిన్ననే రావచ్చుకదా! పోన్లెద్దూ స్నాతకం సమయానికయినా వచ్చింది.

తనకి తనే సర్ది చెప్పుకుని ముందుకి వస్తున్నవాడల్లా.

కాళ్లు నేలకి అతుక్కుపోయినట్లు ఆగిపోయాడు.

బంగారత్త, వెనుకే పసిపిల్లాడిలా నవ్వుతూ మామ, అంతవరకూ బాగానే ఉంది. పక్కనే కేశవుడు, సూరమ్మ సంకోచిస్తూ నిలబడిపోయారు.

వారికి కొంత దూరంలో గిరి మేనమామలు.

సూరమ్మని చూడగానే గిరి మొహం రక్తం అంతా ఎవరో తోడేసినట్లు పాలిపోయింది.

"అబ్బ! ఎంత చక్కగా ఉన్నాడో మా నాయన. పేరు పెట్టినందుకు అచ్చు ఆ గిరిధారిలాగే ఉన్నాడు."

బంగారమ్మ గిరి దగ్గరగా వచ్చి అంతెత్తున ఉన్న గిరి తలవంచి నుదుటిమీద ముద్దుపెట్టింది.

గిరి చాలా పొడుగయ్యాడు. ఉంగరాల జుట్టు సగం నుదురు కప్పేస్తూ, ఆల్చిప్పల్లాంటి కళ్లు, దట్టమైన కనురెప్పలు, కోటేసినట్లున్న ముక్కు. అందగాడేనని చెప్పచ్చు. తన స్వంత ఇల్లూ, తల్లిదండ్రులూ అంటూ పెరగకపోవడం కొంత ఆత్మన్యూనతా భావాన్ని ఆపాదించి అది మనిషి తీరులో తెలిసిపోతుంటుంది. అదే దర్జా, ధీమా ఉంటే ఎన్నో రెట్లు బాగున్నట్లు అనిపించేవాడే?

"ఎక్కడ్రా మా విడిది?"

గిరి ముభావంగా ఉండడం పట్టించుకోకుండా బంగారమ్మ సుందరి దగ్గరికి వెళ్లింది.

●●●

"గిరిధారీ! అమాయకుడైన కన్న తండ్రిని చూడ్రా. నీకు పెళ్లనగానే ఎంతో ఉత్సాహపడ్డాడో తెలుసా? దారి ఖర్చులు లేవని డీలాపడిపోతే నేనిస్తానని తీసుకొచ్చా అందర్నీ.

మీ మావయ్యలు కూడా అంతంత మాత్రవే కద. సూరమ్మ కూడా మారింది. అసూయ, అసహనం అన్నీ తగ్గాయి. అమ్మన్న అంటే నీకు ఎంతో ఇష్టం కదా! అమ్మన్నని నీకు చెల్లెలిగా ఇచ్చిన పిన్ని ఆవిడ. అలా అని ఆలోచించు. కడుపు నిండా తినడానికుంటే ఆవిడ ఇంకోలా ఉండేదేమో.

పెద్ద మనసు చేసుకుని సంతోషంగా ఉండు. నేను, మీ మావయ్య స్నాతకం చెయ్యడానికి వల్లకాదు. గోత్రాలు వేరు. మా నాయన కదూ ఏదీ మా తోటలో జాం చెట్టుమీద మంచి కాయదొరుకుతే ఎలా నవ్వేవాడివీ అలా నవ్వు. ఇదిగో నీకోసం దోరజామకాయలు కూడా తెచ్చా."

గిరిని గదిలో కూర్చోపెట్టి అరగంటనుంచీ బ్రతిమాలుతోంది బంగారత్త.

నరహరి ఇంటిముందే పెళ్లి చేస్తున్నాడు. గేటుకీ వరండాకీ మధ్య చాలానే ఉంది జాగా. పక్కింటివాళ్లు మూడు గదులు విడిదిగా ఇచ్చారు.

సూరమ్మ ఇంటి వరండాలోనే కూర్చుంది.

అమ్మన్న ఆడపెళ్లివారింటి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అన్నయ్యా! అమ్మా, నాన్న వచ్చారు. నాకెంత సంతోషంగా ఉందో తెలుసా?"

గిరి మొహం చూసి గుమ్మం దగ్గరే ఆగిపోయింది సంకోచిస్తూ.

"చూశావురా! నే చెప్పలే ఆనందంగా పెళ్లి చేసుకో. అనాథలా కాకుండా నీ వాళ్లంతా వచ్చారు. మీ పిన్ని దేనికీ పేచీ పెట్టకుండా చూసే బాధ్యత నాది." బంగారమ్మ కుర్చీలోంచి లేపి గిరిని వరండాలోకి తీసుకెళ్లింది.

"లోపలికి పద పిన్నీ!" అమ్మన్న అమాంతం వచ్చి, అమ్మని రెండు చేతుల్తో పట్టుకుని, పెట్టెలతో సహా గదిలోకి తీసుకు వెళ్లింది. కేశవుడు కొడుకుని దగ్గరకు తీసుకున్నాడు. అసంకల్పితంగా గిరి కూడా తండ్రిని హత్తుకున్నాడు.

దాదాపు పదిహేనేళ్ల తరువాత తండ్రి స్పర్శలో సుఖం. గిరి శరీరం కొద్దిగా వణికింది.

●●●

గిరి స్నాతకం పీటలమీద అలనాటి శ్రీరామచంద్రుడిలాగే మెరిసిపోతున్నాడు. పక్కనే కూర్చున్న కేశవుడి మొహంలో వింతకాంతి. సూరమ్మకి, కేశవుడికీ, గిరికీ పట్టుబట్టలు కొంది బంగారమ్మ.

ఎవరూ లేరనుకున్న గిరికి మగపెళ్లివారు కిటకిటలాడుతూ చేరారు. సుబ్బులు ఐదుగురు చెల్లెళ్ల భర్తలూ, పిల్లలూ... అందరూ గిరి పక్షం చేరిపోయారు.

మా పుట్టింట్లో ఇంతకాలానికి మగపిల్లవాడి పెళ్లి జరుగుతోందంటూ. మూడు రోజుల పెళ్లి చాలా సరదాగా జరిగింది.

నరహరి ఇచ్చిన రెండువేలలో యమునకి పట్టుచీర, రెండు జతలగాజులు, గొలుసు కొన్నాడు గిరి.

తనకి ఐదువందలు మాత్రం పెట్టి రెండు జతలు బట్టలు తీసుకున్నాడు.

పెళ్లిపందిట్లో చదివిస్తుంటే అందరూ మెచ్చుకుంటూ చూశారు.

యమునకి అందరిలో చాలా గర్వంగా అనిపించింది.

అసలు ఏమీ ఉండవేమో అనుకుంటే కావేరికి జరిగినట్లే తనకీ ఏ లోటూ లేకుండా జరుగుతోందని. చీరలమీద, నగలమీద ఎప్పుడూ వ్యామోహంలేదు తనకి. అయినా నలుగురిలో చిన్నబోకూడదు కదా!

సుందరీ, నరహరీ మగపెళ్లివారికి మర్యాదలు బాగా జరిపారు. తమ వాళ్లేకదా అని చులకన చేయకుండా. అందరికీ పట్టుబట్టలు పెట్టినా, లాంఛనాలు జరిపినా ఏడువేలకి మించలేదు ఖర్చులు.

విష్ణు అన్నగారికి చేదోడు వాదోడుగా అన్ని పనులూ చూసుకున్నాడు.

అప్పగింతల కార్యక్రమం కూడా. అంతా ఇంట్లో వాళ్లే కనుక సరదాగా గడిచిపోయింది. అంతా బాగా జరిగిపోతోందనుకున్న సమయంలో..

అమ్మన్న పెద్దగా కేకపెట్టింది.

అప్పటికి అందరూ అలిసిపోయి కాళ్లు సాగదీసుకుని నరహరి ఇంట్లో హాల్లో విశ్రాంతిగా కూర్చున్నారు. అమ్మన్న కేకతో, సూరమ్మ గట్టిగా ఏడుస్తున్న గొంతు కూడా వినిపిస్తోంది. విడిది ఇంట్లో ఏదో గొడవగా ఉందని పరుగెత్తుకుంటూ వెళ్లారు అందరూ.

కేశవుడు కిందపడిపోయి ఉన్నాడు. చేతుల్లో కాళ్లలో కదలిక ఏమీలేదు. పెళ్లి పనుల్లో పదిహేను రోజుల్నుంచీ అలిసిపోయిన నరహరి, కిందపడిన కేశవుణ్ని చూడగానే పరుగున వచ్చాడు. బోర్లాపడున్న వాడిని తిప్పి, ముక్కు కిందవేలు పెట్టి చూశాడు. నాడి పట్టుకుని చూసి, పెదవి విరిచాడు.

విష్ణు అన్నగారి మొహం చూసి..

వెంటనే పెళ్లికి కుదిర్చిన టాక్సీ అతన్ని పిలిచి సాయం పట్టి కారులో ఎక్కించాడు.

9

గిరి స్తబ్దుగా కూర్చుండిపోయాడు.

ఏం జరుగుతోంది? బాగా చిన్నతనంలో, అమ్మ ఉన్నప్పుడు ఎత్తుకుని ఆడించేవాడేమో నాన్న. ఆ తరువాత..

తనకి జ్ఞానం వచ్చినప్పట్నుంచీ పిన్ని వచ్చాక, ఎప్పుడూ దగ్గర కూర్చోపెట్టుకుని పలుకరించలేదు.

తాతగారి వద్దనున్న చనువు తనవద్దలేదు. అయినా జీవితంలో మొదటిసారి, మొన్ననే పితృపరిష్వంగంలోని హాయి, ప్రేమ అనుభవంలోకి వచ్చాయి. అటువంటిది. మూణ్ణాళ్ల ముచ్చటకాకుండానే ఇలా అన్నింటికీ దూరం చెయ్యడమే ఆ పైవాడి ఆటా, ఆనందమూనా? ఇంతేనా జీవితం అంటే.. అందుకునేలోపు అంత దూరం వెళ్లిపోవడమేనా?

"గిరిధారీ!" బంగారత్త పిలుపు మంద్రంగా వినిపించింది. శూన్యంలోకి చూస్తున్నట్లు బంగారమ్మని చూశాడు. పుత్రవాత్సల్యంతో గుండె, గొంతూ ఏకమై పోయాయి ఆవిడకి. కాళ్ల పారాణి ఇంకా ఆరనే లేదు. సంవత్సరాల తరువాత తండ్రినంటూ ముందు నిలబడి పెళ్లి జరిపించాడు.

రెండు రోజులయితేనేమీ గిరిధరి మొహంలో సంతోషం కనిపించింది.

ముందు వీడిని అయోమయంలోనుంచి బైటపడెయ్యాలి. తప్పదు.

"లే నాన్నా! నీ చేతిలో వెళ్లిపోవాలని ఇక్కడికి వచ్చాడేమో. రావులపాలెంలో అయితే నువ్వు వెళ్లనని భీష్మించుకునేవాడివి కాదూ.. మన చేతిలో ఏముంది కనుక... జరుగవలసిన కార్యక్రమం చూడాలి. అందరూ నీ దగ్గరికి రావడానికి సంకోచిస్తున్నారు. ఆ పిచ్చిపిల్ల యమునని చూడు. బిక్క మొహం వేసుకుని ఎలా చూస్తోందో!"

కేశవుడిని హాస్పిటల్‌కి తీసుకెళ్లడం కేవలం చివరి ఆశతోనే.

ఏమీ లాభంలేదని నరహరికి తెలుసు. కానీ ఆ మాట వైద్యుడు చెప్పాలి కదా! ఇంటికి తీసుకొచ్చారు కానీ, బైటరోడ్డు మీదే పడుకోబెట్టారు. పెళ్లి ఇల్లు.. ఇంట్లోకి తీసుకెళ్లడానికి వీల్లేదని పెద్దలు చెప్పారు.

గిరి మొద్దుబారిపోయిన మనసుతో అలా చూస్తుండగానే పెళ్లి చేయించిన పురోహితుడు వచ్చాడు.

"పెళ్లయి మూడు రోజులుకూడా లేదు. పదహారోజుల పండుగ అయితే కానీ ఇటువంటు క్రతువు చెయ్యకూడదు. కర్తృత్వం ఇతని మీద పెట్టి వర్ధులు గారితో జరిపిద్దాం.

నెలమాసికంలోపు ప్రాయశ్చిత్తం చేసి మామూలుగా తరువాతి కార్యక్రమాలు జరిపించచ్చు ఒక్కడే కొడుకు కనుక ఈ విధంగా చెయ్యక తప్పదు. ఇంకా సంతానం ఉంటే వాళ్లు చేసేవారు."

గురువుగారు చెప్పింది బాగానే ఉన్నట్లు అనిపించింది.

కాదూ కూడదనేవారు ఎవరూ కనిపించలేదు. నరహరికీ, సుబ్బులుకీ పెద్ద భారం తలమీంచి తీసేసినట్లయింది. పధ్నాలుగురోజులూ అయ్యాక ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోయారు.

గిరి కూడా రాజమండ్రి వెళ్లి డ్యూటీలో చేరిపోయాడు.

యమునని మూడు నెలలు అయ్యాక పంపుతామన్నారు.

ఈలోపు ఇల్లూ అదీ వెతుక్కోవాలికదా!

అంతవరకూ గిరి ఒక గదిలో కాలక్షేపం చేస్తున్నాడు.

"పోనీలెద్దూ! ఇదీ బాగానే ఉంది. వస్తూ పోతూ ఉంటే భార్యాభర్తలకి మంచి అవగాహన వస్తుంది." బంగారత్త వెళ్తూ అందరికీ ధైర్యం చెప్పి హుషారు చేసి వెళ్లింది.

●●●

గిరి నెలకొకసారి శని ఆదివారాలు వస్తున్నాడు.

అతనికొచ్చే జీతంలో సగం పైగా అద్దెకే పోయేలాగా ఉంది, ఒక్క గది తీసుకున్నా కూడా. యమున జీవితంలో మార్పేమీ లేదు. మామూలుగానే నడిచిపోతోంది. పెళ్లిళ్లయిన కొంతమంది స్నేహితురాళ్లు గుంటూర్లోనే ఉన్నారు. గిరి కొద్దిగా డబ్బులిస్తుండడంతో సినిమాలు చూడ్డం, సరదాగా తిరగడం మామూలే.

"చిన్నక్కా! కాలేజీలో చేరరాదూ? టైమ్ అంతా వేస్ట్ చేస్తున్నావు. నువ్వు సినిమాలకి పెట్టే డబ్బుతో కాలేజీ ఫీజు వచ్చేస్తుంది." ఒక ఆదివారం నచ్చ చెప్పబోయాడు ఆనంద్. ఇంట్లో ముగ్గురే ఉంటారు. పెద్ద పనేం ఉండదు. నరహరి ఎక్కువగా ఒంగోలులో ఉంటున్నాడు. పొగాకు సీజన్ బాగా ఉందంటూ.

యమునకి ఛరుమని కోపం వచ్చింది.

"నీకు ఇష్టంలేకపోతే చెప్పు. రేపే వెళ్లిపోతాను. మీ బావ ఎప్పుడు వచ్చి తీసుకువెళ్తారా అని నేను కూడా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు చదువు సంధ్య అంటే మధ్యలో ఆపెయ్యద్దూ దండగ."

"అట్లా పోట్లాడతావేమిటక్కా! నీ మంచికోసమే కదా చెప్పాను. ముందు ముందు ఎప్పటికైనా ఉపయోగపడుతుందేమోనని" ఆనంద్ చిన్నబుచ్చుకుని వెళ్లిపోయాడు. అప్పుడు తెలియలేదు యమునకి. అటువంటి చేష్టల వల్ల జీవితంలో ఎంత నష్టపోవలసివచ్చిందో!

ఎవరూ అడిగేవారు లేరు. గిరి కూడా ఇది బాగానే ఉందనుకున్నాడేమో ఇల్లు వెదికే ప్రయత్నమే మానేశాడు.

ఒక రోజు విష్ణు వచ్చాడు. యమున పెళ్లయి సంవత్సరం అయింది.

"ఏమిటొదినా యమున ఇక్కడే ఉంది?"

"గిరికి ఇల్లుదొరకలేదుట. అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నాడు."

విష్ణు సాలోచనగా చూశాడు. రాజమండ్రి పట్టణంలో ఇల్లే దొరకలేదా? గిరి ఇదే తన ఇల్లులాగా అనేసుకుంటున్నాడేమో.

చిన్నప్పుడే నరహరి దగ్గరికి వచ్చేశాడు.

అతన్నే తండ్రి స్థానంలో ఊహించుకుంటున్నాడేమో.

అతనికి బాధ్యత ఎప్పటికి తెలుస్తుంది? వాళ్ల నాన్నలాగే తయారవుతున్నాడా? అప్పుడే గిరి, యమున ఇంట్లోకి వచ్చారు, మేటినీకి వెళ్లి.

"బాగున్నావా బాబాయ్? ఇప్పుడేనా రావడం?" యమున పలుకరించి, రెండు గ్లాసుల్లో నీళ్లు తెచ్చి గిరికొటిచ్చి, తనొకటి తీసుకుని కూర్చుంది.

"ఆ .. ఆఫీసు పనిమీద వచ్చాను. ఏం గిరీ ఇంకా ఇల్లు దొరకలేదా? మీ నాన్న సంవత్సరీకాలు కూడా అయిపోయినట్లున్నాయి"

నవ్వుతూ ఏదో చెప్పబోయిన వాడల్లా గిరి తీక్షణంగా నీళ్లు తాగడంలో మునిగిపోయాడు. యమున పళ్లు కొరికింది బాబాయి చూడకుండా. అందరికీ తమ సంగతే కావాలి.

సుందరి ఏదో పనున్నట్లు లేచి వెళ్లిపోయింది.

"ప్రతివారం ఇక్కడికి వచ్చే డబ్బు పెడితే ఇల్లు రాదూ! చుట్టు ప్రక్కల అంతా అప్పుడే ఆరాలు తీస్తున్నారు. సరైన ఉద్యోగంలేని వాడికిచ్చి తప్పు చేశామా" బాధగా అనుకుంది.

"లేదు బావా! చూస్తున్నా. అద్దెలు చాలా ఎక్కువగా ఉన్నాయి.. వచ్చేది సరిపోదేమోనని" నెమ్మదిగా వచ్చాయి గిరి నోట్లోంచి మాటలు.

"ఒక్క గది దొరికినా ఫరవాలేదు. మీరిద్దరే కదా? యమునని సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ అవమను. ఏ స్కూల్లో అయినా కళ్లకద్దుకుని ఇస్తారు. అంతగా తక్కువైతే నేను కొంత పంపిస్తాను."

●●●

"చిన్నక్కా నీకు ఉత్తరం. బావరాశారు. ఈసారి చాలా రోజులైనట్లుందే తనొచ్చి."

యమున గబగబా వచ్చి, ఏమీ మాట్లాడకుండా ఆనంద్ చేతిలో ఉత్తరం లాక్కున్నట్లు తీసుకుంది. ఎవరిమీద కోపం? ఉక్రోషం తనే చెప్పింది. ఇల్లు దొరికేవరకూ కనిపించద్దని. విష్ణు వచ్చి వెళ్లాక గిరిని కొత్తపేట ఆంజనేయస్వామి గుడికి తీసుకువెళ్లి, ఎవరూ లేని చోట కూర్చోపెట్టి గట్టిగా దెబ్బలాడింది.

కొన్ని రోజులనుంచీ అమ్మ కూడా ముభావంగా ఉంటోంది. ఆనంద్ సరేసరి. అంటీముట్టనట్టు ప్రవర్తిస్తున్నాడు. స్నేహితురాళ్లు ఎంత సరదాగా గడిపినా ఎప్పుడో ఒకప్పుడు పుల్లమాట అంటున్నారు. ఆ బాధంతా ఆ రోజు తీర్చేసుకుంది. ముక్కు ఎగరేస్తూ, ఎర్రబడ్డ కళ్లతో రోషంగా మాట్లాడుతున్న యమునని ఓదార్చాడు గిరి, ఇల్లు దొరికాకే వస్తానని.

వరండాలో పడక్కుర్చీలో కూర్చుని ఇన్‌లాండ్ కవరు విప్పింది.

గిరి రాసిన మొదటి ఉత్తరం. కవిత్వం, వర్ణనలూ ఉంటాయని ఊహించకపోయినా మరీ ఇంత చిన్నగానా! నవలల్లో హీరోయిన్‌కి రాసినట్లు ఉండక్కర్లేదు. పడక్కుర్చిలో కూర్చున్నంతసేపు పట్టలేదు. "శనివారం వస్తున్నాను. ఆదివారం బయల్దేరి ఇక్కడికి వచ్చేద్దాం. రెడీగా ఉండు." అలా వెనక్కి వాలిపోయి కూర్చుండిపోయింది. ఏమిటో అంతా వెల్తిగా అనిపించింది. బుర్రంతా ఖాళీ అయిపోయినట్లు శరీరంలో శక్తి అంతా ఎవరో లాగేసినట్లు, పెదవులు వణుకుతుండగా, చేతిలో కవరు వెనక్కీ ముందుకీ తిప్పి చూసింది. కళ్లల్లోంచి నీళ్లురాలడానికి సిద్ధంగా ఉన్నాయి.

అటుగా వచ్చిన ఆనంద్ అక్క స్థితి చూసి, గాభరాగా వెళ్లి అమ్మని పిలుచుకొచ్చాడు.

"ఏమయిందే యమునా? గిరికులాసానా? అలా ఉన్నావేమిటి?"

యమునని కుర్చీలోంచి లేపబోయింది. అలా కిందికి జారి భోరుమంది యమున. యమున దుఃఖం చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది సుందరికి. ఆడుతూ పాడుతూ తిరిగే పిల్ల ఏమయింది? ఏమీ పట్టించుకోనట్లు మొండిగా ఉంటుంది కానీ, మామూలు ఆడపిల్లకుండే కోరికలు ఉండవా? పెళ్లయిన కొత్త సంవత్సరం, పండగలనీ సారెలనీ అత్తవారూ వాళ్లు వస్తూపోతుండడం ఏ ముచ్చటా తీరలేదు. పైగా అందరూ చులకనగా చూసేవాళ్లే. కన్న తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. "ఊరుకోరా! మా అమ్మవి కదూ! ఏం జరిగింది? నేనున్నాను కదా నీకు. చెప్పు తల్లీ!" అమ్మ ఓదారుస్తుంటే ఇంకా గట్లు తెగిన వరద నీరులా వచ్చింది యమున కళ్లలోంచి నీరు. ఎప్పట్నుంచో దాచుకున్న బాధంతా బైటికి వచ్చింది. ఉధ్రుతం తగ్గాక, చేతిలో ఉన్న ఉత్తరం అమ్మకిచ్చింది.

"మంచిదేకదమ్మా! చక్కగా వెళ్లు. హాయిగా ఉండండి. మీకు ఏం కావలసినా మేమున్నాం. అమ్మని వదిలి వెళ్లాలనా పిచ్చిపిల్లా ఎంతదూరం అనీ? దా లేచి మొహం కడుక్కో. నీక్కావలసిన సామాన్లు లిస్ట్ రాద్దాం. బజారు కెళ్లి కొనుక్కుని అన్నీ సర్దుదాం. అక్క వెళ్లలే అలాగే నువ్వు కూడా."

●●●

**"అమ్మో ఇన్నిన్ని సామాన్లా? వద్దక్కా. కావల్సినవి నేను సమకూర్చుకున్నాను**. వంట సామాన్లు కూడా వద్దు. ఒక ట్రంకు పెట్టెలో యమున బట్టలు సర్దితే చాలు." హాలంతా పరిచి ఉన్న మంచం, పరుపు, కుర్చీలు, బల్లా.. అవన్నీ చూస్తూ అన్నాడు గిరి.

"అదేవిటి గిరీ! ఏమీ లేకుండా ఎలా పంపిస్తాం పిల్లని.. నేను కూడా వచ్చి అన్నీ సర్దివస్తాను" సుందరి డబ్బాల్లో జంతికలు, అరిసలు సర్దుతూ అంది.

"ఎందుకక్కా! శ్రమ. నేను చూసుకుంటాకదా. ఏమైనా పరాయి ఊరా? ఇది వరకు మనం ఉండే ఇంటికి దగ్గర్లోనే దొరికింది ఉండడానికి. మేము రేపే బయల్దేరి వెళ్తున్నాం."

గిరి ఇంకో మాటకి అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు.

చేసేదేం లేక సుందరి తినుబండారాలు మాత్రం, ఒక సంచిలో సర్దింది. యమున హుషారుగానే ఉంది. ఆనంద్ అక్క వెనుకే తిరుగుతూ జాగ్రత్తలు చెప్పాడు.

"నాన్నగారు వచ్చే వరకూ ఉండాల్సిందక్కా! మరీ ఇంత తొందరగా వెళ్తావనుకోలేదు."

"ఇప్పటికే ఆలిశ్యమయిందిరా."

అద్దంలోకి చూస్తూ జడ అల్లుకుంటున్న యమునని బాధగా చూశాడు ఆనంద్.

"అక్కా నా ఉద్దేశ్యం నిన్ను వెళ్లిపొమ్మనికాదు. టైం వేస్ట్ చేస్తున్నావని ఏదయినా ఉపయోగించే పని చెయ్యకూడదా అని. నిన్ను బాధపెట్టానేమో ఏమనుకోకు. ఏ అవసరం వచ్చిన నేనున్నానని మర్చిపోకు."

"అబ్బే అదేం లేదురా తమ్ముడూ నేను మామూలుగానే అన్నాను. నువ్వు తప్ప ఇంకెవరున్నారు చెప్పు నాకు."

యమున ఆనంద్ దగ్గరగా వచ్చి మొహంలోకి చూసి నవ్వింది.

●●●

తెలతెలవార్తోంది. పాలవాళ్ళు, పేపరువాళ్ళూ తప్ప వీధుల్లో ఎవరూ కనిపించడంలేదు. తలుపు గొళ్ళెం టకటక చప్పుడైతే తలుపుతీసింది యమున.

"అప్పా మీరా? రండి.. రండి."

యమున మొహం చేటంత చేసుకుని నవ్వుతూ నరహరి చేతిలో పెట్టె అందుకుంది.

"ఇల్లెలా దొరికింది బావా?"

చాపమీద కూర్చుని పొడుగాటి అకౌంట్స్ పుస్తకంలో లెక్కలు టాలీ చేస్తున్న గిరి నుంచుని అడిగాడు.

"ఎలాగో దొరికిందిలే. అప్పుడు యమునని గోదాట్లో పడిపోకుండా కాపాడిన చాకలాడు చూపించాడు. అదృష్టం బాగుండి స్టేషన్ దగ్గరే కనిపించాడు. మీరు వచ్చి మూడు నెలలైంది. ఓ కార్డు ముక్కైనా రాయలేదు. నేను కాంపు నుంచి వచ్చేవరకూ ఆగలేదు. ఇదేమైనా బావుందా?" నరహరికి ఆవేశంతో నోట్లోంచి మాటరాలేదు.

"వస్తూనే వాయించేస్తున్నావు బావా. ఇదిగో రాయమని ఇన్లాండ్ కవరు కూడా తెచ్చిచ్చాను. మీ అమ్మాయిననండి. నాకా ఒక్క నిమిషం కూడా తీరడంలేదు. ఇంటికి తెచ్చి అకౌంట్స్ రాస్తున్నా. కొద్దిగా డబ్బులొస్తాయని."

అప్పుడు చూశాడు నరహరి, యమున 'ఇంటి'ని. ఒక్కటే గది. పెంకుటింట్లో వెనక వసార ఆనుకుని ఉంది. కూతుర్ని చూడాలనే ఆదుర్దాలో గమనించలేదు కానీ, పక్క సందులోంచి ఇల్లంతా తిరిగి వెనక్కి వచ్చాడతను. ఒక పక్క పంచపాలి, గోడ దగ్గరగా వెళితే తలకి కొట్టుకునేలా ఉంది చిన్న గది.

అందులోనే ఒక మూల వంట కిరసనాయిల్ స్టౌ. కిటికీకి ఉన్న అరుగు మీద వంటకి సామాన్లు. పక్కనున్న గూడులో ఐదు డబ్బాలు. నేలమీద చాపమాత్రం ఉంది. రెండు తలగడలు గోడకానించి కూర్చుని గిరి పనిచేసుకుంటున్నాడు. నరహరి అతికష్టం మీద కంట్లోంచి నీళ్ళు రాకుండా ఆపుకున్నాడు.

ఎంత గారంగా పెరిగింది యమున.

పంతం పట్టి తనక్కావలసినవి ఇచ్చేవరకూ ఊరుకునేది కాదు. తన గుండెలమీద పెట్టుకుని పెంచుకున్నాడు.

"మొహం కడుక్కునొస్తే కాఫీ కలుపుతాను. పెరట్లో నూతి పళ్ళెం దగ్గర..."

యమున స్టౌ వెలిగించడానికి కూర్చుంది. పంపుకొడితే కానీ వెలగదు అది. నరహరి దుఃఖం ఆపుకుంటూ పెరట్లోకి నడిచాడు.

"కూర్చోండి అప్పా."

చిన్న గాజుగ్లాసులో కాఫీ అందిస్తున్న కూతుర్ని పరిశీలనగా చూశాడు. చవకరకం గాజుగ్లాసు. రోడ్డు పక్కన చిన్న బడ్డీ కొట్లలో టీలు ఇచ్చేలాంటిది. ఎక్కడ కూర్చోవాలా అని అటూ ఇటూ చూశాడు నరహరి.

తలుపు పక్కనున్న ట్రంకు పెట్టెమీద ఒక తగలడా వేసి మడిచిన దుప్పటీ వేశారు.

దానిమీద కూర్చుని కాఫీ గ్లాసు తీసుకున్నాడు. యమున, గిరీ తమ గ్లాసులు పట్టుకుని చాపమీద కూర్చున్నారు. కాఫీ గొంతు దిగగానే బయిటికి వచ్చెయ్యబోయింది. ఏ భావం కనిపించనియ్యకుండా ఆపుకుని, మింగేసి, గొంతు సవరించుకున్నాడు. కాఫీ, నీళ్ళలా, చేదుగా, అదోరకం వాసన వేస్తూ ఉంది.

సుందరి ఫిల్టర్ కాఫీ అప్రయత్నంగా గుర్తుకొచ్చింది. బిగపట్టిన మొహంతో ఆవేశాన్ని ఆపుకోడంలో ముక్కు ఎర్రగా అయిపోయింది.

"అప్పా! ఏమయింది? ఒంట్లో బాగాలేదా?" యమున లేవబోయింది. ఆగమని సైగచేస్తూ.. బాగుందన్నట్లు తలూపాడు నరహరి.

చాలా మామూలుగా తాగేస్తున్న కూతుర్నీ అల్లుడ్నీ చూస్తూ.

"రాత్రి సరిగ్గా నిద్రలేదురా! అందుకే వికారంగా ఉంది. ఇపుడు ఫరవాలేదు."

"భోజనానికి వచ్చెయ్యండి అప్పా! మీ కిష్టమైన కారపొంకయ కూర, మజ్జిగ పులుసూ చేస్తా." సంచి పట్టుకుని, బైటికి వెళ్ళబోతున్న నరహరి ఆగి వెనక్కి చూశాడు.

పసిపిల్లలా అమాయకమైన మొహంతో నవ్వుతూ చూస్తోంది యమున.

"తప్పకుండానమ్మా!" దగ్గరగా వెళ్లి తల నిమురుతూ అన్నాడు.

## 11

నరహరి రైల్లో వెళ్తున్నంత సేపూ, చెమరుస్తున్న కళ్లని చేరుమాలుతో వత్తుకుంటూనే ఉన్నాడు. మధ్యాన్నం అనుకున్నట్లుగానే యమున దగ్గిరికి భోజనానికి వెళ్లాడు. ఆ గదిని ఇల్లనుకోడానికి మనసొప్పలేదు. చెప్పినట్లుగానే వంకాయ కూర చేసింది. కానీ వంకాయలు కమిలిపోయి గిడసబారిపోయాయి. ఉప్పు రెండు కూరలకి సరిపోయేంత వేసింది. అన్నం చిమిడి పోయింది. మజ్జిగపులుసు.. మజ్జిగ విరిగిపోయి తిత్తులు తిత్తులుగా తేలుతోంది. ఆనపకాయ ముక్కలు ఉడకలేదు. నరహరి తినలేక తినలేక తిన్నాననిపించాడు. ఇంకా కడుపులో వికారంగానే ఉందంటూ.

మధ్యాహ్నం షావుకార్నడిగి భోజనానికొచ్చిన గిరి మాత్రం పంచభక్షపరమాన్నాలు తింటున్నట్లుగా ఆనందంగా తినేశాడు.

"యమునకి వంట నేర్పలేదా సుందరి. ఏం చేస్తోంది? ఇదేం కాపురం? కావేరి పెళ్లైన కొత్తలో వాళ్లింటికెళ్లాడతను. ఎలా ఉంది? బొంబాయిలో ఇళ్లు దొరక్కపోయినా, మామగారు చిన్న రెండు గదుల ఫ్లాట్‌కొనిపెట్టారు. ముచ్చటగా సర్దుకుంది కావేరి.

అప్పుడు తిన్న పదార్థాల రుచి ఇంకా నోటిమీద ఆడుతోంది. ఇద్దరూ తన పిల్లలే అయినా ఈ వ్యత్యాసం ఏమిటి? ఎందుకిలా జరిగింది?" నరహరి ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"ఇవేళ నిన్ను చూసిన ఆనందంలో ఎందుకో కొంచెం కుదరలేదు బావా! రోజూ బాగా చేస్తుంది యమున. ఏమీ అనుకోకు."

దింపడానికి స్టేషను కొచ్చిన గిరి అంటుంటే అతని రెండు చేతులూ పట్టుకున్నాడు నరహరి.

"విష్ణుని అడిగి బొంబాయిలో ఎదయినా ఉద్యోగం వేయించమంటాను వెళ్తావా గిరీ?"

"తప్పకుండా బావా మీరెలా చెప్తే అలాగే."

●●●

యమున, గిరి బొంబాయి వెళ్లి రెండేళ్లయింది.

విష్ణు ముగ్గురు పార్ట్నర్స్‌తో కలిసి సివిల్ కాంట్రాక్ట్స్ మొదలుపెట్టాడు. తన కంపెనీలోనే, ఆఫీసులో అకౌంటెంట్‌గా గిరికి ఉద్యోగం ఇచ్చాడు.

బొంబాయికి వందమైళ్ల దూరంలో రోడ్లు వేసేపని. అక్కడే తాత్కాలికంగా షెడ్లు వేసుకుని ఉంటూ సూపర్‌వైజ్ చేస్తున్నాడు. గిరి బొంబాయి రాగానే తనుంటున్న ఇంట్లోనే ఉండమని, తన ముగ్గురమ్మాయిల్నీ యమున దగ్గర వదిలేసి, భార్యని తీసుకుని వర్క్ స్పాట్‌కి వెళ్లిపోయాడు.

బొంబాయి జీవితానికి అలవాటు పడడానికి యమునకి కొంతకాలం పట్టింది. ముఖ్యంగా గిరి ఆరుగంటలకే లోకల్ ట్రైను పట్టుకుని వెళ్లాలి. అప్పటికి వంట అయిపోవాలి. అతను రాత్రి వండినవి తీసుకెళ్లి అడ్జస్ట్ అవుతాడేమో అనుకుంటే.. పిల్లలు ఏడున్నరకల్లా బస్టాప్‌లో ఉండాలి.

అయినా బొంబాయి వాతావరణానికి పొద్దున్నవే రాత్రికి వాసనొచ్చేస్తాయి. అందుకని యమునకి నాలుగింటికి లేచి వంట చెయ్యక తప్పలేదు. గిరి కూడా లేచి సహాయం చేస్తూ అన్ని వంటకాలు నేర్పించాడు. నలుగురి ఇళ్లల్లో ఉండడంతో అతనికి అన్ని పనులూ బాగా వచ్చు. విష్ణు పిల్లలతో పెద్ద సమస్య ఎదురవలేదు యమునకి. అందరూ పెద్దవాళ్లే. ఆఖరిది రాజీకే ఎనిమిదేళ్లు ఎవరి పనులు వాళ్లు చేసుకుంటారు, క్రమశిక్షణతో. అందరికీ లలిత పిన్ని నెమ్మది స్వభావం వచ్చింది. ఒక్క రాజీకి తప్ప. అదే అప్పుడప్పుడు తిక్కపెడుతుంటుంది. లీనా ఇంటిపనుల్లో కూడా సహాయం చేస్తుంది. నెలకి ఒకసారి కావేరి కలుస్తుంటుంది. తను రావడమో, యమున వెళ్లడమో. బొంబాయి అంతా తిప్పి ఎక్కడ ఏం దొరుకుతాయో చూపించింది కావేరి.

"అయితే అప్పని నీ వంటతో భయపెట్టేసి ఇక్కడికొచ్చి పడ్డావన్నమాట." పకపకా నవ్వుతూ అంది కావేరి, నరహరి రాజమండ్రి వెళ్లినప్పటి సంగతి విని.

"అవునక్కా! అప్పుడైతే అస్సలు రాదు నాకు ఏ పనీ. నాక్కూడా ఏ రుచీ తెలిసేది కాదు. గిరి మామయ్య కూడా ఎప్పుడూ చెప్పలేదు."

"ఇప్పుడు ప్రావీణ్యం సంపాదించావా?"

"ఫరవాలేదు. వేపుళ్లు, సాంబారు బాగా కుదుర్తాయి. పిల్లలు, గిరి చాలా హాపీ. మిగిలినవి ఒక్కొక్కటే నేర్చుకుంటున్నా. ఇక్కడ బజారు పని, ఇల్లు సర్దుకోడంతో సరిపోతోందక్కా! పనిమనిషి రోజుకి ఒక్కసారే వస్తుంది."

"పోనీలే.. సంతోషంగా ఉన్నావుకదా! ఏంలేవా?"

యమున అంత నవ్వు మొహం పెట్టకపోతే అనుమానంగా అడిగింది కావేరి.

"అంటే.. తెలుగు సినిమాలు లేవు. పదిరోజులకోసారి వచ్చి విష్ణుబాబాయ్ ఆరాలు తీస్తుంటాడు. ప్రతిచిన్న విషయం అతనికే కావాలి. పిల్లల బట్టలు సరిగ్గా సర్దిలేవనీ. వంటింట్లో ఇది ఇక్కడెందుకుంది అనీ.. పట్టించుకోని విషయం లేదు. అదే కొంచెం ఇబ్బందిగా ఉంది. మొన్ననే కొంచెం గొడవయింది కూడా. అరుస్తూ వెళ్లిపోయాడు. చిన్నప్పుడు ఇంత గట్టిగా కేకలు పెట్టేవాడా? నాకు గుర్తులేదు."

"ఏం గొడవయింది. అతనితో జాగ్రత్తగా ఉండాలి యమునా గిరికి."

"అదే అక్కా! నేననేది. గిరికి బాస్ కానీ నాకు కాదుకదా? ప్రతీనెలా అకౌంట్స్.. ఆడిట్. ఆఫీసులో చెల్లుతుంది కానీ ఇంట్లోకాదు.

ఏంటో నేను ఎక్కువ ఖర్చు పెట్టేస్తానని అనుమానం. చివరికి గట్టిగా చెప్పాను. అదే కోపం వచ్చింది"

"ఏం చెప్పావే. ఏదో ఒకటి తీసుకొస్తూనే ఉంటావు." కావేరి నవ్వుతూ మొట్టికాయ వేసింది ప్రేమగా.

"నువ్వు ఇచ్చే జీతంతో, పిల్లలకని ఇచ్చే డబ్బుతో నేను ఇల్లునడుపుకుంటున్నానా లేదా.. అంతే! అది చూడు. అంతకు మించి నన్ను హింసపెట్టొద్దని చెప్పా.

మిడుకు మిడుకూ చూస్తూ వెళ్లిపోయాడు. పిల్లలు బిక్కమొహం వేసుకుని చూశారు. గిరి ఇంట్లో లేరులే అప్పుడు. లేకపోతే ఆ టెంపర్ ఎవరు భరిస్తారు."

"లేబర్‌తో అరిచి అరిచీ అదే అలవాటయిపోయుంటుంది. అది వరకు లేదు."

"ఏం కాదులే. ఫామిలీలో తనే పెద్ద ఇంజనీరునని గొప్ప. ఆనంద్‌ని చదివిస్తున్నానని అదో టెక్కు. తనని అప్ప చదివించలే. ఏంటిట?" యమున రోషంగా ముక్కు ఎగపీలుస్తూ అంది. కావేరి భయంగా అటూ ఇటూ చూసింది.

"పిల్లలు లేరు. స్కూలుకెళ్లారు."

"తప్పు యమునా తమ్ముడ్ని చదివించడం అప్ప బాధ్యత. ఎంత మాట పడితే అంత అనెయ్యకూడదు. నువ్వు కూడా కొంచెం టెంపర్ తగ్గించుకోవాలి పిల్లా! కాస్త లౌక్యంగా ఉండడం నేర్చుకో. సరేనా?" కావేరి జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయింది.

యమున బుసలు కొడుతూ కూర్చుండిపోయింది.

●●●

"ఏమయింది? అలా ఉన్నారేం?"

ఆఫీసు నుంచి వచ్చి సోఫాలో నిస్త్రాణగా వాలిపోయిన గిరిని అడిగింది యమున. అప్పటికి విష్ణుతో గొడవపడి నాలుగురోజులయింది. తను భయపడ్డట్లే అయిందా.. ఛా కొంచెం కూడా ఆలోచించకుండా నోటికొచ్చినట్లు అనేసింది.

ఏమాత్రం అన్యాయంగా మాట్లాడినా సహించలేదు. తారాజువ్వలా లేస్తుంది కోపం. కనుబొమ్మలు చిట్లించి నెత్తిమీద కొట్టుకుంది.

"రేపు విష్ణుబావ, అక్క వచ్చేస్తున్నారు. ఈ నెలాఖరుకి నా ఉద్యోగం అయిపోయినట్లే. మనం మూటా ముల్లే సర్దెయ్యాలి."

యమున మొహం తెల్లగా పాలిపోయింది. అనుకున్నంతా అయింది.

"ఎందుకట?" పెదవులు వణుకుతుండగా, నీరసంగా అడిగింది.

"ఇప్పుడున్న కాంట్రాక్ట్ అయిపోయింది. కొత్తవేం రాలేదు. ఇక్కడ లోకల్ వాళ్లకే కొత్త కాంట్రాక్ట్‌లు ఇమ్మని గొడవ చేస్తున్నారుట. ఈ వేసంగులకి, పిల్లలు పరీక్షలు అయ్యాక విష్ణు బావ వాళ్లు కూడా ఇక్కడ్నుంచి మకాం ఎత్తేస్తారనుకుంటా."

అమ్మయ్య. తనమూలాన కాదు. కొంతలో కొంత నయం.

ఈ ప్రైవేటు ఉద్యోగాలంటే అంతే మరి. ఎక్కడికెళ్లాలో..!? యమునకి తల తిరుగుతున్నట్లనిపించింది వికారంగా. నోరంతా చేదుగా. ఏదో అవుతోంది. పరుగు పరుగున బాత్రూంలోకి వెళ్లి భళ్లున వాంతి చేసుకుంది.

"అరే యమునా ఏంటిది? ఎక్కడో అక్కడ దొరుకుతుందిలే. అకౌంట్స్‌లో బాగా అనుభవం వచ్చింది కదా. అంతలా వర్రీ అవద్దు." గిరి యమున వెనుకే వెళ్లాడు.

యమున మొహం కడుక్కుని నీరసంగా మంచం మీద వాలిపోయి గోడకేసి తలపెట్టి పడుక్కుంది, ఎంత పిలిచినా పలక్కుండా. గిరికి గబగబా బైటికి వెళ్లి, రోడ్డుమీదున్న పబ్లిక్ బూత్ నుంచి కావేరికి ఫోన్ చేశాడు.యమునకి ఎప్పుడూ జలుబు కూడా చేసెరగదు.

"నేను వస్తున్నా. గాభరా పడకు మామయ్యా!" కావేరి లోకల్ ట్రైన్ తీసుకుని, స్టేషన్నుంచి టాక్సీ తీసుకుని వచ్చేసింది. తన పిల్లలు కొంచెం పెద్దవాళ్లయ్యారు. ఒక రాత్రి లేకపోయినా పెద్ద బాధలేదు.

కావేరిని చూడగానే గిరి మొహంలోకి కొంచెం కళ వచ్చింది.

యమున ఉలుకు పలుకూ లేకుండా పడుకునుంది. "ఎందుకురా? ఇదికాకపోతే ఇంకో ఉద్యోగం. కష్టపడాలేకానీ ఎన్ని మార్గాల్లేవూ? అంతవరకూ మేములేమా? అప్ప నిన్ను వదిలేస్తారా?"

యమున పక్కనే కూర్చుని తల నిమురుతూ, లేపి కూర్చో పెట్టింది.

"ఏదో వికారంగా ఉందక్కా!" శూన్యంలోకి చూస్తూ మళ్లీ వెళ్లి వాంతి చేసుకుంది. గిరి గుమ్మం దగ్గర నిలబడి వణుకుతూ చూస్తున్నాడు.

కావేరి బాత్‌రూంలోకి వెళ్లి యమున పక్కనే నుంచుని నెమ్మదిగా అదిగింది. యమున అయోమయంగా చూసి తలూపింది.

"మరేం భయంలేదు మామయ్యా కొత్త మెంబర్ రాబోతున్నారు మనింట్లోకి. నువ్వనుకునే కారణం కాదు."

కావేరి నవ్వుతూ వంటింట్లోకి వెళ్లి చెంచాతో పంచదార తెచ్చి, నోట్లో వేసింది. గిరి నవ్వుతూ నోరు చప్పరించాడే కానీ మనసులో ఏదో బెరుకు. ఇప్పుడు ఈ సమయంలో పిల్లలంటే ఎలా తట్టుకోడం? ఉద్యోగం ఎప్పటికి ఎక్కడ దొరుకుతుందో..

"ఏం ఫరవాలేద్రా! హాయిగా నవ్వుతూ ఉండండి. అంతా ఆయన చూసుకుంటాడు.." పైకి చూపిస్తూ అంది కావేరి.

* * *

"అమ్మా! చిన్నక్క వచ్చింది. బావున్నావా అక్కా?" తెల్లకోటు భుజాన వేసుకుని, చేతిలో బాగ్‌తో కాలేజ్‌కి వెళ్లబోతున్న ఆనంద్ గేటు దగ్గరే ఎదురయి, యమున చేతిలో సంచి అందుకున్నాడు. అతను ఆ సంవత్సరమే క్లినికల్స్‌కి వచ్చాడు. రిక్షాలో సామాన్లు దింపించి లోపల పెట్టించాడు గిరి. రాజమండ్రి కానీ, బొంబాయి కానీ ఏమీ సామాన్లు తీసుకెళ్లక పోవడం మంచిదే అయ్యిందనుకుంటా. సుందరి పరుగున వచ్చింది ఇంట్లోంచి.

"యమునా! ఉత్తరం ముక్కయినా రాయలేదేమే వస్తున్నట్లు. కులాసానా?" చెయ్యి పట్టుకుని సంబరంగా అంది.

అమ్మ బాగా సన్నగా అయిందే అనుకుంటూ తలూపి వరండాలో పడక్కుర్చీలో కూర్చున్న సుబ్బులు దగ్గరికి వెళ్లి కాళ్లకి నమస్కారం చేసింది యమున.

సుబ్బులు ఎక్కువగా కదల్లేకపోతోంది. పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోమని, ఆప్యాయంగా అడిగింది.

"ఏమ్మా? అలా చిక్కిపోయావు? ఏమీ సయించడంలేదా?"

యమున సిగ్గుగా తలూపింది.

"బొంబాయిలో అంతా కులాసానా? అక్కావాళ్లూ, బాబాయీ, పిల్లలూ.."

"అందరూ బాగున్నారు నాన్నమ్మా! మేము అనుకోకుండా బయల్దేరిపోయాం. మీకు ఉత్తరం రాయడానికి కూడా టైం లేకపోయింది."

"సర్సరే. వెళ్లి స్నానాలు చేసి భోంచెయ్యండి. ఎప్పుడనగా బయల్దేరారో ఏమో." రామకోటి పుస్తకం చేతిలోకి తీసుకుంటూ అంది సుబ్బులు.

"అక్కా! నాకు టైమయింది. సాయంత్రం కలుద్దాం."

తనకంటే పొడుగయిన ఆనంద్‌ని తలెత్తి చూస్తూ, నవ్వుతూ తలూపింది యమున. అమ్మతో కబుర్లు చెపుతూనే స్నానం, భోజనం ముగించింది. చాలా రోజుల తర్వాత కడుపు నిండా తినగలిగింది.

గిరికి ఎందుకో చాలా మొహమాటంగా అనిపించింది.

గోడక్కొట్టిన బంతుల్లా తిరిగొచ్చేశారు తామిద్దరూ.

మౌనంగా వెళ్లి హాల్లో ఒక పక్కగా చాప వేసుకుని పడుకున్నాడు.

అప్పటికప్పుడు బయల్దేరి రావడంతో రిజర్వేషన్ దొరకలేదు.

జనరల్ బోగీలో దొరికిన ఒక్క సీటూ యమున కిచ్చి తను బాత్రూం పక్కనే కూర్చున్నాడు. కొంచెం తక్కువగా రెండు రోజుల ప్రయాణం. రాత్రి నరహరి వచ్చి లేపేవరకూ అదే పడక.

●●●

ఆ రోజే గిరి కలకత్తా ప్రయాణం.

నరహరి పనిచేసే కంపెనీకి ఉన్న అనుబంధ సంస్థల్లో ఒకదాంట్లో ఉద్యోగం వేయించాడు అల్లుడికి.

"యమునా! జాగ్రత్త. ఉత్తరాలు రాస్తుంటాలే. ఒక గది దొరికినా వెంటనే వచ్చి తీసుకెళ్తా" అలాగె అన్నట్లు తలూపింది యమున. ఏం చేస్తాడు. ఎప్పుడూ బొటాబొటీ జీతమే ఐతే.

యమునకి మూడోనెల వచ్చింది.

గాస్ స్టౌ మీద సాయంత్రాలు వంట చేస్తూ అమ్మకి వంటలో సహాయం కూడా ఉంటోంది.

ఆనంద్ తన చదువుతో నిముషం కూడా ఖాళీ లేకుండా ఉంటున్నాడు.

అక్క గురించి పెద్ద పట్టించుకోవట్లేదు.

ప్రతీనెలా హాస్పిటల్‌కి తీసుకెళ్లి లేడీ డాక్టర్‌కి చూపిస్తున్నాడు.

గుంటూరులోనే ఉన్న స్నేహితులతో బాగా కాలక్షేపం అయిపోతోంది.

సినిమాలు ఉండనే ఉన్నాయి.

అయినా ఎందుకో యమున కళ్లల్లో నీళ్లు తిరిగాయి. రెండు సంవత్సరాలు పైగా.. ఇద్దరూ ఒక్క రోజు కూడా విడిగా లేరు. గిరి పెద్ద పట్టించుకోనట్లున్నా, తన ప్రేమని సరిగ్గా వ్యక్తీకరించలేకపోయినా అదీ తను అనుకున్నట్లు.. దూరం వెళ్తున్నాడంటే ఏదో దిగులు మనసంతా ఆవరించుకుంది.

కలకత్తాలో ముగ్గురు తెలుగువాళ్లతో కలిసి ఒక గదిలో ఉంటున్నాడు గిరి.

తనకంటే పదేళ్లు చిన్నవాళ్లు. చదవగానే పొట్టచేతిలో పట్టుకుని దేశం మీద పడ్డవాళ్లు. గిరి కంటే తక్కువ జీతం అందరికీ. లోకం పోకడలు అప్పుడప్పుడే తెలుసుకుంటున్నారు. సార్, సార్ అంటూ గిరిని ప్రతి విషయం ఆసక్తిగా అడుగుతుంటారు.

నలుగురూ కలిసి వంట.. అందులో అతనే గురువు. గిరి స్వతహాగా మంచి మాటకారి. ఆఫీసులో పనికొట్టిన పిండే ఆరుగంటలకి గదికి వెళ్తే మరునాడు ఎనిమిదివరకూ ఖాళీనే. అదే ఆనంద్‌కి చెప్తే. "ఆ చదువేదో పూర్తిచెయ్యచ్చుకదా" అంటాడు. అదంత సులువా? అందరికీ వంటబట్టద్దూ. ఆదివారం వచ్చిందంటే ఇళ్లవేట నలుగురూ కలిసి తిరిగి తిరిగి, మధ్యలో రోడ్డు పక్కన కాకా హోటల్లో తినేసి వేళ్లాడుతూ గదికి చేరుకుంటారు. ఎంత శ్రమపడ్డా గిరి అనుకున్న బడ్జెట్ లో దొరకడం కష్టంగానే ఉంది. అలా రోజులు, నెలలు గడిచిపోతున్నాయి. ప్రతినెలా మిగిలిన డబ్బు రెండు వందలు ఇంటికి పంపుతున్నాడు. అది యమున సినిమాలకి, పుట్టబోయే పాపాయికి వస్తువు సమకూర్చోవడానికి సరిపోతోంది. నరహరి, సుందరి యమున ఇంట్లో ఉండడం అంత భారం అనుకోవడంలేదు.

ఆనంద్ ఎక్కువగా స్నేహితుల దగ్గర చదువుకుంటూ గడుపుతాడు.

ఇంట్లో ఇంకో మనిషి ఉంటే సందడిగా సహాయంగా ఉంది.

అందరూ ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు.

కానీ యమున మనసులో ఏదో దిగులు.

యమునకి ఏడోనెల వచ్చింది. తొలిచూలు. సీమంతం చేసి, గాజులు పెట్టించాలి. అందరికీ అత్తగారింట్లో చేస్తారు. తల్లిచీర, సారె తీసుకెళ్తే గాజులు పెట్టించి, పేరంటం చేసి తల్లి వెంట పుట్టింటికి పంపుతారు.

సుబ్బులు వయసైపోయి మంచం మీదే గడుపుతోంది.

"ఏం చేద్దామత్తయ్యా? కడుపు చలవకి చలిమిడి మిఠాయి సారెపెట్టాలి. నలుగురు ముత్తైదువులు వచ్చి ఆశీర్వదిస్తే మంచిది కదా?"

"మనమే చేద్దాం. తప్పేముంది? దూరాభారం. గిరి ఎలాగూ రాలేనన్నాడు కదా!" అమ్మా, నాన్నమ్మా మాట్లాడుకుంటుంటే యమునకి అప్పుడు గుర్తుకొచ్చింది, కావేరికి ఎంత బాగా చేశారో.

సాధారణంగా ఏదీ పట్టించుకోని యమునకి చివుక్కుమనిపించింది. ఏదో ఒంటరితనం. ఎవరూ లేరు తనకి అనే భావన. హాల్లో ఒక పక్కగా తనకి వేసిన మంచం మీద పడుకుంది. కళ్లల్లోంచి ధారగా కన్నీళ్లు. కడుపులో బిగపట్టినట్లు అనిపించింది.

"యమునా! లేలే.. బజారు కెళ్లి బట్టలు కొనుక్కుందాం.

నాలుగురోజుల్లో పెట్టారు గురువుగారు గాజుల ముహూర్తం.

నీకు నచ్చిన చీర తీసుకుందువుగాని. జాకెట్టు కుట్టించుకోవాలి. అలాగే వంటావిడకి కూడా చెప్పి వద్దాం."

"నువ్వెళ్లి వచ్చెయ్యమ్మా నాకు రావాలని లేదు" గోడవైపుకి పడుకునే సమాధానం ఇచ్చింది యమున.

"అదేంటమ్మా? ఒంట్లో బాగోలేదా? పక్కింటికెళ్లి తమ్ముడికి ఫోన్ చెయ్యనా?" సుందరి ఆదుర్దాగా అడిగింది.

"బాగానే ఉందమ్మా. నిన్ను వెళ్లమన్నా కదా. నన్ను కాసేపు పడుకోనీ" విసుగ్గా అని తలని దిండులోకి దూర్చేసింది.

ఏం చెయ్యాలో తోచక సుందరి పెదవులు కొరుకుతూ అక్కడ్నుంచి వెళ్లిపోయి, వరండాలో సుబ్బులు పక్కన కూర్చుంది కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా.

"తప్పు చేశామత్తయ్యా దిద్దుకోలేని తప్పు. చిన్నపిల్ల. దానికేం తెలీదు. మన తెలివి ఏమైపోయింది" బొంగురు పోయిన గొంతుతో నెమ్మదిగా అంది.

"అంతా ఆ పై వాడి లీల. మనచేతిలో ఏముంది చెప్పు. దాని అదృష్టం అలా ఉంది కనకే హరికి ఉద్యోగం పోడం. పోనీ అన్నింటికీ మొండిగా వాదించే పిల్ల పెళ్లప్పుడు సరే అని ఎందుకనాలీ. అబ్బాయి ఎప్పుడొస్తున్నాడు?"

"కలకత్తా వెళ్లారు కాంపుకి. సరిగ్గా గాజులనాడు పొద్దున్నే వస్తారుట. అసలు ఉత్సాహంగా లేదు. నాక్కూడా ఈ మధ్యన ఒంట్లో బాగోట్లేదు. డాక్టరుకి చూపించుకోవాలి. చెపితే అది మరీ బాధపడుతుందని ఊరుకుంటున్నాను" నిస్త్రాణగా చాప వాల్చుకుని వాలిపోయింది సుందరి.

●●●

**"అమ్మా!" కావేరి పిలుపు** విని ఉలిక్కిపడి లేచింది సుందరి. కలగనట్లేదు కదా!

"లేమ్మా! సంధ్యవేళ అలా పడుకున్నావేంటి?"

పక్కన కూర్చుని కుదుపుతూ లేపింది.. నిజంగానే కావేరి. ఎక్కడలేని బలమూ వచ్చేసింది. ఒక్క ఉదుట్న లేచి కూర్చుంది.

"నువ్వే... ఇలా ఉన్నట్లుండి.. అంతా కులాసానే కదా?"

కావేరి రాక ఆనందాన్ని కలిగించినా.. ఎక్కడో కొంత శంక. చెప్పకుండా వచ్చేసిందే ఏమీ అవలేదుకదా?

నలభై ఐదేళ్ల నిండుతున్న సుందరికి ఒంట్లోంచి వెచ్చని ఆవిరి వస్తున్నట్లు అనిపించింది. ప్రతి చిన్న విషయనికీ లేనిపోనివి ఊహించుకోవడం మామూలైపోయింది.

కళ్లు తిరిగినట్లయింది. తలంతా భారంగా స్తబ్ధుగా ఉంది. మళ్లీ వాలిపోయింది చాపమీదకి.

"అమ్మా! ఏమయింది? అంత నీరసంగా ఉన్నావేంటమ్మా? మిమ్మల్ని చూడాలనిపించి వచ్చాను. అంతా బానే ఉంది. పిల్లల్ని మా ఆయన చూసుకుంటానన్నారు. మా అత్తగారు వచ్చార్లే. యమున ఎలా ఉంది? ఉండు.. వేడిగా ఏదయినా తెస్తాను."

పెట్టె పట్టుకుని హడావుడిగా లోపలికి నడిచింది కావేరి.

గోడకేసి తిరిగి పడుకున్న యమున నిద్రలోనే వెక్కుతోంది.

ఈ సమయంలో అందరూ అలా పడుకున్నారే... ఎమయింది? అయోమయంగా చూస్తూ నిలుచున్న కావేరికి ఏమి చెయ్యాలో తోచలేదు.

కొంచెం సేపటికి సర్దుకుని, యమున పక్కనే మంచం పట్టెమీద కూర్చుంది.

అలికిడికి యమున మరింత ముడుచుకుపోయింది. మెలుకువ వచ్చీ రాని స్థితి.

కావేరి పెట్టె ఒక వారగా పెట్టి, పెరట్లోకి వెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కునొచ్చి, వంటింట్లో ఏమున్నాయో చూసింది. ఫిల్టర్‌లో కాఫీ డికాషన్ నిండుగా ఉంది. మధ్యాహ్నం వండిన అన్నం, కూరలు సగం పైగా మిగిలిపోయున్నాయి. గట్టిగా నిట్టూర్చింది కావేరి. ఎలా ఉండే ఇల్లు ఎలా అయిపోయింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఎర్రగా కాచిన పాలున్న డేకిసా పళ్లెంలో నీళ్లల్లో పెట్టి ఉంది.

పొయ్యి వెలిగించి కాఫీ కలిపి నాలుగు గ్లాసుల్లో పోసి హాల్లోకి తీసుకెళ్లింది.

వంటింట్లోంచి వస్తున్న చప్పుళ్లకి సుబ్బులు లేచి, 'ఎవరూ?' అంటూ కళ్లకి చెయ్యి అడ్డుపెట్టుకుని హాల్లోకి వచ్చింది.

"అయ్యో, వస్తూనే నువ్వెందుకమ్మా పనిలో దిగడం. నేను కలిపేదాన్ని కదా!" సుందరి కూడా కాళ్ళూ చేతులూ సవరించుకుని నొచ్చుకుంటూ అంది.

"అక్కా!" యమున మంచం మీద కూర్చుని సంబరంగా అంది. కళ్లకింద చారికలు. మొహం ఉబ్బిపోయి, కళ్లు ఎర్రగా జుట్టురేగిపోయి, బాగా ఏడ్చినట్లుంది. అయినా ఒక వింత వెలుగు. కాబోయే మాతృమూర్తి నిండుగా ఉంది యమున.

"ఫరవాలేదమ్మా! మనలో మనకేమిటి? అందరూ ఇలా డీలా పడిపోయారేమిటమ్మా? ఏమయింది? యమున ఒంట్లో."

"బాగానే ఉంది తల్లీ! ఏవో చిన్న చిన్న చికాకులు. అంతకంటే ఏమీలేదు. పిల్లల్ని వదిలేసి వచ్చావుకదా వెంటనే వెళ్ళిపోవాలా?" వేడి వేడి కాఫీ ఊదుకుంటూ అడిగింది సుందరి.

"వారం రోజులుంటాను. తిరుగు రైలు కూడా రిజర్వ్ చేసుకునే వచ్చాను."

"సరిగ్గా సమయానికి వచ్చావు. నాలుగు రోజుల్లో గాజులు పెట్టిద్దామనుకుంటున్నాం యమునకి. ఒక్కదాన్నీ ఎలాగా అనుకుంటున్నా. ఆ దేముడు పంపినట్లే వచ్చావు. బజారుకి వెళ్ళి చీరకొని అలాగే దర్జీకి జాకెట్టు ఇచ్చేసిరండి. నిన్ను చూశాక యమునలో కూడా కళ వచ్చింది."

"అలాగే. ఇప్పుడే వెళ్తాం. ఏం యమునా! మన కుటుంబంలోకి రాబోయే కొత్త మెంబరుకి స్వాగతం పలకొద్దూ? త్వరగా తయారవు. పెద్ద బజారెళ్దాం. అక్కడైతే చాలా రకాలుంటాయి." కావేరి, యమున దగ్గరగా వెళ్లి మొహం పైకెత్తి నుదుటి మీద ముద్దు పెట్టింది. అలాగే అన్నట్లు తలూపుతూ మంచం మీద నుంచి లేచింది యమున, మాంద్యం నుంచి బైటపడి.

# 12

"యమునా యమునా!" ఎవరో పిలుస్తున్నారు. కలలోనా? ఏవేవో నీడలు అటూ ఇటూ కదులుతున్నాయి. ఎక్కడుంది తను? ఒళ్లంతా ఎవరో రోట్లో వేసి కుమ్మినట్లు ఉంది. కానీ తేలిగ్గా భారమంతా చేత్తో తీసేసినట్లు, గాల్లో తేలిపోతున్నట్లు చటుక్కున లేవబోయింది. "వద్దొద్దు. అప్పుడే లేవకు. చిట్టిపాప పుట్టింది నీకు ఎంత బాగుందో ముద్దుగా. కళ్లు తెరిచి చూడు" కావేరి గొంతు కొండల మధ్యలో నుంచి వినిపిస్తోంది. బలవంతంగా కళ్లు తెరిచి చూసింది. కావేరి పాపని అరచేతుల్లో పెట్టుకుని, యమున దగ్గరగా తీసుకొచ్చింది. చిన్ని గుప్పెళ్లు ముడుచుకుని, ఒత్తైన జుట్టు చిన్ని నోరు, అప్పుడే స్నానం చేయించి తీసుకొచ్చినట్లున్నారు. మెల్లిగా చెయ్యి పైకి లేపి జుట్టు సవరించింది. చేతిని అలాగే కిందికి దింపి, ఒళ్ళంతా తడిమింది. మెత్తగా ముట్టుకుంటే మాసిపోతుందనిపించేలా ఉన్న ఈ బొమ్మ తనది. ఒడలంతా వింత పులకింత. అలా చూస్తూ ఉండిపోవాలని ఉంది. చెయ్యి చాచి అందుకోబోయింది. అంతలో నర్స్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చింది.

యమునకి కళ్లు మూసుకుపోతున్నాయి.

"పాపని చూపించేశాక మత్తు ఇంజక్షన్ ఇస్తాం. సిజేరిన్ కదా రెస్ట్ కావాలి."

నర్స్ అంటున్న మాటలు వినిపిస్తూనే నిద్రలోకి జారుకుంది.

కావేరి పాపని జాగ్రత్తగా యమున మంచం పక్కనే ఉన్న ఉయ్యాలలో పడుకోబెట్టింది. చెల్లెలికి వాగ్దానం చేసినట్లుగానే పాప పుట్టే సమయానికి వచ్చింది, ఇంట్లో ఇబ్బంది అయినా కూడా. కొంగుతో మొహం అద్దుకుంటూ, ఒక పక్కగా ఉన్న బెంచి మీద వాలి కళ్లు మూసుకుని గతం నెమరువేసుకోసాగింది.

●●●

సీమంతం చెయ్యడానికి యమునని ఒప్పించడానికి చాలా కష్టపడవలసి వచ్చింది కావేరి. నెలలు నిండుతున్న కొలదీ అభద్రతాభావం, గిరికి సరైన ఉద్యోగం లేకపోవడం, అతను రాకపోవడం, అత్తింటివారి అండలేకపోవడం వివిధ భావాలు కలగాపులగం అయి యమునని డిప్రెషన్‌లోకి దింపేశాయి. రాత్రిళ్ళు వెక్కుతూనే ఉండేది.

"అమ్మలూ. ఇలా అయితే ఎలా చెప్పు. ఇప్పటి నీ మానసిక స్థితి ప్రభావం పుట్టబోయే పాపాయి మీద చాలా ఉంటుంది. ఒక మంచి, ఆరోగ్యకరమైన పాపాయి కావాలా వద్దా చెప్పు. పద నీ కిష్టమైన సినిమాకి వెళ్దాం" కావేరి, ఉన్న వారం రోజులూ ఎంతో ఓపిగ్గా సముదాయించి, మామూలు మనిషిని చేసింది. అనుకున్న ముహూర్తానికే గాజులు పెట్టించి సీమంతం చేశారు. నరహరి ఒక జత బంగారు గాజులు చేయించాడు, తన డిఏలో నుంచి తినీ తినకా డబ్బు మిగిల్చి. సమయానికి బంగారత్త.. నిండు ముత్తైదువ.. వచ్చి పట్టు చీర పెట్టి ఆశీర్వదించింది. అమ్మన్న కూడా తన ఇద్దరు పిల్లలతో వచ్చింది. తను కూడా చీర, సారె పట్టుకొచ్చింది. శివానందం మంచి కంఠస్వరం, విద్వత్తు ఉన్న పురోహితుడు కింద పేరు పొందాడు. ఊర్ల ఊర్ల నుంచీ అతనికోసం వస్తున్నారుట అందరూ.

"చిత్తశుద్ధీ, సంకల్పం, నిజయితీ, శ్రద్ధా ఉంటే ఏ వృత్తిలోనైనా రాణించవచ్చు" అనుకుంది యమున, అమ్మన్నని చూసి. కళకళ్లాడుతూ, ముఖానికి పసుపు రాసి, కళ్లనిండుగా కాటుక, నయాపైసంత కుంకం బొట్టు. పట్టు చీర కట్టుకుని చకచకా తిరుగుతూ పనులు చేసే అమ్మన్నని చూస్తే ముచ్చటేసింది అందరికీ.

"ఆయనతోపాటు నాక్కూడా మంచి బట్టలు పెడతారొదినా చాలామంది. అందులోవే మీకు, అన్నయ్యకీ తెచ్చాను. ఏమీ అనుకోరు కదూ?" పెద్ద కారియర్ల నిండా చలిమిడి, లడ్డూలు, కారప్పూస తెచ్చి, అమాయకంగా అడుగుతున్న అమ్మన్నని దగ్గరగా తీసుకుని రెండు చేతులూ కళ్లకద్దుకుంది యమున. ఉద్వేగంతో కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"అన్నయ్యా కష్టార్జితం. నేను ఏమైనా ఎందుకనుకుంటానూ! మీరు నా కంటే పెద్దవారు కదా. నన్ను మీరు అనడం ఏమిటి?" మెత్తగా మందలించింది.

"అది మన ద్రావిడ సాంప్రదాయం. వదినల్నీ ఆడపడుచుల్నీ మరుదుల్నీ ఎంత చిన్నవాళ్ళయినా మన్నించడం" ఏదో తప్పు జరిగిపోతున్నట్లు ఖంగారుగా అంది అమ్మన్న.

"సరే వదినగారూ అలాగే ఒప్పేసుకున్నాం కదా!" పకపకా నవ్వింది యమున.

యమున మనుషుల్లో పడుతున్నందుకు అక్కడున్న వారంతా గాఢంగా నిట్టూర్చారు. అమ్మన్నని రమ్మనడం మంచిపనే అనుకుంది కావేరి.

తను గుంటూరు వచ్చిన రోజే ట్రంకాల్ బుక్ చేసి అమ్మన్నతో మాట్లాడింది. బోలెడు సంతోషపడిపోయి, వెంటనే సర్దుళ్ళు మొదలు పెట్టేసింది అమ్మన్న. శివానంద అందరికీ అందుబాటులో ఉండేలా ఫోను పెట్టించుకున్నాడు. మధ్యలో ఒకసారి గిరి కూడా వచ్చి వెళ్లడంతో యమునకి కాస్త ఊరట కలిగింది.

●●●

ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారుకుంది కావేరి. "అక్కా!" యమున పిలుపూ, పాపాయ్ ఏడుపూ ఒకేసారి కుదిపినట్లు లేపేశాయి. గుక్క పట్టి ఏడిచేస్తోంది పాపాయి. టైము చూసుకుంది కావేరి. రెండు గంటలు నిద్రపోయారు ముగ్గురూ. తక్కువ అలసటా? రాత్రంతా నొప్పులు పడింది యమున.

ఇంక బేబీ బలహీనం అయిపోతోందని రోజంతా చూసి అప్పుడు ఆపరేషన్ చేశారు. సుందరీ, నరహరీ, ఆనంద్ యమునని గదిలోకి తీసుకు వచ్చాక ఇంటికెళ్లి స్నానాలు చేసి, భోజనం పట్టుకొస్తామని వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేర్చారు. ఆనంద్ దగ్గరున్నాడు. పాపాయిని మొదటగా ఎత్తుకున్నది అతనే.

పట్టించుకోనట్లు ఉంటాడు కానీ సమయం వస్తే ఎంతో బాధ్యతగా చేస్తాడు ఆనంద్. మామూలుగా ఇంట్లో ఎప్పుడూ ఒక మాటా మంతీ ఉండదు. ఎప్పుడొస్తాడో, ఎప్పుడు వెళ్తాడో కూడా తెలియకుండా గడిచిపోతుంటాయి రోజులు.

"మరి వాడు చదివే చదువలాంటిది. మనతో కబుర్లేసుకుని కూర్చుంటే అయినట్లే" కావేరి అంది ఒకసారి, యమున ఏదో చెప్పబోతే. నిజమే కదా అనుకుని ఊరుకుంది యమున.

"అక్కా!" యమున గట్టిగా అరిచింది. కావేరి ఉలిక్కిపడి చంటిపిల్లని చేతులోకి తీసుకుని సముదాయించి, నర్సుని పిలిచింది, యమున అవసరాలు తీర్చడానికి.

●●●

"స్మితా! ఎక్కడున్నావే..? నిన్ను వెతికేసరికే నా పనైపోతోంది. కాస్తకనుమరుగైతే చాలు ఏదో ఒకటి చేసేస్తావు." యమున హడావుడిగా ఇల్లంతా తిరుగుతూ వెతుకుతుంటే నవ్వుకుంది సుందరి. చిన్నప్పుడు తనెన్ని తిప్పలు పెట్టలేదూ.

హైదరాబాద్‌లో చిక్కడిపల్లి పోస్ట్ ఆఫీసు పక్క సందులో ఉన్న కాంపౌండ్లో ఉన్న మూడుగదుల ఇల్లు అది. మూడువాటాల వాళ్లు ఉంటారు.

అందరి ఇళ్లల్లోనూ తిరుగుతూ ఉంటుంది చిన్నారి స్మిత.

ఎక్కడుందో ఎప్పుడూ వెతుక్కోవలసిందే.

యమున కూతురి బారసాల గుంటూర్లో బాగానే చేశారు.

అమ్మన్న వచ్చి పాపాయికి బోలెడు గౌన్లు తెచ్చింది. లక్ష్మీస్మిత అని పేరు పెట్టారు. గిరి తల్లిపేరు లక్ష్మి. స్మితకి రెండేళ్లు నిండుతుండగా గిరి కలకత్తా నుంచి వచ్చేశాడు. వాళ్ల కంపెనీలో సగం మంది ఉద్యోగుల్ని తీసేశారు, నష్టాలు వస్తున్నాయని. "ఎక్కడేం జరిగినా ముందు నా మీదే చూపిస్తుంది విధిప్రభావం" గిరి వాపోతుంటే ఆనంద్ ఓదార్చాడు.

ఆనంద్ ఇ.సి.యఫ్.యమ్.జి పాసయి అమెరికా వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నాడు.

నరహరి పొగాకు కంపెనీ నుంచి రిటైర్ అయి, హైదరాబాదులో ఒక పబ్లిషింగ్ కంపెనీలో చేరాడు సూపర్ వైజర్‌గా. అది ప్రసాదం వాళ్ల బంధువులది. అతనే సిఫార్స్ చేసి ఇప్పించాడు.

ఏదో ఒక సంపాదన లేందే గడవని స్థితి. ఆనంద్ నిలదొక్కుకునే వరకూ తప్పదు.

ఆనంద్ విమానం ఎక్కడానికి ముందే మకాం హైదరాబాద్ మార్చేశారు.

మూడుగదుల ఇల్లైనా సదుపాయంగా ఉంది. గుంటూరు ఇల్లు అమ్మేసి, వచ్చిన డబ్బు ఫిక్సిడ్ డిపాజిట్‌లో వేశాడు నరహరి. నెలనెలా వచ్చే వడ్డీ, తనజీతం.. బాగానే సరిపోతోంది. గిరి ప్రస్తుతం ఖాళీనే.

యమున సంసారం ఇంట్లో ఉండడం ఇప్పుడు అందరికీ అలవాటైపోయింది. రోజూ పదింటికి భోజనం చేసి సిటీ అంతా సర్వే చేసి వస్తుంటాడు గిరి.

ఎప్పట్లాగా నెల ఖర్చంతా యమునే చూస్తోంది.

బలాదూర్ తిరుగుతున్నాడని మొగుడ్ని విసుక్కుంటూనే.

సినిమాలు ఉండనే ఉన్నాయి. అక్కడ మాత్రం సర్దుకునే సవాలే లేదు.

"అమ్మా! నేనలా వెళ్లి చూసొస్తా. పక్కిళ్లల్లో ఉందేమో ఒట్టి రాలుగాయి పిల్లైపోయింది." యమున చీర మార్చుకుని బైటికి నడిచింది. "ఎవరూ?" వరండాలో కూర్చున్న సుబ్బులు అడిగింది, చెవులు రిక్కించి.

ఆవిడకి కళ్లు కనిపించట్లేదు సరిగ్గా. కేటరాక్ట్ ఆపరేషన్ చేయించాలి. ఇంకా కొంచెం ముదిరితే కానీ చెయ్యమన్నారు.

"నేనే నానమ్మా! స్మిత కనిపించటంలేదు. ఎక్కడికెళ్లిందో. నీకేమైనా తెలుసా?"

"నాకింకేం కనిపిస్తుందే ... శబ్దం అయితే కానీ! అదేమో చప్పుడు చెయ్యకుండా జారుకుంటుంది. మీరేమో కాలికి గజ్జెలు కట్టండ్రా అంటే వినరు." సుబ్బులు కంగారుగా లేస్తూ అంది.

"నువ్వు లేవకు. ఊరికే గాభరాపడొద్దు. బి.పి పెరుగుతుంది. కాళ్లగజ్జెలా... సరేలే ఎన్నిసార్లు కట్టినా తీసేస్తుంది. లేపోతే పడేసుకునొస్తుంది. మనకేమైనా వెండి బంగారాల షాపుందా చెప్పు."

అంటూనే కాంపౌండంతా వెతికింది యమున.

"అమ్మా! ఎక్కడాలేదమ్మా" ఏడుపు గొంతుతో అంది. కళ్లలోంచి నీళ్లు. సుందరి గబగబా చెప్పులేసుకుని వచ్చింది.

"ఈ మహానగరంలో ఎక్కడని వెతుకుతామే బాబూ. కాస్తటు వెళ్లిందంటే మెయిన్ రోడ్ బస్సులవీ తిరుగుతుంటాయి. పద. నేనిటూ నువ్వటూ వెళ్దాం."

గేటు తీస్తుండగా నవ్వులు వినిపించాయి. గిరి చెయ్యిపట్టుకుని, మెడపైకెత్తి ముద్దుమాటలతో ఏదో చెపుతూ చేతులు తిప్పుకుంటూ పకపకా నవ్వేస్తోంది మూడేళ్ల స్మిత.

యమునకి పట్టరాని కోపం వచ్చింది.

స్మితని గిరి దగ్గర్నుంచి లాక్కుని బరబరా ఇంట్లోకి తీసుకుపోయింది. వీపు మీదకి చెయ్యిలేపబోయేంతలో గిరి చెయ్యిపట్టుకున్నాడు.

"నన్నాపకండి!" ఆగ్రహంగా అంది. మొహం కోపంతో ఎర్రగా అయిపోయింది.

"చిన్నపిల్లని అలా బాదేస్తావా ఏమిటి?" గిరి నవ్వుతూ అన్నాడు.

"మీకు నవ్వులాటగానే ఉంటుంది. ఏదైనా బాధ్యత తీసుకుంటే కదా తెలిసేది. ఎవరితో చెప్పకుండా తీసుకెళితే మాకు గాభరా వెయ్యదూ. మీకెలాగా పట్టదు. దీనికైనా తెలియద్దూ చెప్పెళ్లాలని. దొంగముండా.. ఎప్పుడైనా అమ్మకి తెలియకుండా వెళ్తావా?"

బిత్తరపోయి చూస్తున్న స్మిత చెంప ఛెళ్లుమనిపించింది. మూడువేళ్లు బూరెబుగ్గల మీద ఎర్రగా తేలాయి.

స్మిత షాక్‌తో గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

గిరి మొహం జేవురించింది.

"నా కూతుర్ని నేను తీసుకెళ్లడానికి పర్మిషన్ కావాలా?" నెమ్మదిగానే అన్నాడు. యమునని అంత కోపంగా ఎప్పుడూ చూడని గిరి. కానీ అతనికేం తెలుసు. ఎప్పట్నుంచో లోలోపల పేరుకుపోయిన బాధంతా అప్పుడు వెళ్లగక్కుతోందని. ముప్ఫై ఐదేళ్లు దాటినా జీవితంలో స్థిరపడి తనకంటూ ఒక సంసారం ఏర్పరచుకోని మొగుడు.. పైకి చెప్పకపోయినా అందరూ చులకనగా చూస్తున్నారే అని దుఃఖం. ఎవరికీ చెప్పుకోవట్లేదు కానీ యమునని తరచూ తలనొప్పి వేధిస్తోంది.

తనకే తెలియకుండా ఏర్పడిన న్యూనతా భావం కాల్చేస్తోంది.

తనదే ఏదో తప్పైనట్లు నిమ్మకి నీరెత్తినట్లు నిష్ఠూరంగా మాట్లాడుతున్న గిరిని చూస్తే ఇంకా ఒళ్లు మండిపోయింది యమునకి.

ఏదో అనబోయింది కానీ, తలనొప్పితో కళ్లు ఎర్రగా అయి, తలపైకెత్తలేక బొటబొటా కన్నీళ్లు కారుస్తూ పరుగెడుతున్నట్లు లోపలికి పారిపోయింది. నిర్ఘాంతపోయిన సుందరి ఏడుస్తున్న స్మితని సముదాయిస్తూ వంటింట్లోకి నడిచింది అడుగులో అడుగువేసుకుంటూ.

గిరి మారు మాట్లాడకుండా వరండాలోంచే వీధిలోకి వెళ్లిపోయాడు.

●●●

రాత్రి పన్నెండవుతోంది.

హుసేన్‌సాగర్‌లో ప్రతిఫలిస్తున్న దీపాలకాంతులు చెరువులోని కెరటాలతో కలిసి నాట్యం చేస్తున్నాయి.

చల్లనిగాలి అక్కడక్కడా ఇంకా తిరుగుతున్న జంటల్ని పలుకరిస్తోంది .

అదేమీ పట్టనట్లు, ఆకలిదప్పులు మరచి బెంచిమీద వెనక్కి వాలి అలా కూర్చుండిపోయాడు గిరి.

మధ్యాహ్నమనగా ఇంట్లోనుంచి వెళ్లిపోయిన గిరి నడుచుకుంటూ టాంక్‌బండ్ వచ్చి రెండు సార్లు ఈ చివర్నుంచి ఆ చివరికి తిరిగి, అక్కడున్న బెంచీ అంచుమీద కూర్చుని జుట్టులోకి చేతులు పోనిచ్చి చిందరవందర చేసుకోసాగాడు.

ఆలోచించి ఆలోచించి పిచ్చెక్కిపోతుందేమో అనిపించింది.

ఎంతో కష్టపడి పనిచేస్తాడు తను. కానీ ఎందుకిలా ఏ ఒక్కటీ స్థిరంగా ఉండదు? తలరాత. జాతకం అనేవి నమ్మాలేమో అనిపిస్తోంది. లేకపోతే వంశపారంపర్యం హెరిడిటిరీ అంటారు అదేనా?

అందుకనేనా ఉద్యోగం ఎన్ని రోజులు చేశాడో ఖాళీగా అంతకు మించినన్ని రోజులు ఉన్నది? చదువుకుని ఆ డిగ్రీ పాసయితే బాగుండేదేమో?

అదేమిటో ఎంత చదివినా సబ్జెక్ట్ మాత్రం జ్ఞాపకం ఉండదు. తండ్రి తెలివే రావాలా? తాతగారి పోలిక రాకూడదూ?

కడుపులో పేగులు అరుస్తున్నాయి. తనవికానట్లు ఆకాశంకేసి చూసి చెయ్యి విసిరాడు. దేముడిని ప్రశ్నిస్తున్నట్లు.

లేచి టాంక్ బండ్ రైలింగ్ పట్టుకుని వంగుని నీళ్లల్లోకి చూస్తూ నిల్చున్నాడు. భుజం మీద ఎవరిదో చెయ్యిపడింది.

ఎవరూ పోలీసులా? ఒక్కడివీ ఇక్కడేం చేస్తున్నావని అడిగితే ఏం చెప్పాలి? ఇక్కడ ఉండడానికి కాలపరిమితి ఉందా?

●●●

"మావయ్యా!"

వెనక్కి తిరిగాడు గిరి.

ఆనంద్! భయంగా చూస్తున్నాడు రైలింగ్ పట్టుకుని.

"ఏమయింది ఆనంద్? ఇంట్లో అందరూ.. యమున.. ఏం అవలేదుకదా?" అయోమయంగా చూస్తూ అన్నాడు.

"వాళ్ళంతా బాగానే ఉన్నారు. నువ్వేంటి ఇలా ఒంటరిగా.. ఇంట్లోనుంచి పదకొండింటికి వచ్చేశావుట. నేను హాస్పిటల్ నుంచి ఇంటికెళ్ళగానే బయల్దేరి వచ్చేశా తెలుసా? మొదట ఇక్కడ చూసి, స్టేషన్‌కి వెళ్దామనుకున్నా. అలా వంగుని ఏం చేస్తున్నావు? " మందలిస్తున్నట్లు అన్నాడు ఆనంద్.

"అబ్బే .. ఏం లేదు.. మనసు బాగోలేక.. కాసేపు ఒంటరిగా.."

"అంతేసేపా? ఇంట్లో అందరూ ఎంత ఖంగారు పడుతున్నారో తెలుసా? అప్పకూడా వస్తానన్నారు. నేనే వద్దన్నాను. ఇంటికి పద. రేపు మాట్లాడుకుందాం."

"కాసేపు ఇక్కడ కూర్చుందాం ఆనంద్.. ప్లీజ్."

"ఆకలెయ్యట్లేదా? మధ్యాన్నం కూడా ఏమీ.."

"నాకు చిన్నప్పట్నుంచీ అలవాటే. రెండు రోజులవరకూ ఉండగలను."

"కానీ నేనుండలేనే ఆకలి దంచేస్తోంది. ఇవాళే నేను పనిచేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్ లో చివరి రోజు. వచ్చేవారం నా ప్రయాణం. చెయ్యవలసిన పనులు బోలెడు."

ఆనంద్ ఎంతలసిపోయాడో అతని మాటతో తెలిసిపోతోంది.

"అయాం వెరీ సారీరా.. పద ఇంటికెళ్దాం" ఆనంద్ చెయ్యిపట్టుకుని నడిపించాడు గిరి. ఇంటి ముందు ఆగిన ఆటో చప్పుడు విని నరహరి గేటు దగ్గరకి వచ్చాడు. లోపలికి వస్తున్న గిరిని చూసి యమున ఇంట్లోకి వెళ్ళిపోయింది.. పెదవులు వణుకుతుండగా, వస్తున్న ఏడుపు ఆపుకుంటూ.

నరహరికి గిరిని లాగి ఒక్కటెయ్యాలనిపించింది. స్వతహాగా సాధు స్వభావుడతను. పైగా చిన్నప్పట్నుంచీ ఎంత తన దగ్గరుంచుకుని చూసుకున్నా అల్లుడు.. అతి కష్టం మీద నిగ్రహించుకున్నాడు. వేళకి తిని ఇంట్లో కూర్చోలేక.. వేషాలు.. కనుబొమ్మలు ముడిచి, ముఖంలో కండరాలన్నీ బిగుసుకు పోతుండగా ఒక్కమాట అన్నాడు, "చెప్పకుండా ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లకు గిరీ. నా మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా"

అక్కడున్న అందర్నీ పరికించి చూశాడు గిరి.

సుబ్బులు కూడా నిద్రపోకుండా తన పడక్కుర్చీలో కూర్చుని జపమాల తిప్పుతోంది. సుందరి వరండాలో ఉన్న స్థంభానికి ఆనుకుని కళ్ళు విప్పార్చి చూస్తోంది. అప్పుడు కానీ గిరికి అర్థం అవలేదు.

తను అనాలోచితంగా చేసిన పనులు ఎందర్ని బాధపెట్టాయో.

"నన్ను క్షమించు బావా! ఇంకెప్పుడూ ఇలా జరగదు." తల దించుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

యమున నిశ్శబ్దంగా రెండు కంచాలు పెట్టి భోజనం వడ్డించింది. అన్నాన్ని చూడగానే ఆకలి తనున్నానంటూ ముందుకురికింది. కాళ్ళూ చేతులూ కడుక్కుని, ఆనంద్ పక్కన కూర్చుని మాట్లాడకుండా భోజనం ముగించి, తన పక్క మీద వాలిపోయాడు గిరి.

ఆ మూడు గదుల ఇంట్లో, ముందు గది రాత్రికి గిరి పడక గదిగా మారిపోతుంది. మధ్య గది హాలులా ఉంటుంది. అందులోనే మిగిలిన వాళ్ళ పడక. సుబ్బులుకి, నరహరికి పట్టెమంచాలు. సుందరి ఆనంద్ కింద చాపల మీద బొంతలు పరచుకుని పడుకుంటారు. ముందు గది బెడ్ రూం అని పేరే కానీ, రాత్రి ఎంత ఆలస్యంగా పడుకున్నా సరే తెల్లవారు ఝామున నాలిగింటికి లేచిపోవలసిందే హాస్పిటల్ డ్యూటీలు, ఒక్కోసారి సెకండ్ షో అయ్యాక అర్ధరాత్రి తలుపు తడ్తాడు. ఎప్పుడు ఎవరు లేపుతారో అని అప్రమత్తంగా ఉండాలి.

నిశ్చింతగా నిద్రపోయి ఎన్నాళ్లయిందో అనుకుంటుంది అప్పుడప్పుడు. అదే తమకంటూ ఒక ఇల్లు, ఒక్క గదైనా సరే.. ఉంటే?

●●●

"అత్తయ్యగారూ మీకు ఫోన్. అమెరికా నుంచి ఆనంద్ అన్న." పక్కింటివారి అమ్మాయి వచ్చి పిలిచింది.

ఆదివారం పొద్దున్న ఎనిమిదయింది.

నరహరి వరండాలో కూర్చుని పేపర్ చదవడం అయ్యాక రెండో డోస్ కాఫీ కూడా ముగించి, తల్లితో పిచ్చాపాటీ కబుర్లు చెపుతున్నాడు. గిరి ఇంకా లేవలేదు.

ఆనంద్ అమెరికా వెళ్లి మూడునెలలయింది.

న్యూజెర్సీలో తనకి కావలసిన ఫీల్డ్‌లోనే రెసిడెన్సీ దొరికింది. హాస్పిటల్ దగ్గర్లోనే, తనకంటే ముందు వెళ్ళిన ఇద్దరు డాక్టర్స్‌తో కలిసి అపార్ట్‌మెంట్ తీసుకున్నాడు. నైట్ డ్యూటీలు ఎక్కువగా చేస్తుంటే డబ్బు బాగానే మిగులుతోంది.

అమెరికా నుంచి ఫోన్ అనగానే ఇంట్లో అందరూ పక్కింటి వరండాలోకి చేరారు. వాళ్ళు కిటికీలోంచి ఫోన్ బైటికి ఇచ్చారు.

గిరి కూడా లేచి గబగబా మొహం కడిగేసుకుని వెళ్లాడు.

"ఆనంద్ ఎలా ఉన్నావు నాన్నా? వేళకి సరిగ్గా తింటున్నావా?" సుందరికి అతను సమాధానం చెప్పేలోగా నరహరి అందుకున్నాడు.

"అక్కడ ఇల్లు అదీ సదుపాయంగా.."

అంతలో యమున అందుకుంది.

"ఆనంద్ ఆరోగ్యం జాగ్రత్తరా"

"నన్ను మాట్లాడనియ్యకుండా మీరే ఒకళ్ల తరువాత ఒకళ్లు వాయిచేస్తుంటే ఇంకేం చెప్తాను? మీ అందరి ప్రశ్నలకీ ఓ.కే. ఆన్సరే. ఫోన్ గిరి మామయ్యకి ఇవ్వండి."

"ఆ చెప్పు ఆనంద్. ఏంటీ నన్ను అక్కడికి తీసుకెళ్తావా?" గిరి నవ్వుతూ అడిగాడు.

"దానికింకా చాలా టైముంది మామయ్యా! మీరేదో ప్లాస్టిక్ కవర్ల బిజినెస్ చేస్తానన్నారు. ఏమయింది? దానికి ఎంత డబ్బు కావాలి?"

"పదివేలుంటే మొదలు పెట్టచ్చు ఆనంద్. అంటే ప్రెమిసిస్ అదీ కావాలనుకో"

"ముందు మనింట్లో ముందుగదిలో మొదలు పెట్టండి. నేను పదివేలు పంపుతాను. చిన్నక్కకి కూడా పని చెప్పండి. తనకి ఇష్టమైతే"

ఆనంద్ మాటలు విని గిరి నమ్మలేనట్లు సంభ్రమంగా చూశాడు. వెళ్లిన మూడు నెలల్లోనే పదివేలా?

"కొంత అప్పు తీసుకుని పంపుతున్నా మామయ్యా జాగ్రత్తగా ఖర్చు పెట్టండి" అందరితో.. సుబ్బులుతో కూడా వరుసగా మాట్లాడి ఆనంద్ ఫోన్ పెట్టేశాడు. ఆ రోజు సాయంత్రం వరకూ ఏ పని చేస్తున్నా ఆనంద్ గురించీ, ఆ ఫోన్ కాల్ గురించీ మాట్లాడుకుంటానే ఉన్నారు అందరూ. పక్కింటి వాళ్లతో సహా!

●●●

"పవర్ ప్లాస్టిక్స్ - అనే పేరు ఎలా ఉంటుంది?"

గిరి పొడుగు పుస్తకంలో మొదటి పేజీ మీద మధ్యలో 'అవిఘ్నమస్తు', 'శ్రీరామ', 'ఓం నమశ్శివాయ' రాసి అడిగాడు.

ఇంట్లో వారంతా ముందుగదిలో సమావేశమయ్యారు.

"ఏదైనా తెలుగు పేరు చూడచ్చు కదా?" నరహరి అడిగాడు.

"అసలు ప్లాస్టిక్ అనే మాటే ఇంగ్లీష్. దానికి ముందు తెలుగు పదం పెడితే దుష్ట సమాసంలా ఉంటుంది." గిరి మాటలకి అందరూ నవ్వారు.

"బాగానే ఉంది. అయితే ముందు ఆ పేరు అచ్చుచేయించాలి. కింద మన పేరు అడ్రస్, ఫోన్ నెంబర్ ఇవ్వాలి. అన్నట్లు ఫోన్‌కి అప్లై చేశారా?

మన అల్లరి పిల్లకి ఇక్కడి సరుకులు అందకుండా చెక్క అల్మార్లు చేయించాలి. చాలా పనులున్నాయి" ఒళ్ళో పడుకున్న స్మిత తల నిమురుతూ అంది యమున."

"ఫోన్‌కి ఎప్పుడో పెట్టేశాను. మనం హైదరాబాద్ రాగానే. ఇంకొక నెలలో రావచ్చు. బోంబేలో ఒక కంపెనీకి ప్లాస్టిక్ షీట్స్ కోసం రాశాను.

వాళ్ళ దగ్గరున్న అన్ని రకాల శాంపుల్స్ పంపించారు.

మొదట మూడు రకల సంచిలు చేద్దామనుకుంటున్నాను.

అంటే మందంలో తేడాలుంటాయి. ఒక్కో థిక్‌నెస్‌కీ మూడు సైజుల్లో, మొత్తం తొమ్మిదిరకాలుంటాయి. అవి సుల్తాన్ బజార్ షాపుల్లోనూ, చిక్కడపల్లి షాపుల్లోనూ సాంపుల్స్ ఇస్తే వాళ్లు మనకి ఆర్డర్లిస్తారు. సంచిలు చెయ్యడానికి ఒక మెషిన్ ఉంటుంది.

దానిమీద రెండు షీట్లు పెట్టేస్తే అతుక్కుపోతాయి. ఎల్క్ట్రిక్‌ది. మనక్కావలసిన సైజు, షేపుల్లో కత్తిరించుకుని పెట్టెయ్యడమే"

సుబ్బులుతో సహా అందరూ ఉత్సాహంగా గిరి చేస్తున్న తొలి వ్యాపారానికి ఎవరికి తోచిన సలహాలు వాళ్ళిస్తున్నారు. యమున మరీ హుషారుగా ఉంది. ఈ ప్రయత్నం ఫలిస్తే తను, పాప, గిరి.. ఒక చిన్న ముచ్చటైన ఇల్లు తీసుకుని, తాము ముగ్గురే. చిన్ని సంసారం, చింతలు లేని సంసారంలాగా ఉంటారు. కలల్లో తేలిపోసాగింది.

●●●

"అయ్యయ్యో! అదేంటమ్మా.. అట్ల వంకరగా చేస్తున్నారూ? మన మాల్ షాపుల కెళ్లాల్నా వద్దా?" బొమ్మలు, పేర్లు అచ్చు వేయించిన సంచిలు పేర్లని బట్టి వరుసల్లో పేర్చుతున్న యమున కొంచెం గట్టిగానే అడిగింది సంచులు చేస్తున్న అమ్మాయిలిద్దర్నీ. అనుకున్నట్లు కాకుండా, ఆర్డర్ ఇచ్చిన షాపుల పేర్లు వాళ్ల అడ్వర్టైజ్‌మెంట్ బొమ్మలు పెద్దగా వేయించాల్సి వచ్చింది. 'పవర్‌ప్లాస్టిక్స్' ఒక మూల ఒదిగి, పరిశీలిస్తే కానీ కనిపించట్లేదు.

మూతి మూడు వంకలు తిప్పి, మర్నాటినుంచే పనిలోకి రావడం మానేశారు ఇద్దరూ.

"మన పేరు భూతద్దం పెట్టి చూస్తే కానీ కనిపించట్లేదు. మనం చేస్తున్నామని ఎవరికి తెలుస్తుంది?" ఆ రోజు రాత్రి నిష్ఠూరంగా అంది యమున, మూసుకుపోతున్న కళ్లని బలవంతంగా తెరుస్తూ.

కొంత వాదన అయ్యాక యమునని ఒప్పించాడు గిరి.

"సరుకులు కొనే షాపుల పేర్లుండాలి కానీ, మనపేరుంటే ఎలా? మన కంపెనీ పేరు షాప్స్‌కి మాత్రమే తెలియాలి. దానికి మనం ఇచ్చే శాంపుల్స్ చాలు.."

మొదటి నాలుగు నెలలూ కొంచెం కూడా లాభం రాలేదు.

సంచులు చెయ్యడం చేత కాక సగం పైగా షీట్లు వేస్ట్ అయిపోయాయి.

అడిగిన రేటు కంటే సగం తగ్గిస్తేనే కానీ ఎవరూ కొనట్లేదు.

ఎంతమంది పనివాళ్లని మార్చినా పాడయేవి పాడవుతూనే ఉన్నాయి. చివరికి బాగా అనుభవం ఉన్న నాగేశుని చార్మినార్ నుంచి వెతికి పట్టుకొచ్చాడు గిరి. కొంచెం జీతం ఎక్కువైనా టకటకా ముగ్గురి పని చేసేస్తున్నాడు నాగేశు. నెమ్మదిగా నిలదొక్కుకుంటున్నారు. బోంబేలో అన్ని కంపెనీల నుంచీ కొటేషన్స్ తెప్పించి, బేరం ఆడి.. షీట్ల కొనుగోలు ధర ఇరవై శాతం తగ్గించగలిగాడు గిరి.

సంవత్సరం తిరిగేసరికి ఖర్చులు పోను నెలకి రెండువేల వరకూ మిగలసాగింది. ఇంక యమున తమకోసం ఒక హాలు విడిగా ఉండేట్లు చూస్తున్న సమయంలో అనుకోని సంఘటనలు రెండు జరిగాయి.

●●●

అంతా సవ్యంగా జరిగిపోతోంది. సుబ్బులు కూడా తన పడక్కుర్చీలోనే కూర్చుని, సైజు వారీగా సంచుల్ని వేరుచేస్తోంది. సుందరి సరేసరి. యమున కూడా బైటికి వెళ్ళి కొత్త ఆర్డర్లు తెస్తోంది.

ఒకరోజు.

గిరికి బాగా తెలిసినవాళ్ళు.. కలకత్తాలో అతని గదిలో ఉండి లోకజ్ఞానం సంపాదించిన కుర్రాళ్లిద్దరు ఇంటికొచ్చి గిరి చేస్తున్న వ్యాపారాన్ని చూశారు.

చాలా రోజుల తరువాత శిష్యులని చూసిన ఆనందంలో పూసగుచ్చినట్లు అంతా తను మొదలు పెట్టినప్పటి నుంచీ పడిన శ్రమ, చేసిన మార్కెట్ సర్వే.. ఎప్పుడు ఎక్కడ ఏం చెయ్యాలో, ఏది చెయ్యకూడదో అంతా వివరించాడు గిరి, భోళాశంకరుడు. అచ్చు భక్తులకి వరమిచ్చి చిక్కుల్లో పడే పరమ శివుడిలాగే.

"అయితే గురూగారూ వీటికి చాలా డిమాండ్ ఉందంటారా?"

"ఓ.. బోలెడు. ఇప్పుడిప్పుడే మనదేశంలో కాగితాల సంచులు వాడడం తగ్గించేస్తున్నారు. చెట్లు కొట్టీ కాగితం చెయ్యడంతో వాతావరణం దెబ్బతింటోందని. పైగా ఇవి ఒక పట్టాన చిరగవు. ఎన్ని రోజులైనా ఏవైనా దాచుకోవచ్చు." ఒక అరగంట ప్లాస్టిక్ సంచుల ఉపయోగాలు చెప్పాడు.

"మరి వేరే పెద్ద ప్రెమిసిస్ తీసుకుని అభివృద్ధి చెయ్యచ్చు కదా?"

"అదే అనుకుంటున్నా.. కొంచెం నిలదొక్కుకున్నాక.. అమెరికాలోలాగా జిప్ ప్లాస్టిక్ సిస్టం పెట్టి తయారు చేద్దామనుకుంటున్నా. ఇదిగో ఇతనికి నేర్పిస్తున్నా.." నాగేశుని చూపించి, ఆనంద్ పంపిన జిప్‌లాక్ బాగ్ తీసి, ఎలా పనిచేస్తుందో చూపించాడు.

"వావ్. ఇలాంటిది ఎక్కడా మేం చూడలేదండీ గురూగారూ. సక్సెస్ అయితే పేలిపోతుంది మార్కెట్."

హాయిగా నవ్వాడు గిరి. మార్కెట్ సంగతెలా ఉన్నా, ముందు తన బిజినెస్సే.. గిరీ, శిష్యులూ నవ్వుకుంటూ వరండాలోకి వచ్చారు.

అప్పుడే సికింద్రాబాద్ మార్కెట్ అంతా తిరిగి తమ సంచులు, వాడకంలో ఉన్న ఇతర వాటికంటే ఏ విధంగా మంచివో. వాటి ఉపయోగాలు ఏమిటో గొంతు పోయేలా వివరించి, కొన్ని చిన్న ఆర్డర్లు తీసుకుని, బస్టాండు నుంచి సంచులతో పాటు కూరగాయలు కూడా మోసుకొచ్చిన యమున ఉస్సురంటూ వరండాలో కుర్చీలో కూలబడింది. మొహం అంతా ఎర్రగా కందిపోయింది. చెమటలు ధారగా కారుతున్నాయి.

అనుకున్న పని ఎంత కష్టమైనా సరే అలసట ఎరుగకుండా చేస్తుంది. చేస్తున్న పని ఆపి, సుందరి లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

"అక్కా! అలాగే మరో మూడు" వరండా చివరికి వెళ్ళి సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు గిరి. యమున చిరాగ్గా చూసింది. కొంత డబ్బు కనిపిస్తుంటే కొత్త అలవాట్లూ.. తనేదో బిర్లా అయిపోయినంత బిల్డప్పూ!

ఎండలో వచ్చిన యమున మనసులోనే విసుక్కుంది, పొగ గుప్పున వదుల్తూ శిష్యులతో కబుర్లు చెప్తున్న గిరిని చూసి.

"యమునా! వీళ్ళిద్దరూ కలకత్తాలో నా రూమ్మేట్స్. భలే తమాషాగా ఉండేవిలే ఆ రోజులు. "గిరి పరిచయం చేశాడు. ఎందుకో వాళ్ళిద్దరి మీద సదభిప్రాయం కలుగలేదు యమునకి. 'అలాగా' అన్నట్లు తలూపి లేచి లోపలికెళ్ళిపోయింది.

యమునకి ఏదో అశరీరవాణి హెచ్చరిస్తున్నట్లు అనిపించింది. మనసులో గుబులుగా, భయంగా అనిపించింది.

భయపడినట్లుగానే ఒక నెల తిరిగేలోగా గిరి శిష్యులిద్దరూ సుల్తాన్ బజార్లో ఒక మల్గీ తీసుకుని ఇదే బిజినెస్ మొదలుపెట్టడం, మరో రెండు నెలలు గడిచే లోగా నాగేశుకి ఎక్కువ జీతమే కాక లాభాల్లో పెర్సెంటేజి ఇస్తామని, గిరినుంచి అతన్ని తప్పించడం జరిగిపోయాయి.

నాగేశు గురించి తెలిసినా గిరి పట్టించుకోలేదు. అప్పటికే మరో ఇద్దరికి ట్రైనింగ్ ఇచ్చేశాడు. సుల్తాన్ బజార్ వ్యాపారులందరూ తక్కువ ధరకి ఇస్తున్నారని, వాళ్ళిద్దరికే ఆర్డర్లిస్తున్నారు. ఈ కుట్రంతా గిరికి తెలిసే సరికి మూడు నెలలు పట్టింది. అప్పుడే దీపావళి దగ్గర పడుతోంది.

సప్లై ఎక్కువ చెయ్యాలి అనుకుంటున్న సమయంలోనే అంతా జరిగిపోయింది. ఇంట్లో ముందు గదంతా స్టాక్‌తో నిండిపోయింది.

సరిగ్గా నడవడానికి మాత్రం తోవ ఉందంతే.

వీళ్లు కాకపోతే ఇంకొకళ్లు. సిటీలో షాపులకి కరవు రాలేదుకదా. అనేకసార్లు ఉద్యోగాల్లో ఆటు పోట్లు తట్టుకున్న గిరి నిబ్బరంగానే ఉన్నాడు, యమున డీలా పడిపోయినా కూడా.

సిగరెట్ల వాడకం మాత్రం రోజుకి నాలుగు సిగరెట్లనుంచి రెండు పాకెట్లకి పెరిగింది. అదీ ఇంకొక దెబ్బ తగిలేవరకూ.

●●●

దీపావళికి వారం ముందే ఆరేళ్ళ స్మిత, తాతగారితో వెళ్ళి తనక్కావలసిన టపాసులన్నీ తెచ్చుకుంది. సుందరి అన్నీ చేటలో పెట్టి పెరట్లో ఉన్న కొద్దిజాగాలో ఆరబెట్టింది. ముందు గది బిజినెస్ సెంటర్ అవడంతో, యమున, గిరి వంటింట్లో పడుకుంటున్నారు. రాత్రి భోజనాలయ్యాక, వంటిల్లు కడిగేసి, బట్టతో తుడిచేసి రెండు చాపల మీద పరుపులు పరచి, ఉతికిన దుప్పట్లు వేస్తుంది యమున. వెలుగొచ్చినా రాకపోయినా, ఐదింటికల్లా లేచేసి మళ్ళీ అన్నీ చుట్టేసి మధ్య గదిలో సర్దేస్తుంది. దీపావళి ముందు రోజు అన్నీ సర్దుకున్నాక ఎక్కడా జాగా లేకపోవడంతో ముందు గదిలో తలుపులు వేసి, తలుపు వెనుక టపాసులున్న చేట పెట్టింది సుందరి. రాత్రి పదకొండు దాటింది. అందరూ పడుకున్నారు.

అమ్మకీ, నాన్నకీ మధ్యలో పడుకున్న స్మిత నెమ్మదిగా లేచింది. మరునాడు కాల్చబోయే టపాకాయలు, కట్టుకోబోయే కొత్త బట్టలు కళ్ల ముందు కదిలాయి. పొద్దున్నే తలంటేసుకుని, పట్టు పరికిణీ కట్టుకుని పక్కింటి అత్తయ్యగారికి ఎప్పుడెప్పుడు చూపిద్దామా.. ఎదురింటి శాంతికి గౌనే. తనకే పట్టులంగా. ఒకసారి మధ్య గదిలోకి వెళ్ళి, స్టాండు మీదున్న తన లంగా, జాకెట్టు తడిమి చూసుకుంది. ఇంట్లో అందరూ అలసిపోయి గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. అతి నెమ్మదిగా ముందు గదిలోకి వెళ్ళింది స్మిత. తలుపు దగ్గరున్న చేటలోని టపాసులన్నీ చూసుకుంది. ఒక్కొక్క అట్టపెట్టె తీసి చూసింది. పేలే టపాకాయలేం లేవు.

రంగు రంగుల వెలుగునిచ్చే అగ్గిపెట్టెలు చాలా ఉన్నాయి. కాకరపువ్వొత్తులు, మతాబులు, భూచక్రాలు, విష్ణుచక్రాలు. అన్నీ చప్పుడు చెయ్యనివే. ఆకుపచ్చ రంగు వెలుగునిచ్చే అగ్గిపెట్టెతీసి, ఒక పుల్ల వెలిగించింది. సురసురా వెలిగింది. మధ్యలో రవ్వలు. స్మితకి భలే సంతోషమయింది.

అలాగే, ఎక్కువ నిప్పురవ్వలు విదిల్చే అగ్గిపెట్టి..

కుతూహలంతో అదికూడా వెలిగించింది. అంతే...

నిప్పురవ్వలు చేటలోని టపాసుల మీదపడి,

బాగా ఎండిన భూచక్రం మొదట అంటుకుంది. ఆ తరువాత వరుసగా రంగు రంగుల కాంతులు. నిప్పురవ్వలు.

ఒక విష్ణు చక్రం కొద్దిగా పేలి పెద్ద రవ్వ వచ్చి స్మిత మీద పడింది. స్మిత భయపడిపోయి, పరుగెత్తుకుంటూ వంటింట్లోకి వెళ్ళి అమ్మని లేపింది.

స్మిత అలా వెళ్ళడమేమిటి. చేటలో నుంచి భూచక్రాలు పాకి గిరిగిరా తిరిగేస్తున్నాయి. కాకరపువ్వొత్తులు అన్నీ ఒక్కసారిగా అంటుకోవడంతో ఎగిరి కింద అరలో ఉన్న ప్లాస్టిక్ సంచిల మీద పడాయి. ఇంక మొత్తం అదుపు తప్పి ఒకటే పొగ మంటలు.

చప్పుళ్ళు లేకపోడంతో నిద్రలో ఉన్న వాళ్ళకి తెలియలేదు.

పొగకి ఊపిరి అందక ముందుగా సుబ్బులు లేచింది.

అంతలో వంటింట్లోంచి యమున, గిరి వచ్చారు.

అందరూ లేచి బకెట్లతో నీళ్ళు తెచ్చి పొగలో, మంటల మీద కుమ్మరించారు. పక్కిళ్ళ వాళ్ళు కూడా పరుగెత్తుకుని వచ్చి సహాయం చేశారు. రాత్రంతా అందరూ కలిసి మంటలు వ్యాపించకుండా నిప్పు ఆరిపోయేలా చెయ్యగలిగారు.

తెల్లగా తెల్లారాక చూస్తే..

నల్లగా పొగచూరిపోయిన ముందుగది.

అందులో ఎక్కడ పడితే అక్కడ అంటుకు పోయిన నల్లని ప్లాస్టిక్ ముక్కలు.

మొత్తం ఇరవై వేల రూపాయల సరుకు. రెండు సంవత్సరాల కష్టఫలం. అంతా బుగ్గికాదు ముద్దయిపోయింది.

●●●

**దీపావళి మరునాడు.. పొద్దున్న తొమ్మిది గంటలయింది.** స్మిత స్కూలుకి వెళ్లింది. వంటింటి వెనుక చిన్న పెరడు, బుల్లి తులసికోట, ఒక మూలగా స్నానాలగది, మరుగుదొడ్డి ఉన్నాయి. పెరట్లోకి వెళ్లే మెట్లమీద కూర్చుని కాఫీ తాగుతోంది యమున. ముందుగదిలోనుంచి కాగితాలు, ప్లాస్టిక్ కాలిన వాసన.. సన్నగా పొగ, ఇల్లంతా పరచుకున్నాయి. మధ్య గదిలో మంచాల మీద నీరసంగా వాలి, గొంతులన్నీ పట్టెయ్యగా, పొగంతా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, గొంతుతో ఉండుండి ఖళ్లు ఖళ్లున దగ్గుతున్నారు సుందరీ, నరహరీ.

తడిపొడి చీర చుట్టబెట్టుకుని స్నానాల గదిలోంచి వస్తూ తులసికోట మీదికి వాలిపోబోయింది సుబ్బులు.

"అమ్మా! నాన్నమ్మ.." గట్టిగా అరుస్తూ చేతిలో కాఫీ గ్లాసు కుళాయి పళ్లెంలోకి విసిరి కిందికి వాలిపోతున్న సుబ్బుల్ని పట్టుకుంది యమున.

సుందరీ, నరహరీ రెండంగల్లో పెరట్లోకి వచ్చారు. సుబ్బుల్ని అలాగే అందరూ కలిసి కింద పడుక్కోబెట్టారు. ఆవిడకి ఊపిరి అందట్లేదు. యమున గబగబా ఇంట్లోకి వెళ్ళి చాప తీసుకొచ్చింది. నెమ్మదిగా దానిమీదికి జరిపి, తల క్రింద దిండు పెట్టి సర్దారు. ఇంట్లోకి తీసుకెళ్దామంటే పొగతో ఎగఊపిరి ఎక్కువవుతుందేమోనని భయం.

"పక్క వీధిలో డాక్టరు బాలక్రిష్ణగారున్నారు.. పిలుచుకొస్తా." నరహరి చెప్పులేనా వేసుకోకుండా సందులోంచి వీధిలోకి పరుగెత్తాడు.

"నరహరిగారూ!" సరిగ్గా అప్పుడే వరండాలో నిలబడి ముందుగదిలోకి తొంగి చూస్తూ, ముక్కు చిట్లిస్తూ పిలిచాడు ఇంటిఓనరు. కిటికీ రెక్కలు కాలిపోయి, నల్లగా మసి పట్టిన గోడల్ని చూస్తుంటే ఆయనకి కోపం నసాళానికి అంటింది. గదంతా నానా గందరగోళంగా ఉంది.

"బాబుగారూ! మా అమ్మకి అసలు ఒంట్లో బాగోలేదు. డాక్టర్ని పిల్చుకురావడానికి వెళ్తున్నా. తర్వాత మాట్లాడుదామా?" నరహరి చేతులు జోడించి అడిగాడు.

ఓనరుకి ఏమనలో తోచలేదు. అతి కష్టం మీద ఆవేశాన్ని అణుచుకున్నాడు. పక్క వాటాల వాళ్లు ఆయనకి ఫోన్ చెయ్యగానే పరుగెత్తుకుని వచ్చాడతను.

"సరే! రేపొచ్చి మాట్లాడుతా." వెనక్కి చూస్తూ వెళ్లిపోయాడు ఓనరు.

గిరి పొద్దున్నే ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎవరితోనూ మాట్లాడట్లేదు. అపరాధ భావంతో తల దించుకుని అటూ ఇటూ చూడకుండా, సాధ్యమైనంత వరకూ తప్పించుకుని తిరుగుతున్నాడు.

"పొద్దున్నే లేచి పారిపోకపోతే ఏం చెయ్యాలో ఆలోచించచ్చు కదా! ఇటువంటప్పుడు కొంచెం చేతికింద సాయంగా నైనా ఉండేవాడు.." యమున లోపల్లోపల పిండుకుంటోంది, నాన్నమ్మ పక్కన కూర్చుని నీళ్లు తాగించడానికి ప్రయత్నం చేస్తూ. నోట్లో పోసిన నీళ్లు అలాగే బైటికి వచ్చేస్తున్నాయి.

●●●

ఇల్లంతా సుబ్బులు సంతానంతో నిండి పోయింది. కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకులు కోడళ్లు, మనవలు అందరూ వచ్చారు. సుబ్బులు పోయి పన్నెండు రోజులయింది. ఆవిడ తులసికోట దగ్గిర పడిపోయినప్పుడు, డాక్టరుగారు వచ్చేసరికే ప్రాణం పోయింది.

మరునాడు పొద్దున్నకి బస్సుల్లో, టాక్సీలు చేయించుకునీ వచ్చేశారు అందరూ.

నరహరి దిక్కుతోచనట్లు కూర్చుండిపోయాడు. విష్ణు రాగానే పరిస్థితి అర్థం చేసుకుని, తన అదుపులోకి తీసుకున్నాడు. రాత్రంతా ఐసు మీద, పెరట్లోనే ఉంచేసిన తల్లి పార్థివ శరీరాన్ని వీధి వరండాలోకి చేర్చాడు, గోపాల్‌రావు, గిరిల సహాయంతో.

ఇద్దరు కూలీలని పెట్టి ముందుగది శుభ్రం చేయించాడు. ఇంటి ఓనరు మంచివాడే. పన్నెండు రోజులు అయ్యాక వెల్లలు వేయించి పుణ్యావచనం చేయిస్తే ఇంట్లో కర్మకాండలు చెయ్యడానికి అభ్యంతరం లేదన్నాడు.

"బాబుగారూ! మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనండీ!" నరహరి కళ్లనీళ్లతో అంటుంటే చెయ్యి అడ్డంగా తిప్పి వారించాడు.

"ఈ ఆఖరి మజిలీ ఎవరికైనా తప్పదు కాదండీ? మామ్మగారు పుణ్యాత్మురాలు. సునాయాసంగా వెళ్లిపోయారు. మీరు శాస్త్రోక్తంగా అన్నీ జరిపించండి." ముందురోజు ఎంత ఆగ్రహంతో వచ్చాడో అంత శాంతంగా మాట్లాడాడు. ఆ సమయంలో నరహరిని చూస్తే ఎవరికైనా హృదయం ద్రవించక మానదు.

సుబ్బులు తనకి చాతనయినంతలో అందరికీ సహాయం చేస్తూ, తలలో నాలికలా ఉండేది. ప్రతీ ఒక్కరూ ఆవిడని తలుచుకుని కళ్లనీళ్లు పెట్టుకున్న వారే.

ఒక వ్యక్తి మంచితనం మరణించినప్పుడు కారిన కన్నీరుతో కొలవచ్చునన్నాడు ఒక మహానుభావుడు. అది నిజమే ననిపించింది అక్కడి పరిస్థితి చూస్తే.

ముఖ్యంగా యమునకి నాన్నమ్మ దగ్గర చాలా అలవాటు.. పుట్టింట్లో ఎక్కువకాలం గడుపుతుండడం వలన. కళ్లు సరిగ్గా కనిపించకపోయినా కూడా చేతులతో తడుముతూ, పాలిథీన్ సంచీలు వేరు చేసేది. తల్చుకుని తల్చుకుని ఏడుస్తున్న యమునని ఎవరూ ఓదార్చలేకపోయారు.

ఆ రోజు మధ్యాన్నం, భోజనాలయ్యాక వరండాలో చాపమీద కూర్చుని మోకాళ్లమీద తల పెట్టుకున్న యమున దగ్గరికి వచ్చింది కావేరి.

"ఏంటమ్మా ఇదీ? జీవితాన్ని పూర్తిగా అనుభవించి వెళ్లిపోయింది నాన్నమ్మ. ఆవిడ సూచించిన మార్గంలో నడుస్తూ అందరికీ సహాయంగా ఉంటే చాలు.. మనం ఆవిడ ఋణం తీరుచుకున్నట్లే. ఇంక అప్పునీ, అమ్మనీ నువ్వే చూసుకోవాలి. ఇలా డీలా పడితే ఎలా చెప్పు? ఊరుకో.." కావేరి యమున తల నిమురుతూ ఓదార్చింది.

కళ్లనిండా నీళ్లతో చూసింది యమున.

నిజమే! సుందరి అమాయకురాలు. నరహరి.. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు తిని.. సంసార బాధ్యతలు మోసీ మోసీ అలిసిపోయాడు. ఇంకా ఆయన్ని ఎక్కడో అకౌంట్స్ రాసి సంపాదించి తెమ్మనడం అన్యాయం. కనుచూపు మేరలో గిరికి ఉద్యోగం దొరికే సూచనలు లేవు. సుబ్బులు ఉన్నప్పుడు విష్ణు కొంత డబ్బు పంపేవాడు. అదీ, యఫ్.డీల మీద వచ్చే వడ్డీ కలిపి బొటాబొటీగా సరిపోయేది. ఇంక ఇప్పుడెలా?

ఈ సంగతి ఎవరూ ఆలోచించట్లేదు. యమునకి ఒక్కసారిగా కాళ్లూ చేతులూ చల్లబడి పోయాయి. చదువు మీద శ్రద్ధ చూపించనందుకు పదివేలో సారి తిట్టుకుంది. ఆనంద్ చెప్పినట్లు పెళ్లయ్యాకయినా చదువుకునుంటే.. ఇప్పుడనుకునేం లాభం?

ఆ రాత్రికే అందరూ ప్రయాణం అవుతున్నారు. విష్ణు మాత్రం మరో రెండు రోజులుండి వెళ్తానన్నాడు.

"అరే.. ఆనంద్! బావా.. ఆనంద్ వచ్చాడు. రా, రా. వస్తున్నట్లు ఒక ఫోనైనా చెయ్యలేదే." గిరి సంభ్రమంగా అంటూ, ఆనంద్ సూట్ కేసు లోపలికి తీసుకొచ్చాడు. ఆనంద్‌ని తలుచుకుందో లేదో.. వచ్చేశాడు, యమున కళ్ళు తుడుచుకుని లేచింది.

●●●

స్తబ్ధుగా సుబ్బులు కూర్చునే పడక్కుర్చీలో కూర్చున్న నరహరి చటుక్కున లేచాడు. వంటింట్లో మిగిలిన కూరలూ అవీ సర్దిస్తున్న సుందరి పరుగున వచ్చింది. ఇంటిడు మందీ వరండాలోకి వచ్చేశారు.

"అప్పా! ఎలా ఉన్నారు? టికెట్ దొరికే వరకూ అనుమానమే.. ఇంకా లీవు.. డ్యూటీ అప్పచెప్పడానికి ఎవరైనా దొరకడం.. ఆఖరి నిముషం వరకూ నాకే తెలియదు, నేను రాగలనని. అందర్నీ చూడాలనిపించింది." కావేరి అందించిన మంచినీళ్ల గ్లాసు అందుకుంటూ అన్నాడు ఆనంద్. నలభై గంటలు పైగా.. మూడు చోట్ల విమానాలు మారి వచ్చాడేమో నీరసంగా కనిపిస్తున్నాడు.

"మంచి పని చేశావురా.. అన్నయ్యకి కాస్త ధైర్యంగా ఉంటుంది. చాలా డీలా పడిపోయాడు." విష్ణు, ఆనంద్ చెయ్యి పట్టుకుని అన్నాడు.

నరహరి మొహం లోకి కూడా కాస్త ఊపిరి వచ్చినట్లయింది.

"ముందు స్నానం అదీ చేసి, భోజనం చెయ్యి. తరువాత మాట్లాడుకుందాం. అమ్మ లేని లోటు ఎవరూ తీర్చలేరనుకో.. కానీ తప్పదు కదా! మెల్లిగా అలవాటు చేసుకోవాలి."

"నిజమే అప్పా! మీరు బాగా వీక్‌గా ఉన్నారు. రేపొక సారి హాస్పటల్‌కి తీసుకెళ్ళి అన్ని చెకప్‌లు చేయిద్దాం." ఆనంద్ తండ్రి చెయ్యి నిమురుతూ ఉండిపోయాడు.

●●●

"అప్పా! ఇంక మీరు పూర్తిగా రిటైర్ అయిపోండి. మీకు కావలసిన విధంగా కాలం గడపండి. బి.పి చాలా తక్కువగా ఉంది. మంచి ఆహారం తీసుకుంటూ, ఇంటి పట్టునే ఉండి పుస్తకాలు చదువు కుంటూనో.. సినిమాలు చూస్తూనో మీకిష్టం వచ్చినట్లు గడపండి. ఇంక ఈ తాపత్రయం వద్దు.. చాలా చేశారు మీరు." ఆనంద్ నెమ్మదిగా అన్నాడు.

అందరూ మధ్య గదిలో కూర్చున్నారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అంత మంది ఎక్కడా చీమ దూరడానికి కూడా ఖాళీ లేకుండా అన్ని రోజులుండి వెళ్ళాక బోసి పోయినట్లయిపోయింది.

నరహరి తలెత్తి కొడుకుని చూశాడు. కళ్ళ కింద నల్లగా, కళ్లు నిస్తేజంగా.. మొహం అంతా పీక్కుపోయినట్లుంది.

దూరంగా బల్ల మీద కూర్చున్న విష్ణుకి మనసంతా కలచి వేసినట్లయింది. అన్నగారి పక్కనే, నేల మీద వేసిన పరుపు మీద కూర్చుని భుజం మీద చెయ్యి వేశాడు.

ఒక్క సారిగా ఆనకట్టకి చిల్లి పడినట్లయింది.. నరహరి కంట్లోంచి కన్నీటి గంగ ఉప్పొంగింది. ఆవేదనలో ఆత్మీయుల స్పర్శకి అంతటి శక్తి ఉంది మరి..

"అన్నయ్యా!" విష్ణు ఆందోళనగా జేబులోంచి చేతిరుమాలు తీసిచ్చాడు.

"ఫరవాలేదు బాబాయ్! లోపల బిగపట్టి ఉంచుకునే కంటే దుఃఖాన్ని బైటికి వదిలెయ్యడమే నయం." కుండలోనుంచి చల్లటి మంచి నీళ్ళు తెచ్చిస్తూ అన్నాడు ఆనంద్. సుందరి, యమున ఏం చెయ్యాలో తోచనట్లు కూర్చున్నారు. గిరి పొద్దున్నే బైటికెళ్ళిపోయాడు.

పది నిముషాలయ్యాక రుమాలు చన్నీళ్లల్లో ముంచి మొహం తుడిచాడు ఆనంద్. యమునని గ్లాసులో వేడి పాలు తెమ్మని నెమ్మదిగా తాగించాడు.

అప్పుడు.. నరహరి కాస్త తేరుకుని అన్నాడు..

"అమ్మ ఉంటే కొండంత అండగా ఉండేదిరా! ఇంక నాకు ఏ పని చెయ్యడానికీ ఓపిక లేదు.. కానీ ఇల్లెలా..?" బొంగురుపోయిన గొంతుతో అన్నాడు.

నిజమే.. పెన్షన్ లేని ఉద్యోగం. సంపాదించేటప్పుడు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోతే వృద్ధాప్యం శాపమే. అందులో నరహరికి ఇంకా యమున సంసారం బాధ్యత ఒకటి..

అక్కడే చాప మీద కూరచున్న యమున తల దించుకుంది. నాలుగు కన్నీటి చుక్కలు టపటపా రాలాయి.

పన్నెండురోజులూ పనులతో అలిసిపోయిన సుందరి, ముందుగదిలో మంచం మీద నిద్దరపోతోంది. ఆవిడకి ఇంట్లో ఉన్న సరుకులతో వండి పడెయ్యడం తప్ప ఇంకేం తెలీదు.

"చిన్నక్కా! ఒక కాగితం పెన్నూ తీసుకొచ్చి, నెలకి మీకు ఎంత ఖర్చవుతుందో రాసి చూపించగలవా?"

విష్ణు ఆసక్తిగా చూస్తున్నాడు.

యమున కళ్లు తుడుచుకుని లేచి, తను ప్రతీ నెలా క్రమం తప్పకుండా రాసే పద్దు పుస్తకం తెచ్చింది.

అందులో ప్రతీ పైసా ఎందుకు ఖర్చయిందో రాసుంది. ఆనంద్, విష్ణు మెచ్చుకోలుగా చూశారు. విష్ణు, బొంబాయిలో ఉన్నప్పుడు తనన్న మాటలు గుర్తు తెచ్చుకుని క్షమించమన్నట్లు చూశాడు.

"సరే! డిపాజిట్స్ అలాగే ఉంచుదాం.. వడ్డీ దానికే కలిపేసెయ్యమని బాంకులో రాసిద్దాం. ఇక నుంచీ ప్రతీ నెలా నేను మీకయే ఖర్చంతా పంపుతాను. ప్రస్తుతం రెండు నెలలకి సరిపోయే డబ్బు బాంకులో వేస్తాను. రెండు నెలలు ముందే పంపుతుంటాను. అద్దె పెరిగినా, ధరలు పెరిగినా నాకు చెప్తూంటే, దానికి తగ్గట్లే పెంచుతాను. మీరేం బాధ పడకండి అప్పా! అంతా ఇంక నాకు వదిలెయ్యండి. నేను తరచూ ఫోన్‌లో మాట్లాడుతుంటాను."

నరహరి హృదయం ఉప్పొంగింది. ఇంతకంటే ఇంకేం కావాలి? చేతికందొచ్చిన కొడుకు అన్ని బాధ్యతలూ తీసుకుంటానంటే..

కానీ తనెంత కష్టపడాలో.. అంత ఎలా పంపుతాడు? మరి వాడికీ పెళ్లి చెయ్యాలి, పిల్లలూ సంసారం వచ్చాక కుదురుతుందా? సంశయిస్తూ చూశాడు. వివిధ భావాలతో మనసంతా గందరగోళంగా తయారయింది. అదంతా విష్ణు, ఆనంద్ కనిపెట్టారు.

"నేను కూడా అమ్మ ఉన్నప్పటిలాగే పంపుతానన్నా! ఆనంద్‌కి వచ్చే ఏడు పెళ్లి చేద్దాం. ఎలాగా సంవత్సరీకాలు అయ్యే వరకూ కుదరదు కదా! మేమున్నాం నిన్ను చూసుకోడానికి. ఏమాత్రం బెంగపడద్దు." విష్ణు కూడా భరోసా ఇచ్చాడు.

"ముందు ఈ ఇల్లంతా బాగు చేయించాలి. నేనింకా రెండు వారాలుంటాను. ఆ లోపు చేసేద్దాం. మామయ్య సూపర్వైజర్ చేస్తాడేమో.. చిన్నక్కా! గిరి మామయ్యేడీ?"

ఏమో అన్నట్లు అరచెయ్యి పక్కకి తిప్పింది యమున.

సరిగ్గా అప్పుడే కాళ్లీడ్చుచుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు గిరి.

ఆనంద్ పరిశీలనగా చూశాడు. సన్నగా అయిపోయి.. మెడమీది ఎముకలు ముందుకి పొడుచుకొచ్చాయి. బుగ్గలు లోతుకెళ్లిపోయి కళ్లు పెద్దగా కనిపిస్తున్నాయి. జుట్టు ఎంత పల్చగా అయినా, ఉంగరాలు తిరిగి నుదురు కప్పేస్తోంది. సరిగ్గా భోంచేసి ఎన్నాళ్లయిందో! మొహంలో నవ్వు మాత్రం చెక్కు చెదరలేదు.. నీరసంగా ఉన్నా కూడా!

గట్టిగా నిట్టూర్చాడు ఆనంద్. పసిపిల్లవాడి అమాయకత్వం.. ఏమనడానికీ నోరు రాదు.

యమున తల తిప్పేసింది. ఎంత మొండిగా ఉన్నా అప్పుడపుడు బాధగా, అవమానంగా అనిపిస్తుంది గిరి వ్యవహారం.

ఆనంద్ ఏదో చెప్పబోతున్నాడు.. గేటు తోసుకుని, ఒక రిక్షా లోపలికి వచ్చింది.

"అరే.. లోపలికొచ్చేస్తావేంటి బాబూ.." అని అరుస్తూ గిరి వెళ్లబోయి ఆగి పోయాడు. రిక్షాలోంచి స్కూలు ఆయా కళ్లుమూసుకుని ఉన్న స్మితని సీటు లోంచి భుజం మీదికి వేసుకుంది. స్మిత స్కూలు యూనిఫాం నిండా రక్తం మరకలు.

"స్మితా! పాపా.. ఏమయిందే." గట్టిగా అరుస్తూ యమున పరుగెత్తుకుని వచ్చి, ఆయా చేతుల్లోంచి స్మితని తీసుకుంది. ఆనంద్ వరండాలో చాప వేసి, తలగడా పెట్టి, పాపని పడుకోబెట్టి, చెయ్యి పట్టుకుని నాడి చూశాడు. బాగానే ఉంది. తల మీద చెవి పక్కన ప్లాస్టర్..

"ఏమయింది?" ఆయాని అడిగారు అందరూ ఒకేసారి. గిరి పాప పక్కనే కూర్చుని, చేతి మీద నెమ్మదిగా రాస్తున్నాడు.

"గేమ్స్ పీరియడ్‌లో ఆడుకుంటున్నాదమ్మా.. జారుడు బండ ఎక్కి, పక్క నుంచి కిందికి పడిపోయింది. ఇసకలోనే కానీ పక్కనే ఉన్న రాయికి కొట్టుకుంది దొర్లుకుని. రక్తం అంతా తుడిచి మందిచ్చారు.. స్కూలు పక్కనే ఉన్న ఆస్పత్రిలో."

"నొప్పి తగ్గడానికి మందిచ్చారా?"

"అవునయ్యగారూ.. పాప అప్పట్నుంచీ సొమ్మసిల్లి పడుకుంది."

"మంచిదమ్మా! తీసుకొచ్చినందుకు చాలా థాంక్స్. ఇదిగో ఇదుంచు." ఆనంద్ పది రూపాయల నోటిచ్చి ఆయాని, చిల్లర ఇచ్చి రిక్షానీ పంపేశాడు.

"ఎందుకైనా మంచిది హాస్పిటల్‌కి తీసుకెళ్లి ఎక్స్‌రే తీయిద్దాం. దెబ్బ చిన్నదే. కుట్లు అక్కర్లేదు."

●●●

"ఆనంద్! ఏమయిందిరా! పాప అలా పడుకునుండిపోయింది." ఏడుపుతో గొంతంతా పట్టెయ్యగా సగం మాటలు మింగేస్తూ అడిగింది యమున.

స్మితని హాస్పిటల్లో చేర్పించి ఒక రోజయింది. ఆనంద్ పాపని చూసిన వెంటనే పరిస్థితి బాగా లేదని గ్రహించాడు. ఆటో తీసుకొచ్చి తన స్నేహితుడి ప్రైవేట్ నర్సింగ్ హోంకి తీసుకెళ్లాడు.

అక్కడ చేర్పించినప్పట్నుంచీ ఎక్స్‌రేలు, పరీక్షలూ.. అందరూ తిరిగిన వాళ్లు తిరిగినట్లే ఉన్నారు.

"బ్రైన్‌లో క్లాట్ ఉందక్కా.. ఆపరేషన్ చెయ్యాలి. అందుకే పాపకి తెలివి రాలేదు."

"కోమానా?" గిరి నిద్ర లేని కళ్లని నులుముకుంటూ అడిగాడు.

తలూపాడు ఆనంద్, ఆదుర్దాగా చూస్తున్న యమున కేసి తిరిగి.

"కండిషన్ ఎలా ఉంది? ఆపరేషన్ అంటే.."

"నేనున్నా కదా! సర్జరీ చేసేటప్పుడు అక్కడే ఉంటా. కండిషన్.. అంటే ఆపరేషన్ అయ్యాకా కానీ.." ఆపేశాడు ఆనంద్.

కొంగు మొహానికి అడ్డు పెట్టుకుని కుర్చీలో కూలబడి పోయింది యమున. గిరి పక్కనే కూర్చుని చెయ్యి పట్టుకుని ఓదార్చబోయాడు. అతని కళ్లల్లోంచి కూడా ధారగా నీళ్లు.

"ఆనంద్! ఇవిగో ఇంజక్షన్లూ, మందులూ.." విష్ణు పెద్ద అట్టపెట్టి తెస్తూ యమున, గిరిలని చూశాడు.

"ఊరుకోండి రా. పాపకేం కాదు. తగ్గి పోతుంది. సమయానికి ఆనంద్ కూడా ఉన్నాడు. వాడు చూసుకుంటాడు."

................

"వెళ్లొస్తానక్కా! జాగ్రత్త. అమ్మా, అప్పలని నీకు, మామయ్యకీ అప్పగించి వెళ్తున్నా. డబ్బుకి ఏ మాత్రం ఇబ్బంది పడద్దు. స్మితపాపని కొన్ని రోజులు స్కూలికి పంపద్దు. తగ్గిపోయింది.. ఏమీ ఫరవాలేదు. అలా చూడకు.. కొంత కాలం చూసుకుంటూ ఉండాలి." ఎయిర్‌పోర్ట్‌లో కూర్చుని ఆనంద్ యమున చెయ్యి పట్టుకుని అన్నాడు.

స్మిత ఆపరేషన్ అయి ఇంటికొచ్చి వారం రోజులయింది. ఆలశ్యం చెయ్యకుండా ఆనంద్ దగ్గరుండి వెంటనే తీసుకెళ్లడం వల్ల కాపాడ గలిగామని అన్నారు డాక్టర్లు.

సాధారణంగా ఎంతో ధైర్యంగా ఉండే యమున డీలా పడిపోయింది.

"అదృష్టమేరా! నువ్వున్నావు కనుక సమయానికి గానీ.."

"నేను లేకపోయినా మీరు ఇటువంటి ఎమెర్జెన్సీలు వస్తే కొంచెం కూడా ఆలశ్యం చెయ్యకూడదు. నాకు తెలిసిన డాక్టర్ల, పేర్లు, ఫోన్ నంబర్లు ఇవిగో. అందరికీ చెప్పి పెట్టాను. నేను కొంచెం సర్దుకున్నాక ఇంకా ఎక్కువ పంపిస్తాను." తను వెళ్లవలసిన ఫ్లైట్ గురించి మైకులో చెప్తూంటే లేచాడు ఆనంద్.

ఎయిర్‌పోర్ట్‌కి యమున ఒక్కతే వెళ్లింది. గిరి, స్మిత దగ్గర ఉండిపోయాడు. నరహరి, సుందరి ఎప్పుడూ రైల్వే స్టేషన్‌కి కానీ, విమానాశ్రయానికి కానీ వెళ్లరు. విష్ణు, కావేరి రెండు రోజుల ముందు వెళ్లిపోయారు, బొంబాయికి.

"మళ్లీ ఎప్పుడొస్తావు?" సెక్యూరిటీలోకి వెళ్లబోతున్న ఆనంద్ చెయ్యి పట్టుకుంది యమున.

"వచ్చే ఏడు వస్తానక్కా! జాగ్రత్త."

●●●

**1985-'90:**

"వెళ్లొస్తానమ్మా! తలుపేసుకో." యమున ఇంట్లోంచి బైటికి నడుస్తూ అరిచింది.

సుందరి నవ్వుతూ వచ్చి, ఒక డబ్బా చేతికిచ్చింది.

"ఏమిటమ్మా ఇది?"

"ఆనంద్ దగ్గర్నుంచి కబురు తెచ్చారు కదా! వాడినీ, కోడల్నీ పిల్లల్నీ, చూసి వచ్చారు. కాస్త నోరు తీపి చెయ్యి. సత్యనారాయణ ప్రసాదం చేశాను."

జాలిగా చూసింది యమున. ఆనంద్ పెళ్లయి పదేళ్లయింది. మధ్యలో ఒక్కసారి వచ్చారు.. ఇద్దరు పిల్లల్నీ తీసుకుని. అబ్బాయి నరేన్‌కి ఎనిమిదేళ్లు నిండాయి. సరస్వతికి నాలుగు.. అది పసిపిల్లగా ఉన్నప్పుడు వచ్చారంతే. పైకి చూపించకపోయినా, మగపిల్లాడని ఆనంద్ అంటే ప్రత్యేకమైన అభిమానం సుందరికి.

"పిచ్చి అమ్మా! అలాగే చేస్తాలే. ఫొటోలు కూడా ఉంటే తీసుకొస్తా."

చిక్కడపల్లి నుంచి కోఠీ వెళ్లి, రామచంద్రాపురం, బస్సెక్కింది. బి.హెచ్.ఇ.యల్ కాలనీకి వెళ్లాలి. అక్కడ ఉన్నారు, అమెరికాలో ఆనంద్ వాళ్లని చూసి వచ్చిన వెంకట్రావు దంపతులు. వాళ్ల పెద్దబ్బాయి బి.హెచ్.ఇ.యల్లో ఇంజనీరు. రెండో అబ్బాయి, న్యూజెర్సీలో ఆనంద్ ఇంటి పక్కన ఉంటాడు.

అమెరికా నుంచి, అందులో ఆనంద్ ఊరు నుంచి ఎవరైనా వచ్చారంటే చాలు, అఘమేఘాలమీద వెళ్లిపోతుంది యమున.

బస్‌లో కూర్చుని గత పదేళ్లుగా జరిగిన సంఘటనలని తరచి చూసుకుంది. తన జీవితంలో ఏమీ మార్పు లేదు. గిరి అప్పుడప్పుడూ, అక్కడక్కడ పని చేసినా ఎక్కడా స్థిరత్వం లేదు. ఏ మాత్రమైనా సంపాదిస్తే, అతని సిగరెట్లకే సరిపోతుంది. స్మిత, తలకి తగిలిన దెబ్బ నుంచి త్వరగానే కోలుకుంది. కానీ చదువులో అంతంత మాత్రమే. ఇంటర్ రెండో ఏడు చదువుతోంది. అయ్యాక బిఏలో చేర్పించాలి. తల్లిదండ్రులిద్దరూ కనీసం గ్రాడ్యుయేట్లయినా కాదు.. ఇద్దరికీ చదువంటే శ్రద్ధ ఉండేది కాదు. మరి దానికి ఎక్కడ్నుంచి వస్తుంది?

నవ్వుకుంది యమున, విషాదంగా! ఆ మధ్యన పేపర్లో వార్త.. ఏ కొంచెం చదువు లేని కూలీ కొడుకు ఎంట్రన్స్‌లో పదో రాంకు సాధించలేదూ? నుదుటి రాత ఎలా ఉంటే అలా నడుస్తుంది జీవితం. గిరి తండ్రికి తగ్గ కొడుకనిపించాడు. తాతగారిలా ఉండ కూడదూ? స్మార్తం నేర్చుకుని ఆయనలా సంసారం పట్టించుకుంటే ఎంత బాగుండేది. ఒక రకమైన విరక్తి పెంచుకుంది యమున, గిరి విషయంలో. ఇంక ఇంతే జీవితం.. అనే పరిస్థితికి తల వంచేసింది.

పోనీ తనైనా చదువుకునుంటే.. అనుకునేది ఏముంది? కావేరి, పిల్లలు పెద్దయి స్కూళ్లకి వెళ్లడం మొదలు పెట్టాక, ప్రైవేటుగా బిఏ, బి.ఇడి చేసి వాళ్ల ఇంటికి దగ్గర్లోనే ఉన్న స్కూల్లో చేరింది. మంచి టీచరుగా పేరు తెచ్చుకుని వైస్ ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగింది. అలా తనెందుకు చెయ్యలేక పోయింది?

తమ్ముడు మంచి వాడు కనుక నడిచిపోతోంది. ఆనంద్‌ని తలుచుకుంటే యమున కళ్లలో మెరుపు వస్తుంది. వాడు కూడా తనలాగే ఆర్థిక ఇబ్బందుల్లోనే పెరిగాడు. స్వయం శక్తితో ఎంత పైకి ఎదిగాడూ! అమెరికాలో మంచి పేరు సంపాదించాట్ట. తల్లిదండ్రులకి ఏ లోటూ రాకుండా చూసుకోవడం కాక తన సంసారాన్ని కూడా వాడే. యమునకి దుఃఖం వచ్చింది. శోభ కూడా వాడికి తగ్గ భార్యే కనుక సరిపోయింది.

"అక్కా! నువ్వు బాధపడకు. అక్కడ అమ్మా, అప్పలని బాగా చూసుకుంటున్నావన్న ధైర్యంతోనే నేను ఇక్కడ ఉండ గలుగుతున్నా. ఇప్పటికి నేను బాగా స్థిరపడ్డాను. కొద్ది రోజుల్లోనే మిమ్మల్నందర్నీ తీసుకొచ్చే ఏర్పాటు చేస్తాను." ఆనంద్ ముందు రోజు రాత్రి ఫోన్‌లో మాట్లాడిన మాటలు తల్చుకుని, తేలిగ్గా కళ్లు మూసుకుంది.

●●●

"ఇవిగోనమ్మా! ఈ కాగితాలన్నీ మీకిమ్మన్నాడు ఆనంద్. కొంత డబ్బు, ఈ పాకెట్టు ఇచ్చాడు." వెంకట్రావుగారు అందిస్తున్న వస్తువులని తీసుకుంటూ చిరునవ్వు నవ్వింది యమున. వాళ్ల ఇల్లు వెతుక్కుని చేరేటప్పటికి పది దాటింది. మొత్తం మూడు గంటలు పట్టింది. హడావుడిగా కాఫీ మాత్రం తాగి బయలుదేరింది. ఎండలో వచ్చిందేమో కళ్లు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది.

"ఎలా ఉన్నారండీ మా తమ్ముడూ వాళ్లు?" నీరసంగా ఉన్నా ఎదుటివాళ్లకి తెలియని కంచుకుంఠం యమునది.

"బాగా ఉన్నారు. రోజూ కలుస్తుండే వాళ్లం. పక్కిల్లే. సిటిజెన్‌షిప్ వచ్చింది. పెద్ద ఇల్లు. పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. మా మనవలు వాళ్లు శని ఆదివారాలు వచ్చిందంటే నలుగురూ కలిసే ఉంటారు. ఫొటోలు చూపిస్తా ఉండమ్మా!"

వెంకట్రావుగారి భార్య కాఫీ తీసుకొచ్చింది.

"అంత దూరం నుంచి శ్రమ పడి వచ్చావామ్మా?" ఆవిడ మొహంలో అలసట తెలుస్తోంది. యమునకి ఏదోలా అనిపించింది. రెండురోజులాగి రావలసింది.. వాళ్లు తెల్లవారుఝామున దిగగానే మునిగిపోయినట్లు వచ్చేసింది తను.

"ఏమనుకోకండి.. ఆత్రం ఆపుకోలేక వచ్చేశాను. మీరు బాగా అలిసిపోయినట్లున్నారు." కాఫీ కప్పు ట్రేలో పెడుతూ అంది మొహమాటంగా.

"ఫరవాలేదమ్మా. నాకు తెలుసు.. దూరాన ఉన్న వాళ్ల కబుర్లు వినాలని అనిపిస్తుంది. మేమూ అలా ఉన్న వాళ్లమే కదా!" వెంకట్రావుగారు ఫొటో ఆల్బం తెచ్చి ఇచ్చారు.

ఆనంద్ వాళ్లవి కొన్ని ఫొటోలే ఉన్నాయి. అవే.. ప్రతీ ఒక్కరినీ పరిశీలనగా చూస్తూ కూర్చుంది. ఆనంద్ కొంచెం లావయినట్లున్నాడు. శోభ మామూలుగా ఉంది, ప్రసన్నంగా నవ్వుతూ. పిల్లలు సరే సరి. ముత్యాల్లా ఉన్నారు.

"నీ కిచ్చిన పాకెట్లో చాలా ఉన్నట్లున్నాయమ్మా!" వెంకట్రావుగారు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నారు. ఉలిక్కిపడింది యమున. నిజమే! తను వెళ్లిపోతే వాళ్లు కొంచెం సేపు విశ్రాంతి తీసుకుంటారు.

"అమ్మ మీకిమ్మందండీ. ఇంక నేను వెళ్లొస్తా." డబ్బా బల్ల మీద పెట్టి లేవబోయింది.

"అబ్బ.. నెయ్యి, జీడిపప్పులూ ఘుమఘుమ లాడుతోంది. మర్చిపోయాను. ఉండమ్మా! ముగ్గురం కలిసి భోంచేద్దాం. కోడలు వంట చేసి వెళ్లింది. ఇక్కడ స్కూల్లో పనిచేస్తుందిలే. ఉన్నదేదో సర్దుకుందాం." వెంకట్రావుగారికి అప్పుడు గుర్తుకొచ్చినట్లుంది, యమునకి ఏమీ ఇవ్వలేదని. నొచ్చుకుంటూ అన్నారు.

"వద్దండీ. ఇంటికెళ్లి పోతాను." మొహమాటంగా అంది యమున.

"ఇంకానయం. పొద్దున్ననగా బయల్దేరుంటావు. ఇప్పుడు ఇంటికెళ్లేసరికి రెండవుతుంది. ఆనంద్‌కి తెలుస్తే ఏమనుకుంటాడూ? నువ్వు రాగానే అడగనందుకు ఏమనుకోకమ్మా.. బుర్రంతా మొద్దుబారిపోయింది, ఈ ప్రయాణంతో."

వెంకట్రావుగారి భార్య లోపలికి వెళ్లి ముగ్గురికీ భోజనం వడ్డించేసి పిలిచింది. ఉన్నదేదో తిన్నారు కానీ చాలానే ఉన్నాయి పదార్థాలు.

"అందులో మీ అమ్మానాన్నలకీ, మీకూ గ్రీన్ కార్డ్‌కి అప్లై చెయ్యడానికి ఫారాలున్నాయి. ఏమేం కావాలో కూడా వివరంగా రాసిచ్చాడు ఆనంద్. ఏమయినా సందేహాలుంటే అడగండి. మేము కూడా అప్లై చేస్తున్నాం." భోంచేస్తూ అన్నారు వెంకట్రావుగారు.

యమున విస్ఫారిత నేత్రాలతో చూసింది. ఎప్పుడో తీసుకెళ్తానన్నాడు కానీ ఇంత త్వరగానా?

"మరి మా తమ్ముడు బాగా సెటిల్ అయ్యాడాండీ. ఇంతమందినీ తీసుకెళ్తే కష్టం కదూ?"

"బాగా స్థిరపడ్డారమ్మా! మా వాడూ ఆనంద్ కూడా. మనం ఏ మాత్రం బెంగ పెట్టుకోనక్కర్లేదు. మేం కూడా ఉంటాం కనుక ఒకరికొకరు తోడున్నట్లుంటుంది. వెంటనే నింపి పంపెయ్యండి. మీకు, అంటే సిస్టర్కి ఎక్కువ రోజులు పడుతుంది. పేరెంట్స్‌కి తొందరగా వచ్చేస్తుంది."

యమున మౌనంగా తిన సాగింది. తామా.. అమెరికానా?

నమ్మశక్యంగా లేదు.

గిరి ఏం చేస్తాడూ అక్కడ?

●●●

నరహరికీ, సుందరికీ గ్రీన్ కార్డులొచ్చేశాయి. మద్రాస్ వెళ్లి మెడికల్ పరీక్షలు అవీ అన్నీ చేసుకుని వచ్చారు.

ఇంక వారం రోజుల్లో ప్రయాణం. వెళ్లేటప్పుడు బొంబాయి వెళ్లి కావేరి దగ్గర రెండురోజులుండి వెళ్లాలని అనుకున్నారు. టికెట్లు అలాగే పంపించాడు ఆనంద్. సుందరి హడావుడి ఇంక చెప్పడానికి లేదు. గోపాల్‌రావునీ, విష్ణునీ, ఆడపడుచుల్నీ అందర్నీ రమ్మని పిలిచింది. అన్నా, వదిన్లు వెళ్లాక మళ్లీ ఎన్నాళ్లకి వస్తారో అని అందరూ వచ్చారు. ఇల్లంతా జనం. అలాగే వరండాలో, హాల్లో కాలక్షేపం చేస్తున్నారు. ఎదురుకుండా ఉన్న స్వరాజ్ హోటల్లో రెండు గదులు తీసుకున్నారు. రాత్రిళ్లు అక్కడికెళ్లి పడుక్కుంటున్నారు మగవాళ్లు. ఇంకా అందరి పిల్లలూ రాలేదు కనుక కొంత నయం.

నరహరి మొహంలో కొత్త నిగారింపు.. నడకలో మాటలో ప్రపంచాన్ని జయించినంత ఆనందం, ఉత్సాహం. పొద్దున్న లేచినప్పట్నుంచీ దొరికిన వాళ్లతో ఆపకుండా కబుర్లు. రోజూ తెలిసిన వాళ్ల అందరిళ్లకీ వెళ్లి ఆనంద్ గురించి చెప్పి, తమని ఎలా తీసుకెళ్తున్నాడో విసుగులేకుండా పూసగుచ్చినట్లు చెప్తూండడం.. అతను వస్తున్నాడంటే అందరూ భయపడిపోయేలా ప్రవర్తిస్తున్నాడు.

స్వతహాగా మితభాషి అయిన నరహరి అలా మాట్లాడ్డం అందరికీ వింతగానే ఉంది. గొంతు బొంగురుపోయి, మాటల్లో స్పష్టత లోపించి, అర్ధం చేసుకోవడం కష్టంగా ఉంది. కొంచెం మాట్లాడితే మొహం ఎర్రగా అయిపోవడం.. వీసా వచ్చినప్పట్నుంచీ ఎక్కువైపోయింది.

గిరి మాత్రం స్తబ్దుగా ఉంటున్నాడు.. అందరికంటే అతనికే ఎక్కువ అభిమానం నరహరి మీద. ఓపిగ్గా అతను చెప్పే సోదంతా వింటాడు. ఉక్రోషంతో, ఆక్రోశంతో ఇల్లు వదిలి వస్తే ఆశ్రయం ఇచ్చి, పిల్లనిచ్చి.. ఇంట్లో ఉంచుకుని.. ఏం చేస్తే తీరుతుంది ఋణం? తనే.. వాళ్లు అనుకున్నట్లు స్థిరపడలేకపోయాడు. ఎన్ని ప్రయత్నాలు.. ఎంత కష్టం.. అంతా వృధా అయిపోయింది. ఏం జాతకమో.. ఎక్కడ చెయ్యి పెట్టినా భస్మం. గిరి ఆలోచిస్తూ ఇంట్లోకి కావలసిన కూరలు తెచ్చి సర్దుతున్నాడు.

అందరూ నరహరి గురించి అతని వెనకాల విడ్డూరంగా చెప్పుకునే వాళ్లే కానీ ఒక్కరికి కూడా డాక్టరికి చూపిద్దాం, పరీక్షలు చేయిద్దాం అనిపించలేదు. ఆనంద్ ఉండి ఉంటే ఎలా ఉండేదో..

"గిరీ!" వంటింట్లోకి వస్తున్న నరహరి అరుస్తూ అలాగే గుమ్మం దగ్గర కూర్చుండిపోయాడు.

వెనుకే వస్తున్న విష్ణు పట్టుకున్నాడు, గుమ్మం తగలకుండా. విష్ణు చేతుల్లో అలా ఒరిగిపోయాడు.

●●●

"అప్పా.. అప్పా!" ఆనంద్ పిలుస్తున్నాడు, దుఃఖంతో.

నరహరి ఎమర్జెన్సీ రూంలో ఉన్నాడు. ఉలుకు పలుకు లేకుండా. ఆనంద్‌కి వెంటనే ఫోన్ చేశారు. దొరికిన మొదటి విమానం ఎక్కి వచ్చేశాడు. గుమ్మం దగ్గర పడడం పడడం కోమాలోకి వెళ్లిపోయాడు నరహరి. బి.పి చాలా పెరిగిపోయి తలలో రక్తనాళాలు చిట్లిపోయాయి. డాక్టర్లు తేరుకునే ఆశ లేదని చెప్పారు.

"ఎప్పుడైతే బిహేవియర్ తేడా కనిపించిందో వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి చెకప్ చేయించద్దా మావయ్యా! బిపి అంతలా పెరిగిపోయే వరకూ ఊరుకున్నారు.." బయటికి వచ్చి గిరితో అన్నాడు ఆనంద్.

"మాకేం తెలుసు.. కొడుకు అమెరికా తీసుకెళ్తున్నాడని ఆనందంతో అలా ఉంటున్నాడనుకున్నాం. ఇలా అవుతుందని కలలో కూడా ఊహించలేదురా!" ఏడుపు ఆపుకుంటూ గోడ వైపుకి తిరిగిపోయాడు గిరి.

బయట కుర్చీల్లో కూర్చున్నారు అందరూ.

"ఎంత ప్రైవేట్ హాస్పిటల్ అయినా ఇంత మంది ఉండ కూడదు. డాక్టర్ ఆనంద్! ఒకళ్లు లోపల, ఒకళ్లు బయట.. అంతే. మిగిలిన అందర్నీ పంపించెయ్యండి ప్లీజ్. మీరు అర్థం చేసుకోవాలి." పెద్ద డాక్టర్ రౌండ్స్‌కి వచ్చి గట్టిగా చెప్పి వెళ్లాడు.

ఆనంద్, గిరి తప్ప మిగిలిన అందరూ వెళ్లి పోయారు. విష్ణు ఇంటి వద్ద అంతా చూసుకుంటున్నాడు. దాదాపు ఇరవై మందికి భోజనాలు, పడకలూ.. అన్నీ చూడాలి.

"మామయ్యా! నేను శోభనీ, పిల్లల్నీ రమ్మని చెప్తాను. ఒక సారి ఇంటికెళ్లి ఫోన్ చేసి వస్తా."

"అయితే ఆనంద్! బావ.." కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా అడిగాడు గిరి.

"కొన్ని గంటలే మామయ్యా! ఇంకొక పదేళ్లయినా కనీసం బతకాల్సిన మనిషి. నేను దగ్గర లేకపోవడంతో.." బావురుమన్నాడు ఆనంద్.

●●●

ఆ రోజు వచ్చిన బంధువులంతా ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోతున్నారు. ఆనందంగా అమెరికా పంపాల్సిన మనిషిని అనంత లోకాలకి పంపామని విచారంగా వెళ్తున్నారు. సంసారంలో నరహరి బాధ్యత తీసుకోని వ్యక్తి లేరు. పేరుకి తండ్రే కానీ చేసిందంతా నరహరే అని అందరికీ తెలుసు.

నరహరి మంచితనం, సుందరి ఒద్దిక గురించే కథలుగా చెప్పుకున్నారు పన్నెండు రోజులూ. చెంపలకి పాకిపోతుందా అన్నట్లుగా కాటిక పెట్టుకుని, నయా పైసంత కుంకం బొట్టు, పసుపు, పౌడరు కలిపిన ఛాయతో మెరిసిపోతున్న మొహం.. సుందరి కళకళ్లాడుతూ ఉండేది. నరహరి పోయాక, తలకి నూనె రాయడం కానీ, మొహానికి సబ్బెట్టుకోడం కానీ మానేసింది. బొట్టూ కాటుక సరే సరి.

యమున, కావేరి కేకలేస్తే, బలవంతంగా తలకు పోసుకుంది ఆ వేళ.

అందరూ వెళ్లిపోయాక చెప్పాడు ఆనంద్, "అమ్మని నాతో తీసుకెళ్తున్నా."

ఏ సలహా చెప్పడానికీ విష్ణు కూడా లేడు. అప్పటికే నెల రోజులయిందని, తను కూడా బయలుదేరాడు. అతని పిల్లలు కూడా పెదవాళ్లవుతున్నారు. పెద్దమ్మాయికి పెళ్లి చేద్దామని ప్రయత్నం చేస్తున్నాడు. "మేం చూసుకో గలుగుతాములే బాబాయ్, నువ్వెళ్లు.." అని ఆనంద్ ఒకటికి పది సార్లు చెప్తే తప్పని సరిగా వెళ్లాడు.

"చిన్నక్కా! అమ్మ బట్టలు అవీ.." యమున దగ్గరగా వెళ్లబోతున్న ఆనంద్ ఆగిపోయాడు. అదివరకే సర్దిన రెండు పెట్టెల్లోంచీ తండ్రి బట్టలు తీసేస్తూ కన్నీళ్లు కారుస్తోంది యమున. సహాయం చేస్తున్న శోభ కూడా మాటలు దొరక్క మౌనంగా ఉంది.

ఆనంద్ వాళ్ల పక్కనే నేల మీద కూర్చుని యమున చేతిని పట్టుకుని అడిగాడు, మాట మార్చడానికా అన్నట్లు, "పిల్లలేరక్కా?"

"పార్కుకి వెళ్లినట్లున్నారు, తను తీసుకెళ్లారు అలా.." బొంగురు గొంతుతో సమాధానం చెప్పింది.

అంతలో వంటింట్లోంచి సుందరి వేడివేడి కాఫీ నాలుగు గ్లాసుల్లో పోసి తీసుకొచ్చింది. ఆవిడ రోజుకి మూడుసార్లు కాఫీ తాగకపోతే ఉండలేదు.

"అబ్బ.. సరిగ్గా సమయానికి తెచ్చావమ్మా! ఇప్పుడే అనుకుంటున్నా.. అమ్మ చేతి కాఫీ తాగి ఎన్ని రోజులో అయిందని. ఇన్నాళ్లూ వంటామే కదా!బాగానే ఉండేదనుకో.. కానీ.." నురుగుతో కమ్మని వాసన వేస్తున్న గ్లాసు తీసుకుంటూ అన్నాడు ఆనంద్.

"అమెరికా రావలసిందే నంటావా నేను?" సుందరి అడిగింది అదోలా చూస్తూ.

"అందుకే కదమ్మా ఇన్ని ప్రయత్నలు చేశాను. నీక్కూడా కొంత మార్పుంటుంది. నువ్వు నా దగ్గరే ఉంటే నాకు ధైర్యంగా ఉంటుంది."

యమున చివాలున తలెత్తి చూసింది. ఇన్నేళ్లూ తను ఏమీ చూసుకోలేదా? ఎంత చేసినా పరాయిదానిలాగే ఉందా! అక్క కళ్లల్లో భావాలు చదివిన ఆనంద్ వెంటనే అన్నాడు, తప్పు దిద్దుకుంటున్నట్లు, "అంటే.. మీరు ఉన్నారక్కా! కానీ నేనయితే మెడికల్‌గా కూడా సహాయం ఉంటుందని. పైగా ఒక్క కొడుకుని, నాతో అప్పా, అమ్మా ఎప్పుడూ లేరు. తీరా వచ్చే సమయానికి.." ఆపేశాడు, మాట మింగేస్తూ.

మనసులో దాక్కున్న దుఃఖం లావాలా పొంగింది. మోకాళ్లమీద తల వాల్చుకుని వెక్కి వెక్కి ఏడిచాడు.

అప్పుడే లోపలికి వస్తున్న గిరి, చేతిలో ఉన్న కామిక్ పుస్తకాలు పిల్లలకిచ్చి, వరండాలో చదువుకొమ్మని చెప్పి, ఆనంద్ పక్కనే కూర్చుని భుజాలు నిమురుతూ ఓదార్చసాగాడు.

"నేనేం అనలేదురా తమ్ముడూ! అలాగే తీసుకెళ్లు. మీక్కూడా ఉంటుంది కదా అమ్మ ఉండాలని! కాకపోతే మేం ఏదయినా పల్లెటూరికి మారిపోతాం. ఖర్చు తక్కువుంటుంది. మన ఊళ్లల్లో దీపం పెడ్తే చాలు అనుకునే ఇళ్లు ఎన్నో ఉంటాయి."

ఆనంద్, గిరి యమున కేసి చూశారు, ఇద్దరి మనసులూ వేర్వేరు భావాలతో ఆర్ద్రమవగా.

గిరి తల దించుకున్నాడు తప్పు చేసినవాడిలా. నిజమే! సుందరి వెళ్లిపోతే ఆనంద్ ఇంక డబ్బు ఎందుకు పంపుతాడూ? ఇక ముందు గడవడం ఎలా? లాభం లేదు. ఏదో ఒకటి చెయ్యాల్సిందే ఎందరి చేత ఎన్ని మాటలు పడినా, యమున ఒక్కసారి కూడా తనని నిలదియ్యలేదు. ఓరిమితో, మగరాయుడిలా సంసారాన్ని ఈదుకొచ్చింది. వెనక్కి జరిగి గోడకానుకుని కూర్చుని భార్యని పరికించాడు. ఇన్నాళ్లూ సరిగ్గా గమనించలేదు. సగం వెంట్రుకలు నెరిసిపోయి, మొహం అంతా ముడుతలు పడి.. అక్కడక్కడ నల్లని చుక్కలు, కళ్లకింద చారలు, నలభైఏళ్లకే అరవై మీద పడినట్లుగా ఉంది. ఎంత చక్కగా ఉండేది? ఇదంతా తన వల్లనే కదూ! న్యూనతా భావంతో, అపరాధిలా చూశాడు అందరినీ.

ఆనంద్‌కి తను చేస్తున్న తప్పేమిటో తెలిసింది. ఇన్నేళ్లూ బాధ్యతగా తల్లిదండ్రులని చూసుకున్న చిన్నక్కకి తనేం భరోసా ఇవ్వకుండానే అమ్మని తీసుకెళ్లిపోదామనుకున్నాడు. అప్ప ఉంటే వేరే.. ఆయన చూసుకునే వారు. అందుకే వాళ్లిద్దరూ వెళ్లడానికి సిద్ధపడినప్పుడు చిన్నక్క పెద్ద బాధ పడలేదు. ఇప్పుడు.. మరి నిజమే కదా! చిన్నక్కా వాళ్లకి తనున్నాననే ధైర్యం ఇవ్వాలిసిన బాధ్యత ఉంది.

"చిన్నక్కా!" ప్రేమంతా గొంతులో నింపుకుని మార్దవంగా పిలిచాడు.

ఆ స్వరంలోని ఆప్యాయతకి అక్కడున్న అందరూ చలించిపోయారు. అదే రక్త సంబంధంలోని తియ్యదనం. గట్టిదనం. ఎన్ని మనస్పర్థలున్నా, ఎంత తిట్టుకున్నా.. చిన్నప్పుడు కొట్టుకున్నా, సమయం వచ్చినప్పుడు, అవసరమైనప్పుడు, మీకు మేమున్నాము అనే అభయం ఇవ్వగలగాలి. అలా అనే పరిస్థితులు, అనగలిగే పెద్దమనసు కల్పించుకోవాలి. ఆనంద్ అటువంటి తమ్ముడే కావేరికి, యమునకీ.

"మీరు ఎక్కడికీ వెళ్లనక్కర్లేదు. ఇదివరకు లాగనే నేను డబ్బు పంపుతుంటాను. నీక్కూడా గ్రీన్ కార్డ్‌కి అప్లై చేశాను. తల్లిదండ్రులకి తొందరగా వస్తుంది, కానీ తోబుట్టువులకి ఎక్కువ సమయం తీసుకుంటారు. నీకు నాలుగైదేళ్లలో వచ్చేస్తుంది. అంతవరకూ మీరు ఇక్కడే ఉండి, స్మితని బాగా చదివించండి. అమ్మని మాత్రం నేను తీసుకెళ్తాను. అది నా చిరకాల కోరిక. కాదనవు కదూ?"

యమున లేచి వచ్చి, తమ్ముడి పక్కన కూర్చుని చెయ్యి పట్టుకుంది. ఆ స్పర్శలో ఆనంద్‌కి అన్ని సమాధానాలు దొరికాయి.

●●●

**న్యూయార్క్, 1990:**

"విష్ యు హాపీ టైం ఇన్ అమెరికా!"

విమానం తలుపు దగ్గరికి రాగానే ఎయిర్ హోస్టెస్ చిరునవ్వుతో నమస్కారం పెట్టి అంటుంటే, యమునకి విష్, హాపీ తప్ప ఇంకేం అర్థం అవలేదు. బింకంగా తనుకూడా అటువంటి నవ్వునే విసిరి, బయటికి అడుగు పెట్టింది.

"హాపీగా విష్ చేస్తోంది.. నిజంగా ఇక్కడ హాపీగా ఉంటానా? జీవితంలో ఈ దశ ఎలా ఉంటుందో!" అనుకుంటూ, తోటి ప్రయాణీకులు ఎటు వెళ్తే తను కూడా అటే నడిచింది.

ప్రయాణంలో చివరి మజిలీ కనుక ఫరవాలేదు. తప్పిపోయే అవకాశం లేదు. అదే ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఆగినప్పుడైతే.. తల్చుకుంటేనే యమునకి వణుకు పుట్టుకొచ్చింది. ఎవరూ తెలుగు వాళ్ళు కనిపించలేదు. యమున ఏం మాట్లాడుతోందో అర్థం కాక భుజాలెగరేశారు, ఎయిర్‌పోర్ట్‌లో ఉండే ఉద్యోగులు. బాణం గుర్తులతో ఉన్న పేర్లను చదివి మీక్కావలసిన చోటికి వెళ్ళండి అన్నట్లు సైగలు చేశారు.

ఇంచుమించు రాజమండ్రీ అంతున్న ఎయిర్‌పోర్ట్‌లో అటు తిరిగి, ఇటు తిరిగీ, మొత్తానికి పట్టుకుని వెళ్ళేసరికి, గేటు తలుపు వేసెయ్య బోతున్నారు.

ఆయాసపడుతూ, బోర్డింగ్ పాస్ చూపించి బ్రిడ్జిలోకి పరుగెత్తింది.

తన సీట్లో కూర్చున్నాక కానీ గుండె కుదుటపడలేదు. కూర్చున్నాక నుదుటిమీంచి చెమటలు ధారగా కారాయి.. ఏసీ ఎంత ఎక్కువగా ఉన్నా కూడా. చాలా సేపు తన గుండె చప్పుడు తనకే వినిపించింది.

"అమ్మా!" ఉలిక్కిపడి పక్కకి చూసింది. పక్కనున్న పొడవాటి తెల్లయువకుడు ఏదో పత్రిక చదువుకుంటున్నాడు. ప్చ్! అంతా తన భ్రమ.. స్మిత ఇక్కడికెలా వస్తుంది? కుదుటపడిందనుకున్న గుండె బాధగా మూలిగింది. ఇదే మొదటిసారి తన చిట్టితల్లిని వదిలి రావడం. ఎలా ఉందో!

తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. ఇంకా పన్నెండు గంటలవలేదు వదిలి.. ఎన్నాళ్ళు పడుతుందో మళ్ళీ చూడ్డానికి.

న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ క్యూలో నుంచున్న యమున కళ్ళముందు మళ్ళీ స్మిత నిల్చుంది. "నన్ను క్షమించు తల్లీ.. ఇదంతా నీకోసమే.." కళ్ళు మూసుకుని గొణుక్కుంది.

"యస్.." ఇమిగ్రేషన్ బల్ల దగ్గరకి ఎలా వచ్చిందో తనకే తెలియలేదు.. ప్రవాహంలో కొట్టుకుపోయి వచ్చేసిందంతే.

గబగబా తన దగ్గరున్న పాస్‌పోర్ట్ కావలసిన కాగితాలు, అద్దం వెనుక ఉన్న నల్ల అమ్మాయికి ఇచ్చింది. ఎంతసేపటికో.. అవసరమైన చెకింగులన్నీ అయ్యాకా బల్లమీద యమున పాస్‌బుక్, అధికారులకి అక్కర్లేని కాగితాలూ పెట్టి అంది..

"విష్ యు హాపీ టైం ఇన్ అమెరికా!"

అడుగు పెట్టిందో లేదో.. అప్పుడే ఇది రెండోసారి. వేచి చూడాల్సిందే!

●●●

అరే.. సామాన్లన్న అలా తిరిగిపోతున్నాయే! ఎలా దింపుకోడం.. యమునకి అర్ధం అవలేదు. అదిగో.. తన తోలు పెట్టెలు రెండూ కనిపిస్తూనే ఉన్నాయి.. ఇది మూడో సారి రావడం. బెల్ట్‌తో పాటు పరుగెత్తి దింపబోయింది. కనీసం ఒకటి తీసినా.. రెండోది మళ్ళీ సారి.. దింపుకోవచ్చు. కానీ ఒక్కటి కూడా చేతికి రావట్లేదు. యమునకి ఏడుపు రాబోయింది.

"చిన్నక్కా!" చిరపరిచితమైన కంఠం వినపడగానే ఆనందంగా వెనక్కి తిరిగింది.

"హమ్మయ్యా.. ఆనంద్! వచ్చేశావా? ఈ పెట్టెలేవిట్రా. అలా తిరిగిపోతుంటే ఎలా తియ్యడం. పైగా చచ్చేంత బరువు. కూలాళ్ళుంటారేమో అని చూశాను. నా దగ్గర కొన్ని డాలర్లున్నాయిలే. ఎక్కడా ఎర్ర చొక్కా వాళ్ళు కనిపిస్తేనా! మీరు ఎలా చేస్తుంటార్రా ఈ ప్రయాణాలన్నీ" కంచు కంఠంతో ఆపకుండా మాట్లాడుతున్న అక్కగార్ని చిరునవ్వుతో చూస్తూ, సునాయాసంగా రెండు పెట్టెల్నీ దింపేశాడు ఆనంద్. యమున కళ్ళప్పగించి చూస్తుండిపోయింది.

"సారీ అక్కా! కొంచెం లేటయింది. మధ్యలో ఎంత ట్రాఫిక్కో. నువ్వు ఖంగారు పడుతుంటావని అనుకున్నాను. నయం గేటు దాటి వచ్చేస్తే వెతుక్కోడం కష్టమయ్యేది. కారోసిల్ మంచి పనే చేసిందన్నమాట." అక్కని గట్టిగా హగ్ చేసి బైటికి నడిపించుకెళ్ళాడు.

ఏదో అడుగుదామనుకున్న యమున, అదేవిటో మర్చిపోయింది.. ఎవరూ తియ్యకుండానే తెరుచుకున్న గాజు తలుపుల్నీ చూస్తూ.

"అమ్మెలా ఉంది? శోభ పిల్లలూ బాగున్నారా? మనిల్లు ఎంత దూరం..?" సామాన్లున్న ట్రాలీ తోసుకుంటూ షికారుకెళుతున్నట్లు జాలీగా నడుస్తున్న ఆనంద్ వెనకాలే పరుగెడుతూ అడుగుతోంది. ఇక్కడ స్పీడుగా నడవడం అలవాటు చేసుకోవాలన్నమాట. ఇంటి దగ్గర అడుగులో అడుగు వేసుకుంటూ నడవడం గుర్తుకొచ్చింది.

"ఆడపిల్లలు నెమ్మదిగా నడవాలి.. అలాగే మాట్లాడేప్పుడు పక్కనున్న వాడికి తప్ప వినిపించకూడదు." నాన్నమ్మ చిన్నప్పట్నుంచీ నూరిపోసిన నీతులు గుర్తుకొచ్చాయి. మొదటిది బాగానే వచ్చింది కానీ, రెండో నీతే.. యమున తగ్గించుకుందామన్నా తన గొంతు సహకరించదు. మైకుతో పనిలేకుండా ఫర్లాంగు దూరం వినిపిస్తుంది.

"చిన్నక్కా! కారెక్కు.." ఆలోచన్లలో పడి కారు దగ్గరకొచ్చిన సంగతే చూసుకోలేదు.. లిఫ్ట్ ఎక్కారు, సొరంగం లోంచి వచ్చారు. మధ్యలో రెండు క్రాసింగులు దాటారు. అయోమయంగా చూస్తూ కారెక్కి కూర్చుంది యమున. సీటు బెల్ట్ పెట్టుకోడం చూపించి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు ఆనంద్.

"చెప్పక్కా! ప్రయాణం బాగా జరిగిందా?" కారు హైవే ఎక్కగానే వెనక్కి వాలి అడిగాడు ఆనంద్.

"ఊ! ఫరవాలేదు. ఆ బ్రిడ్జి అలా ఉందేవిటీ.." బ్రూక్లిన్ బ్రిడ్జ్ చూస్తూ, నిద్ర మత్తుతో కళ్ళు మూసేసి తల వెనక్కి వాల్చేసింది యమున.

సన్నగా గుర్రు వినిపించింది.

"ఒకే! పడుకో అక్కా.. ఇంటికెళ్ళడానికి ఎలాగా గంట పడుతుంది."నవ్వుకుంటూ కారు పోనిచ్చాడు ఆనంద్.

●●●

"చిన్నక్కా! ఇంటికొచ్చేశాం.. లే!" కలలోలా వినిపిస్తుంటే బలవంతంగా కళ్ళు తెరిచింది యమున. అరే.. ఇంత మొద్దునిద్రేంటీ! తమ్ముడితో ఎన్నో కబుర్లు చెప్దామనుకుంది.

నెమ్మదిగా కారు దిగి కాళ్ళు సవరించుకుంది.

"అబ్బ.. కారులో కూర్చుంటే ఎంత సుఖంగా ఉందోరా." కళ్ళు విప్పార్చి చుట్టూ చూస్తూ అంది యమున.

"యమునా!" నవ్వుతూ వచ్చి పలుకరిస్తున్న తల్లిని చూసి ఒక్కంగలో ఆవిడ దగ్గరికి వెళ్ళి గట్టిగా కౌగలించుకుంది. నాలుగేళ్ళయింది. అమ్మని వదిలి అంతకాలం ఉండడం అదే సుందరి పెద్ద లావవలేదు కానీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిసిపోతోంది. పదిహేను రోజులకోసారి మాట్లాడుతూనే ఉంది యమునతో, కావేరితో.. కానీ చూస్తుంటే ఆ దారే వేరు. అమ్మని చూడగానే అనుకోకుండా ఏడుపొచ్చేసింది.

"పిచ్చి తల్లీ! అంతా సవ్యంగా జరుగుతుంది. బెంగెట్టుకోకు." యమున వీపు నిమురుతూ అంది సుందరి.

"వదినగారూ! వచ్చేశారా? ఎలా ఉంది విమాన ప్రయాణం? కిటికీలోంచి అన్నీ చూశారా?" మరదలు శోభ ఆప్యాయంగా పలుకరిస్తూ వచ్చి చేతిలో బాగ్ తీసుకుంది.

పాంటూ, షర్టూ.. కత్తిరించుకుని భుజాల పైకి పరుచుకున్న జుట్టు. మొహమ్మీద బొట్టు లేదు. కనుబొమ్మలు ముడవబోయి.. తనున్నది తమ్ముడింటి ముందు అని గుర్తుకొచ్చి ఆపుకుంది కానీ మనసులో మాత్రం పిండుకుంటూనే ఉంది. అమ్మ ఎలా ఊరుకుందో! అయినా తనది సర్దుకుపోయే స్వభావం.. ఎక్కువగా ఏదీ పట్టించుకోదుగా చిన్నప్పట్నుంచీ.. పట్టించుకుంటే తను బాగా చదువుకునేది కాదూ! చివరికి తన మీదికే వచ్చింది.. నవ్వుకుంటూ జవాబిచ్చింది.

"చాలా బాగా జరిగిందమ్మా! అసలు ఎలా వచ్చానో తెలియనే లేదు. కిటికీ లోంచా.. మేఘాలు తప్ప ఏమీ కనిపించలేదు."

"ఇక్కడి పద్ధతులు ఇలాగే ఉంటాయి.. నేర్చుకో.." తనని తనే హెచ్చరించుకుంటూ శోభ వెనుకే వెళ్ళబోయింది.

"మీరు అక్కడే ఆగండి వదినగారూ! నేను వీధి తలుపు తీస్తా." ఆనంద్ సామాన్లు లోపల పెడ్తుంటే, శోభ గబగబా వెళ్ళి, సింహద్వారం తీసి, యమునని పిలిచింది.

అబ్బా! ఎంత పెద్ద తలుపో.. పూర్వం రాజులిళ్ళలో ఉండేవేమో! ఆశ్చర్యంగా చూస్తూ ఇంట్లోకి నడిచింది యమున.

"మీరు మొదటిసారి రావడం కదా! గరాజ్‌లోంచి ఎందుకనీ.. " శోభ నవ్వు చూశాక ధైర్యం వచ్చింది యమునకి. అమ్మని అంత బాగా చూసుకుంటున్నారు, తనకి మాత్రం లోటు ఎందుకు రానిస్తారూ?

"ఫరవాలేదు.. ఇక్కడ సాఫీగానే నడిచిపోతుంది." అనుకుంటూ ఇంట్లోకి నడిచింది యమున.

"కుడికాలు ముందు పెట్టావా అక్కా! అమెరికాలో కొత్త జీవితానికి ఇది నాంది కదా!"

ఆనంద్ నవ్వుతూ అంటుంటే ఆలోచనలో పడింది యమున.. కుడికాలే పెట్టానా?

●●●

"కుడి కాలు పెట్టినా సరే! ఏదీ ఈజీగా జరగదు. ఎన్నో మానసిక భౌతిక సంక్షోభాలని ఎదుర్కుంటూ.. చివరికి విధి నడిపించినట్లు నడవాల్సిందే. ఎవరైనా అంతా వాళ్ళ శ్రమ ఫలితమే అనుకుంటే వట్టి భ్రమే.." యమున విరక్తిగా అనుకుంటుంటుంది అప్పుడప్పుడు.

అమెరికా వచ్చి పదినెల్లు పైన అయింది. గిరికి వీసా వచ్చింది కానీ స్మితకి రావడానికి ఇంకా ఎన్నాళ్ళు పడుతుందో తెలీదు. తనకి వీసా ఉన్నా కూతురితో వస్తానని గిరి ఆగిపోయాడు. ఆడపిల్లని ఒక్కదాన్నీ ఎక్కడని ఉంచుతారు? గ్రీన్‌కార్డ్ ఉంటే మంచి సంబంధాలు వస్తాయని ఆగమన్నాడు ఆనంద్ పెళ్ళి చెయ్యడానికి. అదీ ఆనందే చెయ్యాలి కద.. గిరి గ్రీన్‌కార్డ్ ఒక ఏడాది పొడిగించమని పర్మిషన్ తీసుకున్నారు యు.యస్ కాన్సలేట్ వద్ద నుంచి. అయినా ఇద్దరూ తమ్ముడింట్లో.. తను ఏదో విధంగా సంపాదన మొదలు పెడ్తే కానీ.. ఆనంద్ స్పాన్సర్ చేస్తాననగానే చటుక్కున ఒప్పేసుకుని వచ్చేయడం మంచి నిర్ణయమేనా.. యమునకి ఒకోసారి అనుమానం వేస్తుంది.

"తప్పకుండా మంచి డెసిషనే.. అమ్మా! నువ్వేం బెంగ పెట్టుకోకు. నేను నాన్నగారిని బాగా చూసుకుంటున్నా.. మహా అయితే ఇంకొక ఏడాదిలో వచ్చేస్తాం ఇద్దరం." స్మిత ఫోన్‌లో అనే మాటలతో కర్తవ్యం గుర్తుకొచ్చి మనసు సమాధాన పరచుకుంటుంది. స్మిత యమ్మే కూడా అయి, ఇంటి దగ్గరే ఉన్న స్కూల్లో ఇంగ్లీష్, టీచర్‌గా చేస్తోంది. గిరి ఏదో ఆపనీ ఈ పనీ చేసి కొంత సంపాదిస్తున్నాడు. వెనుక ఎవరూ లేకపోయే సరికి బాధ్యత కొంచెం వచ్చినట్లుంది. ఏం చేస్తున్నారు అని యమున అడిగితే దాటేస్తాడు.

అమెరికా వచ్చినప్పట్నుంచీ ఎన్ని సవాళ్ళు ఎదుర్కొంది.. ఎంత తమ్ముడయినా ఎన్నిరోజులు ఉండగలదు.. త్వరగా ఉద్యోగం సంపాదించుకుని, స్మిత, గిరి వచ్చేలోపు అపార్ట్‌మెంట్ తీసుకోవాలి. ముఖ్యంగా భాష. ఏ పని చేద్దామన్నా ఇంగ్లీష్. తను చదివిన యస్సెస్సెల్సీ చదువుకి యస్ నోలు తప్ప ఇంకేం రావు. ఏం ఉద్యోగం వస్తుంది..

అమెరికా వచ్చిన వెంటనే స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసుల్లో చేర్పించాడు ఆనంద్.

ఎంత కష్టపడి నేర్చుకుంటున్నా పునాది లేని కట్టడంలాగే ఉంది.

ఆనంద్ వాళ్ళూ ఉండేది న్యూజెర్సీలో.. అక్కడ ఇండియన్స్ ఎక్కువమంది ఉండడం యమునకి లాభమే అయింది. బొంబాయిలో ఉండగా నేర్చుకున్న హిందీ బాగా ఉపయోగ పడింది. ఒక సూపర్ మార్కెట్లో హెల్ప్ పని దొరికింది. బైట తిరగడం ఇష్టమైన యమునకి కారుడ్రైవింగ్, వీధులు గుర్తు పెట్టుకోడం, మాప్ చూసి ఎక్కడికయినా వెళ్ళగలగడం ఇట్టే వచ్చేశాయి.

సూపర్ మార్కెట్లో కూడా పని సులభంగా నేర్చేసుకుంది. కాకపోతే అంతంత బరువైన పాకెట్లు సర్దడం.. ట్రాలీలు తోసుకుంటూ ఈ పొడుగు నుంచి ఆ పొడుక్కి తిరగడం.. స్టూలు వేసుకుని మెడ విరిగేలా పైకి చూస్తూ ఎత్తైన రాకులమీది లేబుల్స్ చదివి ఎక్కడివక్కడ పెట్టడం.. సాయంత్రం ఇంటికొచ్చేసరికి నడుం, మెడ, కాళ్ళూ చేతులూ చెప్పిన మాట వినడం మానేశాయి. రాగానే ఒక గంట పడుక్కుంటే కానీ మామూలుగా అవలేకపోయింది మొదట్లో.

వచ్చిన కొత్తల్లో బైటికి వెళ్ళేటప్పుడు చీర, బొట్టు, గొలుసులు.. గాజులు, హైద్రాబాద్‌లోలాగ తయారయ్యేది. అంతా అలవాటయి.. ఇంగ్లీషులో కొంత సంభాషణ జరపడం వచ్చి, మరునాడు డ్రైవింగ్ టెస్ట్‌కి వెళ్ళాలనగా శోభ నెమ్మదిగా నచ్చచెప్పింది.

"వదినా! మీరు ఇక్కడే ఉండాలని అనుకున్నప్పుడు తప్పక మారాల్సిందే ఇవేళ వెళ్ళి పాంట్లు, టాప్స్ కొనుక్కొద్దాం. మీరు ముఖ్యంగా బొట్టు తీసెయ్యాలి. ఇవన్నీ సర్వైవల్ కోసం తప్పనిసరి.. అందులో మీరు పనిచెయ్యబోయేది పబ్లిక్ ప్లేస్‌లో. రకరకాల వాళ్ళు వస్తుంటారు."

"ఈ వయసులో.. అవన్నీ.." యమున అయోమయంగా చూసింది.

"ఏమంత వయసనీ.. నలభై అయిదు.. అంతేగా! ఇక్కడ లైఫ్ బిగిన్స్ యట్ ఫార్టీ అంటారు. పదండి." శోభ మాల్‌కి లాక్కెళ్ళింది.

యమున మధ్యవయసు దాటినా చురుగ్గా, ఉత్సాహంగా ఉంటుంది. లావూ, సన్నం కాకుండా, పొడవూ పొట్టీ కాకుండా సమానంగా ఉంటుంది. ఎప్పుడూ తిరగడం అలవాటేమో శరీరం కడ్డీలా ఉండి ఏ డ్రస్ వేసినా అతికినట్లు సరిపోతుంది.. జుట్టు వంకీలు తిరిగి పోయి భుజాలు దాటదు.

డ్రస్సింగ్ రూంలోకి వెళ్ళి వచ్చిన యమునని ఆరాధనగా చూస్తుండిపోయింది శోభ.

"మీకు ఈ ఫుల్‌హాండ్ షర్ట్, పాంట్ ఎంతబాగా నప్పాయో తెలుసా." యమున దగ్గరగా వచ్చి జుట్టుకి పెట్టిన క్లిప్ తీసేసింది. నుదుటి మీదినుంచి, మెడవరకూ రింగురింగులుగా చుట్టుకుపోయింది. అక్కడక్కడ తెల్ల వెంట్రుకలున్నా అదీ ఒక రకమైన ఠీవి నిచ్చింది.

యమున సిగ్గుగా అద్దంలోకి చూసుకుంది. ఎవరో కొత్త మనిషిలా అనిపించింది.

"బాగుందంటావా?"

"చాలా బాగుంది. ఏ స్పానిష్ లేడీలాగో ఉన్నారు.. కాకపోతే ఒక్కటే చిక్కు.." సందేహంగా ఆగిపోయింది శోభ.

"ఫరవాలేదు చెప్పు."

"ఈ స్టిక్కర్ తీసేస్తే.."

హిందూ సాంప్రదాయానికి ప్రతీకమయిన బొట్టు.. భర్త బ్రతికుండగానే! యమున మొహంలో మారుతున్న భావాలని గమనించి, స్టిక్కర్ తియ్యబోతున్న శోభ చెయ్యి వెనక్కి లాక్కుని ఆగిపోయింది. అమ్మకి మాత్రం ఇష్టం ఉంటుందా.. ఆవిడ ఎదురుగా ఎలా తిరుగుతుంది? యమున మనసులో భావాలు గ్రహించినట్లుగా అంది శోభ, "ఇంట్లో మామూలుగా ఉండచ్చు వదినా! నే ననేది బైట ఉద్యోగానికి వెళ్ళినప్పుడే."

ఆరోజు శోభ ధైర్యం చేసి బొట్టు తియ్యలేకపోయింది.. కానీ..

యమున ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకే ఎదురైన భయంకరమైన అనుభవం.. తన చేతే ఆ పని చేయించింది. ఆ సంఘటన తల్చుకుంటేనే ఇప్పటికీ ఒళ్ళంతా చెమటలు పడ్తాయి.

మామూలుగా పార్కింగ్ లాట్లోకి వచ్చి కారు బయటికి తియ్యబోతోంది.. నలుగురు యువకులు.. ఒకడు జుట్టు భుజాలు దాటి పెంచీ, ఇంకోడు రోమన్ రాజకుమారుడిలాగ మధ్యలో జుట్టుని పైకి పొడుచుకొట్టేట్టు దువ్వీ, ఇంకోడు నున్నటి గుండూ.. మరొకడు ఒళ్ళంతా గగుర్పొడిచే పచ్చబొట్లతో కారుకి అడ్డంగా నిలబడ్డారు.

తలుపుకి దానంతట అదే తాళం పడిపోతుంది కనుక యమున బ్రతికి పోయింది.

ఇద్దరు కారు ముందుకి వచ్చి భయంకరంగా నవ్వుతూ పిడికిళ్ళు చూపిస్తున్నారు. వణుకుతున్న చేతులతో స్టీరింగ్ వీల్ పట్టుకుని రివర్స్ గేరుకి మార్చి, మెల్లిగా యాక్సిలరేటర్ మీద కాలు పెట్టింది. వెనుక ఉన్న ఇద్దరూ పక్కకి గెంతేసి.. చేతిలో ఉన్న పెద్ద రాళ్ళని తీశారు.. అద్దాలు పగలగొడ్తామని బెదిరిస్తూ. చలికాలమేమో ఆరుగంటలకే నిర్మానుష్యమైపోయింది అంతా.

యాక్సిలరేటర్ మీద గట్టిగా కాలు పెట్టి, గేరు మార్చి దూసుకెళ్దామంటే చేతులు కాళ్ళు చెప్పిన మాట విననంటున్నాయి. యమునకి కళ్ళలోంచి నీళ్ళు తెలియకుండానే కారిపోతున్నాయి. ముందుసీట్ల తలుపుల పక్కనా.. ఎదురుగా.. రాక్షసుల్లా, భీకరంగా.. ఎవరు వీళ్ళు! ఏం చెయ్యాలి? ఎమర్జెన్సీ లైట్లు వెలిగించి హారన్ మీద చెయ్యి వేసి ఉంచింది.

గుండువాడు నుదిటిమీద చెయ్యి పెట్టి ఏదో చెప్తున్నాడు. ఇద్దరు రాళ్ళు గురిచూసి వెయ్యబోతున్నారు..

యమున కళ్ళు మూసుకుని తన ఇష్ట దైవం కృష్ణుడ్ని ప్రార్థించుకుంటోంది.

అయిపోయింది.. దేశం కాని దేశంలో.. ముక్కూ మొహం తెలియని మనుషుల చేతుల్లో తన జీవితం.. ఇంతేనా! పడ్డ శ్రమంతా వృధాయేనా! కష్టపడితే సాధించలేనిది లేదు ఈ దేశంలో అంటారు.. మరి ఇలాగవుతోందేమిటి? కళ్ళముందు స్మిత, గిరి ఆందోళనగా చూస్తున్నట్లు అనిపించింది. అంతే అలా స్టీరింగ్ వీల్ మీద తల వాల్చేసింది.

●●●

ఎవరో నెమ్మదిగా తలుపు మీద శబ్దం చేస్తుంటే లేచింది యమున. నీలం డ్రస్సులో పోలీసులు..

హారన్ మీదనుంచి చెయ్యి తియ్యమని సైగ చేస్తున్నాడు ఒకతను. భయంగా అటూ ఇటూ చూసింది. ఆ రాక్షసులు.. ఎక్కడా లేరు. ధైర్యం తెచ్చుకుని చెయ్యి తీసి కిటికీ అద్దం దించింది.

"ట్రబుల్ చేసే వాళ్ళు వెళ్ళిపోయారు. మీకేం భయం లేదు.. వాళ్ళు డాట్ బస్టర్స్. మీరు కేర్‌ఫుల్‌గా ఉండాలి. హెల్ప్ కావాలా? మీ ఇంటివరకూ రమ్మంటారా?"

"నో! థాంక్స్." కాళ్ళు చేతులూ కూడదీసుకుని నెమ్మదిగా ఇంటి దారి పట్టింది.

జాగ్రత్తగా డ్రైవ్ చేస్తోందే కానీ యమునకి ఇంకా గుండె దడ తగ్గలేదు. ఇలాంటి దాడులుంటాయని ఎప్పుడు చెప్పలేదే ఎవరూ! ఎంత సేపు అమెరికా అంటే భూతల స్వర్గం.. ఎంత పని చెయ్యగలుగుతే అంత డబ్బు.. తిండికీ బట్టకీ లోటుండదు. బాగా వెనకేసుకోవచ్చు. పిల్లలకి అందమయిన భవిష్యత్తు అందించచ్చు.. ఇవేగా!

ఇక్కడికి వచ్చిన వాళ్ళు పడుతున్న పాట్లు ఎన్నీ.. ఎటువంటివీ.. వాటి గురించి చెప్పరే!

ఒకవేళ చెప్పబోయినా రావాలనుకున్నవారు వినిపించుకోరు. పైగా అడ్డుపడుతున్నారని నింద కూడా వెయ్యచ్చు. తను మాత్రం వినేదా..

ధైర్యం కూడ తీసుకుని ఇంట్లో అడుగు పెట్టింది యమున.

తప్పకుండా కుడికాలే పెట్టి ఉంటా.. లేకపోతే ఈ పాటికి ఎక్కడుండేదాన్నో అనుకుంటూ తన గది లోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది నీరసంగా.

.....................

"మొట్టమొదటి సారిగా 1987లో మొదలయింది. హిందువుల మీద ముఖ్యంగా గుజరాతీ వ్యాపారస్థుల మీద పగతో ఈ ఉద్యమం."

డాట్ బస్టర్స్ అంటే ఎవరూ అని అడిగిన యమునకి వివరిస్తోంది శోభ. వాళ్ళ గురించి ఇప్పుడు ఎందుకని అడిగిన శోభకి పార్కింగ్ లాట్లో జరిగిన గొడవ గురించి చెప్పింది.

"మీకేం అవలేదు కదా వదినా!" శోభ ఆందోళనగా చూసింది.

"సమయానికి పోలీసులు వచ్చారు.. లేకపోతే ఏం జరిగేదో. వాళ్ళే చెప్పారు ఈ డాట్ బస్టర్స్‌తో జాగ్రత్తగా ఉండాలని.. ఎవరు వీళ్ళు?"

"అదో పెద్ద కథ. ఆ రోజుల్లో అయితే రోడ్డు మీదికి వెళ్ళాలంటే వణికి పోయే వాళ్ళం. "ఈ డాట్ పెట్టుకునే పటేల్స్ అంటే మాకు పరమ అసహ్యం.. వాళ్ళున్న ఏరియాలో నివసిస్తున్న వాళ్ళంతా అదే అయి ఉంటారు. వాళ్ళనీ.. ఈ ఏషియన్స్ అందర్నీ.. తరిమితరిమి వెళ్ళగొట్టే వరకూ మేం నిద్రపోం." ఇదీ ఆ డాట్ బస్టర్స్ స్లోగన్. వాళ్ళ దృష్టిలో బొట్టు పెట్టుకున్న వాళ్ళంతా పటేల్సే.

మొదటిసారిగా నౌరజ్‌మోడీ అనే గుజరాతీ వర్తకుడ్ని, అతని ఫ్రెండ్‌తో కలిసి గోల్డ్‌కోస్ట్ కేఫ్ నుంచి వస్తుండగా ఇటుకలు, కర్రలు పెట్టి స్పృహ తప్పే వరకూ కొట్టారు. అతను నాలుగు రోజుల తర్వాత చనిపోయాడు. నౌరజ్ మోడీ తండ్రి జంషెడ్ మోడీ పోలీసుల మీద ఏషియన్ ఇండియన్స్ పై జరుగుతున్న దాడుల్ని ఉపేక్షిస్తున్నారని కేసు పెట్టాడు. కానీ కోర్టులో తగిన ఆధారాలు లేవని కొట్టేశారు.

మోడీ మీద దాడి జరిగిన కొద్ది రోజులకే శరన్ అనే 28 ఏళ్ళ యువకుడ్ని జెర్సీ సిటీ హైట్స్ అనే చోట, పార్కుకి దగ్గర్లో, జనం తిరిగే చోట కొట్టి రోడ్డు పక్కన పడేశారు. శరన్ ఇండియాలో మెడిసిన్ చదివి ఇక్కడ లైసెన్స్ కోసం ప్రయత్నిస్తూ పరీక్షలు పాసవుతున్నాడు. ఆనంద్‌కి బాగా తెలిసిన వాడే ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు. అతని స్కల్కీ, బ్రెయిన్‌కీ బాగా దెబ్బలు తగలడంతో పాక్షిక కోమాలో ఉండిపోయాడు. ఇంకా అతన్ని అటాక్ చేసిన వారి మీద ట్రయల్ నడుస్తోంది.

ఈ గాంగ్ న్యూయార్క్, న్యూజెర్సీల్లో ఉంటూ జెర్సీ సిటీలో ఎక్కువగా తిరుగుతుంటారు. అక్కడ పోలీసు నిఘా కూడా ఎక్కువ చేశారనుకోండి. వీళ్ళు ఎక్కువగా బొట్టుపెట్టుకునే హిందువులనే టార్గెట్ చేసుకుంటున్నారు.. ఈస్ట్ ఏషియన్స్ అందర్నీ వెళ్ళగొట్టాలన్నదే వాళ్ళ ధ్యేయం.

అందుకే ఆ రోజు మిమ్మల్ని బొట్టు తీసెయ్యమన్నాను. ఇక్కడ సెటిల్ అయిన మేం చాలా మంది పెట్టుకోం. ముఖ్యంగా బైటికి వెళ్ళేటప్పుడు. ఏ దేశంలో ఉంటే ఆ దేశం వాళ్ళలాగ ఉండడం అలవాటు చేసుకోవాలి." శోభ ఆపింది.

●●●

యమున హైవే మీద కుడిచివర ఉన్న లైన్‌లోంచి మినిమం స్పీడ్ లిమిట్లో కారు పోనిస్తూ చిన్నగా నవ్వుకుంది.. అద్దంలో బొట్టు లేకుండా కనిపిస్తున్న తన మొహం చూసుకుని. ఇప్పుడు కావేరి తనని చూసిందంటే.. అత్తపోరు లేదని ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావే అంటుందేమో!

ఆలోచనల్లోంచి బైటపడి ఎగ్జిట్ తీసుకుని తను పనిచేసే సూపర్‌మార్కెట్ ఉన్న రోడ్‌లోకి కారుని తిప్పింది. పరాకుగా ఉండి ఎగ్జిట్ తీసుకోవడం మర్చిపోయిందా అంతే సంగతులు! ఇరవై మైళ్ళు వెళ్ళి వచ్చినట్లు వెనక్కి తిరిగి రావలసిందే అరగంట టైము.. ఎనిమిది డాలర్లూ..

ఎటువంటి మార్పులు వస్తాయో జీవితంలో ఎవరూ ఊహించలేరు. పార్కింగ్ లాట్లో ఆపి కారు దిగి, మార్కెట్ పేరు రాసున్న ఎర్రటి ఓవరాల్ తొడుక్కుని, బాడ్జ్ తగిలించుకుంది.

"హాయ్! యమూనా.. హౌ ఆర్ యు టుడే..?" తన కారు పక్కనే పార్క్ చేసి కారు దిగుతూ పలుకరించింది సూప ర్‌వైజర్ శమంతా.

"ఫైన్. హౌ ఆర్ యూ?" తనుకూడా నవ్వుతూ ఆగింది. ఇద్దరూ టైం చూసుకుంటూ పరుగెడుతున్నట్లుగా నడిచారు ఆటోమాటిక్ తలుపు లోపలికి.

●●●

యమున త్వరగా వెళ్ళి కౌంటర్ నంబర్ పది దగ్గర నిల్చుని కంప్యూటర్, క్రెడిట్ కార్డ్‌లు పెట్టే మెషిన్స్.. అన్నీ ఆన్ చేసింది. పేమెంట్ కౌంటర్ దగ్గరికి వచ్చాక కొంచెం సులువయింది పని. తన ఎనిమిది గంటలు అయిపోయాక, శమంతా దగ్గర డాటా ఎంట్రీలు నేర్చుకుంది. బార్ కోడ్లు చూపించి కంప్యూటర్కి సరుకుల పేర్లు, ఖరీదులు ఎక్కేలా చూడ్డం, చూస్తూనే కార్డులు పెట్టాక అవి క్రెడిట్ అవుతున్నాయా లేదా చూడ్డం.. తెలియని వాళ్ళకి చూపించడం.. అంతా రొటీన్ అయిపోయింది.

ఒక సంవత్సరం అయితే గంటకి పది డాలర్లు ఇస్తామన్నారు. శని ఆదివారాలు కూడా పని చెయ్యడం మొదలు పెట్టింది. ఇంట్లో ఉన్నప్పుడు కూడా శోభ వంటింట్లో ఉంటే వెనుక వెనుకే ఉండి సహాయం చేస్తుంది. ఒక్కోసారి తన చేతి వంట రుచి చూపిస్తుంటుంది. సుందరికి పూర్తిగా విశ్రాంతి ఇచ్చారు. స్నానం చేశాక, భగవద్గీత కానీ రామాయణం కానీ చదువుకోవడం, తన వయసు వా ళ్ళతో ఫోన్లలో మాట్లాడ్డం, అప్పుడప్పుడు గుడికి వెళ్ళడం.. ఇవే ఆవిడ కాలక్షేపాలు.

యమునకి వంట మీద అంత అభిరుచి లేదు. ఏదో ఉప్పూ కారం వెయ్యడం.. అంత వరకే. గిరి ఏది పెట్టినా నోరెత్తకుండా తినేస్తాడు. సంసార బాధ్యత పట్టించుకోనివాడు సర్దుకు పోవల్సిందే అనుకుంటాడేమో మరి! అమెరికా వచ్చాక అమ్మని అడిగి కొంచెం నేర్చుకుంది.

గంటకి పది డాలర్లు వచ్చాక తను పనిచేసే చోటికి దగ్గ ర్లోనే అపార్ట్‌మెంట్ చూసుకుని వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది.

"శమంతా! ఈమె ఏదో అడుగుతోంది. నాకేం అర్ధం అవడంలేదు. కొంచెం హెల్ప్ చెయ్యవా? ఇన్ని రోజులయినా నాకు ఇక్కడ కొంతమంది మాట్లాడేది తెలియట్లేదు.. నాకు షేం అనిపిస్తోంది."

పెద్ద బండి నిండా తోసుకొచ్చిన సరుకుల్ని కౌంటర్ మీద పెడితే వాటిని కంప్యూటర్‌లోకి ఎక్కిస్తూ అటుగా వెన్న శమంతాని పిలిచింది యమున సిగ్గుపడుతూ.

"ఓహ్! ఈమె స్పానిష్ మాట్లాడుతోంది. నీకెలా అర్థమవుతుంది." నవ్వుతూ అంది శమంత.

కంప్యూటర్లోకి ఎక్కించిన సరుకుల్ని సంచీల్లో నింపడానికి వచ్చిన మెక్సికన్ యువతి కస్టమర్ డౌట్ తీర్చి యమునతో అంది..

"నిన్ను చూసి డొమినికన్ రిపబ్లిక్ నుంచి వచ్చిన స్పానిష్ గర్ల్ అనుకుందిట."

యమునని చూసి పకపకా నవ్వుతూ వెళ్ళిపోయింది కస్టమర్.

**తన చిన్న అపార్ట్‌మెంట్‌ని తృప్తిగా చూసుకుంది యమున.**

మరునాడు గిరి, స్మిత వస్తున్నారు. ఇన్నాళ్ల, ఇన్నేళ్ల శ్రమకి సార్థకత లభించబోతోంది. యమునకి కొంత ఆనందం, కొంత అశాంతి, కొంత ఉద్వేగం.. కొంత ఉత్సాహం, విభిన్న భావాలు. కాళ్లు తేలిపోతున్నట్లున్నాయి. బుర్రలో ఒక రకమైన మైకం కమ్ముకున్నట్లుంది.

"చిన్నక్కా! ఇప్పుడు హాపీగా ఉన్నావా? అందరూ కొన్నాళ్లు  మా దగ్గరుండి, ఇంకొంచెం సెటిల్ అయ్యాక వెళ్లమంటే విన్నావు కాదు.."

"గిరి మామయ్య, స్మిత వచ్చే లోపు నా ఇల్లంటూ ఏర్పరచుకోవాలని రా! ఏమీ అనుకోకు. అమ్మా నాన్నల కన్నా ఎక్కువ బాగా చూసుకున్నావు నన్ను. నీ వల్లనే కదా.. నాకంటూ ఒక ఇల్లు, ఒక సంసారం ఇన్నాళ్ళికి.." కళ్ళలో నీళ్ల తిరుగుతుండగా, గొంతులో ఏదో అడ్డు పడ్డట్లయింది యమునకి.

ఆనంద్ చటుక్కున వచ్చి, భుజాలు పట్టుకుని అక్కని దగ్గరకి తీసుకున్నాడు.

అతి కష్టం మీద తనని తాను సముదాయించుకుంది యమున.

"వదినగారూ! ఈ బల్ల కిటికీ దగ్గరగా వెయ్యమంటారా? చదువుకోడానికి వెలుతురు బాగా ఉంటుంది." పడగ్గదిలోంచి హాల్లోకి వచ్చిన శోభ గుమ్మం దగ్గరే ఆగిపోయింది, అక్కా తమ్ముళ్లని చూసి.

"నిజంరా.! నాది అందరి ఆడపిల్లల్లాంటి సాధారణ జీవితం కాదు. ఎవరైనా పెళ్లి అవగానే అత్తగారింటికి వెళ్లి.. అప్పుడప్పుడు పుట్టింటికి వచ్చి మహారాణీల్లాగ, అపురూపంగా వచ్చే అతిథుల్లాగ ఉంటూ.. అందరి ప్రేమాభిమానాల్ని పొందుతారు. కానీ నేను మాత్రం అత్తిల్లనేదే ఎరుగను. నాకంటూ ఒక ఇల్లు వాకిలి లేకుండానే ముప్ఫైఏళ్ళు గడిచిపోయాయి. ఎన్నెన్ని అవమానాల్ని ఎదుర్కొన్నాను.. ఎంతెంత నిష్ఠూరాల్ని భరించాను.." ఆపుకోలేని యమున అక్కడున్న సోఫా మీద కూలబడి రోదించసాగింది. ఆనకట్ట తెగిన వరద గోదారిలా ఉబికి ఉబికి వస్తున్నాయి కన్నీళ్ళు. వెక్కుతూ, పక్కటెముకలు కదిలేలా ఏడుస్తున్న చిన్నక్క పక్కనే కూర్చుని, తల నిమురుతూ ఓదార్చాడు ఆనంద్.

శోభ కళ్ళు పెద్దవి చేసి ఏం చెయ్యాలో అర్థం అవనట్లు అలాగే నిలబడి పోయింది.

కొంచెం సేపటికి ఉధ్రుతం తగ్గి, నెమ్మదిగా లేచి ఎర్రబడ్డ కళ్లు, మొహంతో బిడియంగా చుట్టూ చూసింది యమున. బాత్రూంలోకి వెళ్లి మొహం కడుక్కుని వచ్చింది.

శోభ చటుక్కున వచ్చి యమున చేతుల్ని పట్టుకుంది.

"నా వల్ల మీరెప్పుడయినా బాధ పడ్డారా వదినా?"

"లేదురా.. అందుకే కదా మీరు రమ్మనగానే ఏ సంకోచం లేకుండా వచ్చేసి.. ఇలా నిలదొక్కుకో గలిగాను. మీకు జీవితాంతం ఋణపడి ఉంటాను."



కౌముది

"అటువంటి మాటలొద్దు వదినా.. అప్పులూ, తీర్చుకోడాలూ అవీ పరాయివాళ్ళకి. మనం అంతా ఒక్కటే. ఇంకెప్పుడూ అలా అనద్దు." శోభ చెప్తూంటే ఎక్కువగా మాట్లాడని ఆనంద్ అవునన్నట్లుగా తలూపాడు.

సామానంతా సర్దేసి పిజ్జా తెప్పించుకుని తినేశారు ముగ్గురూ.

"పూర్తిగా సర్దుకోవడం అయ్యాక అమ్మని తీసుకొచ్చి రెండురోజులు ఉంచుకుంటా.. సంతోషిస్తుంది." పిజ్జా తెచ్చిన అట్ట పెట్టెని ముక్కలు చేసి చెత్త డబ్బాలో వేస్తూ అంది యమున.

"ఇంక నేను వెళ్ళాలి చిన్నక్కా! నైట్ కాల్లో ఉన్నా. ఏమయినా కావలిస్తే ఏ మాత్రం సందేహించకుండా.."

"అది నువ్వు వేరే చెప్పాలిరా! ఇట్స్ ఆల్ ఇన్ ద పాకేజ్.." అమెరికన్ లాగ.. అదే యాసతో అంటున్న, ఎంతో ఎదిగిన అమాయకురాలైన మొండి అక్కని చూస్తూ చిరునవ్వుతో బైటికి నడిచాడు ఆనంద్. వెనుకే శోభ.

"ఇంకో మాట.. రేపు ఎయిర్‌పోర్ట్‌కి నేను వెళ్లొచ్చేస్తాను. మీరు శ్రమ పడద్దు." యమునని ఆశ్చర్యంగా చూసింది శోభ.

"మీరు ఒక్కరూ.. అంత దూరం.. హైవే ఎగ్జిట్లూ అవీ చూసుకుని.. దారి తప్పారంటే న్యూయార్క్‌లో అంతా గజిబిజి. ఎందుకొదినా! నేను వస్తాను.. నాకేం పనీ లేదు.. ఇందులో పెద్ద శ్రమా లేదు. "

"నేను వెళ్ళగలను శోభా! ఫరవాలేదు.."

ఇంకా ఏదో చెప్పబోతున్న శోభని చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళాడు ఆనంద్..

"అలాగే చిన్నక్కా! నువ్వే వెళ్ళు. ఏదయినా ట్రబుల్ ఉంటే కాల్ చెయ్యి."

కార్లో వెళ్తూన్నప్పుడు భార్యతో నెమ్మదిగా అన్నాడు ఆనంద్..

"తన ఫీలింగ్స్‌ని మనం అర్థం చేసుకోవాలి డియర్.. అలాగే వాళ్ళ ఏకాంతానికొచ్చాడా మనం భంగం కలిగించ కూడదు. తన సామర్థ్యం మీద తనకి ఎంత నమ్మకం ఉందో తన ఫామిలీకి చూపించుకోవాలని.. దటీజ్ యమునా!"

●●●

యమున రోజూ కంటే ముందుగానే లేచి తయారయిపోయింది. అలవాటుగా పాంటూ, ఫుల్‌హాండ్ షర్టూ తీసి వేసుకోబోతూ ఒక్క క్షణం ఆలోచించింది. స్మిత సంతోషిస్తుంది కానీ గిరి ఏమంటాడో.. ఇంతవరకూ తన పని గురించీ.. ఆహార్యం గురించీ వివరాలు చెప్పలేదు ఇండియాలో వాళ్ళకి. ఇంకా గిరి క్రాపులో కనీ కనిపించకుండా ఉన్న పిలక గుర్తుకొచ్చింది.

ఏమీ అనక పోవచ్చు కానీ.. మొదట్లోనే ఎందుకు షాక్..

మరి కౌంటర్ దగ్గిర అందరూ వింతగా చూస్తారే.. జులపాలూ, టాటూలూ ఉన్న కుర్ర కస్టమర్లు గుర్తుకొచ్చి ఒక్క క్షణం వణికింది.

తను వచ్చే ముందు మీనా బజార్లో గిరి కొన్న ప్రింటెడ్ సిల్క్ చీర దానికి మాచ్ అయే బ్లౌజు, లంగా ఒక సంచీలో పెట్టుకుని, మామూలు బట్టలే వేసుకుని సూపర్ మార్కెట్‌కి బయలు దేరింది. వెళ్ళే ముందు వంటింట్లో ఒక పక్కగా అమర్చుకున్న దేముడి మందిరం దగ్గిర ఆగి, ఆపిల్ పండు నైవేద్యం పెట్టి, అగరొత్తి వెలిగించి, మనసారా కృష్ణుడ్ని ప్రార్థించింది. మర్చిపోకుండా అగరొత్తి ఆర్పేసింది, "చెక్క ఇళ్ళు.. ఎటువంటి నిప్పూ.. కొంచెం అయినా సరే ఉండ కూడదు.. మనం లేనప్పుడు" అనే తమ్ముడి మాటలు గుర్తుకొచ్చి.

ఉండి ఉండీ యమున కళ్ళు తడి అవుతూనే ఉన్నాయి ఉద్వేగంతో. అపార్ట్‌మెంట్ తాళం వేసి, కార్లో కూర్చుని, గట్టిగా ఊపిరి పీల్చి కళ్ళు మూసుకుంది.

ఒక నెల తక్కువగా రెండేళ్ళు అయిపోయింది, స్మితనీ, గిరినీ చూసి. మొదట్లో అనిపించిన బెంగ మెల్లిగా తగ్గిపోయింది. దాని స్థానే నిలదొక్కుకోవాలనే పట్టుదల, తన గోల్.. అన్నీ మర్చిపోయేలా చేసింది.

అలవాటయిన దారి.. ఆలోచిస్తూ తను పని చేసే సూపర్ మార్కెట్ దగ్గర ఆపి.. ఓవరాల్ వేసుకుని, సంచీ తీసుకుని లోపలికి నడిచింది.

"యమూనా! హేపీ మార్నింగ్.. మీ వాళ్ళు వస్తున్నా రు కదా! ఎప్పుడు? ఇవేళ తొందరగా వచ్చేశావే! అసలు నిద్రపోయావా?" శమంతా నవ్వుతూ పలుకరించింది టైం చూసుకుంటూ. శమంతా తన కింద పనిచేసే అమ్మాయిల కంటే అరగంట ముందే వచ్చి అన్నీ చూసుకుంటుంది. తను నెల జీతం తీసుకునే రెగ్యులర్ ఉద్యోగి. గంటల్లెక్క కాదు. బాధ్యతలెక్కువ.. బోనస్‌లూ అవీ ఉంటాయి.

ఎర్రబడ్డ బుగ్గలతో తలూపింది యమున.. కళ్ళు మిలమిలా మెరుస్తుండగా.

"ఫ్లైట్ ఎన్నిగంటలకి?"

"త్రీకి లాండవుతుంది. నాకు ఎయిర్‌పోర్ట్‌కి త్వరగా వెళ్ళే రూట్ వేసి ఇస్తావా?"

"ష్యూర్ యమూనా.. అదెంత పని.. నీకు టూ కి అయిపోతుంది కదా! ఒక హాఫెనవర్ ముందు వెళ్ళు.. ఎంత లేట్ అయినా వనండాఫ్ అవర్లో వెళ్ళచ్చు.. జేయఫ్‌కేనే కదా!"

"థాంక్యూ శమంతా!"

"యు వెల్కం.. వన్ మోర్ థింగ్. నువ్వు తీసుకున్న అపార్ట్‌మెంట్ దగ్గరే.. నడిచి వెళ్లిపోవచ్చు. ఒక కాంప్‌లెక్స్‌లో సెక్యూరిటీ పర్సన్ కావాలిట.. నైట్ టెన్ టు సిక్స్. చెయ్యగలవా?"

మంచి అవకాశం.. వదులుకోడం ఎందుకు.. నైట్ డ్యూటీ అంటే గంటకి పన్నెండు డాలర్లు..

చెయ్యగలనా లేదా అని ఆలోచించకుండా సరే అనేసింది యమున. శమంతా అడ్రస్ ఉన్న చీటీ ఇచ్చి మరునాడు కలవమని చెప్పింది.

"నేను వాళ్ళకి చెప్పేశాలే.. తప్పకుండా నిన్ను తీసుకుంటారు.. డోంట్ వర్రీ" అంటూ తన ఆఫీసుకి వెళ్ళిపోయింది శమంతా.

మొత్తం నెలకి ఎంత వస్తుందో లెక్కలు వేసుకుంటూ తన పనిలో పడిపోయింది యమున, టైం చూసుకోడానికి కూడా కుదరలేదు.

"కమాన్.. యమూనా! ఇదిగో ఎయిర్‌పోర్ట్ రూట్ మాప్ తీసుకో. టైం అవుతోంది.. మరి బయల్దేరు." శమంతా వచ్చి పిలిచేవరకూ ఖాళీ లేకుండా గడిచిపోయింది. ఆ రోజు మొత్తం అందరికీ ఒకేసారి ఇళ్ళల్లో సరుకులు అయిపోయినట్లు ప్రవాహంలా వచ్చేశారు.

"థాంక్యూ శమంతా.. నువ్వు లేకపోతే నే నేమయిపోయేదాన్నో!" నవ్వుతూ ఒకసారి మాప్‌లో దారి చెప్పించుకుని, తన సంచీ పుచ్చుకుని బాత్రూంలోకి నడిచింది యమున.

"వావ్! యు లూక్ గార్జియస్.." చీరలో ఉన్న యమునని చూసి కామెంట్ చేస్తున్న శమంతాకి టాటా చెప్పి కారు దగ్గరికి నడిచింది, ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకున్న శాండ్‌విచ్ నములుతూ.

●●●

"అమ్మా!" స్మిత చేతులూపుతూ గట్టిగా పిలిచింది.

కూతుర్ని చూస్తున్న యమునకి కళ్లనీళ్లు తిరిగాయి. ఇంచుమించు రెండేళ్లయిపోయింది.. కొంచెం చిక్కినా చక్కగా ఉంది చిట్టితల్లి. వీలయినంత త్వరగా మంచి సంబంధం చూసి పెళ్లి చేసెయ్యాలి.. మొహంలో ఈ అమాయకత్వం కనిపిస్తుండగానే. సామాన్లున్న ట్రాలీని చుట్టి వచ్చి తల్లిని కౌగలించుకుంది స్మిత. ఇద్దరికీ ఉద్వేగంతో మాటలు రాలేదు.

గిరి కొంచెం దూరంగా నిలబడి చూస్తున్నాడు. అతన్ని చూస్తుంటే గుండె వేగంగా కొట్టుకోవడం తెలుస్తోంది యమునకి. మొహంలో ముడుతలు బాగా కనిపిస్తున్నాయి. రెండేళ్లలోనే పదేళ్ల వయసు మీద పడినట్లు అనిపిస్తోంది. చిరునవ్వు మాత్రం అలాగే ఉంది. యమునని చూసిన సంతోషంతో కళ్లలో కాంతి వచ్చింది. ద్వైదీ భావంతో యమున మనసు బాధగా మూలిగింది. ఒక రకంగా తన కష్టాలకి అతనే కారణమని గుండె బరువెక్కుతోంది.. అయినా అతని మీద ప్రేమ.. నేనున్నానని అదే గుండెని తేలిక చేస్తోంది.

అమెరికా సాంప్రదాయాలు చూసి చూసి గట్టిగా కౌగలించుకుని, ముద్దుతో స్వాగతం చెప్పాలనిపించింది యమునకి. కానీ.. గిరి బెదిరిపోవచ్చు. అతనికి ఆత్మన్యూనత కలగకుండా చూసుకోవడం ఒక పెద్ద బాధ్యత యమునకి.

"నువ్వొక్కదానివే డ్రైవ్ చేసుకుని వచ్చావా అమ్మా?" కార్లో సామాన్లు పెడుతూ కళ్ళు పెద్దవి చేసి అడుగుతున్న స్మితని చూసి నవ్వింది యమున.

"ఇక్కడ డ్రైవింగ్ చెయ్యలేకపోతే కాళ్ళు లేనట్లే. చచ్చినట్లు నేర్చుకోవాలి.. ఫర్ ది సర్వైవల్.."

యమున ఎంతో లాఘవంగా ట్రాఫిక్ లోంచి హైవే మీదికి వెళ్ళి టేప్ రికార్డర్ పెట్టింది. మంద్రంగా మంగళంపల్లి కళ్యాణి రాగం మనసుకి హాయి కలిగిస్తోంది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళేటప్పుడు ఎంతో అవస్థ పడింది. రెండు సార్లు ఎగ్జిట్లు దాటేసింది. ముందుగా బయలుదేరడం మంచిదే అయింది. ఆ అనుభవం తిరిగి వెళ్ళేటప్పుడు ఉపయోగించింది.

"అమ్మా! ఇదా మన అపార్ట్‌మెంట్? మావయ్య ఇల్లులా ఉంటుందనుకున్నా.." స్మిత మొహంలో కొంచెం ఆశాభంగం కనిపించింది.

సింగిల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్ రెండో అంతస్థులో. మెట్లమీదనుంచి సామాన్లు ఈడుస్తూ వస్తున్న గిరి బాధగా చూశాడు కూతుర్ని. ఈ పాటి నిలదొక్కుకోడం ఎంత కష్టం.. నెమ్మదిగా వాస్తవాలు బోధించాలి..

యమున దెబ్బ తిన్నట్లు చూసింది. ఎంత కష్టపడితే, పడుతుంటే.. ఇదయినా ఏర్పడింది? మొహంలో ఏభావం కనిపించకుండా వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి తీసుకొచ్చింది. స్మిత బాల్కనీలోకి వెళ్లి అంతా పరికించింది. చిక్కడపల్లిలో తమ ఇంటికంటే బాగానే ఉంది. ఫరవాలేదు. ఫ్రెంచ్ తలుపు బార్లాతీసి, గట్టిగా గాలి పీలుస్తూ లోపలికి వచ్చింది.

"విష్ణుతాతగారి రెండో అమ్మాయికి పెళ్ళయింది కదా.. అందరూ నీ గురించే అడిగారనుకో. నువ్వు లేకుండా జరుగుతున్న పెళ్ళి ఇదే అని ఒకటే గొడవ. చాలా గ్రాండ్‌గా చేశారులే. గోపాల్‌రావు తాతగారి ఆఖరి అబ్బాయికి ఇక్కడ, అంటే ఈ ఊరు కాదులే.. టెక్సాస్‌లో, యమ్మెస్‌లో సీటొచ్చిందిట. వచ్చే నెల్లో వస్తాట్ట. మామయ్య ఏదో కొంత స్పాన్సర్ చేస్తున్నట్లున్నాడు.."

స్మిత చుట్టాల కబుర్లన్నీ చెప్తూ అలాగే సోఫాలో వాలిపోయింది.

"ఇప్పుడు దీని చదువు, ఉద్యోగం, పెళ్ళీ అన్నీ చూసుకోవాలి. ఐదేళ్ళయితే కానీ సిటిజెన్ షిప్ రాదు. అది వస్తే.. ఇండియా నుంచి మంచి సంబంధాలు వస్తాయి. అప్పటికి ఇరవై ఆరేళ్లు దాటిపోతాయి. ఇవన్నీ చెయ్యగలమంటావా?" రాత్రి భోజనాలయి, మంచం మీద ఏకాంతంలో గిరితో పంచుకుంది తన ఆలోచనలనీ.. కర్తవ్యాన్నీ.

"నా సంగతేమో కానీ నువ్వు తప్పకుండా చెయ్యగలవు యమునా! నాది ప్రేక్షక పాత్రే. పీటల మీద కూర్చోమంటే కూర్చుంటా.." భార్య మొహంలోకి ఆర్తిగా చూస్తూ అన్నాడు గిరి.

గట్టిగా నిట్టూరుస్తూ చాచిన గిరి చేతిమీద తల వాల్చింది యమున.

●●●

"ఒక్క రోజయినా విశ్రాంతి తీసుకో యమునా! ఇంతలా పని చెయ్యడం ఆరోగ్యానికి మంచిది కాదు." వచ్చిన రెండు నెలలకి, యమున కష్టం చూడలేక అన్నాడు గిరి.

అప్పుడే నిద్ర లేచి కాఫీ కలుపుకుని తాగుతున్న యమున అలసటగా చూసింది. నిజమే.. కానీ ఎలా? ఏం చెయ్యాలి? స్మిత యూనివర్సిటీలో చేరడానికి తయారవుతోంది. ఏ కోర్సులు చేస్తే బాగుంటుందో.. అందర్నీ కనుక్కుంటోంది. ఏ చదువైనా దానికి కావలసిన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చెయ్యాలి. తనకి జర్నలిజం అంటే ఇష్టం. ఆనంద్ కూడా అదే చెయ్యమంటున్నాడు. ఏదయినా కమ్యూనిటీ కాలేజ్‌లో చేర్పించాలి. దానికి డబ్బు కావాలి. ఇక్కడి వాళ్లయితే ఆ వయసుకి ఏదో ఒక పని.. బేబీ సిటింగ్ వంటివి చేసి కొంత సంపాదించుకుంటారు. అసలు స్మిత, యమ్మే ఇంగ్లీష్‌కి ఇంకా మంచి జాబ్ ప్రయత్నించచ్చు. కానీ తను చదువు పూర్తి చేసి కానీ ఏ పనీ చెయ్యనని కూర్చుంది.

"ఇండియా యమ్మే డిగ్రీతో ఏం జాబమ్మా! నేను ఇంకా చదవాలి." తన నిర్ణయం చెప్తున్న స్మితని అభావంగా చూసింది యమున. కనీసం ఇంటి పనిలో కూడా సహాయం చెయ్యదు.

ఇంకొంచెం బాధ్యతతో పెంచాలిసిందేమో అనుకుంటూ తనలో తనే నవ్వుకుంది యమున. తను మాత్రం తల్లి చెప్పిన మాట ఎప్పుడైనా విందా?

కారు డ్రైవింగ్ మాత్రం నేర్చుకుంటా అంటూ దానిక్కావలసిన పరీక్ష పాసయింది. అదీ ప్రొఫెషనల్ చేత నాలుగయిదు సార్లు నేర్పించాలి. అదొక ఖర్చు. తండ్రీ, కూతురూ స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసుల్లో చేరారు. త్వరగానే నేర్చుకుంటున్నారు. ఇంకొక నెల అయ్యాక మానెయ్యచ్చు. ఈ నెలలో తను దాచుకున్న సగం డబ్బు అయిపోయింది, అపార్ట్‌మెంట్‌కి కట్టిన డిపాజిట్‌తో కలిపి.

ఇంటి సరుకులకి పెద్ద అవదు కానీ, ఫీజులకే.. ఇంకో ఆర్నెల్లు ఆగి రమ్మనాల్సిందేమో వీళ్లని.. లేదా తమ్ముడు చెప్పినట్లు, వాళ్లింట్లో కొన్నాళ్లుండి, ఇంకొంచెం డబ్బు దాచుకుని.. అంతులేని వ్యర్థం ఆలోచనలు. తల విదిలించింది.

కాఫీ తాగి అలాగే బల్ల మీద తల వాల్చింది యమున. గిరి కప్పు తీసేసి, ఉప్మా చేసేశాడు. అతను ఇంటి పనుల్లో బాగా సహాయం చేస్తాడు. వంట బాగా వచ్చు కనుక, అంతా తనే చేస్తుంటాడు, ఏం చెయ్యాలో యమునని అడిగి. ఎందుకో అది అంత నచ్చలేదు యమునకి. అతను సంపాదించి తను ఇంటి పనులు చెయ్యాలి కానీ..

"యమునా! టైమవుతోంది. పోనీ శమంతాకి ఫోన్ చేసి రానని చెప్పేస్తావా?" గిరి మాటలు కలలోలా వినిపిస్తున్నాయి. చటుక్కున లేచి మెడ సవరించుకుంది. అమ్మో! ఒక్క రోజు మానేస్తే తొంభై డాలర్లు పోతాయి. లేచి గబగబా ముందు వేడి వేడి నీళ్లు, వెంటనే చల్లని నీళ్లతో స్నానం చేసి, తయారయి హాల్లోకి వచ్చింది. గడియారం కేసి చూసింది. పదకొండున్నర. హాల్లో దివాన్ మీద పడుకున్న స్మిత అప్పుడు లేచి ఒళ్లు విరుచుకుంటూ అంది, "గుడ్ మార్నింగ్ మాం."

అవును కదూ.. ఇదొకటి ఇంట్లో ఉందన్న సంగతే మర్చిపోయింది. ఇప్పుడా లేవడం. సర్రున వస్తున్న కోపాన్ని ఆపుకుని, తను కూడా విష్ చేసి బయటికి నడిచింది.

యమున పన్నెండు నుంచీ రాత్రి ఎనిమిది వరకూ సూపర్ మార్కెట్లో, రాత్రి పది నుంచీ పొద్దున్న ఆరు వరకూ శమంతా చెప్పిన కాంప్లెక్స్‌లో సెక్యూరిటీ పర్సన్‌గా పని చేస్తోంది. ఎన్నాళ్లు ఆ విధంగా చెయ్యగలదూ?

●●●

అవును ఎన్నాళ్లు చెయ్యగలదూ? గిరికి అదే ఆలోచన.

ఆదివారం.. పొద్దున్న ఏడు గంటలయింది. స్మిత లైబ్రరీకి వెళ్లింది. తనకి ఆనంద్ పాత కారు ఇచ్చాడు. అది వేసుకుని తిరిగేస్తుంటుంది. ఎలాగయినా మంచి యూనివర్సిటీలో జర్నలిజం యమ్మే చెయ్యాలని ధ్యేయం.

గిరి హాల్లో అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. స్మిత పడుక్కుని లేచిన పక్క సర్ది, హాలు తుడిచేశాడు. ఇంకా సోఫాలు, బల్లలూ.. టెలిఫోన్‌తో సహా అన్నీ బట్ట పెట్టి తుడిచేశాడు. ఇంకేం చెయ్యాలి? పొద్దున్నకి ఇడ్లీ రాత్రే పెట్టేసి ఉంచాడు. అస్సలు

తోచడం లేదు. ఒక చెయ్యి పిడికిలి బిగించి, ఇంకొక అరచేతిలో కొట్టుకుంటున్నాడు. ఇక్కడికి వచ్చి తను ఏం చేస్తున్నాడు? ఇంటి పనులు చెయ్యడం తనకేమీ నామోషీగా లేదు కానీ.. యమున కష్టం కొంచెం కూడా తగ్గించలేకపోతున్నాడు. తను వచ్చి ఆర్నెల్లు అవుతోంది. ఇంతవరకూ ఒక్క డాలరు సంపాదించలేదు. స్మిత దగ్గర్లో ఉన్న కమ్యూనిటీ కాలేజ్‌లో కొన్ని కోర్సులు చేస్తోంది. అయ్యాక, యూనివర్సిటీలో.. అన్నింటికీ బొటా బొటీగా సరిపోతోంది వచ్చింది. అదీ ప్రతీదీ ఎంచి ఎంచి కొంటుంటే. లాభం లేదు. ఏదో చెయ్యాల్సిందే

యమున ఇంకా లేవలేదు. ఆరున్నరకి వచ్చి పడుక్కుంది. ఇంకా మూడుగంటలు ఉంది సమయం..

ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా గబగబా స్నానం చేసి బట్టలు వేసుకుని, కారు తాళాలు తీసుకుని అపార్ట్‌మెంట్లోంచి బయటికి వచ్చాడు. ఇండియాలోలా ఉంటే లాభం లేదు. అక్కడంటే నరహరి బావ చూసుకుంటున్నాడు కదా అని కొంత, స్నేహితులు అలవాట్లు వదిలెయ్యలేని బలహీనత కొంత.. పెళ్లాం పిల్లల్ని పట్టించుకోలేదు. ఇక్కడలా కాదు.. కానీ ఏం చెయ్యాలి? ఏం చెయ్యగలడు?

చేతి గడియారం చూశాడు. ఆదివారం పొద్దున్న సాధారణంగా ఆనంద్ ఇంట్లోనే ఉంటాడు. వచ్చినప్పటినుంచీ ఎప్పుడైనా పిలుస్తే వెళ్లి భోంచేసి రావడమే కానీ నిలకడగా మాట్లాడింది లేదు. వాడితోనే చర్చించి ఒక పరిష్కారం కనుక్కోవాలి. ఇదే విధంగా కొనసాగుతే యమున ఆరోగ్యం దెబ్బతినడం ఖాయం. యమున పట్టుబట్టి డ్రైవింగ్ నేర్పించింది ఇంట్లో కూర్చోడానికి కాదు కదా!

అసలు ఆనంద్ ఇంటికి వెళ్లగలడా తను? రెండు మూడుసార్లు, యమున పక్కన కూర్చుని చూపించింది. రూట్ గుర్తుకు తెచ్చుకున్నాడు. ఫోన్ చెయ్యకుండా వెళ్లడమా?

వెళ్తే ఏమవుతుంది.. అతనికి కుదురుంది.. లేదు అంతే కదా! తనకి డ్రైవింగ్ అనుభవం వస్తుంది.. అదీ ఒక్కడూ వెళ్లడం. లైసెన్స్ ఉందా అని చూసుకున్నాడు. జై జగన్మోహినీ కేశవస్వామీ!

●●●

గిరి జాగ్రత్తగా ఆనంద్ ఇంటి ముందు డ్రైవ్‌వేలో కారు పార్క్ చేసి, తలుపు దగ్గరికి వెళ్లి బెల్ నొక్కాడు. కొద్దిగా కర్బ్‌కి రాసుకు పోయినా, బాగానే పెట్టాడు కారు.

"హా! మామయ్యా! నువ్వే.. ఒక్కడివే వచ్చేశావా? వెరీ గుడ్ బాగా డ్రైవ్ చేసేస్తున్నావా?" సంభ్రమంగా అరిచాడు ఆనంద్ తలుపు తీస్తూనే.

గిరి నవ్వుతూ చెయ్యి చాపాడు. ఆనంద్ ఆప్యాయంగా అందుకుని, భుజం మీద చెయ్యి వేసి లోపలికి తీసుకెళ్లాడు. గిరి అమెరికా వెళ్లాక కొంచెం తేరుకున్నాడు. సిగరెట్లు బాగా తగ్గించేసి, పొద్దున్నొకటి, సాయంత్రం ఒకటి కాలుస్తున్నాడు. ప్రతీ సెంటూ యమునని అడగాలి.. అదొక కారణం. ఇంకొకటి తను చేసుకున్న స్థిర నిర్ణయం. ఆ రెండూ కూడా మానేస్తా, ఏదైనా ఉద్యోగంలో చేరాకా.. తనకి తనే చెప్పుకున్నాడు.

కొద్దిగా లావయి, రంగు తేలాడు. ఉంగరాల జుట్టు మొహం మీద పడి సగం నుదురు కప్పేస్తూ ఉండేది.. అది మాత్రం ఊడి పోయి, నుదురు విశాలమయింది.

"ఆనంద్! ఖాళీగా ఉన్నావా? మనం కొంచెం సేపు మాట్లాడుకోవడానికి కుదురుతుందా? వీలవకపోతే మళ్లీ వస్తా.. యమున లేచే లోపుగా ఇంటికెళ్లిపోవాలి."

"అలాగే మామయ్యా! తప్పకుండా. నా రూంకి వెళ్దాం. కొంచెం కాఫీ కలిపి తెస్తానుండు. శోభ, అమ్మని గుడికి తీసుకెళ్లింది. పిల్లలు ఇంకా లేవలేదు.

కిందనే విడిగా ఉన్న ఆనంద్ ఆఫీసు గదిలో కూర్చున్నారు ఇద్దరూ.

"చెప్పు మామయ్యా! ఒక గంట వరకూ ఇక్కడికెవ్వరూ రారు. ఏదైనా సమస్యా?"

"సమస్యే.. ఆనంద్! మేము ఇక్కడికి రావడానికి ఎంతో సహాయం చేశావు. ఇది నువ్వే తీర్చగలవు."

"అంటే.. చిన్నక్క ఏమైనా.. ఆర్ స్మిత సరిగ్గా లేదా?" ఆనంద్ ఆందోళనగా అడిగాడు.

"అబ్బెబ్బే.. అదేం కాదు. నేనే.. ఇంట్లో ఊరికే కూర్చుని, ఒక్క పెన్నీ కూడా సంపాదించకుండా ఎన్నాళ్లు తినగలను? నా చదువుకి ఇక్కడ ఉద్యోగం ఏమొస్తుంది? ఇప్పుడు ఎక్కడో కాలేజ్‌లో చేరి ఏదైనా చదవమంటే నా వల్ల కాదు. అసలు నా భవిష్యత్తు ఏమిటి? కొంచెమైనా యమున కష్టం తీర్చగలనా? " మాట్లాడుతుంటే గిరి గొంతు బొంగురుపోయింది.

ఏమీ పట్టించుకోడేమో అనుకున్న గిరి అలా మాట్లాడుతుంటే ఆనంద్‌కి ఆనందం, ఆశ్చర్యం కూడా వేశాయి. అసలు వాళ్లు రాగానే తను పిలిచి ఏదయినా సలహా ఇద్దామనుకున్నాడు కానీ, అడగకుండా చెప్పకూడదని ఊరుకున్నాడు.

"ఇప్పుడిప్పుడే కంప్యూటర్లు అన్నిచోట్లా వాడుతున్నారు. నువ్వు డాటా ఎంట్రీలాంటిది నేర్చుకుంటే ఎక్కడైనా ప్రయత్నం చెయ్యచ్చు."

అసహనంగా కదిలాడు గిరి.

"డబ్బు ఖర్చుకాకుండా.. అంటే మొదట పెట్టుబడి పెట్టకుండా ఏమీ రాదా?" నిరాశగా అడిగాడు. ఇప్పుడు ఏదయినా.. ఎంత సులభమైనదయినా నేర్చుకోవడానికి ఓపిక లేదు. కొంచెం స్థిర పడ్డాక, తన మీద తనకి నమ్మకం వచ్చాక ఏమో కానీ..

"చిన్నక్కలాగ సూపర్ మార్కెట్లో, సెక్యూరిటీలో అయితే ఏదయినా చూడగలను. కానీ ఫిజికల్‌గా శ్రమ ఉంటుంది. అలాగే గాస్ స్టేషన్‌లో పెట్రోల్ కొన్ని చోట్ల వాళ్లు మనిషి చేత కొట్టిస్తారు." మొహమాటంగా అంటున్న ఆనంద్‌ని చిరునవ్వుతో వారించాడు గిరి.

"యమున చెయ్యట్లేదా! తనే అంత శ్రమ పడగా లేంది నేను చెయ్యలేనా? తప్పకుండా ఏదయినా సరే. మొదట్లో నేర్చుకోవాలి కదా! దానికి ఒప్పుకున్న వాళ్ల దగ్గర ఏ పనైనా సరే.. చేస్తాను. యమున లాగ రెండు షిఫ్టులు కూడా. ఒక్క యమున సంపాదనతో గడవడం చాలా కష్టంగా ఉంది. రేపు స్మిత కాలేజ్‌లో చేరిందంటే ఇంకా ఖర్చు."

"తప్పకుండా చూస్తాను. నీకు వారం రోజుల్లో ఫోన్ చేసి చెప్తాను. తొమ్మిదవుతోంది, ఉప్మా ఉన్నట్లుంది, వేడి చేసి పెట్టనా?"

"వద్దురా! ఇంట్లో ఇడ్లీ పెట్టాను. యమున లేచాక ఇద్దరం తింటాం. వస్తా. నీ ఫోన్ కోసం ఎదురు చూస్తుంటా."

వెళ్లిపోతున్న గిరి కేసి చూస్తూ ఉండిపోయాడు ఆనంద్. తను అనుకున్న విధంగా వాళ్లు సెటిల్ అయిపోతే అప్ప ఆత్మకి శాంతి కలిగినట్లే. నరహరి యమున సంసారం గురించే ఎప్పుడూ ఆలోచిస్తుండే వాడని ఆనంద్‌కి బాగా తెలుసు.

●●●

యమునా వాళ్ల అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోనే చేరారు కొత్తగా వరంగల్ నుంచి వచ్చిన ప్రతాప్, రేణుక దంపతులు. ప్రతాప్ కిట్స్‌లో ఇంజనీరింగ్ చదివి, ఆర్లింగ్టన్, టెక్సాస్‌లో యమ్మెస్ చేసి, న్యూయార్క్‌లో సాఫ్ట్‌వేర్ కంపనీలో పని చేస్తున్నాడు. రేణుక, స్మిత కంటే రెండో, మూడో ఏళ్లు పెద్ద అయియుంటుంది.

పొద్దున్న ఏడు ఎనిమిది మధ్యలో యమున నిద్రపోతున్నప్పుడు, తను ప్రశాంతంగా నిద్ర పోవాలని.. గిరి సాధారణంగా కింద పార్కింగ్ లాట్లో పచార్లు చేస్తుంటాడు, అలా చేస్తున్నప్పుడే నాలుగు రోజుల క్రితం పరిచయం అయాడు ప్రతాప్.

"రేపటికి వారం అవుతుంది. ఆనంద్ ఇంకా ఫోన్ చెయ్యలేదు." ఆరోజు కూడా గిరి అలాగే పచార్లు చేస్తున్నాడు, అసహనంగా. మొహంలో మామూలుగా ఉండే చిరునవ్వు లేదు. పెదవులు రెండూ బిగించి ఆలోచిస్తూ తిరుగుతున్నాడు.

మరునాడే ఆదివారం. వారానికి ఒక్కరోజైనా విశ్రాంతి తీసుకోకుండా యమున పని చేస్తోంది. అదీ రెండు ఉద్యోగాలు. ఏదో చెయ్యాలని, ఏదైనా ఎలాగైనా చెయ్యాలని.. గిరి నిర్ణయించుకున్నాక రోజులు మరింత భారంగా నడుస్తున్నాయి.

"హలో అంకుల్! ఎలా ఉన్నారు? డల్‌గా కనిపిస్తున్నారే? రాత్రి నిద్ర పట్టలేదా?" ఆఫీస్‌కి బయలుదేరిన ప్రతాప్ తన కారు దగ్గరకు వెళ్తూ పలుకరించాడు.

"నాకేం.. నేను బుల్లాగ పడుక్కుంటా. యమున గురించే నా దిగులంతా."

"ఆంటీకి ఏమయిందంకుల్?" గాభరాగా అడిగాడు ప్రతాప్.

"అబ్బెబ్బే.. ఏమీ అవలేదు. రోజూ నైట్ డ్యూటీలు చేస్తుంది. అందుకే నాకు బాధ. ఇప్పుడు బిజీగా ఉన్నావు కదా.. రేపు మాట్లాడుదాం."

"సాయంకాలం మీ ఇంటికి వస్తామంకుల్. రేపు సత్యనారాయణ వ్రతం అంటోంది రేణు. దానికి పిలుద్దామని."

"తప్పకుండా. ఏడు గంటలకి వస్తే ఆంటీ కూడా ఉంటుంది."

అప్పుడే గిరి మరో నిర్ణయం తీసుకున్నాడు. తను ఉద్యోగం కోసం వెతుకుతున్నట్లు అందరికీ చెప్పాలని. రెజ్యూమేలు పంపేటంత అర్హతలేవీ తన వద్ద లేవు. మాట సహాయంతోనే తెచ్చుకోవాలి.

●●●

సరిగ్గా ఏడుగంటలకి గంట మోగింది. యమున స్నానం చేసి వచ్చింది. గిరి భోజనం చెయ్యడానికి బల్ల సర్దుతున్నాడు. వాకింగుకెళ్లిన స్మిత వచ్చిందేమోనని ఊరుకున్నాడు గిరి. తన వద్ద తాళం ఉంది.. అయినా బెల్లు మోగిస్తుంటుంది.

బెల్లు మళ్లీ మోగింది. అపుడు గిరికి గుర్తుకొచ్చింది, ప్రతాప్ పొద్దున చెప్పిన సంగతి. ఉత్సాహంగా వెళ్లి తలుపు తీశాడు. అతను అమెరికా వచ్చాక ఇంటికి వచ్చిన మొదటి పరిచయస్థుడు.

ప్రతాప్, రేణుక.. చిరునవ్వుతో నమస్కరించారు.

"రండి రండి. యమునా! చూడు ఎవరొచ్చారో?" గిరి సాదరంగా ఆహ్వానించాడు.

అందరూ దివాన్ మీద, కుర్చీల్లోనూ కూర్చున్నాక యమునకి పరిచయం చేశాడు గిరి.

"రేపు సత్యనారాయణ వ్రతం చేస్తున్నాము. మీరు, అంకుల్ తప్పక రావాలి, మీ అమ్మాయి కూడా! సాయంత్రం నాలుగు కొట్టేసరికి మొదలవుతుంది. ఏడు కల్లా భోజనాలు. మీ సమయం ఎక్కువసేపు తీసుకోం. మీరే పెద్ద దిక్కు మాకు." ప్రతాప్ పిలుస్తుంటే ముచ్చటగా అనిపించింది యమునకి.

ఇద్దరూ ఎంత ఒద్దికగా ఉన్నారు! జీవన యానంలో తొలి మెట్టు మీద ఇద్దరూ కలిసి పయనించడానికి సిద్ధంగా. ఇద్దరి మొహాల్లోనూ ప్రశాంతత. తప్పక వారు అనుకున్న శిఖరాలకు చేరుకోగలరని అనిపిస్తుంది ఎవరికైనా.

"తప్పకుండా వస్తాం. రేపు నేను నాలుగ్గంటలే పని చేస్తున్నా. ఏ సహాయం కావాలన్నా అడగండి." యమున నవ్వుతూ అంది.

గిరి లోపలికి వెళ్లి రెండు గ్లాసుల్లో పల్చని మజ్జిగ తీసుకొచ్చి ఇచ్చాడు. నిమ్మకాయ పిండి, ఉప్పు, జీలకర్ర పొడి వేసి.

"భలే ఉంది అంకుల్. అచ్చు ఇండియాలో మా అమ్మ చేసినట్లే ఉంది." మెచ్చుకున్నాడు ప్రతాప్.

"మేము ఇదే మొదటిసారి పూజ చేసుకోవడం. ఇక్కడి గుళ్లో ఉండే పూజారిగారు లిస్ట్ ఇచ్చారు. సూపర్ మార్కెట్‌కి వెళ్తున్నాం. ఆయనే వచ్చి చేయిస్తానన్నారు. మీరు కొంచెం ముందు వచ్చి సరిగ్గా ఉందో లేదో చెప్పగలరా అంకుల్?" రేణుక అడిగింది బిడియంగా.

"తప్పకుండానమ్మా! నాలుగింటికల్లా మీ ఇంట్లో ఉంటా. మీ అపార్ట్‌మెంట్ మా పైదే కదూ?"

"అవునంకుల్. ప్లీజ్ తప్పకుండా వస్తారు కదూ?" మరీ మరీ చెప్పి వెళ్లారు ఇద్దరూ.

"స్మితకి కూడా త్వరలో పెళ్లి చెయ్యాలి. వీళ్లని చూస్తుంటే ఇప్పటికే ఆలిశ్యమైపోయిందేమో అనిపిస్తోంది." యమున, భోజనం చేస్తూ అంది.

గిరి ఏమీ జవాబియ్యకుండా తలూపాడు అవునన్నట్లుగా.

"అంకుల్ని చూస్తుంటే మనూళ్లో గుళ్లో పూజరిగారిని చూసినట్లే ఉంది కదూ! క్రాఫు, అందులో పిలక.. బాగా ఆచారం ఉన్నట్లుంది." రేణుక మెట్లు ఎక్కుతూ అంది. ప్రతాప్ అవునన్నట్లు తలూపాడు. ఇద్దరికీ గిరి అంటే గౌరవభావం ఏర్పడింది.

●●●

ప్రతాప్ అపార్ట్‌మెంట్ గలగల్లాడుతూ సందడిగా ఉంది గిరి వెళ్లేసరికి. పొద్దున్నే వచ్చేసింది రేణుక పిన్ని కూతురు ఉష, అక్కడే యూనివర్సిటీలో యమ్మెస్ చేస్తోంది. ఇంకా మూడు జంటలు.. ప్రతాప్ స్నేహితులు, రెండు గంటలకే వచ్చారు. అంతా ముప్ఫైలోపు వాళ్లే. అందరూ దేముడ్ని అలంకరించడానికి హడావుడి పడుతున్నారు గిరి వెళ్లేటప్పటికి.

తెచ్చిన సరుకులన్నీ నేల మీద పరిచి ఉన్నాయి. ఇంకా పటం కూడా నిలబెట్టలేదు.

"అమ్మయ్య. అంకుల్ వచ్చేశారు. ఆయన్ని అడిగి సర్దేద్దాం." రేణుక వంటింట్లోంచి పెద్ద గ్లాసునిండా ఆరంజ్ జ్యూస్ తెచ్చి ఇచ్చింది.

గిరి నవ్వుతూ, వాళ్ల సరదా అంతా చూస్తూ జ్యూస్ తాగాడు.

"ఈ స్టూల్ ఇక్కడ వెయ్యాలి." అప్పుడప్పుడే బట్టతల వస్తున్న ఒకబ్బాయి అడ్డగించాడు, ఒక మూలగా స్టూల్ పెట్టి పటం పెట్టబోయిన ప్రతాప్‌ని.

"ఊహు.. ఇక్కడయితే కన్వీనియంట్. అందరూ వాచ్ చెయ్యడానికి వీలుగా ఉంటుంది." ఇంకో ఉంగరాల జుట్టు.

"ఆ డైనింగ్ టేబుల్ మూలకి జరిపి మధ్యగా ఏదైనా సపోర్ట్ పెట్టి పెడదాం. అటూ ఇటూ కూడా వాచ్ చెయ్యచ్చు." రేణుక బల్ల జరపబోయింది.

"ఉండండి అంకుల్ని అడుగుదాం. ఇండియాలో చూసుంటారు కదా! టైమయిపోతోంది. పూజారి శాస్త్రిగారు వచ్చేస్తారు." ప్రతాప్ గిరి దగ్గరగా వచ్చాడు.

"అవును.. అంకుల్.." అందరూ కోరస్.

"సరే! ఇటు ఈస్ట్. మీరు ఇటు తిరిగి కూర్చోవాలి. దేముడిని అటు పెట్టాలి.. ఆ పువ్వులు, బల్ల, పళ్లాలు, జాకెట్టు బట్ట, తమల పాకులు అన్నీ ఇక్కడికి తీసుకు రండి.." గిరి అరగంటలో అంతా సర్దేశాడు.

"అబ్బ. ఎంత బాగుందో.. చూస్తుంటే వచ్చేవారం మేము కూడా చేసుకోవాలనిపిస్తోంది." పొడవాటి లంగా, పొడుగు చేతుల జాకెట్ వేసుకున్న ఒకమ్మాయి ఆశ్చర్యంగా చూస్తూ అంది.

గిరి అక్కడ్నుంచి లేచి నుంచుని దూరంగా జరిగి చూసి, కొన్ని మార్పులు చేశాడు. అంతలో ఫోన్ మోగింది. అప్పటికే శాస్త్రిగారి రాక అరగంట ఆలశ్యమైందని కంగారు పడుతున్న ప్రతాప్ పరుగెత్తాడు.

ఫోన్‌లో అటుపక్క చెప్పేది వింటుంటే అతని మొహం పాలిపోయింది.

"అదేంటండీ.. అంతా అరేంజ్ చేసుకున్నాం మరి.. పోనీ ఇంకెవరినైనా.. వీలు పడదా! ఎవరూ లేరా, మరేం చెయ్యమంటారు? వచ్చే వారం చేసుకోవాలా? పోన్లెండి, మీరు మాత్రం ఏం చేస్తారు?" ఫోన్ పెట్టేసి, ప్రతాప్ నీరసంగా నేలమీద కూలబడి పోయాడు.

సరిగ్గా అప్పుడే యమున లోపలికి అడుగు పెట్టింది. ఎర్రని పట్టు చీర కట్టుకుని, లక్ష్మీ దేవిలా.

"అరే! ఏమయింది బాబూ?" ఆదుర్దాగా అడిగింది. అందరూ ప్రతాప్‌నే చూస్తున్నారు.

"పూజారి శాస్త్రిగారు రాలేరుట. ఆయనకి జ్వరంట. వచ్చే వారం చేయిస్తానని చెప్పారు." అది వినగానే రేణుక కూడా ప్రతాప్ పక్కనే కూర్చుండిపోయింది.

అలంకరించిన మండపాన్ని, దేముడి పటాన్నీ, చుట్టూరా అమర్చిన వస్తువుల్ని చూస్తూ మిగిలిన వాళ్లు కూడా డీలా పడిపోయారు.

"పొద్దుట్నుంచీ ఏమీ తినకుండా కూర్చున్నాం, పూజ ఉందని. ఇంత అరేంజ్ చేసాం.. ఆ దేమునికి మన మీద ఎందుకనో కోపం వచ్చింది." ప్రతాప్ గొంతు దుఃఖంతో బొంగురు పోయింది.

యమునకి జాలేసింది వాళ్లని చూస్తుంటే. పాపం ఎంతో శ్రద్ధా భక్తులతో అంతా సిద్ధం చేసుకున్నారు. తామేం సహాయం చెయ్యలేమా? అప్పుడే బెల్ మోగింది. స్మిత తలుపు నెట్టుకుని లోపలికి వచ్చింది.

"అమ్మా! మనింట్లో పుస్తకం ఉంది కదా! నాన్న చూసి చేయించలేరా? రోజూ పూజ చేసుకుంటారు కదా ఇంట్లో.." అంతా విన్న స్మిత అంది.

అందరూ ఆశగా గిరి కేసి చూశారు.

●●●

తలుపు తీసుకుని లోపలికి అడుగు పెడుతున్న గిరిని చూసి, అప్రయత్నంగా అందరూ లేచి నిలుచున్నారు. చందమామ కథల్లో తాము చదివిన రాజ పురోహితుడు గుర్తుకొచ్చాడు అందరికీ. యమునతో సహా అందరూ బ్రతిమాలితే గిరి, తాను వ్రతం చేయించడానికి వప్పుకున్నాడు.

తెల్లని లాల్చీ పైజామాతో వచ్చినవాడు, బట్టలు మార్చుకుని వస్తానని చెప్పి ఇంటికెళ్లి వచ్చాడు. ఎర్రని రుద్రాక్ష అంచు గల పట్టుపంచె, కండువా.. హాల్లో ఉన్న చాందిలీర్ల వెలుతురులో మెరిసిపోతున్నాయి. విశాలమైన నుదుటిమీద కుంకం బొట్టు, సూర్యతేజంతో వెలిగిపోతోంది.

"మిమ్మల్ని ఏమని పిలవాలి అం.." సగంలోనే ఆపేశాడు ప్రతాప్ సంబోధన తనకే నచ్చకపోవడంతో.

"నా పూర్తిపేరు గిరిధారి దీక్షితులు." తన ఆసనం మీద కూర్చుంటూ అన్నాడు గిరి. స్మిత ఆశ్చర్యంగా చూసింది. ఆ అమ్మాయికి కూడా తెలియదు మరి.

ప్రతాప్‌కి తన కర్తవ్యం గుర్తుకొచ్చింది. చిన్నప్పుడు తాతగారు, నాన్నగారు పూజల సమయంలో ఏ విధంగా ఉండే వారో గుర్తుకు తెచ్చుకున్నాడు. వెంటనే రేణుకని పట్టుచీర కట్టుకొమ్మని, తను కూడా పాంటు షర్టులోనుంచి పంచెలోకి మారి పోయాడు, గిరి సహాయంతో. పెళ్లి బట్టలు తెచ్చుకోవడం మంచిదే అయింది అనుకుంటూ.

ఇంకో ఇద్దరు జంటలు కూడా వచ్చారు ఆ లోపు, ఏవో పదార్థాలు పట్టుకుని. మొత్తం ఐదుగురు దంపతులు, స్మిత, ఉష, యమున కాక. హాలంతా నిండుగా ఉన్నా ఎవరూ మాట్లాడటం లేదు. గిరిలోని గాంభీర్యం చెప్పకనే ఆదేశిస్తోంది.

ప్రతాప్‌నీ, రేణుకనీ మండపం ఎదురుగా కూర్చోపెట్టి, రేణుక చేత దీపారాధన చేయించాడు.

"మరి పుస్తకం తెచ్చుకోలేదే..?" యమున మాట బైటికి రానే లేదు..

గంభీర స్వరంతో మొదలు పెట్టాడు గిరి, గణపతి పూజ.

"ఓం గణానాన్త్వా గణపతి గం హవా మహే కవింకవీనా ముపమశ్ర వస్తవం, జ్యేష్ఠ రాజం బ్రహ్మణా బ్రహ్మణస్పత ఆన శృణ్వనూతిభిస్పీసాధనం.. శ్రీ మహా గణాధిపతయే నమః ధ్యాయామి, ఆవాహయామి.."

ఆ తరువాత వరుసగా నవగ్రహ పూజ.. మండపంలో తమలపాకులు, వక్క, నాణాలతో నవగ్రహాలనీ ఆహ్వానించి పూజ చేయించాడు. కలశం పెట్టి, సత్యనారాయణ స్వామి వారి పూజ, అష్టోత్తరం ముగించాక, వ్రత కథలన్నీ ఆసక్తికరంగా తడబడకుండా.. మధ్యలో స్వామిని స్తుతిస్తూ చెప్తూంటే అటూ ఇటూ కదలకుండా విన్నారు అందరూ.

గిరి కంఠంలో మాధుర్యం, ప్రస్ఫుటంగా మంత్రాలు పలికే తీరు, నిదానంగా బోధించే విధానం అంతా అతని తాతగారిని స్ఫురణకి తెచ్చింది యమునకి, తను దీక్షితులుగారిని ఒక్కసారే చూసినా కూడా.

"ప్రసాదం చేశావామ్మా? గోధుమ రవ్వ వేయించి చక్కెర పొడి కలిపినా చాలు. పళ్లు నైవేద్యం పెడదాం." రేణుకని అడిగాడు గిరి.

రేణుక మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్లి, మూడు రకాల పళ్లాలని తీసుకొచ్చింది. గిరి ఆశ్చర్యంగా చూశాడు.

ఒక పళ్లెంలో సత్యనారాయణ ప్రసాదం ఉండలు చేసి ఉంది. ఇంకొక పళ్లెంలో రకరకాల పళ్లు అమర్చి ఉన్నాయి. ఇంకొక పళ్లెంలో, వడలు, పాయసం, పులిహోర, పూరీలు, దధ్ధోజనం ఉన్నాయి.

"అమ్మా! ఇవన్నీ..?"

"నేనే చేశాను దీక్షితులుగారూ! స్నానం చేసి మడి కట్టుకుని, ఏమీ తినకుండా చేశాను. పొడి ప్రసాదం కంటే 'సిరా' స్వామికి ఇష్టం అని మా నాయనమ్మ అంటుండేది. రెండు సార్లు కాఫీ తాగాననుకోండి.." రేణుక సిగ్గుగా అంది.

గిరి ఆనందంగా మహా నైవేద్యం పెట్టి, మంత్రపుష్పం చదివి అందర్నీ పుష్పాలు స్వామి మీద వెయ్యమని, తీర్థ ప్రసాదాలు ఇచ్చాడు.

"రేణుక పుట్టి పెరిగిన ఊరు ధర్మపురి దీక్షితులుగారూ. అక్కడ నరసింహస్వామి ఆలయానికి వారం వారం వెళ్తుంటారు వాళ్ల ఫామిలీ. వ్రతాలు, పూజలూ కూడా శ్రద్ధగా చేస్తుంటారు. మా మేనమామ కూతురే తను. అందుకే కొంచెం నేను కూడా ఫాలో అవుతుంటాను." ప్రతాప్ వివరించాడు.

పూజంతా అయ్యాక, గిరి బట్టలు మార్చుకుని వచ్చాడు.

"ఇందాక వేరుగా ఉన్నారు అంకుల్ మీరు.. వచ్చే వారం మా ఇంట్లో వ్రతం. మీరే చేయించాలి." బట్టతల భాస్కరం అడిగాడు. అంతే.. వరుసగా అక్కడున్న అమ్మాయిలు అందరూ, రాబోయే ఐదు వారాలకి గిరిని ఒప్పించేశారు.

"కానీ శాస్త్రిగారు ఏమైనా అనుకుంటారేమో! ఎప్పట్నుంచో ఇక్కడున్నవారు కదా! మధ్యలో నేను వచ్చి ఆయనకి ఇబ్బంది కలిగిస్తే బాగుండదు.." గిరి అభ్యంతర పెట్టాడు.

"ఆయన చాలా బిజీ అంకుల్. ఆర్నెల్లు ముందు బుక్ చేసుకోవాలి. మా ముందు జనరేషన్ అంతా ఆయన్నే పిలుస్తారు. మీకు గ్రీన్ కార్డ్ ఉంది కదా! ఫ్రీ లాన్సర్‌గా దర్జాగా చేసుకోవచ్చు. ఇన్‌కంటాక్స్ పక్కాగా చేసేస్తే నో ప్రాబ్లం. మీకు నేను హెల్ప్ చేస్తా కదా!" ఉంగరాల జుట్టు సి.పి.ఏ భరోసా ఇచ్చేశాడు.

తాంబూలంలో సిద్ధంగా ఉంచుకున్న, నూటపదహారు డాలర్లు గిరికి భక్తిగా ఇచ్చి నమస్కరించారు ప్రతాప్, రేణుక.

"మీరు ఇదంతా ఎప్పుడు నేర్చుకున్నారు?" యమున ఆశ్చర్యంగా అడిగింది రాత్రి పనికి వెళ్తూ.

"నేను దీక్షితులుగారి మనవడ్ని. చిన్నప్పుడే తాతగారితో అన్ని పూజలకీ వెళ్తున్నప్పుడు వచ్చేసింది. మధ్యలో అలవాటు లేక కొంత మర్చి పోయినా, నువ్వు లేని రెండేళ్లూ, హైదాబాద్‌లో గణపతి శాస్త్రిగారి వెంట వెళ్తుండేవాడ్ని. కొద్దిగా అయినా ఆదాయం వస్తుంది కదా అని."

ఆ రాత్రి నిశ్చింతగా పడుక్కున్నాడు గిరి, జీవితంలో మున్నెన్నడూ లేని విధంగా. ఇన్నేళ్లకి తను తృప్తిగా, అందరికీ నచ్చే విధంగా చెయ్యగల వృత్తి దొరికింది. ఇప్పుడు దొరకడమేమిటి.. వంశపారంపర్యంగా తరతరాలుగా వస్తున్నదే. గిరి నవ్వుకున్నాడు నిద్రకుపక్రమిస్తూ.

●●●

అమెరికా వెళ్లిన ప్రతీ వారూ ఎదురు చూసేది ఒకే మాటకి.. అది వస్తే చాలు జీవితంలో స్థిర పడినట్లే. అది ఏ వృత్తిలోనైనా సరే. ఎన్నో ఏళ్లుగా దాని కోసం ఎదురు చూస్తూ ఆశతో జీవిస్తున్నవాళ్లు లెక్కలేనంత మంది. అదే. తమకి కావలసింది, సంతృప్తి నిచ్చేది అయిన పని దొరకడం.. దానినే 'బ్రేక్ త్రూ' అంటారు.

అది గిరికి త్వరగానే వచ్చిందని చెప్పచ్చు.

గిరి ఇంక ఆనంద్ ఫోన్ కోసం ఎదురు చూడవలసిన పని తప్పింది. రోజూ క్రమం తప్పకుండా చేసిన, చేస్తున్న సంధ్యావందనం ఫలితమే అనుకుంటాడు గిరి. ఎప్పటికైనా గాయత్రీ మాత ఒడ్డుకు చేర్చకపోదు.

అసలు ఇండియాలో ఉన్నప్పుడే ఈ పని చేసుంటే.. ప్చ్! గతం గతః. ఎందుకొచ్చిన పనికిరాని ఆలోచనలు? గిరి తయారవుతూ అద్దంలో చూసుకున్నాడు.

ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు అనిపించింది. గిరికి బ్రేక్ త్రూ వచ్చి ఆర్నెలలు అయింది. అసలే తెల్లని మనిషేమో, మొహం వెడల్పయి మెరిసిపోతోంది. కొద్దిగా లావయి, ఎముకలు పూడుకుని ఆరోగ్యంగా తయారయ్యాడు. విశాలమైన కళ్లు తృప్తితో వింతగా మెరుస్తున్నాయి. సిగరెట్లు మానెయ్యడం వల్ల, పెదవులలో నలుపు పోయి, లేత గులాబీ రంగుతో తళతళ్లాడుతున్నాయి.

చూడ చక్కని రూపం గిరిది. ఒక క్రమంతో రోజులు గడుపుతుండడం వలన అది రెట్టింపయింది. ముఖ్యంగా సంతృప్తి.. మానసిక స్థైర్యం, ధైర్యం భౌతికంగా కూడా బలాన్నిచ్చాయి. దీక్షితుల కుటుంబం తరతరాలుగా జగన్మోహినీ కేశవస్వామిని ఆరాధించిన ఫలితం ఇప్పుడు గిరికి అందుతోంది. మొహంలో అనిర్వచనీయమైన తేజస్సు, ఎదురు పడిన వారందరినీ ఒక్క క్షణం ఆగి మనసులోనైనా నమస్కరించమనేట్లు చేస్తుంది.

అమెరికా వచ్చే ముందు ర్యాలి వెళ్లి, జగన్మ్మోహినీ కేశవస్వామిదీ, బంగారత్తదీ ఆశీస్సులు తీసుకున్నాడు. బంగారత్తకి ఎనభై ఏళ్లు వచ్చాయి. పండు ముత్తైదువ. ఆవిడకీ, ఇంకొంచెం అయోమయం అయిపోయిన మామయ్యకీ బట్టలు పట్టుకెళ్లాడు. మంచితనంతో ఊర్లో అందరికీ తలలో నాలికలా ఉండే బంగారత్తకి పిల్లలు లేరన్న బాధ ఎప్పుడూ లేదు. ఊర్లో వాళ్లు, రోజూ ఆవిడని చూసి అవసరమైన సహాయం చేసి వెళ్తుంటారు.

ఇప్పటికీ వంట తనే చేసుకుంటుంది. గిరికి నెలకో ఉత్తరం రాసి, రావులపాలెం పంపించి మరీ పోస్ట్‌లో వేయిస్తుంది. పెద్దాపురం సిల్కు లాల్చీ బట్ట, పట్టు పంచె, యమునకి పట్టు చీర పెట్టి గిరిని మనసారా ఆశీర్వదించింది బంగారత్త.

"వెళ్లేటప్పుడు, భగవద్గీత, రామాయణ మహా భారతాలు, ఇంకా మన పురాణ గ్రంధాలన్నీ వెంకట్రామా బుక్ డిపోలో కొనుక్కునెళ్లరా గిరి ధారీ..." బంగారత్త ఇచ్చిన సలహా పాటించడం వల్ల ఎంత మేలు జరిగిందో జన్మలో మర్చిపోలేడు గిరి.

ఆవిడ పెట్టిన బట్టలు కట్టుకుని, తలుచుకుని మనసులోనే నమస్కారం పెట్టుకున్నాడు.

ఆర్నెలలుగా ఒక్క శనాదివారాలు కూడా ఖాళీగా లేడు గిరి. న్యూ జెర్సీలో ఉన్న కుర్రకారంతా గిరి చేతే సత్యనారాయణ వ్రతాలు చేయించుకుంటున్నారు. రేటు కూడా రెండు వందల డాలర్లు చేశారు, గిరి అడక్కుండానే. వ్రతంతో పాటుగా వెంకటేశ్వర దీపారాధన కూడా ఉంటుంది మరి. రెండు ఐటమ్స్‌కి వేరుగా ఇవ్వద్దూ..

నారాయణ మంత్రిప్రగడ సి.పి.ఏ, గురువుగారి టారీఫ్ అంతా నిర్ణయించేశాడు. దీక్షితులుగారి ఉభయం (ఫీజు) ఎంత ఇవ్వాలో, దేనికి ఎంతో.. అంతా ఒక పట్టీ తయారు చేసి అందరికీ వితరణ చేశాడు. అతనే అకౌంట్స్ చూస్తున్నాడు. మెడికల్ ఇన్సూరెన్స్ ఏది కట్టాలో, టాక్స్ పేపర్లు తయారు చెయ్యడం వంటి వన్నీ.. బదులుగా అతనింట్లో వ్రతానికి శాస్త్రానికి పదహారు డాలర్లు మాత్రం పుచ్చుకుంటానన్నాడు గిరి.

ఆరోజు ప్రతాప్ వాళ్ల గృహప్రవేశం. ప్రిన్స్‌టన్ దగ్గర్లో ఇల్లు కొనుక్కున్నారు ప్రతాప్, రేణుక. యమున కూడా ఆఫ్ తీసుకుంది. ఇప్పుడు యమున వారానికొకసారి సెలవు తీసుకుంటోంది. వారంలో ఐదు రోజులు గిరి ఇంటి పని, వంట చేస్తాడు. శనాది వారాలకి కూడా చేసి ఫ్రిజ్‌లో పెట్టేస్తాడు. శనాదివారాలు మాత్రం పొద్దుట్నుంచీ రాత్రి వరకూ ఎక్కడో పూజలు ఉంటూనే ఉంటాయి. ఒక్కో రోజు మూడు వ్రతాలు కూడా.. అలాగే డబ్బు కూడా బాగా వస్తోంది. నెలకి రెండువేల డాలర్లకి తక్కువ కాకుండా వస్తోంది.

మిగిలిన ఐదు రోజులూ కూడా ఏదో చెయ్యాలని తపన గిరికి.

"మీరు గృహప్రవేశం చేయించగలరా?" పంచె సరి చూసుకుంటున్న గిరిని అడిగింది యమున సంభ్రమంగా.

"గణపతి హోమం, బారసాల, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గృహప్రవేశం.. ఇవే కాకుండా కళ్యాణం కూడా చేయించగలను. నువ్వు అక్కడ లేని రెండేళ్లూ బాగా తిరిగాను, గణపతి గారి వెంట. పైగా చిన్నప్పుడు తాతగారి కూడా తిరిగిన అనుభవం. అన్ని మంత్రాలూ నాకు తెలియకుండానే నోటికి వచ్చేశాయి. ఇంకా చెవులో ఆయన గొంతు మారు మ్రోగుతూనే ఉంటుంది."

●●●

"యమునా! నేనొకటి అడుగుతాను ఏమనుకోవు కదూ?" కారు డ్రైవ్ చేస్తున్న యమున కొద్దిగా తల తిప్పి చూసింది.

గిరి గొంతులోని ఆర్ద్రత యమునని కదిలించింది. పెళ్లయి ముప్పై ఏళ్లు దాటింది. ఎంత ప్రేమ ఉన్నా మనసులో దాచుకోవడమే కానీ బైటికి తెలిపింది లేదు. కావాలని చేసుకుని, సినిమాలకి డబ్బివ్వడం తప్ప.. భర్తగా బాధ్యతలు తీసుకోలేకపోయానని గిరికి ఎప్పుడూ బాధే

ఆ న్యూనతా భావం అతనికీ, యమునకీ మధ్యనున్న అనుబంధం మీద బాగా కనిపించేది. దానికితోడు ఇంచుమించు ఇల్లరికం వంటి సంసారం.. ఉమ్మడి కుటుంబం. వచ్చేపోయే బంధువులతో చిన్న ఇంట్లో ఏకాంతానికి కరవు.

బొంబాయిలో ఉనప్పుడు కూడా విష్ణు పిల్లల బాధ్యత, అడపాతడపా వచ్చి ఆరాలు తీసే విష్ణు.. ఎప్పుడూ అది వారి స్వంత కాపురం అనిపించలేదు. అందరూ నిద్రపోయాక, వంటింట్లో పడగ్గది మనసు విప్పి మాట్లాడుకోవడానికి కూడా సహకరించలేదు.

ఆ మాటకొస్తే అసలు భార్యాభర్తల మధ్య మాట్లాడుకోవడానికి ఏ విషయాలుంటాయా అని తెలియకుండానే ఏళ్లు గడిచి పోయాయి.

అమెరికా వచ్చాక, స్వతంత్రంగా ఆలోచించడం.. ఇది మా ఇల్లు, ఇక్కడ మేము అనుకున్నది ఎవరి జోక్యం, విమర్శ లేకుండా.. ఏ పనైనా చెయ్యగలము అనిపించింది యమునకీ గిరికీ కూడా.

అప్పుడే భవిష్యత్తు గురించి ఆలోచనా, ప్రణాళికలూ నేర్చుకున్నారు. గిరి కంఠస్వరంలో ప్రేమ, బాధ్యత.. యమున గొంతులో అభిమానం, అర్థం చేసుకునే సమన్వయం వినిపించసాగాయి. ఇద్దరిదీ ఒకటే ధ్యేయం.

స్మితకి మంచి చదువు, జీవితం వచ్చేలా చెయ్యడం. దానికోసం, ప్రతీ సెంటూ, చూసి చూసి, అపురూపంగా ఖర్చు పెట్టడం, అవకాశం వచ్చినంత సంపాదించడం..

గిరికి ఇంకా ఏదో చేసెయ్యాలని, యమునని సుఖ పెట్టాలని తపన. సాధారణంగా వారానికి ఐదు రోజులు పనేం ఉండదు అతనికి.

"నాక్కూడా సెక్యూరిటీ పని ఏదయినా ఉందేమో కనుక్కోగలవా? ఇప్పుడు ఇంగ్లీష్ బాగా మాట్లాడ్డం వచ్చింది కదా? అదయితే రాత్రిళ్లు చెయ్యచ్చు. పగలు ఇంటి పని చూసుకోవచ్చు."

యమున కొంచెం ఇబ్బందిగా కదిలింది. తను అస్సలు ఇంట్లో ఏమీ పని చెయ్యడం లేదు. చెయ్యడానికి ఏమీ ఉంచడం లేదు గిరి. కానీ గిరి అంటున్నది నిజమే.. అతనికి ఇంగ్లీష్ మాట్లాడ్డం బాగా వచ్చింది.

"కానీ నైట్ డ్యూటీ చెయ్యగలరా మీరు?"

పక పకా నవ్వాడు గిరి. యమునకి కూడా నవ్వొచ్చింది. అమెరికా వచ్చాక రాత్రిళ్లు ఇంటి దగ్గర ఉంటున్నాడు కానీ, హైద్రాబాద్‌లో గిరి ఏనాడూ పన్నెండులోపు ఇంటికి రాలేదు. ఆ తరువాత కూడా రెండింటి వరకూ వీధిలో తిరుగుతూ సిగరెట్లు తాగుతూ, స్నేహితులతో కబుర్లు చెప్తూ కాలక్షేపం చేసేవాడు. మధ్యాన్నం రెండు మూడుగంటలు పడుకోవడం అలవాటే. అది ఇంట్లోవాళ్ల కంట తక్కువ పడడానికే.. మొదట్లో యమున దెబ్బలాడి, విసుక్కునీ సాధించడం చేసేది.. ఆ తరువాత వదిలేసింది.

"సరే! కనుక్కుంటాను."

"పోనీ నీ బదులు నేను చెయ్యడానికి వీలవుతుందేమో.. నువ్వు రెండు ఉద్యోగాలు చెయ్యనక్కర్లేదు."

యమున ఒక్క క్షణం మాట్లాడలేదు. అవును.. బాగానే ఉంటుంది, తను సూపర్ మార్కెట్ జాబ్ ఒకటే చేస్తే. కాస్త జీవితాన్ని అనుభవించచ్చునేమో!

"నీకు మానేజర్ తెలుసు కదా! వారానికి ఐదు రోజులు నేను, రెండు రోజులు నువ్వు చెయ్యడానికి ఒప్పుకుంటాడేమో అడిగి చూడగలవా?"

"కనుక్కుంటాను మామయ్యా! నాక్కూడా చాలా టైర్డ్ గా ఉంటోంది. మీరు చెప్పిన ఐడియా బాగానే ఉంది."

"అమ్మయ్య!" అనుకుంటూ గిరి నిట్టూర్చాడు. తను కూడా మంచి ఇంటి యజమాని అనిపించుకోగలుగుతున్నందుకు.

●●●

ప్రతాప్ వాళ్ల కొత్త ఇల్లు ఉన్న ప్రిన్స్‌టన్ వెళ్లడానికి గంట పైన పట్టింది. ఆ లెక్కలన్నీ వేసుకుని ముందే బయలుదేరారు యమునా, గిరీ. పూజకి కావాల్సిన సామాన్లు కూడా వీళ్లే తీసుకెళ్తున్నారు.

అదంతా మంత్రిప్రగడ సలహా. సామాన్లన్నీ గురువుగారినే తెమ్మని, "ఆ సర్వీస్‌కి కూడా 'పే' చేద్దాం. మనకి సదుపాయం, గురువుగారికి కొంత ఆదాయం." రోజుకి పదిగంటలు పైగా పనిచేసే యువక బృందం ఆనందంగా ఒప్పుకున్నారు. పైగా ఏమేమి ఎంత కావాలో ఆయనకయితే బాగా తెలుసు మరి.

కొత్త ఇల్లు చాలా బాగుంది. నాలుగు పడగ్గదులు. కింద హాల్లో వ్రతానికి కావలసిన ఏర్పాట్లు చేశాడు గిరి. ముందుగా వీళ్లే వెళ్లి పువ్వులతో అలంకరణ చేశారు. సరిగ్గా సమయానికి అందరూ వచ్చారు. శాస్త్రోక్తంగా దేముడి పఠం, బిందెలతో నీళ్లూ, పళ్లూ, పువ్వులూ.. అన్నీ ప్రతాప్, రేణుకల చేత వారి బంధువుల చేత పట్టించి, ఇంట్లోకి ప్రవేశ పెట్టాడు.

వాస్తు పూజ, నవగ్రహ పూజ, సత్యనారాయణ వ్రతం అన్నీ చేయించాడు. భోజనం.. అందరూ తలొక పదార్థం చేసి తీసుకొచ్చారు. అన్ని రకాల పిండివంటలూ అక్కడ ప్రత్యక్షం.

చాలా మంది కొత్త వాళ్లు వచ్చారు. అందరూ గిరి పూజ చేయించే విధానాన్ని మెచ్చుకున్నారు. ఫోన్ నంబర్ అడిగి తీసుకున్నారు.

గిరికి, యమునకి బట్టలు కూడా పెట్టారు ప్రతాప్, రేణుక.

●●●

**ప్రతాప్ ఇల్లు చూస్తుంటే మనసులో కొంచెం బాధ** అనిపించింది యమునకి. ఛా..ఛా ఇలా ఆలోచిస్తోందేమిటి తను. అసూయా!

కాదు. సంతోషంగానే ఉంది ఒక పక్క. కానీ, ఇంత చిన్నపిల్లలు. ఇంచుమించు స్మిత వయసు వాళ్ళు ఇళ్ళు వాకిళ్ళతో సంబరాలు చేసుకుంటుంటే తామేమో నడివయసు దాటాక జీవనపోరాటం ప్రారంభించారు. ఎప్పటికైనా ఒక గూడు ఏర్పరచుకోగలుగుతామా!

నాన్నమ్మ మాటలు గుర్తుకొచ్చాయి.

"ఇప్పుడు కష్టపడితే తర్వాత సుఖపడొచ్చే పిల్లా. ఆ సినిమాలు తగ్గించచ్చు కదా!" తను మొదటిసారి యస్సెస్సెల్సీ తప్పినప్పుడు అంది.

తను వినిపించుకుంటే కదా! అందుకే అంటారు పెద్దల సుద్దులు వ్యర్థాలు కావని. తనకంటూ ఎప్పటికైనా ఒక సొంత ఇల్లు కలతీరేనా?

"యమునా! వెళ్ళేటప్పుడు నేను డ్రైవ్ చేస్తా, నువ్వు పక్కనుంటే నాకు ధైర్యంగా ఉంటుంది. ఇప్పటి వరకూ ఇంత దూరం అదీ రాత్రివేళ నేను చెయ్యలేదు కదా!" గిరి మాటలకి ఉలిక్కిపడి చూసింది యమున.

గృహప్రవేశానికి వచ్చిన వారందరూ వీధిలో గలగలా వీడ్కోళ్లు చెప్పుకుంటున్నారు.

ప్రతాప్ కారు దగ్గరికి వచ్చాడు, తలుపు తియ్యడానికి.

"మీ పరిచయం మాకు చాలా లక్కీగా అయింది గురూజీ! మీరు వ్రతాలు, పూజలు చేయిస్తున్నారు. మేమందరం మంచిగా సెటిల్ అవుతున్నాం. తొందర్లో మంత్రిప్రగడ కూడా ఇక్కడే కొంటున్నాడు. మాకు నైబర్ అవుతున్నాడు. మనవాళ్ళు చాలామంది ఈ పక్కలకొస్తున్నారు. మీరు కూడా వచ్చెయ్యండి." తలుపు తీసి పట్టుకుని అన్నాడు.

"అలాగే తప్పకుండా మీరందరూ మమ్మల్ని సపోర్ట్ చేస్తుంటే ఎందుకు రామూ?" యమున చిరునవ్వు నవ్వింది.

"ఏంటి గురూజీ. మీరా డ్రైవింగ్? బ్రేవో" డ్రైవింగ్ సీట్లో కూర్చుని బెల్ట్ పెట్టుకుంటున్న గిరిని అభినందించాడు.

"స్మితని కూడా తీసుకురావల్సిందుండె" ఎప్పుడొచ్చిందో రేణుక, అరడజను పాకెట్ల పులిహోర, పాయసం, కూరలు, సాంబారు అవీ ఒక పెద్ద సంచిలో తెచ్చి వెనుక సీట్లో పెట్టింది.

"స్మితనా! వీకెండ్ చాలా బిజీ. లైబ్రరీకి వెళ్ళాలని పొద్దున్నే వెళ్ళిపోయింది. అసలు ఈ మధ్యన తనతో పదినిముషాలు కూడా మాట్లడలేకపోతున్నా. మళ్లీసారి తీసుకొస్తాం."

"ఒకే ఆంటీ.. బై"

కదులుతున్న కార్లోంచి చెయ్యూపి, కారు పోనిచ్చాడు గిరి.

ఎక్కువసేపు పట్టినా జనసంచారం తక్కువగా ఉన్న రోడ్ల మీదినుంచి పోనిమ్మని, సూచనలిస్తూ స్పీడు ఎక్కువ అక్కరలేని తోవచెప్పింది యమున.

"బాగానే డ్రైవ్ చేస్తున్నారే" తాముండే ఎడిసన్ ఏరియాలోకి ప్రవేశిస్తుండగా అంటోంది యమున. ఇంకా తన మాట నోట్లోనుంచి పూర్తిగా బైటికి రానేలేదు.

గిరుక్కున పక్కకి తిరిగి దేనికో కొట్టుకుని ధామ్మని చప్పుడు చేస్తూ ఆగిపోయింది కారు.

యమున గుండెలు దడదడలాడుతుండగా తలుపు తీసుకుని దిగింది.

చేతికున్న గడియారంలోని ఫ్లోరసెంట్ ముల్లు టైమ్ పన్నెండు దాటిందని చెప్తోంది.

గిరి దిగడేంటి? యమున గాభరాగా డ్రైవింగ్ పక్క తలుపు దగ్గర కెళ్ళింది. అప్పుడే తలుపు తీసి అటూ ఇటూ చూస్తూ కారు దిగాడు.

ఎంత తాపీగా దిగుతున్నాడో యమున కోపంగా ఏదో అనబోయి. ఆపుకుంది. అద్దం పగిలిపోయిన కారు హెడ్‌లైట్ కాంతిలో, గిరి కళ్లల్లో భయం కనిపించింది.

"ఎక్కడున్నాం? ఏమయింది?" వణుకుతున్న కంఠంతో అడిగాడు.

"ఇక్కడ రైట్ టర్న్ తీసుకోమన్నా కదా! కొంచెం ఎక్కువ తీసుకున్నట్లున్నారు. ఎవరిదో డ్రైవ్ వేలోకి వెళ్ళిపోయింది కారు. ఇప్పుడు దీన్ని బైటికి తీద్దామంటే చీకటి కొట్టు. ఇక్కడ ఎవరి కాంపౌండ్‌లో కైనా వెళ్లడం నేరం. కేసులూ అవీ. ఏం గొడవ అవుతుందో. అయినా నాదే తప్పు. రాత్రిపూట, ఇంత దూరం మీకు కారివ్వకుండా ఉండాల్సింది." యమున గొంతు భయంతో దుఃఖంతో బొంగురు పోయింది.

గిరి మొహం, రక్తం అంతా ఎవరో తోడేసినట్లు పాలిపోయింది.

"ఎలా ఇప్పుడు. ఏం చెయ్యాలి?" అంతకు కొద్ది గంటల ముందే గంభీర కంఠస్వరంతో మంత్రాలు చదివిన గిరి గొంతు, నూతిలోంచి వస్తున్నట్లు ఉంది.

"ఏదో చేద్దాం లెండి. మీరు నెమ్మదిగా ఉండండి."

తెచ్చి పెట్టుకున్న ధైర్యంతో అందే కానీ యమునకి ఏం చెయ్యాలో తోచలేదు. ఆ సమయంలో కారు అక్కడే వదిలేసి వెళ్దామన్న ఏం దొరకవు. ఒక పక్క ఎముకలు కొరికే చలి పళ్లు కటకటలాడుతున్నాయి. కార్లోనే కదా అని ఆ చలికి తగిన కోటు, టోపీ అవీ తెచ్చుకోలేదు. కాసేపుంటే చలికి శరీరం కొయ్యబారిపోడం ఖాయం.

గిరి ఆ హెడ్ లైట్ కాంతిలో కారు దేనికి కొట్టుకుని ఆగిందో చూశాడు. తడుముకుంటూ వెళ్ళి చెట్ల చుట్టూ పెట్టే రాళ్ల మధ్యలోకి దూసుకుని వెళ్లిపోయింది. వెనక్కి తియ్యాలంటే పక్కనున్న ఇంకో చెట్టు మొదలు తగులుకుంటుంది. లైట్ పడుతున్న మేర తప్పితే మిగిలిన చోటంతా అంధకారం. ఏదైనా చెయ్యాలనుకోవడం తెలివి తక్కువే.

ఆ చుట్టు పక్కల అన్నీ పెద్ద పెద్ద ఇళ్లే. అరమైలు దూరంలో ఉన్న పెట్రోల్ బంక్‌కి వెళ్తేనే ఎవరికైనా ఫోనైనా చెయ్యగలరు. గిరితో అదే చెప్పి పేవ్‌మెంట్ మీదికొచ్చింది యమున. కారు తలుపు తీసి లైట్లార్పి తాళం వేసి, గిరి కూడా వెనుకే వెళ్లాడు. ఇద్దరూ నాలుగడుగులు వేశారో లేదో.

ఇంటిముందున్న లైట్లన్నీ ఒక్కసారిగా వెలిగాయి.

తలుపు తీసుకుని, ఒక అమెరికన్ మధ్య వయస్కుడు కోటు బటన్స్ పెట్టుకుంటూ ఇంట్లోంచి బైటికి వచ్చాడు. గిరి, యమునలకి గుండె ఆగినంత పనయింది. అర్ధరాత్రి అతన్ని బైటికి తప్పించారు. ఇంట్లో గార్డెన్ డామేజ్. ఏమరుస్తాడో. ఎంత డబ్బు ఖర్చవుతుందో.

"ఏమయింది? పెద్ద శబ్దం వినిపించింది. మా అబ్బాయి వచ్చాడేమో అని ఇంతసేపూ

ఆగాను. చూడబోతే మా తోటలోకి దూసుకొచ్చినట్లున్నారే" అమెరికన్ కారు దగ్గరకి వచ్చి పరీక్షగా చూస్తూ అన్నాడు. యమున తొందరగా అడుగులు వేసుకుంటూ వెనక్కి వెళ్లి అతనికి జరిగింది వివరించింది.

"ఓ.కె. మీకు కార్ ఇన్సూరెన్స్ ఉందా? ఈ కార్ మీదేనా? బై ద వే. నా పేరు జాక్ విలియమ్స్" మంద్ర స్వరంతో నెమ్మదిగా అడిగాడు. అర్ధరాత్రి నిద్రలేపినందుకు విసుక్కుంటాడేమోనని భయపడ్డ యమున గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

ఇన్సూరెన్స్ ఉందని చెప్పి తమని పరిచయం చేసుకుంది.

అదే సమయంలో సర్రుమంటూ ఒక నల్లకారొచ్చి అక్కడాగింది.

"హాయ్ డాడ్ ఏమయింది" ఇరవై ఏళ్ల అబ్బాయి కారు దిగి తండ్రిని పలకరించాడు.

"మా బ్రదర్ ఇక్కడికి దగ్గర్లోనే ఉంటాడు. ఒకసారి ఫోన్ చేసుకోవచ్చా?" యమున మాటలు వినిపించుకోకుండా ఆ అబ్బాయి కారు చుట్టూ తిరిగి పరిశీలించి, తన కారు కొంచెం దూరం పెట్టి, గిరి నడిగి కారు తాళాలు తీసుకున్నాడు.

"మా అబ్బాయికి కార్లంటే పిచ్చి. ఏమనుకోకండి." విలియమ్స్ మొహమాటంగా అంటుంటే ఆశ్చర్యపోవడం యమున వంతయింది.

"అదేంటి మిస్టర్ విలియమ్స్! మీ ఇంట్లోకి వచ్చి మీ తోట డేమేజ్. మిమ్మల్ని ఈ టైమ్‌లో డిస్టర్బ్ చేశాం."

"ఫర్లేదు. ఇటువంటివి కామన్. ఈ కార్నర్లో స్ట్రీట్ లైట్ పెట్టమంటే కౌంటీ వాళ్లు వినిపించుకోవట్లేదు. ఈ సంగతి చెపితే వాళ్లు యాక్షన్ తీసుకుంటారు. మీ ఇన్సూరెన్స్ డామేజ్ పే చేస్తుంది కదా! మేం పన్నెండు తర్వాతే పడుకుంటాం. మా అబ్బాయి వర్క్ నుంచి వచ్చాక." శాంతం మూర్తీభవించినట్లున్న విలియమ్స్ గారిని చూస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి యమునకి.

ఇంత సులభంగా బయట పడేసినందుకు జగన్మోహినీ కేశవస్వామికి గిరీ, కృష్ణుడికి యమునా థాంక్స్ చెప్పుకున్నారు. కాకపోతే ఇన్సూరెన్స్ ప్రీమియమ్ కొంచెం పెరుగుతుంది. ఇంకా నయం కోర్ట్ చుట్టూ తిప్పుతారేమో అని భయపడ్డారు.

చిన్న విలియమ్స్ పక్కనున్న చెట్టుకి తగలకుండా, లాఘవంగా కారు బయటికి తీసేశాడు ఒక్క నిముషంలో.

"హియర్ యు ఆర్. కార్ ఈజ్ ఫైన్."

"థాంక్ యు మిస్టర్ విలియమ్స్. మా కార్డ్ ఇదిగో. మీ ఫోన్ నంబర్ ఇస్తే రేపు పిలుస్తాం" గిరి విజిటింగ్ కార్డ్ ఇచ్చింది యమున. అంతకు ముందు నెలలోనే మంత్రిప్రగడ సలహాతో కార్డ్స్ చేయించారు.

బోలెడు థాంక్స్ చెప్పుకుని ఊగిసలాడుతున్న హెడ్‌లైట్‌తో ఇంటికి చేరేసరికి ఒంటిగంట దాటింది.

"ఇదో అనుభవం అమెరికాలో" గిరి గట్టిగా నిట్టూర్చి అన్నాడు.

●●●

"ఓహ్. జాక్ విలియమ్సా! నా కొలీగే. మేమిద్దరం రెసిడెన్సీ కూడా కలిసే చేశాం. హాస్పిటల్లో కలుస్తాడు. అడుగుతాను, ఎంత కావాలంటాడో" పొద్దున్నే హడావుడిగా ఇంటికొచ్చిన యమునతో అన్నాడు ఆనంద్.

ఆదివారం పొద్దున్నే వచ్చి జరిగింది చెప్పి, ఇన్సూరెన్స్ ప్రీమియమ్ ఎంత పెరుగుతుందో అని వాపోయింది యమున. గిరి ఎవరింట్లోనో వ్రతం చేయించడానికి వెళ్లాడు. వాళ్లే వచ్చి తీసుకెళ్లి దింపుతారు.

"ఏదేమైనా విలియమ్స్ చాలా మంచి వాడిలాగున్నాడు. మరొకరైతే అర్ధరాత్రి అలా చేసినందుకు నానా బీభత్సం చేసేవారు" యమున నిట్టూర్చింది.

"వాడు మొదట్లో ఎంత టెంపర్‌తో ఉండేవాడో తెలుసా? అప్పటి రోజులే కనుక ఐతే నానా గోలా చేసి ట్రెస్ పాస్ అనీ అదీ చెప్పి జైలుక్కూడా పంపించుండేవాడు. సైకియాట్రీ చేశాక కొంత తగ్గింది. పేషంట్ల సమస్యలు వినీ వినీ, వాళ్లని ట్రీట్ చేసీ చేసీ వాళ్ల అబ్బాయి మూలాన మిగిలింది తగ్గింది."

"వాళ్లబ్బాయా! తండ్రి కంటే శాంత మూర్తిలాగున్నాడే"

"ఇప్పుడు బాగుపడ్డాడు. పధ్నాలుగేళ్లకే డ్రగ్స్, అమ్మాయిలు అంటూ తిరిగి నాలుగు సార్లు జైలుకెళ్లొచ్చాడు. జాక్, తన ఫీల్డే కనుక సరైన సమయంలో కనుక్కుని వాళ్ల ప్రొఫెసర్ చేత ట్రీట్మెంట్ ఇప్పించాడు. రెగ్యులర్ చదువంటే ఇష్టం లేదని, ఆటోమొబైల్ ట్రైనింగ్‌లో చేర్పించాడు. తన స్నేహితుల్ని కలవడానికి వీల్లేకుండా సాయంత్రాలు వెళ్లేలోగా. చాలా తంటాలుపడ్డాడులే పాపం. ఇంకా పడుతున్నాడు. మళ్లీ ఎప్పుడు పాత అలవాట్ల దగ్గరికి పోతాడో అని భయపడ్తూ "కాఫీ కలిపి యమునకి ఒక కప్పు ఇచ్చి, తనొకటి తీసుకుని వంటింటి గట్టు దగ్గర కూర్చున్నాడు ఆనంద్.

"మరి వాళ్లమ్మ పట్టించుకోదా?"

"అదో గాథ. మేం రెసిడెన్సీలో ఉండగానే ఇతని రెండేసి మూడేసి రోజుల డ్యూటీలు తట్టుకోలేక విడాకులిచ్చి వెళ్లిపోయింది. అప్పుడు కొడుక్కి మూడేళ్లు. పాపం జాక్ నానా అవస్థా పడ్డాడు. వాళ్లమ్మ రోజూ బేబీ సిట్టింగ్ చేసేది. చాలా మందికి ఆ మూడేళ్లు ఓపిక పట్టే పేషన్స్ ఉండదు. అందుకే నేను అంత అయ్యాక పెళ్లి చేసుకున్నా" చిరునవ్వు నవ్వాడు.

"నామీదేంటో చెప్పుకుంటున్నారా అక్కా తమ్ముళ్లు. మా అన్నగారు రాలేదా?" శోభ జిమ్ డ్రెస్‌తో ప్రవేశించింది వంటింట్లోకి.

"హాయ్. గరాజ్ తలుపు శబ్దం వినిపించలేదే" ఇంకో కప్పు కలవడానికి లేచాడు ఆనంద్.

"కారు బయటే పెట్టి వచ్చాను. ఎలాగ మీరు వెళ్తారు కదాని. ఇంతకీ ఏమిటి విశేషాలు? ఇవేళ ఆఫ్ తీసుకున్నారా వదినా?"

"అబ్బే. ఇప్పుడు వెళ్లాలి. మా ఏజెన్సీ బాస్ వస్తానన్నాడు, అతనితో మాట్లాడాలి కూడా. మామయ్య నా బదులు నైట్ డ్యూటీ చేస్తానంటున్నారు." అంటూ రాత్రి జరిగింది చెప్పింది యమున.

"ఇలాంటివి మామూలే. నేనయితే బేస్మెంట్ అపార్ట్‌మెంట్‌లోకి సగం దూసుకెళ్లిపోయా కొత్తల్లో. అప్పుడు మేం హాస్పిటల్ దగ్గరగా అపార్ట్‌మెంట్‌లో ఉండేవాళ్లం. కాఫీ చాల బాగుంది డాక్టర్. థాంక్యూ!" శోభ, యమున పక్కనే స్టూల్ మీద కూర్చుంది.

"అవునా. ఎప్పుడూ చెప్పలేదే"

"ఇదేం పెద్ద ఘనకార్యమనీ.. ఇంకా పెద్దవే ఉన్నాయి అమ్మాయిగారి చిట్టాలో." ఆనంద్ ఉడికించాడు.

"చెపితే మాలాంటి వారికి కాస్త పాఠాల్లా ఉంటాయి కదా! ఎలాగైనా మరదలికి గుట్టు ఎక్కువే. మరి అప్పుడేం చేశారు?"

"ఏముంది. మేం కూడా అందులోనే ఉన్నాం కదా. అంతా ఫిక్స్ చేయించి బిల్ మాకు పంపాడు మానేజర్. ఒక వెయ్యి వదిలింది."

"ఇప్పుడు అంత సరిపోతే ధన్యులమే. ఇంక వస్తా. ఆలస్యమయిందంటే ఒక గంట కోసేస్తారు. పిల్లలు లేవలేదా?" యమున లేచింది.

"అప్పుడేనా! ఆదివారం. ఇదిగో నేను వెళ్లి మేలుకొలుపులు పాడాలి." శోభ లేచింది.

"చిన్నక్కా! నువ్వేం బెంగపెట్టుకోకు. తెలిసిన వాళ్ల ఫ్రంట్ యార్డ్ అవడం లక్కీనే. నేను మాట్లాడ్తా జాక్‌తో. అలాగే నీ కారిక్కడుంచి నా సెకండ్ కార్ తీసుకెళ్లు. హెడ్ లైట్ బాగు చేయిస్తా సాయంత్రంలోగా. నాకెలాగూ ఇవేళ ఆఫ్." ఆనంద్ మరోసారి భరోసా ఇచ్చాడు.

●●●

ఆనంద్ రెండో కారు చిన్నదే అయినా మంచి కండిషన్లో ఉంది.

"అబ్బ. ఎంత హాయిగా ఉందో డ్రైవ్ చేస్తుంటే తనెప్పటికైనా కొత్తకారు కొనుక్కోగలుగుతుందా? యమున ఆలోచిస్తూనే తను సెక్యూరిటీ పని చేసే కాంప్లెక్స్ దగ్గరకొచ్చింది.

ఏదో... అసలు తనేమిటి. కారు డ్రైవ్ చెయ్యడమేమిటి. ఈ పాటి అదృష్టమైనా కలిగించాడు ఆ కృష్ణుడు. ఆ రోజు నాలుగోసారి ఆయనకి థాంక్స్ చెప్పుకుంటూ కార్ పార్క్ చేసి కిందకి దిగింది.

లోపలికి వెళ్తుండగానే ఎదురయ్యాడు రాడ్నీ రిఛర్డ్స్, యమునని పనిలోకి తీసుకున్న ఏజెన్సీ ఓనర్. పదిహేను రోజులకోసారి ఆదివారం పొద్దున్నే వచ్చి అంతా సరిగ్గా ఉందా లేదా అని చూస్తుంటాడు. యమున ఆందోళనగా టైమ్ చూసుకుంది. సరిగ్గా ఎనిమిదయింది. అమ్మయ్యా అనుకుంటూ నవ్వు మొహంతో గుడ్ మార్నింగ్ చెప్పింది. ఐదు నిముషాలు ముందే వచ్చి కూర్చుంటాడు అనుకుంటూ.

అంత పంక్చువల్‌గా ఉంటాడు కనుకే అంత పెద్ద ఏజెన్సీ నడుపుతున్నాడు. తను చాల నేర్చుకోవాలి వీళ్ల దగ్గర్నుంచి.

"గుడ్ మార్నింగ్ యమునా! ఇవేళ ఎలా ఉన్నారు? వర్క్‌లో ఏం ప్రాబ్లం లేదు కదా?" ఎంతో సౌమ్యంగా అడిగాడు. వారానికి ఏడురోజులూ క్రమం తప్పకుండా పనిచేసే యమునంటే అతనికి అభిమానమే.

"ఏం లేదు. ఇక్కడంతా మంచివాళ్లే. చాలా మర్యాదగా ఉంటారు. ఒక చిన్న రిక్వెస్ట్ మిస్టర్ రాడ్నీ"

"యస్" చాంబర్లో కూర్చుని లాగ్ బుక్ చూస్తూ అన్నాడు రాడ్నీ. అతను పది కాంప్లెక్స్‌లకి సెక్యూరిటీ మానేజ్ చేస్తాడు.

యమున గిరి గురించి చెప్పింది.

రాడ్నీ పుస్తకం మూసేసి శ్రద్ధగా విన్నాడు.

"సరే. రేపు అతన్ని తీసుకురా. చూద్దాం. మా ఆఫీస్ తెలుసు కదా!"

యమున తెలుసన్నట్లు తలూపి తన పనిలో పడుతూ ఆలోచించింది.

ఇక్కడ ముఖాముఖీ భేటీ చేస్తే కానీ తృప్తి చెందరు. రేపు ఒక గంట ఆలశ్యంగా వస్తానని శమంతాకి చెప్పాలి. ఏమవుతుందో గిరి సరిగ్గా ఆన్సరిస్తాడో లేదో. పోనీలే ఈ ఉద్యోగం రాకపోయినా ఇబ్బందిలేదు. ఇలాగే నడిపించేయచ్చు. యమున ఎటువంటి పరిస్థితయినా ఎదుర్కోడానికి సిద్ధంగానే ఉంది.

●●●

గిరిని చూసి తృప్తిగా తలాడించింది యమున. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోకి వెళ్లే వారెవరైనా తలుపు తెరుచుకున్నాక గిరిని చూస్తే ఇంప్రెస్ అయితీరుతారు. ముందు రాడ్నీ బుట్టలో వేస్తే పనయినట్లే.

అసలే చక్కని వాడేమో. ముదురు నీలం పాంట్లో లేత నీలం ఫుల్ హాండ్ షర్ట్ టక్ చేసి, ఎరుపు మీద లేత నీలం చుక్కలున్న టై.. బంగారత్త చూస్తే వెంటనే దిష్టి తియ్యండ్రా అంటుంది. ఎందుకో ఈ వేళ బంగారత్త గుర్తుకొచ్చింది. ఎలా ఉందో. ఒకసారి ఫోన్ చెయ్యాలనుకుంది యమున. ఆవిడ ఆశీర్వాదం ఉంటే తప్పకుండా ఇంటర్వ్యూలో బాగా చేస్తాడు గిరి. అయినా బెదురుగానే ఉంది.

పరి పరివిధాల ఆలోచిస్తూ శమంతాకి ఫోన్ చేసింది ఒక గంట ఆలశ్యంగా వస్తానని.

"వై యమునా?"

"నేను చేసే నైట్ డ్యూటీ గిరికి ఇమ్మని అడిగాను. రాడ్నీ ఇంటర్వ్యూ చేసి చెప్తానన్నాడు. అక్కడికి తీసుకెళ్లి, ఇంట్లో దింపి వస్తా. ఆ టైమ్ ఈవినింగ్ కవర్ చేస్తా."

"వెరీ గుడ్ యమునా! నువ్వు కొంచె రిలాక్స్ అవచ్చు. గో ఎ హెడ్"

రాడ్నీ ఆఫీస్‌కి వెళ్లడానికి అరగంట పట్టింది.

గిరిని చూస్తూనే రాడ్నీ మొహం వికసించింది, యమున ఊహించినట్లుగానే.

"నువ్విక్కడేం చేస్తున్నావు? మూవీస్‌లో యాక్ట్ చెయ్యకుండా" నవ్వుతూ అన్నాడు, షేక్ హాండిస్తూ. గిరి మొహం ఎర్రగా అయిపోయింది. టీవీ చూసి చూసీ అమెరికన్ యాక్సెంట్ బాగా అర్ధమవుతోంది.

"మీ దగ్గర పని చెయ్యడానికి వచ్చేశాను." గిరి కూడా అంత హాస్యంగానూ అన్నాడు.

యమున అమ్మయ్యా అనుకుంది. ఫరవాలేదు. అంతా సవ్యంగా జరిగిపోతోంది.

గిరి ఇంగ్లీష్ కూడా బాగా నేర్చుకున్నాడు. క్లాసులకెళ్లీ ప్రతాప్ దగ్గర మాట్లాడీ రోజూ అపార్ట్‌మెంట్ బయట అమెరికన్ వృద్ధులతో పరిచయం పెంచుకుని కళ్లు సరిగ్గా ఆనని వాళ్లకి పేపర్ చదివి వినిపించీ.

రాడ్నీ ఆ రోజు నుంచే గిరిని చేరిపొమ్మన్నాడు.

యమున సంతోషంగా గిరిని ఇంట్లో దింపి, సూపర్ మార్కెట్‌కి వెళ్లి పనిలో పడింది. సన్నగా కూనిరాగం తీస్తూ. ఇంక రాత్రిళ్లు నిద్రపోవచ్చు హాయిగా.

కానీ. అంతా అనుకున్నట్టే జరగదు కదా! నడిపించే విధికి మానవుడు తల వంచక తప్పదు.

●●●

**యమున గాలిలో తేలిపోతున్నట్లు అడుగుపెట్టింది** సూపర్ మార్కెట్ ఆవరణలోకి. గిరిని ఇంట్లో దింపి వెళ్ళేసరికి రెండు గంటలు ఆలశ్యమయింది.

రోజూ చూసే పరిసరాలే. ఎంతో అందంగా కనిపించాయి. ఒక్క ఆకు కూడా లేకుండా రాలిపోయిన చెట్లని చూసి రోజూ మోడులా ఉండడమంటే ఇదే కాబోలనుకునే యమునకి అప్పుడు అవి నాట్యభంగిమలో ఉన్న సాలభంజికల్లా కనిపించాయి.

వెన్నులోంచీ పాకి వణికించే చలి ఏ మాత్రం బాధించలేదు. కారులోనే యూనిఫామ్ టీ షర్ట్‌లోకి మారి, నాలుగంగల్లో మార్కెట్‌లోకి వెళ్లి పడింది.

శమంతాని చూడగానే కుడి చేతి బొటనవేలు పైకెత్తి, కనుబొమ్మలు పైకి లేపి, మొహం వెలిగిపోతుండగా చిరునవ్వు నవ్వి, మరేం మాట్లాడకుండా పనిలో పడింది యమున. ఒక్క క్షణం కూడా వృధా చెయ్యకుండా.

ఆరవుతుండగా యమున దగ్గరకొచ్చింది శమంతా.

"ఇవేళ గిరి జాయిన్ అవాలి కదా! నేను కవర్ చేస్తా. నువ్వెళ్లు యమునా!"

యమున ఆశ్చర్యంగా చూసింది.

రాడ్నీ ఫోన్ చేసి చెప్పాడు. పైగా నీ మొహం ఫ్లడ్ లైట్‌లాగ వెలిగిపోతోంది. ఏదో విశేషం ఉందని ఎంప్లాయిస్‌కే కాదు, కస్టమర్స్‌కి కూడా తెలిసిపోయింది." శమంతా చిరునవ్వుతో అంది.

"నువ్వే లేకపోతే నేనేమయిపోయేదాన్నో! " కౌంటర్ దగ్గర్నుంచి బయటికి వచ్చి, శమంతాకి హగ్ ఇచ్చింది. కృష్ణుడి అనేక అవతారాల్లో శమంతా కూడా ఒకటిలా అనిపించింది అప్పుడు. యమున పెద్ద పెద్ద అంగలతో బయటికి నడిచింది.

"హలో! వచ్చేశా. రెడీనా?" యమున ఉత్సాహంగా అరిచింది, తలుపు తీసుకుని వస్తూనే.

గిరి ఎక్కడా కనిపించలేదు. తనొచ్చేసరికి ఆలశ్యమవుతుందని కిందికి వెళ్లాడేమో అనుకుంటూ, వంటింట్లోకి వెళ్లింది. మాములుగా వంట చేసి పెట్టేస్తాడు రోజూ.

కానీ ఈవేళ ఏమయింది? అంట్ల గిన్నెలన్నీ ఎక్కడివక్కడే ఉన్నాయి. పొద్దున్న పెట్టిన ఇడ్లీల గుత్తి అట్ట కట్టి దీనంగా చూస్తోంది. ఆందోళనగా అటూ ఇటూ చూసింది యమున.

ఎక్కడి కెళ్లిపోయాడు. కారు కూడా లేదే

ఒక వేళ ఉద్యోగం దొరికిందని, ఇంటి పని ఎందుకు చెయ్యడం అనుకుంటున్నాడా. ఛ..ఛా అలా అనుకునే మనిషి కాదు. గుండె దడదడలాడుతుండగా సోఫాలో కూలబడింది.

ఆనంద్ కేమైనా తెలుసేమో ఫోన్ దగ్గరికి నడిచింది.

క్లిక్..

తలుపు తాళం తీసిన చప్పుడు విని వెనక్కి తిరిగింది.

గిరి నెమ్మదిగా లోపలికి వచ్చాడు. మొహం పాలిపోయి ఉంది. కళ్లల్లో ఆపుకుందామన్నా ఆగని కన్నీళ్లు తొంగిచూస్తున్నాయి. ఏ క్షణమైనా కిందికి ఉరకడానికి సిద్ధంగా.

"ఏమయింది? అలా ఉన్నారేం?"

గిరి ఏం మాట్లాడకుండా కుర్చీలో కూర్చుని, చొక్కా అంచుతో కళ్లు తుడుచుకున్నాడు. అంతలో ఆనంద్ లోపలికొచ్చాడు. కారు పార్క్ చేసి.

యమున పాలిపోయిన మొహంతో ఆనంద్ కేసి చూసింది. అమ్మకేం అవలేదు కదా! "చిన్నక్కా! గిరి మామయ్య రేపు ఫ్లైట్‌లో ఇండియా వెళ్తున్నాడు. టికెట్ నేను అరేంజ్ చేశాను. మామయ్య చెల్లెలు అమ్మన్నకి సీరియస్‌గా ఉందట. మామయ్యని చూడాలంటోందని ఫోన్ వచ్చింది. దారి ఖర్చులకి వెరవద్దని కూడా శివానందం బాబాయ్ చెప్పారు. ఎలాగైనా పంపించమని నాకే చేశారు. మామయ్యకి కూడా వెళ్దామని ఉంది. అందుకే, నీకు చెప్పకుండా.. అయినా టైమ్ కూడా లేదనుకో అతి కష్టం మీద టికెట్ దొరికింది."

"ఏమయింది?"

"కాన్సర్. టెర్మినల్ స్టేజ్."

యమున గిరి దగ్గరగా వెళ్లి పక్కన కూర్చుని చెయ్యిపట్టుకుంది.

అప్పుడు గిరి కళ్లలోంచి ధారగా నీళ్లు కారసాగాయి. ఆత్మీయుల స్పర్శ బిడియం అనే ఆనకట్టని తొలిగిస్తుంది.

"నేను కూడా రానా?"

గిరి శూన్యంలోకి చూసినట్లు చూశాడు. యమునకి మాత్రం తెలీదా. తను వెళ్లడం సాధ్యం కాని పని అని. దారి ఖర్చుల మాటెలా ఉన్నా తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి ఉద్యోగాలు. తను వెళితే కూడా కష్టమే. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాడు. ఇవేళే చేరవలసిన కొత్త జాబ్. కానీ తనమీద ఎంతో ప్రేమ చూపించిన చెల్లెలు. చివరి చూపు కోసం తహ తహ లాడుతోంది.

యమునకి, ఆనంద్‌కి కూడా కన్నీళ్లు ఆగలేదు.

"శివానందం బావ నువ్వు లేనప్పుడు ఎంతో సహాయం చేశాడు. గణపతి శాస్త్రిగారికి చెప్పి ఆయన దగ్గరికి పంపింది అతనే. అప్పుడప్పుడు డబ్బు కూడా సర్దేవాడు. అదంతా అమ్మన్న ప్రోత్సాహమే" గొంతు డెక్కు పడగా ఆగిపోయాడు గిరి.

ఆనంద్ గ్లాసులో నీళ్ళు తీసుకెళ్ళి ఇచ్చాడు.

"మేము ఇక్కడికి వచ్చేముందు హైదరాబాద్ వచ్చి సాగనంపింది." దగ్గుతూ, గొంతు తడుపుకుంటూ చెప్పసాగాడు గిరి.

యమున ఆపబోతే వద్దని సైగచేశాడు ఆనంద్.

అలా చెప్తూనే ఉన్నాడు గిరి, చెల్లెలితో తన అనుబంధం గురించి. మధ్యలో ఆనంద్ వెళ్లి కాఫీ కలుపుకుని వచ్చాడు.

"హాయ్! ఏమిటి అందరూ ఇక్కడ. మామా నీకు ఆఫ్‌నా?" స్మిత హుషారుగా లోపలికొచ్చి, ఆగిపోయింది, విషాదంగా ఉన్న వాతావరణం చూసి.

"డబ్బు కంటే బాంధవ్యాలు ముఖ్యం. నువ్వు వెళ్లిరా నాన్నా! రేపు ఎయిర్ పోర్ట్‌లో నేను దింపుతా. అమ్మా! నువ్వు త్వరగా తయారయి తినేసి, డ్యూటీ కెళ్లు. పిజా ఆర్డరిస్తా." ఎప్పుడూ, ఏదీ పట్టించుకోనట్లు ఉండే స్మిత చక చకా వంటింట్లోకి వెళ్లి అంతా శుభ్రం చేసింది ఆనంద్ చెప్పింది విన్నాక.

"వెల్‌డన్ స్మితా! అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు. అవసరం ఉన్నపుడు ఇలాగే అంది రావాలి. టేక్ కేర్." ఆనంద్ ఇంటికెళ్తూ స్మిత భుజం తట్టాడు.

●●●

గిరి విమానంలో కూర్చుని, తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకున్నాడు.

"అన్నా! అమ్మ నిన్నెందుకు అస్తమానూ తిడుతుంది?" ఆరేళ్ల అమ్మన్న గౌనుకున్న జేబులోంచి బంక పట్టిన పిప్పర్ మెంట్ తీసి ఇస్తూ.

అమాయకంగా తన వెంట తిరిగే అమ్మన్నతో తనెప్పుడూ పెద్దగా స్నేహం కలుపుకోలేదు. ఇంకా పిన్ని మీద కోపాన్ని, చిన్న పిల్ల అని అయినా చూడకుండా దానిమీద చూపించేవాడు.

అమ్మన్న అదేం పట్టించుకునేది కాదు.

నాన్న ఎప్పుడూ ఉదాసీనంగానే ఉండేవారు. తాతగారు సంభావనకి ఊరికెళ్లినప్పుడు, పిన్ని రాత్రిళ్లు అన్నం పెట్టేదికాదు. నాన్నమ్మ ఎదురుగుండా కంచం పెట్టినట్లు చేసి, ఒక గరిటెడు అన్నంలో నీళ్ల మజ్జిగ పోసి లెమ్మనేది. కడుపులో పేగులు ఉండచుట్టుకుపోయేవి. కాళ్లు ముడిచి పెట్టుకుని పడుకుంటే అప్పుడు అమ్మన్న ఎక్కడ్నుంచి తెచ్చేదో చిన్ని చిన్ని చేతులతో గ్లాసు నిండా పాలు పట్టుకొచ్చి, తాగేవరకూ...

గిరి కళ్లలోంచి ధారగా నీళ్లు చెంపల్ని తడిపేస్తుంటే తుడుచుకోవాలని కూడా మర్చిపోయాడు. పక్కనున్న అమెరికన్ వింతగా చూసి బెల్లు నొక్కి ఎయిర్ హోస్టెస్‌ని పిలిచాడు.

"మీకేమైనా సహాయం చెయ్యగలనా?" చిరునవ్వుతో, కళ్లలో సానుభూతి చూపిస్తూ.

"కాఫీ ప్లీజ్"

"ఒక్క నిముషం" ఎయిర్ హోస్టెస్ వెళ్లి కాఫీతో పాటు తలనొప్పి తగ్గించే మాత్ర కూడా తెచ్చింది.

"మీకు కావాలంటే వేసుకుని నిద్రపోడానికి ప్రయత్నించండి." ఆ అమ్మాయి చెప్పినట్లే చేశాడు.

రాత్రి అస్సలు నిద్రపట్టలేదేమో. తలగడా సర్దుకుని కళ్లు మూసుకోగానే నిద్రాదేవి ఒడిలోకి తీసుకుంది.

●●●

ఎయిర్ పోర్టులోంచి బయటికి రాగానే ఎదురయిన వ్యక్తిని చూసి గిరి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. విమానంలో కూర్చున్నంత సేపు ఆలోచిస్తూనే ఉన్నాడు. ఎక్కడికెళ్లాలా అని. అమ్మన్న వాళ్లు విశాఖపట్నంలో ఉంటారు. అసలు అక్కడికే ఫ్లైట్ తీసుకుంటాడేమో అనుకుంటే ఆనంద్ హైదరాబాద్‌కి తీసుకున్నాడు. ఏ సంగతీ మాట్లాడ్డానికి తనకి బుర్ర పనిచెయ్యలేదు. అంతా అతను చూసుకుంటున్నాడులే అనుకున్నాడు.

పోనీ యమున అయినా సరిగ్గా వివరించి చెప్పచ్చు కదా! బస్ డిపోకో, లకిడికాపూల్‌కో వెళ్లి బస్ కోసం ప్రయత్నిస్తే సరి.

కృష్ణా లాడ్జికి వెళ్లి, స్నానం చేసి ఆలోచించవచ్చనుకుంటూ బయటికి వచ్చాడు. అంతలోనే సాక్షాత్తు విష్ణుమూర్తిలాగే ప్రత్యక్షం అయ్యాడు.

"ప్రయాణం సరిగ్గా జరిగిందా బావా?" విష్ణు, గిరి చేతుల్లోంచి ట్రాలీ తీసుకుని ముందుకి నడిచాడు.

''నువ్వు ఎలా ఇక్కడ'' గిరి నోట్లోంచి మాట సరిగ్గా రాలేదు. విమానంలో పెట్టే తిండి అతనికి సహించదు. పాలు, పళ్లతో కాలక్షేపం చేశాడు. జెట్‌లాగ్, ఆపైన సరైన తిండి లేక నీరసం.

''ఇంటికెళ్లాక మాట్లాడుకుందాం. అన్నీ వివరంగా చెప్తా.''

గిరి ఇంకా ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేదు. విష్ణు హైదరాబాద్‌లో ఉంటున్నట్లే అతనికి తెలియదు. అమ్మన్న కూతురి పెళ్లిలో ఆ తరువాత విష్ణు ఆఖరి కూతురి పెళ్లిలో కలవడమే. అమెరికా వెళ్లాక వాళ్ల సంగతులేమీ తెలియలేదు.

ఇండియాలో ఉన్నప్పుడు కూడా అంతంత మాత్రం సంబంధాలే. మొదట్నుంచీ విష్ణుకి గిరి అంటే సదభిప్రాయం లేదు. ఒకసారి ముంబాయిలో అతని దగ్గర పనిచేసేటప్పుడు మీద కొచ్చి కొట్టినంత పనిచేశాడు. విష్ణుకి కోపం ఎక్కువ. తను అనుకున్నట్లు ఎవరు ప్రవర్తించకపోయినా, ఏది జరగకపోయినా అంతెత్తున లేచి అందర్నీ హడలగొడ్తాడు. అటువంటిది స్వయంగా ఎయిర్ పోర్ట్‌కి వచ్చాడంటే తనమీద అభిప్రాయం మార్చుకున్నాడా. దూరం అయ్యాక ఆప్యాయతలు పెరిగాయా, అమెరికా మహత్యమా!

గిరి తల పగిలి పోతున్నట్లనిపిస్తుంటే ఆలోచించడం మానేశాడు.

●●●

''లోపలికి దా బావా! ఇదే మనిల్లు.'' శాంతినగర్‌లో ఒక చక్కని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ ముందు కారు ఆపాడు విష్ణు.

''రండన్నయ్యా! అక్కడంతా కులాసానా?'' విష్ణు భార్య, లలిత చిరునవ్వుతో పలకరించింది. ఆవిడ ఎప్పుడూ శాంతానికి మారుపేరులా ఉంటుంది.

ఆ విధంగా కూరుస్తాడేమో భగవంతుడు గిరి చిన్నగా నవ్వి, ఇంట్లోకి నడిచాడు. మూడు గదుల విశాలమైన అపార్ట్‌మెంట్ అది. శుభ్రంగా తళతళ మెరిసే గోడలతో, నేలతో ఆధునికంగా ఉంది.

''మేం నిరుడే ఇక్కడికి మారాం. పిల్లలందరి పెళ్లిళ్లూ అయ్యాక, ముంబాయ్ ఉద్యోగం వదిలేశాను. ఇక్కడే కన్‌స్ట్రక్షన్ కంపెనీలో చీఫ్‌గా ఉన్నా. నీ సామాన్లు ఈ గదిలో పెట్టిస్తున్నా. లోపలికెళ్ళి, మొహం కడుక్కుని రా! కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం.''

''ఇప్పుడు చెప్పు. కొంత అర్థం అయిందిలే. ఆనంద్ ఫోన్లో చెప్పుంటాడు నేనొస్తున్నట్లు.''

గిరి స్నానం చేసి, తెల్లని పైజమా లాల్చీ వేసుకుని, సోఫాలో కూర్చున్నాడు. లలిత ఇచ్చిన కాఫీ తాగుతూ.

''అవును. ఆనంద్ నాతో టచ్‌లోనే ఉన్నాడు. ఎప్పటికప్పుడు మీ విషయాలన్నీ తెలుస్తూనే ఉన్నాయి. ప్రస్తుతానికి వస్తే.''...

''విష్ణుబావా! అమ్మన్న ఎలా ఉంది. ఎక్కడుంది? తనని చూడాలి అర్జంట్‌గా. ఈవేళ రాత్రికి రైల్లో సీటు దొరుకుతుందేమో చూస్తావా? ఒక వేళ ఆల్రెడీ కొనేశారా?''

''అమ్మన్న ఇక్కడే ఉంది. కాన్సర్ హాస్పిటల్‌లో పొద్దున్నే వెళ్దాం. శివానందం, పిల్లలూ కూడా ఇక్కడే ఉన్నారు. హాస్పిటల్ దగ్గరగా ఒక గది తీసుకున్నారు. నీకు అన్ని సంగతులూ చెప్పే ఉంటారు కదా! ఎవరం చెయ్యగలిగిందేం లేదు. జరిగేది చూస్తూ ఉండడం తప్ప.''

లలిత కూడా వచ్చి కూర్చుంది, ఏమీ మాట్లాడకుండా.

''ఇప్పుడెళ్లడానికి లేదా?''

విష్ణు గోడకున్న గడియారం కేసి చూశాడు. నాలుగున్నరయింది. తెల్లవారడానికి ఇంకా గంటన్నర పైన పడుతుంది.

గిరి మౌనంగా గదిలోకి వెళ్లిపోయాడు.

●●●

"అన్నయ్యా!" ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు వినిపించింది అమ్మన్న గొంతు.

మంచానికి బల్లిలా అతుక్కుపోయిన అమ్మన్నని గుర్తుపట్టలేకపోయాడు గిరి. ఒక్క ఏడాదిలోనే ఇంత మార్పా! మసకబారిన కళ్లని నులుపుకుని మరీ చూశాడు. బాలా త్రిపుర సుందరిలా ఉండే అమ్మన్న మొహం ఇదేనా?

హాస్పిటల్ గది ముందు ఎదురయిన శివానందం కళ్లతోనే పలకరించాడు. అతను కూడా చాలా డీలా పడిపోయాడు. అటువంటి జబ్బులు రానేకూడదు. వస్తే కుటుంబం అంతటికీ క్షోభే. అందరికీ మానసిక, శారీరిక శ్రమే. అంత శ్రమపడీ ఫలితం?

శివానందం నిరంతరం భగవన్నామ స్మరణలోనే ఉంటాడు. మరి ఎందుకిలా? సంచిత కర్మలంటే ఇవేనా?

"ఫోన్ చెయ్యక తప్పలేదు బావా! ఒకటే గొడవ పెట్టేస్తోంది. అందుకే మీకు శ్రమ ఇచ్చాను." నీరసంగా అన్నాడు శివానందం.

అతని చెయ్యిపట్టుకుని నిమిరాడు గిరి, ఏం ఫరవాలేదన్నట్లుగా.

కుర్చీ జరుపుకుని అమ్మన్న దగ్గరగా కూర్చుని, చెల్లెలి చెయ్యి తన రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. చీపురు పుల్లలా ఉన్న చేతిని చూస్తుంటే దుఃఖం ఆగలేదు. తమాయించుకుని అడగబోయాడు. ఏం అడగాలీ?

"ఏమ్మా" గొంతు పెగల్లేదు.

"వదినా, స్మితా బాగున్నారా అన్నయ్యా?"

తలుపాడు గిరి గుంభ్రంగా.

"అమెరికాలో బాగుందా? స్థిరపడ్డారా?"

"కొంచెం టైం పడుతుంది అమ్మన్నా! ఫరవాలేదు. లోటైతే లేదు దేనికీ."

"చాలా సంతోషంగా ఉందన్నా! నా మాట మన్నించి వచ్చావు. పిల్లలకి నువ్వంటే ఎంతో ఇష్టం. వాళ్లనో కంట కనిపెడుతూ ఉండు. అదే ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినప్పుడు. బంధుత్వాలు నిలుపుకుంటేనే మన ఉనికికి అర్థం."

అమ్మన్న ఆ తరువాత మాట్లాడలేకపోయింది. కళ్లు మూసేసుకుంది.

"నొప్పి తెలియకుండా మార్ఫిన్ పాచ్‌లు పెట్టారు మామయ్యా. ఎప్పుడూ మత్తులోనే ఉంటుంది." అమ్మన్న పెద్ద కూతురు అంది.

గిరి రోజూ వెళ్లి పగలంతా తన దగ్గర కూర్చుని వచ్చేవాడు. గిరిని చూడగానే అమ్మన్న మొహంలోకి కాంతి వచ్చేది.

పది రోజులు గడిచాయి. విష్ణు వాళ్ల ఇంట్లోనే ఉంటున్నాడు. లలిత చాలా మర్యాదగా చూస్తోంది. విష్ణు పొద్దున్నే సైట్ దగ్గరికి వెళ్లిపోయి, గిరికి కారు పంపుతున్నాడు.

ఆ రోజు, తెల్లవారు ఝామునే ఫోన్. గిరి చటుక్కున లేచి తీశాడు.

"బావా! అంతా అయిపోయింది." శివానందం.

అనుకుంటున్నదే అయినా, మెదడంతా మొద్దుబారినట్లు అవగా సోఫాలో చతికిల పడ్డాడు గిరి.

ఇంతేనా జీవితం. ఎక్కడికెళ్లిపోతాయి అనుబంధాలన్నీ?

●●●

**అమెరికా ప్రయాణం దగ్గర పడుతోంది.** గిరి సామాన్లు సర్దుకుంటున్నాడు.. తను రావడం మంచిదే అయిందనుకుంటూ..

అమ్మన్న ఆఖరి కోరిక.. వాళ్ల ఊరికే తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లయి మనవలు, పిల్లా పాపల్తో కళకళ్లాడుతూ ఉండే కుటుంబం. భార్య పోగానే శివానందం లోకమంతా శూన్యంగా మారిపోయినట్లయి, స్తబ్దుగా అయిపోయాడు.

గిరి రావడం వల్ల అతనికి కొంత బలం వచ్చినట్లయింది.

"నీకు తెలియని వేదాంతం కాదు బావా! మనస్సు స్థిమిత పరచుకోవాలి. ఎంతో మందికి అన్నీ బోధించి ఉంటావు.. మన వరకూ వస్తే, చెప్పటం ఇంత తేలికా అనిపిస్తుంది.. నిజమే!" కొంత వైరాగ్యం చెప్పి, వేదాంతం వల్లించీ.. అవసరమైనప్పుడు కోప్పడీ, శివానందాన్ని కొంత వరకూ మామూలుగా చెయ్యగలిగాడు.

విష్ణు కూడా చాలా ఆదుకున్నాడు. అతను బాగా నెమ్మదిగా మాట్లాడ్డం అలవాటు చేసుకున్నాడు. కోపం కూడా బాగా తగ్గింది. బంధువులు అందరూ వచ్చారు.

"అమ్మన్న ఇమ్మంది.. " శివానందం యాభై వేలకి డ్రాఫ్ట్ ఇవ్వబోయాడు.

"ఛా.. ఆడపిల్ల దగ్గర తీసుకోవడమా!

"ఫరవాలేదు బావా.. ఆ మాత్రం టికెట్ కొనగలము.. అసలు కొద్ది కాలం అయ్యాక, మీ ఇద్దరినీ తీసుకెళ్దామనుకున్నాము. " గిరి ససేమిరా తీసుకోనన్నాడు.

"లేదు.. మీరు తీసుకోకపోతే అమ్మన్న నన్ను క్షమించదు. స్మిత పెళ్లికి నాకు టికెట్ కొందువుగానిలే." బలవంతంగా చేతిలో పెట్టిన శివానందం ఔదార్యానికి కళ్లు చెమర్చాయి గిరికీ, విష్ణుకీ.

అది చాలనట్లు..

"అమ్మన్న ఇమ్మంది మేనకోడలికి.. " అంటూ శివానందం ఒక జత బంగారు గాజులు, ఒక గొలుసు కూడా ఇచ్చాడు.

"నేనెప్పుడూ ఆడపడుచు అని చిన్నమెత్తు బంగారం పెట్టలేదు.. ఇవెలా తీసుకోగలను.." గిరి ఆశ్చర్యంగా చూసి, మొహమాటంగా అన్నాడు గొంతు రాచుకు పోయినట్లవగా.

"నేను బాగా సంపాదించాను బావా! అంత కంటే అమ్మన్న నిర్వాకం ఎక్కువ అని చెప్పచ్చు. చాలా చోట్ల.. వైజాగ్, హైద్రాబాద్‌లో శివార్లలో స్థలాలు కొనేది. అందరూ ప్లాట్లు చేసేటప్పుడు నన్ను పిలిచి పూజ చేయించే వారులే. గురువుగారికని చెప్పి ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఇచ్చే వారు. వాటన్నిటి ధరలూ ఎన్నో రెట్లు పెరిగాయి. ప్రతీ సంవత్సరం బంగారం కొనేది తప్పకుండా. ఇంతకీ అదృష్టం కలిసొచ్చిందనుకో! కాకపోతే అనుభవించడానికి అమ్మన్నకే ఆ అదృష్టం లేకపోయింది. " శివానందం గంభీరంగా అన్నాడు.

నిజమే.. గిరికి అమ్మన్న కూతురి పెళ్లి ఎలా జరిగిందో గుర్తుకొచ్చింది. అమ్మాయి ఇంజనీరింగ్ చదివింది. అల్లుడు డాక్టర్. చాలా వైభవంగా చేశారు. మంచి మనసున్న వారికి సాధారణంగా మంచే జరుగుతుంది. ఆయుర్దాయం మాత్రమే.. ముందే రాసిపెట్టేస్తాడు కదా ఆ సృష్టి కర్త.

"ఆడపిల్లలకి పుట్టింటి వాళ్లంటే ఎంతో అభిమానం ఉంటుంది. అది అన్నదమ్ములు అర్థం చేసుకుని వాళ్లకి కాస్త ప్రేమ పంచగలిగితే ఎంత బాగుంటుంది.. నా మటుకు నేను చూపవలసినంత ప్రేమ, అభిమానం చూప లేదనే అనుకుంటాను. తెలిసొచ్చే సరికి ఏమీ లేకుండా అయిపోయింది." గిరి బాధగా అన్నాడు.

"అలా అనుకోకు బావా! అభిమానం లేకుండానే వేల మైళ్ళు ప్రయాణం చేసి వచ్చావా చెప్పు!" ఓదార్చడానికి ప్రయత్నం చేశాడు శివానందం.

సామాన్లు సర్దుకుంటుంటే గాజులు, గొలుసు చూసి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు గిరి మళ్లీ.

ఇంక ఇండియాతో సంబంధ బాంధవ్యాలు వదులుకున్నట్లే.. ఎవరున్నారు తమకి! నిర్లిప్తంగా లేచి హాల్లోకి వచ్చాడు.

"గిరి బావా! అలా ఎప్పుడూ అనుకోకు.. మేమందరం ఉన్నాం. మీరు మళ్లీఇక్కడికే వచ్చి స్థిరపడాలి." విష్ణు, గిరి మనసులో మాట తెలిసినట్లు అన్నాడు.

విరక్తిగా నవ్వుకున్నాడు గిరి.

"చుట్టూ అందరూ ఉన్నా ఎవరూ లేనట్లే ఉన్నాను చిన్నప్పట్నుంచీ.. చుట్టూ నీళ్లున్నా తాగడానికి గుక్కెడు నీళ్లు లేని నడి సముద్రంలో ఉన్నట్లే ఉండేది, ఆప్యాయత కరవై. ఇంక ఇప్పుడు.. అదీ అమెరికాలో ఉంటూ.." మనసులో మాట పైకి రానివ్వలేదు.

నిశ్శబ్దంగా, స్తబ్దుగా ఉన్న హాల్లో ఫోన్ రింగ్ విని ఉలిక్కిపడ్డారు ఇద్దరూ.

దగ్గర్లో ఉన్న గిరి ఎత్తాడు ఫోన్.

"ఏరా గిరిధారీ! నేను ఇంకా ఉన్నానన్నమాట మర్చిపోయారా? అంత కష్టం వచ్చినప్పుడు ఒక్క ఫోను కొడ్తే ఏం పోయిందిరా? అంతేలే.. నీరు పల్లమెరుగు అని ఊరికే అన్నారా! నాకున్న ప్రేమ, అభిమానం మీకెందుకుంటాయి? నువ్వు అమెరికానించి వచ్చినట్లు కూడా నిన్నే తెలిసింది. అల్లాగే వెళ్లిపోదామనుకున్నావు కదూ.." బంగారత్త ఐదు నిముషాలు ఆపకుండా వాయించింది.

గిరి ఏమీ మాట్లాడలేకపోయాడు. తప్పు చేసినవాడిలా తల దించుకున్నాడు. బంగారత్తకి కనిపించదు కానీ.. మనో నేత్రంతో చూసేస్తుంది.

"అలా తలొంచుకోనక్కర్లేదు రా! ఆ మాత్రం అర్థం చేసుకోగలను. కాకపోతే.. ఒక్కసారి ఇక్కడికి వచ్చి వెళ్తే సంతోషిస్తా. మీ మావయ్యకి ఏమీ బావోలేదు. ఇవేళో రేపో అన్నట్లే ఉంది. టాక్సీ చేసుకునొచ్చేయ్. డబ్బు గురించి ఆలోచించకు."

ఎవరూ లేరనుకున్న క్షణమే బంగారత్త ఫోన్. ఆవిడని ఎలా మర్చిపోయాడు? అసలు తనలో మానవత్వం మిగిలిందా? ఏదో మేఘం కమ్మినట్లయిపోయింది మెదడంతా.

"తప్పే చేశానత్తా! ఇదిగో ఇప్పుడే బయలుదేరి వచ్చేస్తున్నా. ఇంకా నాల్గు రోజులుందిలే నా ప్రయాణానికి. ఎలా ఉన్నారు మీరు?"

"బానే ఉన్నాం..రా..! ఇక్కడంతా మమ్మల్ని కళ్లల్లో పెట్టి చూసుకుంటున్నారు. మాక్కూడా కుళాయిలొచ్చేశాయి ఇంట్లోకే.. మోటారదీ పెట్టించాను. నీకు అంతా సదుపాయంగా ఉంటుంది. వస్తావు కదూ!" కొంచెం ఝుంకారం తగ్గినట్లనిపించింది ఆవిడ గొంతులో.

ఏం సంబంధముందని ఆవిడకంత ఆప్యాయత? నిజానికి తనకి అందుకోడానికి అర్హత ఉందా? గత ఏడాదిలో ఒక్క ఫోను కూడా చెయ్యలేదు..

ఎలా మర్చిపోగలిగాడు? కనీసం యమున అయినా గుర్తు చెయ్యొచ్చు కదా!

ఛా.. ఎంత తెలివి తక్కువగా ఆలోచిస్తున్నాడు. యమునకి ఊపిరి పీల్చడానికి మాత్రమే సమయం ఉందని తెలియదా? అంత ఖాళీగా కూర్చున్న తనే.. ఒక్కోసారి అనిపిస్తుంటుంది.. తను మనిషేనా?మరా? అని.

గిరి ఫోన్ పెట్టేసి తల మోకాళ్ల మీద పెట్టుకుని కన్నీళ్లు కార్చసాగాడు.

విష్ణు లేచి వెళ్లి, గిరి పక్కన కూర్చుని భుజం మీద చెయ్యి వేశాడు.

"ఫరవాలేదు బావా! మీ జీవన పోరాటంలో మీరే మునగానాం, తేలానాం. ఇంక మిగిలిన విషయాలేం గుర్తుంటాయి? మీ బంగారత్త అర్థం చేసుకుంటుంది."

●●●

21

హైదరాబాద్‌లో రాత్రి బస్సెక్కి పొద్దున్నే రావులపాలెంలో దిగాడు గిరి. అక్కడ్నుంచి ర్యాలికి గంట గంటకీ బస్సులే. అప్పుడే మొదటి బస్సు వెళ్లిందంటే, ఎదురుకుండా ఉన్న హోటల్కి వెళ్లి మొహం కడుక్కొని కాఫీ తాగుతున్నాడు.

ఒక్కళ్లు కూడా తెలిసిన వాళ్లు కనిపించలేదు..

ఎవరుంటారు.. నవ్వుకున్నాడు గిరి. ఏనాడయింది ఊరొదిలి? ఎవరైనా కనిపించినా గుర్తు పట్టగలరా?

"బాబూ! మీరు ఎవరూ? ఎక్కడో చూసినట్లుంది"

హోటల్లో తను కూర్చున్న బల్ల మీదికి వంగి ఒక పెద్దాయన నవ్వుతూ పలుకరించాడు.

గిరి తలెత్తి చూశాడు. ఎనభై ఏళ్ల పైనే ఉంటాయి. నున్నటి గుండు. ఎర్రని శాలువా కప్పుకున్నాడు. పళ్లన్నీ ఊడిపోయాయి. మాట్లాడుతుంటే.. నవ్వుతుంటే పసిపిల్లాడిలా ఉన్నాడు.

"ఇప్పుడే బస్సు దిగానండి. ర్యాలి వెళ్లాలి. మీకు నేను తెలిసే అవకాశం.."

"దీక్షితులి మనవడివి కాదురా! తెలీపోడమేవిటీ. నువ్వు నా దగ్గరే చదూకున్నావు. నీకు అక్షరాభ్యాసం చేసింది నేనే. అచ్చం దీక్షితుల్ని చూసినట్టే ఉంది. మాట కూడా.. అవునూ.. అమెరికాలో ఉంటున్నావుట కదూ! నువ్వు వస్తావని బంగారి అంటోంది. "

గిరి అసంకల్పితంగా లేచి నిలుచున్నాడు.

శర్మగారు.. ఈ విధంగా కలుస్తారని కలలో కూడా ఊహించలేదు. బంగారత్తకి పింతల్లి కొడుకు. ఆవిడకి కష్టంలో మాట సహాయం చేసినవాడు. తనంటే కూడా ఎంతో అభిమానం చూపించేవాడు.

నయానా భయానా అక్షరాలు నేర్పించిన తొలి గురువు. సింగిల్ టీచర్ బళ్లో పెద్దబాలశిక్ష కంఠతా పెట్టించిన మేష్టారు. గుర్తు పట్టలేకపోడం క్షమించరాని తప్పే!

వంగుని కాళ్లకి నమస్కారం చేశాడు, అక్కడే. బజారని కూడా సంకోచించకుండా.

"అయ్యయ్యో! వద్దురా. ఏనాడయింది! నువ్వు గుర్తు పట్టలేకపోడం న్యాయమే. నేను వృద్ధుడ్నయిపోలా. నువ్వంటే మీ తాతగారిలా ఉన్నావు. పైగా వస్తావని తెలుసు. అందుకే చటుక్కున నే పలకరించేశా. పద.. మనూరికి వెళ్దాం."

"మనూరా..?"

"అదేవిట్రా వెధవన్నర వెధవానీ! నువ్వు కాదనుకుంటే మాత్రం కాకపోతుందా? పద.." శర్మ మేష్టారు నిటారుగా నిలుచుని గిరి చెయ్యి పట్టుకున్నారు.

"మీరు ఇంత దూరం రాగలిగారా మేష్టారూ?"

"ఏవంత పెద్ద కష్టమా! ఆ మాత్రం తిరక్కపోతే శరీరం మరీ మొరాయించదూ.. నడు నడు."

ఇద్దరూ బస్సెక్కారు. ఎర్రమట్టి, కంకర్రోడ్డు ఉండేది. రాళ్లు పొడుచుకొచ్చి ఉండేవి. బాగా చేసి తార్రోడ్డు వేశారు. ఇదివరకట్లా దుమ్ము రేగట్లేదు.

గిరి కళ్లు పెద్దవి చేసి కిటికీలోంచి చూడసాగాడు.

అమెరికా వెళ్లే ముందు హడావుడిగా వచ్చాడు. అంత గమనించలేదు కానీ, చుట్టూ తను బండి తొట్లో కూర్చుని వెళ్లినప్పట్లాగే ఉంది. దారిలో చెట్లు, పొలాలూ అలాగే ఉన్నాయి. ఇదివరకు అక్కడా అక్కడా కనిపించే మనుషులు, బళ్లు.. ఇప్పుడు ఎక్కడ చూసినా రకరకాల వాహనాలు. ఝూమ్మని స్కూటర్లు.. కార్లు. బస్సులు సరేసరి.

"బాగా అభి వృద్ధి కనిపిస్తోంది కాదురా! ఇళ్లల్లోకి టి.వీలు, టేప్ రికార్డర్లు వచ్చేశాయి. ఇంక బ్రాందీ షాపులు.. అవునూ! నువ్వా చలి దేశంలో కాస్త పుచ్చుకుంటూ ఉంటావా?"

"లేదు మాష్టారూ! ఇది వరకు సిగరెట్లు కాల్చే వాడ్ని. ఇప్పుడు అది కూడా మానేశాను. కాసింత బాధ్యతగానే ఉంటున్నా.." సిగ్గు పడుతున్నట్లు నవ్వాడు.

"తప్పులు చాలా మంది చేస్తారు. తెలుసుకుని సరిదిద్దుకున్నవాడే ఎన్నదగినవాడు. మంచిదిరా గిరీ! అమ్మన్న గురించి తెలిసింది. దానిక్కూడా నేనే పలక మీద 'ఓం నమశ్శివాయ' దిద్దించాను. ఏం చేస్తాం.. ఎవరికి పిలుపొస్తే వాళ్లు వెళ్లి పోవలసిందే ఎంతో అణకువగా, ఒబ్బిడిగా ఉండేది. ముఖ్యంగా నువ్వంటే ఎంతో ప్రేమ. నువ్వు చిన్నతనంలో చెప్పకుండా వెళ్లి పోయావు చూడు. ఎన్నో రోజులు ఏడ్చింది. చివరికి, నీ సంగతి విని మీ తాతగారు చెప్పే వరకూ వాళ్లమ్మని సాధిస్తూనే ఉండేదనుకో!" శర్మగారు విచారంగా అన్నారు.

"నేనే తన గురించి పట్టించు కోలేదు మాష్టారూ! చెల్లాయి నేనంటే కొట్టుకు పోతుండేది."

"ఫరవాలేదు లేరా. నీ పరిస్థితి అటువంటిది. నీ ఓరిమి మాత్రం ఎంతకాలం.. ఏదో ఒక ఇంటి వాడవయ్యావు. అదే ఆనందం మాకు. మీ చుట్టాలెవరూ ఇక్కడ లేరు. అస్సలు మనిళ్లల్లో కుర్రకారెవరూ లేరు. పెద్దవాళ్లవే పట్టుకు వేళ్లాడుతున్నాం.. ఎక్కడికీ వెళ్లలేక."

"గిరిధారీ! వచ్చావుట్రా.. నా కోసం మళ్లీ నీ పంతం వదిలేసుకున్నావా?" రెండు చేతులూ పట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్లింది బంగారత్త. కొద్దిగా నడ్డి వంగింది కానీ ఏమంత మార్పు లేదు. అదే ముదురు రంగు బండార్లంక చీర కచ్చపోసి కట్టి, నుదుటి మీద నయాపైసంత కుంకం బొట్టు, పసుపు రాసిన మెరిసిపోతున్న మొహం.. పార్వతీ దేవి అవతారంలా ఉంది.

అప్రయత్నంగా పాదాలంటి నమస్కారం చేశాడు గిరి.

ఆవిడకి పాత సంగతులన్నీ ఎంత గుర్తో.. గిరి పెదవులమీద కదలాడిన నవ్వు చూశారు శర్మగారు.

"బంగారికి వచ్చే జన్మలో కూడా జ్ఞాపకముంటాయిరా సంగతులన్నీ. పెద్ద వ్యవహార కర్త అయ్యేది.. అవకాశం లేక కానీ."

"పోరా.. మరీ చెప్తావు. ఇవేళ నీకూ, మీ ఆవిడకీ ఇక్కడే భోయనాలు. పెందరాళే వచ్చెయ్యండి."

వెనక్కి తిరిగిన శర్మగారి శాలువా, వీపుమీద పక్కకి తొలగింది.. చొక్కా అంతా చిరుగులు.. బంగారమ్మ కంట పడనే పడ్డాయి.

"అదేవిట్రా శర్మా! నాతో ఒక్క మాట చెప్పద్దా.. చిరుగుల గుడ్డలేసుకుని తిరుగుతున్నావా? ఈ మధ్యన నే బైటికి రావట్లే.. మీ బావ ఏవో లేవట్లే కదా! ఓరినీ ఓహాయిత్యం కూలా! గిరీ.. నువ్వు మాష్టారిని ఆనక బజారుకి తీసుకెళ్లి నాలుగు చొక్కాగుడ్డలు, రెండు పంచెల్చాపులు తీసుకురా.. అలాగే దర్జీ వాడికిచ్చేసి రా." చిక్కంలోంచి వెయ్యి రూపాయల నోటు తీసి ఇచ్చింది.

"చూసుకోలేదు లేవే.. గోల చెయ్యకు." శర్మగారు నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లిపోయారు. అప్పుడు.. ఆయన కొద్దిగా వంగినట్లు అనిపించింది గిరికి.

"ఏమయిందత్తా? మాష్టారెందుకలా ఉన్నారు? జరుగు బాటుక్కూడా కష్టంగా ఉందా?"

"ఏవుంది చెప్పుకోడానికి.. ఇక్కడ ఇంటింటా ఉండే కథలే. శర్మది పెన్షన్ లేని ఉద్యోగం. ఓపికున్నన్నాళ్లు ప్రైవేట్లు చెప్పుకుని కాలక్షేపం చేశాడు. కొడుకులిద్దరూ అమలాపురంలో ఒకడు, కాకినాట్లో ఒకడు మాష్టర్లే. వాళ్లవీ బొటాబొటీ బతుకులు. సొంతిల్లుందికదా.. ఈ ఘటాలిక్కడే అని వీళ్లిద్దరూ వెళ్లరు. ఇదిగో.. ఇలా తినీ తినకా, బట్ట కట్టీ కట్టకా కాలక్షేపం. నా లాంటి వాళ్లనడగడానికి అభిమానం."

"ఎంతో మందికి విద్యాదానం చేసిన గురువుల పరిస్థితులిలా ఉంటే.. ఏం చెప్పుకోవాలి?"

"ఇవన్నీ ఇక్కడ మామూలే కానీ. మీ సంగతులు చెప్పు. అమ్మన్న సంగతి సరే.. ఏం చేస్తాం? ఆయుర్దాయం లేదు. యమున, నీ కూతురు బాగున్నారా? అక్కడ ఏం చేస్తున్నావు?" బంగారత్త మండువాలోకి నడుస్తూ అడిగింది.

"బాగానే ఉన్నారు.." గిరి తన సంగతి చెప్పాడు.

"అయితే తాతగారి వారసత్వం కొనసాగిస్తున్నావన్నమాట. చాలా ఆనందంగా ఉందిరా. ఆయన ఆశీస్సులు నీ కెప్పుడూ ఉంటాయి. వెళ్లి స్నానం చేసిరా. బాత్రూంలూ అవీ అన్నీ కట్టించాను."

ర్యాలిలో రెండ్రోజులుండి వెళ్దామనుకున్నాడు గిరి.

బంగారత్త చెప్పినట్లు శర్మగారికి బట్టలు కొని టైలర్ కిచ్చేశాడు.

జగన్మోహినీ కేశవస్వామి గుడికెళ్లి పూజ చేయించాడు. దీక్షితులుగారి శిష్యుడు శాస్త్రులు అక్కడ పూజారి. గిరి కంటే చిన్నవాడు. శ్రద్ధగా చేశాడు. తనకి అంతా తెలిసిన పూజా విధానమే అయినా గిరి ఏమీ తెలియనట్లు కూర్చుని గమనించాడు.

ఫరవాలేదు.. తాతగారు బాగా ట్రైనింగ్ ఇచ్చారు.

ప్రయాణం రోజున శివాలయం వెళ్లి అభిషేకం చేయిద్దామని కూర్చున్నాడు.

"గిరిధారీ!" బంగారత్త ఆదరాబాదరా వచ్చేసింది.

"మీ మావయ్య పలకట్లేదురా.. నాకేదో గాభరాగా ఉంది."

ఎక్కడిదక్కడ వదిలేసి పరుగెత్తాడు గిరి.

●●●

గిరి అమెరికా ప్రయాణం అయోమయంలో పడింది.

ఒంటరిగా కూర్చున్న గిరి దగ్గరికి శర్మ మాష్టారు వచ్చారు. ఊరు ఊరంతా బంగారత్త ఇంటి ముంగిటే ఉంది.

"గిరీ! మీ బంగారత్తకి సంకల్ప బలం చాలా ఉంది. నిన్ను స్వంత కొడుకులా భావించింది. నీ చేతే తామిద్దరి అంత్యక్రియలూ చేయించుకోవాలని తన కోరిక. అలాగే నిన్ను సమయానికి రప్పించుకుంది. ఆవిడ బావగారి మనుమలు ఉన్నారు కానీ, సంబంధ బాంధవ్యాలు అంతంత మాత్రమే.. నీకు తెలియంది కాదు. లే.. లేచి కార్యక్రమంలోకి దిగు."

గిరి శూన్యంలోకి చూసినట్లు చూశాడు.

బంగారత్త పిలవగానే గుడిలోంచి వచ్చిన గిరికి మావయ్య చలనం లేని శరీరం కనిపించింది. ఊరందరికే కబురు అందేలోగా, మండువాలో గోడ కానుకుని కూర్చున్న బంగారత్త కూడా ఉలకడం మానేసింది.

"పుణ్యాత్మురాలు.. సునాయాసంగా వెళ్లిపోయింది." ఆచారిగారు వచ్చి, నాడి చూసి చెప్పారు.

నాలుగురోజుల్లో అమెరికా విమానం ఎక్కాలి. ఇప్పుడు.. ఇలా ఐతే ఏం చెయ్యాలి? సలహా ఇవ్వడానికి యమున కూడా లేదు.

"లే.. లేచి ఏం చెయ్యాలో చూడు. మీ విష్ణు బావకి ఫోన్ చెయ్యి. ఆయన, మీ బావ మరిదీ కలిసి నీ ప్రయాణం సంగతి చూసుకుంటారు." శర్మగారు గిరి చెయ్యి పట్టుకుని లేపారు.

యాంత్రికంగా శర్మగారు చెప్పినట్లు చేస్తున్నాడు గిరి. బంగారత్త చుట్టాలు చెవులు కొరుక్కున్నా పైకి ఏమీ మాట్లాడలేదు.

పన్నెండో రోజుకి విష్ణు వచ్చాడు గిరికి బట్టలు తీసుకుని. అంతా యధావిధిగా చేశారు. ఆ రోజే శర్మగారు బంగారత్త వీలునామా తెప్పించారు, రావులపాలెం ప్లీడరు గారి దగ్గర్నుంచి.

"చాలా తెలివిగా వ్యవహారం జరిపించుకునేది బంగారి. అయివేజులు జాగ్రత్తగా వాడి, ఆస్థి బాగా పెంచింది. బీదా బిక్కీని అవసరానికి ఆదుకునేది. మొత్తం వీలునామా అంతా పక్కాగా రాయించింది. ఎవరూ ఏమీ అనే అవకాశం లేదు. నువ్వేం బెంగెట్టుకోకురా గిరీ!" శర్మ మాష్టారు ఊరడించారు, ఊర్లో అంతా ఏమనుకుంటారో అని భయపడుతున్న గిరిని.

ఇల్లు కాక, పెరిగిన ధరల దృష్ట్యా బంగారమ్మగారి పొలాలు, తోటలూ నలభై లక్షలు పైగా చేస్తాయని విలువ కట్టారు. మొత్తం గిరి ఆజమాయిషీ కింద, ర్యాలిలో వృద్ధాశ్రమం.. అదీ తన ఇంట్లో పెట్టాలని విల్లు రాసిందావిడ.

"గిరిధారి అమెరికా వెళ్లిపోతున్నాడు కనుక వాడు చెప్పిన ఎవరైనా నడిపించచ్చు. కానీ ఏం జరిగినా గిరి అనుమతితోనే జరగాలి."

వీలునామా విన్న గిరి మొహం ఎర్రగా అయిపోయింది.

ఇంత బాధ్యత తన మీదా..

ఇదంతా ఎప్పుడు చెయ్యాలి.. తను అమెరికా ఎప్పుడెళ్లాలి.. తనొక్కడూ ఏం చెయగలడూ?

యమునతో ఫోన్‌లో మాట్లాడాడు.

"అయ్యో! బంగారత్త అలా చేశారా? ఏది ఎందుకు జరుగుతుందో.. మన చేతిలో ఏమీ లేదు. రెండు మూడు నెలల వరకూ ఫరవాలేదు! మీ సెక్యూరిటీ పని ఎక్కడికీ పోదు.. అలాగే వ్రతాలూ, పూజలూ కూడా. గురువుగారు వచ్చాకే పెట్టుకుంటాం.. అంత అర్జెంటేం లేదంటున్నారుణ శిష్యులంతా."

"అందరినీ అడిగానని చెప్పు యమునా! చాలా సహాయం చేస్తున్నారు."

"తప్పకుండా. నిదానంగా బంగారత్త ఇష్ట ప్రకారం అంతా చేసి రండి."

యమునతో మాట్లాడాక ధైర్యం పుంజుకున్నాడు గిరి.

శర్మగారి సలహా మీద, గుడిలో పూజారిగా ఉన్న శాస్త్రులుగారిని మానేజరుగా పెట్టాడు. వారానికోసారి ఫోన్‌లో మాట్లాడుతుంటానని చెప్పాడు. ఆశ్రమంలో చేరిన మొదటి దంపతులు శర్మగారు, భార్య. బంగారత్త కోరిక కూడా అదే

గిరి పెట్టిన ఖర్చంతా తీసుకోమని కూడా రాసింది బంగారత్త. ఆవిడ కొంగుకున్న బీరువా తాళాలు ఉపయోగించి, శర్మగారి సమక్షంలో తలుపులు తీశాడు. దగ్గర దగ్గర లక్ష రూపాయల వరకు ఉన్నాయి.

గిరి వెళ్లేలోగా ఇద్దరు దంపతులు చేరారు. వంటకి, శుభ్రం చేసే పనికీ నడివయసులో ఉన్న నారాయణ, అతని భార్య సీత దొరికారు.

●●●

"బంగారమ్మగారు మాకెంతో చేశారండి. వారి వల్లనే మా పిల్లలిద్దరూ చదూకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇప్పట్నుంచీ వాళ్ల మీద పడ్డం ఎందుకు.. ఆశ్రమం మేం చూసుకుంటాం.." సంగతి విని వాళ్లంతట వాళ్లే వచ్చేశారు.

ఆశ్రమానికి కావలసిన విధంగా గదులు మార్పులు చేయించాడు గిరి. మండువా చుట్టూ ఎనిమిది గదులు, వాటికి ఆనుకుని బాత్రూములు.. ఒక్కో గదికి ఇద్దరు ఉండేట్లు మంచాలు, రెండేసి బల్లలు కుర్చీలు, రెండు అలమార్లు.. మరీ ఆధునికంగా కాకపోయినా

సదుపాయంగా ఉన్నాయి ఏర్పాట్లు.

వెనుక ఉన్న పెద్ద పెరటి వరండా భోజనాల హాలు కింద.. దానికి ఒక పక్క వంటగది, ఇంకో పక్క సామాన్లు పెట్టుకునే కొట్టు గది.

మండువా ముందు హాల్లోనే పూజకి అనువుగా అమర్చాడు. పది మంది వరకూ హాయిగా కూర్చుని ధ్యానం చేసుకోవచ్చు. హాలుకి ఆనుకుని ఉన్నది ఆఫీస్ గది. అందులో కంప్యూటర్.. కంప్యూటర్ తెలిసిన శాస్త్రులుగారి అబ్బాయిని, ప్రతీ నెలా అకౌంట్స్ చూసేలా ఏర్పాటు చేశాడు.. పార్ట్ టైమ్కి.

అవన్నీ అయేటప్పటికి మూడు నెలలు పట్టింది. బాంక్ డిపాజిట్లన్నింటి మీదా గిరిని నామినీ కింద పెట్టింది బంగారమ్మ. ఎందుకంత నమ్మకం తన మీద?

చిన్నప్పటి అల్లరి పిల్లాడికి ఇంతటి బాధ్యత అప్పచెప్పిందంటే నమ్మలేక పోతున్నాడు గిరి. ర్యాలిలోనే ఉంటే తనని పెంచుకునేదేమో! అప్పుడు వేరేలా ఉండేదేమో జీవితం..

హుూ.. గట్టిగా నిట్టూర్చాడు.

"బుద్ధి కర్మానుసారిణీ" తాతగారు ఎప్పుడూ వల్లె వేస్తుండే సూక్తి..

ఏది ఏమైనా బంగారత్త సంకల్పాన్ని కొంత వరకైనా నెరవేర్చడం తన ధర్మం. సంవత్సరానికి ఒక్క సారి ర్యాలి వచ్చి ఒక నెల గడపాలని నిర్ణయించుకున్నాడు.

ఏమైనా ఇంక ర్యాలి రావద్దనుకున్న తన శపథాన్ని ఈ విధంగా నీరు కార్చేశాడు ఆ పైవాడు. అంతా ఆయననుకున్నట్లు జరగాలి కానీ.. మానవ మాత్రుల పట్టింపులు.. పంతాలు.. వాటికి విలువ ఏముంటుంది?

తన జీవితం ఇంకా ఎన్ని మలుపులు తిరగాలో..

"గిరిధారీ!" పిలుపు విని ఉలిక్కిపడ్డాడు. ఒక్క బంగారత్తే అలా పిలుస్తుంది.

"నేనేరా.. నీ ప్రయాణం రేపే కాదూ!" శర్మగారు ఏవో పుస్తకాలు పట్టుకొచ్చారు.

" అవును మాష్టారూ! ఈ గది చూస్తుంటే ఏవో జ్ఞాపకాలు.. నా చిన్నతనం.. బంగారత్త ఇక్కడే నాకు బుద్ధులు చెప్తుండేది."

"నిజమేరా! నీ గురించి ఎంతో తాపత్రయపడేది. నిన్ను చూస్తుంటే దాని చిన్నతనం గుర్తుకొచ్చి, తనని తాను నీలో చూసుకునేది."

"అదేంటి మాష్టారూ? ఆదేం నాకు తెలీదే.." గిరి ఆశ్చర్యంగా అడిగాడు.

"నీకెలా తెలుస్తుందిరా! నాకే కొంచెం లీలగా గుర్తుంది. మా అమ్మకి అక్క కూతురే బంగారి.. నీకు తెలుసు కదా?"

అవునన్నట్లు తలూపి, కుతూహలంగా చూశాడు గిరి.

"మా దొడ్డమ్మ పోయేటప్పటికి బంగారికి మూడేళ్లట. మరి పౌరోహిత్యం చెయ్యాలంటే ధర్మపత్ని కావాలి కదా.. అందుకే పదమూడే రోజే మళ్లీ పెళ్లి చేశారు మా పెదనాన్నకి. అప్పట్నుంచీ దాని పాట్లు.. ఎందుకడుగుతావులే, మీ సవత్తల్లి సూరమ్మ వెయ్యి రెట్లు నయం. చిన్ని చిన్ని చేతులతో పొయ్యి అలికించడం దగ్గర్నుంచీ అన్ని పనులూ చేయించేది. కత్తి పీటతో ఎన్ని సార్లు వేలు కోసుకుందో లెక్కే లేదు. చాలా కష్టాలు పడిందిలే. చివరికి అమాయకుడు, పిచ్చివాడూ.. ఎందుకూ పనికిరాని వాడూ.. మా బావ కిచ్చి పన్నెండేళ్లకి పెళ్లి చేసేసింది.. సవత్తల్లి మత్సరం అలా ఉండేది. ఆ తరువాత అత్తవారింట్లో.."

"అక్కడ్నుంచీ నాకంతా తెలుసు మాష్టారూ! నా చిన్నప్పుడు.. ఇప్పటికీ అంతా కళ్లకి కట్టినట్లుంది. మాకు వాళ్లకి ఒకటే నుయ్యి ఉండేది. అప్పుడే, నా వాతలు చూసి బంగారత్తా.. ఆవిడ అవస్థలూ, మావయ్య దెబ్బలూ చూసి నేనూ.. అసలు ఆవిధంగానే మాకు ఒకరి మీద ఒకరికి అభిమానం ఏర్పడిందేమో!"

"నిజమేరా! అంతే అయుంటుంది. అదీకాక.. బంగారి మనసు వెన్న. ఎవరికే ఆపద వచ్చినా ఆంజనేయుడిలా వెళ్లి ఆదుకునేది. అందుకే ఆస్థి అంతా దాయాదుల పాలవకుండా ఇలా చేసింది. ఎవర్ని చూడమన్నా సరిగ్గా చెయ్యరేమోనని భయం. తను అనుకున్నది నెరవేరాలంటే నువ్వే సరైన వాడవని, దూరా భారం అయినా నీ మీద పెట్టింది."

"నా శాయ శక్తులా న్యాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను మాష్టారూ!"

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను.. మీ పిన్ని సూరమ్మ ఉత్తరం వేసిందిరా గిరీ!"

ముడుచుకుపోయిన గిరి మొహం చూసి ఎందుకు చెప్పానా అనుకున్నారు శర్మగారు. కానీ.. వెంటనే తేరుకుని మొహం ప్రసన్నంగా పెట్టాడు గిరి. అమ్మన్న పోయినప్పుడు కలిసినా కూడా ఒకటి రెండు మాటలు తప్ప ఎక్కువ మాట్లాడలేదు.. కాలం ఎంత గడిచినా కొన్ని గాయాల్ని మాన్పలేదేమో!

"బాగా పెద్దదయిపోయింది రా! కళ్లు సరిగ్గా ఆనవుట. శుక్లాలు ఆపరేషన్ చెయ్యాలిట. అన్నదమ్ములు అందరూ వెళ్లి పోయారు. తరువాతి తరం వాళ్లకి ఈ ముసలమ్మ భారంగా ఉంది. అమ్మన్న ఉన్నప్పుడు దాని దగ్గర కాలక్షేపం చేసేది. ఇప్పుడు.. శివానందం ఏమనడు కానీ, ఆవిడకే మొహమాటంగా ఉందిట. ఆల్లుడినే ఎవరో చూడాలి.. ఇంక తన బాధ్యత కూడా ఎలా పెట్టగలనని మొత్తుకుంది. మన ఆశ్రమంలో చేరడానికి నువ్వు ఒప్పుకుంటావేమో అడగమంది. తను చేసిన తప్పుల్ని పెద్దమనసు చేసుకుని క్షమించమని రాయించింది. అల్లుడు కొంత డబ్బు సాయం చెయ్యగలడేమో అడుగుతానంది, మనం ఒప్పుకుంటే. అదే, డిపాజిట్కి దానికీ.." శర్మగారు ఆపేశారు, ఎర్రగా అయిన గిరి మొహం చూసి.

పెద్దమనసు.. హు! ఉందా తనకి? తనూ అరవయ్యో పడికి దగ్గర పడుతున్నాడు. ఇంకా ఎందుకీ పంతాలు.. కోప తాపాలు?

"అమ్మన్న కోసం మీ పిన్నిని క్షమించరా గిరిధారీ!" బంగారత్త ఎక్కడ్నుంచో బోధిస్తున్నట్లు అనిపించింది.

ఒక్కసారి తలెత్తి ఆకాశంలోకి చూశాడు.. బంగారత్తకి నచ్చే పనే కదా! వృద్ధులు ఎవరైనా అన్నం లేకుండా అలమటించద్దనేగా ఆవిడ చెప్పింది. తప్పకుండా సంతోషిస్తుంది. ఎవరైనా ఎన్నాళ్లుండబోతారు.. పిలుపొస్తే వెళ్లాల్సిందే కదా! ఉన్నన్నాళ్లూ ఎందుకీ ఈర్ష్యా, అసూయా ద్వేషాలు?

అన్నన్ని పూజలు చేయిస్తే సరిపోలేదు.. తను ఎదగాలి. చిన్నపుడు కాలిన కడుపుని మర్చిపోవాలి.

"గిరీ!" శర్మగారు దగ్గరగా వచ్చి భుజం కుదిపారు.

గిరి ఉలిక్కిపడి చూశాడు. తనకి తెలియకుండానే కళ్లలోంచి కన్నీటి ధారలు. ఉన్నట్లుండి, తాతగారు, నాన్నమ్మ, తండ్రీ, అమ్మన్న గుర్తుకొచ్చారు. ఒకప్పుడు ఈ ఊర్లో నడయాడిన వాళ్లు.. కళ్లు తుడుచుకుని మాష్టారిని చూసి నవ్వాడు.

"ఏం లేదు మాష్టారూ! ఏవో జ్ఞాపకాలు.. అంతే. అలాగే. పిన్నిని ఇక్కడుండమందాం. ఆవిడ మా పిన్ని కాకపోయినట్లయితే చేర్చుకునే వాళ్లం కదా! ఇప్పుడు వద్దనడం ఎందుకు? రమ్మని రాయండి. నేను ఇవేళ బయలుదేరి వెళ్తున్నాను. నాలుగురోజుల తర్వాత అమెరికా! ఇక్కడి బాధ్యతంతా మీ మీదే పెడుతున్నా. జాగ్రత్తగా చూసుకోండి. తక్కువ పనేం ఉండదు. డాక్టర్ అవసరం ఉంటేనే కొత్తపేట తీసుకెళ్లాలి. టాక్సీ పిలిపించుకోండి. నేను కూడా అక్కడ్నుంచి డబ్బేమయినా అమర్చగలనేమో చూస్తాను."

"నువ్వు చాలా ఎక్కువ మనిషివిరా గిరిధారీ! అందుకే ఇంత బాధ్యత బంగారి నీకప్పజెప్పింది." శర్మగారు కండువాతో కళ్లు ఒత్తుకున్నారు.

## 22

"నిజంగా మాష్టారు అన్నట్లు ఎక్కువ మనిషినేనా?" విమానంలో కూర్చుని, కిటికీలోంచి తనతో ప్రయాణం చేస్తున్న మేఘాలనడిగాడు గిరి.

ఒక మేఘంలోంచి సన్నటి మెరుపు మెరిసింది.

అసలు.. తనేమిటి! ఇలా విమాన యానాలు చెయ్యడమేమిటి? కలలో కూడా ఆ ఆలోచన రాలేదు ఎప్పుడూ. ఏది జరిగినా, అంతా.. యమున తన జీవితంలోకి అడుగు పెట్టడం వల్లనే కదూ! వెళ్లగానే, వెంటనే నైట్ డ్యూటీలో చేరిపోవాలి. అలాగయినా యమునకి కాస్తంత విశ్రాంతి దొరుకుతుంది. కొంచెం కూడా విసుక్కోకుండా రోజుకి పదహారు గంటలు పని చేస్తోంది.

గిరి ఆలోచిస్తూనే ఉన్నాడు.. అంతలో..

ఉన్నట్లుండి కొంచెం ఆయాసం అనిపించింది. ఊపిరి అందనట్లు.. గాలి ఆడనట్లు..

ఎయిర్ హోస్టెస్ ని పిలిచే బటన్ నొక్కాడు.

"యస్ సర్!" చిరునవ్వుతో, నిద్ర కళ్లతో వచ్చిందొక యువతి.

మాట్లాడలేక.. చేత్తో సైగ చేశాడు.. తల పైకెత్తుతూ, ఊపిరి అందుకోడానికి ప్రయత్నిస్తూ.

"నిబులైజర్ ఉందా? పైనుంచి తియ్యమంటారా? ఆస్త్మా ఉందా?"

ఏదీ లేదన్నట్లు తల తిప్పాడు. గబగబా వెళ్లి.. ఎక్కడ్నుంచి తెచ్చిందో, నిబులైజర్ ఇచ్చి, నోట్లో పెట్టుకుని, లోపలికి పీల్చమంది.

కొంచెం సేపటికి తగ్గి మామూలుగా ఊపిరి పీల్చసాగాడు గిరి.

"ఇందులో ఏముంది?" నిబులైజర్ తీసుకుని వెళ్తున్న ఎయిర్ హోస్టెస్ని అడిగాడు.

"ఆక్సిజెన్, కొద్దిగా చల్లబర్చిన నీటి ఆవిరి. ఎమెర్జెన్సీకి.. ఒక్కోసారి ఆక్సిజెన్ తగ్గినప్పుడు కొంతమందికి ఈ ప్రాబ్లం వస్తే వాడుతాం. ఇప్పుడు ఎయిర్ ప్రెజర్ బాగానే ఉంది.. మీకు ఇలా అయిందంటే.. న్యూయార్క్ వెళ్లగానే డాక్టర్ని కన్సల్ట్ చెయ్యండి. మీకు బ్రీదింగ్ ప్రాబ్లం ఉంది. మెడిసిన్స్ వాడాలనుకుంటా."

తానొకటి తలుస్తే..

మన చేతిలో ఏముంది..

తలగడా సరిచేసుకుని కళ్లు మూసుకున్నాడు గిరి.

****

యమునకి చాలా సంతోషంగా ఉంది. గిరి సెక్యూరిటీ పనిలో చేరి ఒక నెల అయింది. రాడ్నీ రౌండ్స్కి వచ్చినప్పుడు గిరి పనితీరు చూసి మెచ్చుకున్నాడు.

గిరికి మళ్లీ ఊపిరి సమస్య రాలేదు. అతను కూడా ఆ విషయం మర్చిపోయాడు.

రాత్రిళ్లు మెలకువగా ఉండడం అలవాటయి, యమునకి మొదట్లో నిద్ర పట్టడానికి కష్టమైనా.. రెండ్రోజుల్లోనే సర్దుకుంది. గిరి వచ్చేసరికల్లా లేచేసి కాఫీ కలిపేసి, వంట చేసేస్తోంది.

ఇద్దరూ కలిసి, కాఫీ తాగుతూ భవిష్యత్ ప్రణాళికలు వేసుకుంటూ మాట్లాడుకుంటుంటే.. అలారం మోగుతుంది. తను తయారయి సూపర్ మార్కెట్కి వెళ్లడానికీ, గిరి నిద్రపోవడానికీ. స్మిత ఎప్పుడొస్తుందో ఎప్పుడెళ్తుందో.. తన టైమ్ టేబుల్ వేరు. ఒక్కోసారి తను కూడా కలుస్తుంది.

శనాదివారాలు గిరి పూజలు చేయించడానికి వెళ్తే, యమున సెక్యూర్టీ పనికి వెళ్తోంది.

కొంత డబ్బు కూడా దాచుకోగలుగుతున్నారు.

అంతా సాఫీగా సాగిపోతుంటే మనిషి తనంతటి వాడు లేడనుకుంటాడు.

అందుకే అనుకోనివి సంభవిస్తుంటాయి అప్పుడప్పుడు.

ఒక రోజు..

శమంతా ఉత్సాహంగా వచ్చి అందరికీ చాక్లెట్స్ పంచింది.

"బర్త్ డే నా?"

"నో.. యమూనా! అంత కంటే ఎక్కువే.. నేను కొలరాడో మూవ్ అవుతున్నాను. యు నో.. మై హజ్బెండ్ ఎయిర్ ఫోర్స్ కదా! ఇప్పుడు గ్రౌండ్ పోస్టింగ్ వచ్చింది. ఫామిలీతో కలిసి ఉండచ్చు. నేను, మై బేబీ కూడా వెరీ వెరీ హాపీ." యమునకి హగ్ ఇచ్చి మానేజర్ దగ్గరికి పరుగెత్తింది. యమున సంతోషంగా చూస్తూ ఉండి పోయింది. ఏ దేశస్థులకైనా సంసారం, భార్యా భర్తలు కలిసి ఉండడం.. అంత కంటే కావలసింది ఏముంటుంది?

కొత్త సూపర్వైజర్ న్యూఆర్లియన్స్ నుంచి వచ్చాడు. రక్తం బైటికి వచ్చేస్తుందేమో అనిపించే రంగున్న శరీరం.. నిటారుగా జర్మన్ సైనికుడిలా నడుస్తూ వచ్చాడు. యమున వయసే ఉంటుంది. వస్తూనే తన కింద పనిచేసే యముననీ, ఇంకో ఇద్దరు ఆఫ్రికన్ అమెరికన్ అమ్మాయిలు బార్బరా, సాండీలనీ ఎగాదిగా చూశాడు.

అప్పట్నుంచీ మొదలయ్యాయి ముగ్గురికీ పాట్లు.

ముందుగా రాకులన్నీ కిందా మీదా చేసి సర్దెయ్యమన్నాడు.

"మే బి.. యు నో.. బగ్స్ దాక్కుని ఉండచ్చు. డస్ట్ సరిగ్గా పోయుండక పోవచ్చు.."

"క్లీనర్స్ రెగ్యులర్ గా క్లీన్ చేస్తారు మిస్టర్ ఫాక్స్.." యమున చెప్పబోయింది.

"ఇక్కడ నువ్వా నేనా సూపర్వైజ్ చేసేది?"

ముడుచుకున్న కనుబొమ్మల్ని చూసి వెనక్కి వెళ్లిపోయింది.

పనంతా అయి, వెళ్లి పోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు వచ్చి, కుర్చీ లాక్కుని కూర్చుంటాడు.

"కమాన్.. లెట్ అజ్ చెక్ ది కాష్ అండ్ క్రెడిట్.."

"దానికి వేరే.." తనకేసి హెచ్చరిస్తున్నట్లు చూస్తున్న బార్బరాని గమనించి నోరు నొక్కేసుకుంది.

అదంతా అయ్యేసరికి ఇంకో గంట పట్టేది, అదనంగా. దానికి జీతం రాదు.. తన పెండింగ్ పని కిందే వస్తుంది.

నాజీ సూపర్వైజర్ వచ్చాక నడుం లాగెయ్యడం మొదలెట్టింది యమునకి.

కౌంటర్ దగ్గర బోలెడు మంది క్యూలో ఉండి, అష్టావధానం చేస్తున్నప్పుడు దగ్గర్లో నుంచుని అనుమానంగా చూస్తూ గమనిస్తుంటాడు. కొంచెం తడబడితే చాలు.. అందరి ముందూ ఏదో పుల్లమాట అని వెళ్తాడు.

రాను రాను పనికి రావాలంటే బెదురు, భయం పట్టుకున్నాయి యమునకి.

"ఏంటి ఇతని ప్రాబ్లం?" ఒక రోజు ఏ దేముడో కరుణించి అతను రానప్పుడు బార్బరాని అడిగింది. ఆ రోజు కస్టమర్స్ కూడా పలుచగా ఉన్నారు. మధ్య మధ్యలో పని చేసుకుంటూనే పక్కన పక్క కౌంటర్లు అవడంతో సంభాషించ గలిగారు.

"నేను కనుక్కున్నా.. ఇతను కె.కె.కె మెంబర్. అందుకే నల్ల వాళ్లన్నా, బ్రౌన్ వాళ్లన్నా, ఇమిగ్రాంట్స్ అన్నా కోపం.. అసహ్యం."

"కెకెకె అంటే.." యమున ఆ మాట అదే మొదటిసారి వినడం..

"సివిల్ రైట్స్ ని వ్యతిరేకిస్తూ 1865 లో నలుగురు తెల్లవాళ్లు టెన్నిసీ రాష్ట్రంలో ఈ గ్రూప్ని ఫార్మ్ చేశారు. దీని పేరు 'కు క్లక్స్ క్లాన్'. తెల్ల వాళ్ల ఆధిపత్యాన్ని సమర్ధిస్తూ అప్పట్లో నల్ల వాళ్లని, తెల్ల రిపబ్లికన్స్నీ బెదిరిస్తూ, కొడుతూ, ఒక్కోసారి చంపేస్తూ ఉండేవారు. ఒక పదేళ్లు టెర్రరైజ్ చేశాక గవర్న్మెంట్ యాక్షన్ తో ఆ ఉద్యమం అణగి పోయింది.

మళ్లీ 1915 లో అట్లాంటా జార్జియాలో రెండో కెకెకె ఫామ్ అయింది. ఈ సారి చాలా పెద్ద ఎత్తులో, వ్యాపారాలని చేతిలోకి తీసుకుని ఎంతో మందిని సభ్యులుగా చేర్చుకుంది. దాని ముఖ్య ఉద్దేశ్యం.. తెల్ల వాళ్ల తోనే అమెరికా ఏర్పాటు. ఎక్కువగా ఇది దక్షిణ రాష్ట్రాలలోనే వ్యాపించింది. 1940 వరకూ ఆ ఉద్యమం సాగి ప్రభుత్వానికి పెద్ద తల నొప్పిగా అయింది. మొత్తానికి వాళ్లల్లో వాళ్లకి పడక పోవడం, అందులో మెంబర్స్ ని చాలా మందిని వయొలెన్స్, మర్డర్ చార్జెస్ మీద అరెస్ట్ చెయ్యడంతో సద్దు మణిగింది.

మూడో సారి 1940 లో ఫామ్ అయినా 1960 లో ఊపందుకుని, రకరకాలుగా చిన్న చిన్న గ్రూప్స్ కింద అమెరికా అంతా చాప కింద నీరులా అక్కడా అక్కడా దాక్కుంది. దీన్ని మూడో కె.కె.కె ఉద్యమం అంటున్నారు. ఇరవయ్యొకటో శతాబ్దంలో దీనిని టెర్రరిస్ట్ గ్రూప్ కింద చేర్చమన్నారు. అప్పట్నుంచీ అంత బయట పడకుండా.. ఇందులో సభ్యులు, మరీ ఉగ్రవాదాన్ని అనుసరించకుండా.. తెలివిగా సాఫ్ట్ గా, సాఫ్ట్ వేర్ యుగం కదా.." బార్బరా నవ్వింది నీరసంగా.

"ఇమిగ్రెంట్స్ నీ, నల్ల వాళ్లనీ, ఏడిపిస్తున్నారు. వాళ్ల దగ్గరకి వచ్చిన వాళ్లని ఎలాగో పారిపోయేట్లు చెయ్యడం వాళ్ల ఉద్దేశ్యం. ఇటువంటి వాళ్లు ప్రస్తుతం ఐదారువేలు పైన ఉంటారని అంచనా." శాండీ పూర్తి చేసింది.

"ఇతను ఆ గ్రూప్ అనిఎలా కనుక్కున్నారు?" యమున ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది. ఇటువంటిదొకటి ఉందని ఎవరూ చెప్పలేదే అనుకుంటూ.

"ఇప్పుడు ఒకే పెద్ద గ్రూప్ లేదు. కనుక్కోవడం కష్టమే. ఒక సారి అతని షర్ట్ స్లీవ్ పైకి వెళ్లింది. అప్పుడు, వాళ్ల సింబల్ టాటూ కనిపించింది, మోచేతి పైన. చాలా చిన్నది. దానిగురించి తెలిసిన వాళ్లు తప్ప కనుక్కో లేరు. ఎర్ర బాక్ గ్రౌండ్ మీద తెల్ల క్రాస్, క్రాస్ మధ్య ఒక స్క్వేర్.. దాన్లో ఒక సీడ్ బొమ్మ ఉంటాయి. అది నేను గమనించినట్లు అతనికి తెలీదు." బార్బరా నిర్లిప్తంగా చెప్పింది.

"ఇవన్నీ మీకు ఎలా తెలుసు?" అడిగాక యమునకి ఎంత పిచ్చిప్రశ్న అడిగానో అనిపించింది. తనంటే వచ్చి మూడేళ్లు కూడా అవలేదు.. వాళ్లు తరతరాలుగా ఇక్కడే ఉంటూ అన్ని రకాల దౌర్జన్యాలనీ ఎదుర్కుంటున్న వాళ్లు.

"రెండు తరాల ముందు, మా వాళ్లు అట్లాంటాలో ఉండే వాళ్లు. అప్పుడు కె.కే.కే చాలా పీక్ లో ఉండేది. మా తాత రోడ్లు వేసే పనిలో ఉండే వాడు. ఒక రోజు, నలుగురు మానవ రూపంలో ఉన్న రాక్షసులు, మొహాలకి మాస్కు, నెత్తికి టోపీలు పెట్టుకుని వచ్చి అక్కడ పనిచేస్తున్న బ్లాక్స్ అందర్నీ వినరాని మాటలంటూ, పిట్టల్ని కాల్చినట్లు కాల్చేశారు. ఆ తరువాత ఆ నలుగురినీ అరెస్ట్ చేశారుట. కానీ ఏం లాభం.. అప్పటికే ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. అంటే.. అంతకు ముందేవో భవనాలున్నాయని కాదు.. ఇంటి పెద్ద ఒక్క సారిగా ఇంటికి రావడం మానేస్తే ఎలా ఉంటుందో చెప్పడానికి మాటలు దొరకవు." బార్బరా గొంతులో ఏదో అడ్డుపడ్డట్లయి మట్లాడ

లేకపోయింది.

"అయ్యో.. చోక్ అవుతోంది.." శాండీ చటుక్కున వెళ్లి మంచినీళ్ల సీసా అందించింది.

"అయామ్ సారీ బార్బరా.." యమున నొచ్చుకుంది.

"ఫరవాలేదు. మాకు అలవాటే. ఇటువంటి కథలు.. కాదు పచ్చి నిజాలు ఎన్నో.. ఎన్ని రాత్రులు చెప్పుకున్నామో లెక్క లేదు. నీకు టైమ్ ఉంటే "రూట్స్" నవల చదువు. చాలా పెద్దదే అనుకో.. కానీ నీకు మా జాతి వాళ్లు ఎటువంటి కష్టాలెదుర్కొన్నారో క్లియర్ గా తెలుస్తుంది."

"నిజమే.. కానీ నాకు అంత బాగా ఇంగ్లీష్ చదవి అర్థం చేసుకోవడం.. అదీ అంత పెద్ద నవల, చాత కాదు." యమున సిగ్గుగా అంది.

"అరే.. ఇందులో తక్కువ చేసుకునేదేముంది.. మాక్కూడా ఇదివరకు అంత వచ్చేది కాదు. కోర్సెస్ తీసుకుని ఇంప్రూవ్ చేసుకున్నాం. నువ్వు కూడా.."

"ప్చ్.. నాకు టైమ్ ఉండదు.. నిద్ర పోవడానికి మాత్రం సిక్స్ అవర్స్ ఉంటుంది. వీకెండ్స్ కూడా వర్క్.. బట్ ఐ విల్ ట్రై. కమాన్.. నాజీ సోల్జర్ వస్తున్నాడు. ఇంకో నాజీని తీసుకుని. అటూ ఇటూ చూడకండి." యమున తలెత్తకుండా కంప్యూటర్లోకి చూడ సాగింది.

●●●

యమునని తరచూ తల నొప్పి వేధిస్తోంది. దాంతో ఏ పని మీదా సరిగ్గా దృష్టి నిలుప లేకపోతోంది. గిరికి సెక్యూరిటీ పని బాగా అలవాటయిపోయింది. కానీ రాత్రిళ్లు నిద్ర లేక కళ్ళ కింద చారలు మళ్లీ చేరాయి. అతనికి కూడా అప్పుడప్పుడు ఆయాసం వస్తోంది. రాత్రిళ్లు వస్తోంది కనుక యమున గమనించలేదు.

ఆరోగ్యంగా ఉంటే ఎవరైనా, ఎంత పనైనా అవలీలగా చెయ్యగలరు.

ఇద్దరూ ఒక దగ్గర కూర్చుని మనసారా మాట్లాడుకుని నాలుగు నెలలు పైనే అయింది. ఏదో విధంగా ఓపిక తెచ్చుకుని పని చేసుకుంటుంటే ఒక రోజు నాజీ ఫాక్స్ పిలిచి, యమున పనిలో పది తప్పులు చూపించాడు. అంతే కాదు, పై అధికారికి రాత పూర్వకంగా రాసి ఇచ్చాడు.

అసలే తల నొప్పితో చికాగ్గా ఉన్న యమున, ఇంక పనికి రానని చెప్పేసి బయటికొచ్చేసింది.. బార్బరా, శాండీలు పిలుస్తున్నా వినిపించుకోకుండా.

"మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాను.. కానీ.. ఇంక నా వల్ల కాలేదు, ఫాక్స్ గారి అట్రాసిటీస్ భరించడం. ఎలా మానేజ్.. అంటారా? ఏదో ఒకటి ఆ కృష్ణుడే చూపిస్తాడు." మరునాడు బార్బరాకి ఫోన్ చేసి చెప్పింది.

"ఓహ్! మీ గాడ్, క్రిష్ణా! మీ నమ్మకాన్ని, ధైర్యాన్ని చాలా అప్రీషియేట్ చేస్తాము మేము. ఆల్ ద బెస్ట్ యమునా!" బార్బరా హత్తుకుని వీడ్కోలు పలికింది.

యమునకేం తోచట్లేదు. రోజుకి రెండు ఉద్యోగాలు చేసిన మనిషి, ఖాళీగా ఉండాలంటే.. పిచ్చెక్కిపోతోంది.

రాడ్నీని కలిసింది, ఎక్కడైనా ఖాళీ ఉందేమోనని.

"అయామ్ సారీ యమునా! ఎప్పుడు వేకెన్సీ వచ్చినా నీకే మొదట చెప్తాను." రాడ్నీ బోలెడు సానుభూతి కురిపించాడు.

ఉద్యోగం పోయి నాలుగు నెలలయింది. ఇంట్లో కూర్చుని పేపర్లో కనిపించిన ఖాళీకల్లా అప్లై చేస్తోంది. ఏమీ తోచట్లేదు.

ఇంట్లో కూర్చుంటే లాభం లేదని, అలా డ్రైవ్ చేసుకుంటూ డౌన్ టౌన్కి వెళ్లింది. అక్కడ బోలెడు వేకెన్సీ బోర్డ్లు కనిపించాయి. ఫైడ్ పార్కింగ్ లాట్లో పార్క్ చేసి, రెండు గంటలు అంతా తిరిగింది. ఎక్కడా తనకి తృప్తిగా అనిపించలేదు. ప్రతీ షాపూ ఇరుకుగా అనిపించింది. ఒక వారం ఆగి.. ఎక్కడా దొరక్కపోతే.. అప్పుడు చూద్దాంలే అనుకుని, ఇంటికొచ్చేసింది.

అప్పుడే గిరి తయారయి డ్యూటీకి వెళ్తున్నాడు. సెకండ్ హేండ్ కార్ ఒకటి, తనకి తెలిసిన వాళ్లు అమ్మేస్తుంటే, ఆనంద్ గిరికి కొనిచ్చాడు. దాంట్లో తిరగడం బాగానే వచ్చేసింది గిరికి. వారాంతంలో తన పూజలకి కూడా స్వయంగా డ్రైవ్ చేసుకుని వెళ్లి పోతున్నాడు. అతని సంపాదనతోనే ప్రస్థుతం ఇల్లు నడుస్తోంది.

యమున ఇంట్లో కూర్చుని తెలిసిన వాళ్లందరికీ ఫోన్లు చేస్తోంది.

ఒక సాయంత్రం..

యమున తల నొప్పిగా ఉందని పడుకుంది. గిరి వంట చేస్తున్నాడు. ఆనంద్ తలుపు తోసుకుని వచ్చాడు.. తలుపు సరిగ్గా వేసే ఓపిక కూడా లేదు ఇద్దరికీ.

"చిన్నక్కా! నన్నింత పరాయివాడిని చేసేశావా?" వస్తూనే నిష్ఠూరం వేశాడు.

హాల్లో సోఫాలో పడుక్కున్న యమున చటుక్కున లేచింది. మొహం అంతా పీక్కుపోయి, జుట్టంతా రేగిపోయి.. పది లంఖణాలు చేసినట్లుగా ఉంది.

"అదేంటక్కా! అలా అయిపోయావు? ఒంట్లో బాగోలేదా? డాక్టర్ దగ్గర అపాయింట్మెంట్ తీసుకుంటా ఉండు. ఒకసారి షుగర్ టెస్ట్ చేయించుకో.. ఈ టెన్షన్స్ కి వచ్చే అవకాశం ఉంది. ఎన్నాళ్లయింది చెప్పు నా దగ్గరికి వచ్చి? అమ్మ గొడవ చేసేస్తోంది."

"అబ్బా! ఏం లేదురా బాబూ! కాస్త తల నొప్పిగా ఉందంతే. దానికే ఇంత గొడవ చెయ్యాలా?"

"లేదక్కా! సమ్ థింగ్ ఈజ్ రాంగ్ విత్ యు. రేపే మా హాస్పిటల్కి రా. మామయ్య డ్యూటీకి తయారవుతున్నాడా?"

"వస్తున్నా.. ఏకంగా కాఫీ కలుపుకొచ్చేద్దామనీ.." గిరి మూడు కప్పుల్లో చిక్కని ఫిల్టర్ కాఫీ కలిపి తెచ్చాడు.

"హూ.. మామీ ఫిల్టర్లో కాఫీనా.. ఈ రుచే వేరు." వాసన పీలుస్తూ, కాఫీ చప్పరించాడు ఆనంద్.

"అవును.. ఇండియా స్టోర్లో బ్రూక్ బాండ్ పొడి తెస్తాను. ఇంకా అదే అలవాటు.." యమునకి తమ్ముడిని చూడగానే తలనొప్పి తగ్గినట్లనిపించింది.

"ఇప్పుడు చెప్పు.. ఏమిటి సమస్య? జాబ్ వేట ఎంత వరకూ వచ్చింది? నువ్వు వెతుకుతున్నట్లే నాకు తెలియలేదు. ఇందాక అమ్మ ఏదో మాటల సందర్భంలో అంది.. నువ్వు వచ్చి చాలా రోజులయిందంటే.."

"అవునురా! నిజమే. ప్రతీదీ నీకు చెప్పి, ఇబ్బంది పెట్టడం ఎందుకనీ.."

"భలే దానివే! నాకు తెలిసిన వాళ్లు చాలా మంది ఉంటారన్న సంగతి మర్చిపోయావా? కొద్దో గొప్పో పరపతికూడా ఉంది కదా! ఇందాకే ఒక పేషంట్ తో మాట్లాడాను. వాళ్లు బొమ్మలు తయారు చేస్తారు. అక్కడ రెండు మూడు వేకెన్సీలు ఉన్నాయిట. రేపు వెళ్లు.. నీకు ఇదివరకు ఇచ్చినట్లే ఇస్తారు జీతం. పని ఇంచు మించు అలాంటిదే. ఇదిగో కార్డ్." ఆనంద్ వాలట్లోంచి కార్డ్ తీసి ఇచ్చాడు.

యమున అందుకుని, తమ్ముడి పక్కన వచ్చి కూర్చుంది.

"ఏమీ అనుకోకురా తమ్ముడూ! అస్తమానూ నిన్ను సతాయించాలంటే నాకే సిగ్గుగా అనిపిస్తోంది. అందుకే.."

"ఫరవాలేదక్కా! ముందు నువ్వు రేపు హాస్పిటల్కి రా."

గిరి తన ఆయాసం సంగతి కూడా చెప్దామనుకుని.. ఈ సారి వచ్చినప్పుడు చూడచ్చులే అనుకుని ఊరుకున్నాడు.

"స్మిత ఎలా ఉంది? బాగా చదువుతోందా?"

"అనే అనుకోవాలి. ఇంట్లోఉండేది తక్కువ.. లైబ్రరీలో ఉండేది ఎక్కువ. ఏవోకోర్సులు చేస్తోంది. కమ్యూనిటీ కాలేజ్లో. మా ఇద్దరికీ అయితే ఏమీ తెలియదు! ఎప్పుడో నీ దగ్గరికి వస్తుంది. ఏదయినా జాబ్లో చేరితే అనుభవం వస్తుందికదా.. టైమ్ వేస్ట్ చేస్తోందేమో అని మా భయం. అసలేం చేస్తోందో కనుక్కో నిన్ను కలిసినప్పుడు." యమున అన్నది నిజమే.

స్మిత, అమ్మా నాన్నలతో ఏదీ చర్చించదు. వాళ్లకేం అర్థం అవదనుకుంటుందేమో! తనకి కావలసినట్లు చేసుకుపోవడమే చిన్నప్పట్నుంచీ అలవాటు.

"ఒక ఆర్నెల్లు ఆగండమ్మా! అంతా చెప్తాను. అంత వరకూ నన్ను వదిలెయ్యండి."

అడిగినప్పుడు డబ్బు ఇవ్వడం తప్ప, ఏమీ కల్పించుకోడు గిరి.

"నా కూతురి మీద నాకు నమ్మకం ఉంది." అనేస్తాడు, యమున ఏదైనా చెప్పబోతే.

"సరే అక్కా! ఉంటా. ఏదయినా అడగడానికి మొహమాట పడకండి. ఇందాకే మండీ కెళ్లొచ్చాము. ఇవన్నీ మీ కోసం కొంది శోభ.. మీకు వెళ్లడానికి టైమ్ ఉండదంటూ." పది సంచీల వరకూ లోపల పెట్టొచ్చాడు ఆనంద్.

ఎందుకురా.. నోటి వరకూ వచ్చిన మాటని అక్కడే ఆపేసింది యమున. అంత ఆప్యాయత చూస్తుంటే, గొంతు డెక్కు పెట్టగా!

మరునాడు ఆనంద్ ఇచ్చిన కార్డ్ తీసుకుని బొమ్మల ఫాక్టరీకి వెళ్లింది. యమునా వాళ్ల అపార్ట్మెంట్ దగ్గర్నుంచి చాలా దూరం.. గంట పైనే పట్టింది. ఒక వేళ చేరితే బస్సో, ట్రైనో చూసుకోవాల్సిందే అనుకుంది. ఇదో కొత్త అనుభవం అనుకుంటూ కారు పార్క్ చేసి, లోపలికి నడిచింది.

"గుడీ డాల్ ఫాక్టరీ".. అన్ని రకాల బొమ్మలూ తయారు చేస్తుంది. నెలల పిల్లల దగ్గర్నుంచీ ఎనిమిది, తొమ్మిదేళ్ల వరకూ.. వారికి కావలసిన అన్ని రకాల బొమ్మలూ తయారవుతాయి అక్కడ. ముఖ్యంగా ఆడపిల్లల బొమ్మలు.. బార్బీ బొమ్మలు, స్టఫ్డ్ టాయిస్, పజిల్స్ ఎక్కువగా చేస్తారు.

ఎక్కడయినా, ఏ దేశంలో నైనా పిల్లలకి కావలసిన సరుకులకి గిరాకీ ఎక్కువ. ఆహార పదార్థాలు కానీ, దుస్తులు కానీ.. బొమ్మలు కానీ! పాపాయి పుట్టక ముందునుంచీ.. బేబీ షావర్తో మొదలవుతుంది.. అందరూ బహుమతులు ఇవ్వడం. ఇంక పెరుగుతున్న కొద్దీ నెల నెలకీ బొమ్మలలో కూడా మార్పులు.. కొత్తకొత్త రకాలు, పిల్లల ఎదుగుదలకి అనుగుణంగా.

ఇదంతా గమనించి డాల్ ఫాక్టరీ పెట్టాడు నీరజ్ లాడివాలా. అమెరికాలో అతను మూడో తరం గుజరాతీ వర్తకుడు. నీరజ్ తాత సూరజ్ ఇంగ్లాండ్ నుంచి రెండున్నర లక్షల డాలర్ల పెట్టుబడితో అమెరికాకి వలస వచ్చాడు. బిజినెస్ చెయ్యడానికి తగిన పెట్టుబడి ఉంటే గ్రీన్ కార్డ్ సులభంగా ఇచ్చేసేవారు.

మొదట ఇండియన్ సరుకులు దిగుమతి చేసి ఫాన్సీ, కిరాణా షాపు తెరిచాడు న్యూయార్క్లో. అక్కడ్నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు.

ఇద్దరు కొడుకులలో ఒకతన్ని కాలిఫోర్నియా పంపి అక్కడ రెస్టారెంట్, హమారా బజార్ పెట్టించాడు. నీరజ్ తండ్రి చేత

న్యూయార్క్ లో మూడు షాపులు తెరిపించాడు.. అందులో రెడీ మేడ్ దుస్తులు, బంగారు నగల షాపులు కూడా ఉన్నాయి.

మనవడు నీరజ్ చేత బొమ్మల ఫాక్టరీ పెట్టించి తృప్తిగా కన్ను మూశాడు సూరజ్.

యమున ఫాక్టరీలోకి అడుగు పెడుతూనే భారతీయ వాతావరణం చూసి సంతోష పడింది. పైకి చూడ్డానికి చిన్నగా ఉన్నా.. లోపలికి వెళ్లే కొద్దీ హాలు తరువాత హాలు వస్తూనే ఉన్నాయి. ఒక్కో రకానికి ఒక్కో హాలు.. ప్లాస్టిక్ బొమ్మలు, మెత్తని బట్టతో నెలల పిల్లలకి చేసేవి, మగ పిల్లలకి కార్ల వంటివి, రోబోలు.. ఏవీ కూడా లేత చేతులకి, శరీరానికి హాని కలిగించేవి లాగ లేవు.

ప్రతీ చిన్న విషయం మీద శ్రద్ధ తీసుకున్నట్లు కనిపించింది.

యమునని చూడగానే విషయం కనుక్కుని, నీరజ్ గదికి తీసుకెళ్లింది ఒక పదహారేళ్ల అమ్మాయి. ఎక్కువగా పదహారేళ్లలోపు పిల్లలు ఉన్నారు. కొన్ని చోట్ల ఇంకా చిన్న పిల్లలు.. పది పన్నెండేళ్ల వాళ్లు బొమ్మల్లో దూది, బట్ట పేలికలు కూరుతూ కనిపించారు.

ఇక్కడ లేబర్ లా వర్తించదా అనుకుంది యమున.

నీరజ్ కి ఆనంద్ వయసే ఉంటుంది.

“ఆయియే బెహెన్జీ. డాక్టర్ సాబ్ చెప్పారు మీ గురించి. మీరు ఇప్పుడే పనిలో చేరిపోవచ్చు. ఇక్కడ మనం కొనేవే కానీ అమ్మేది తక్కువ. హోల్ సేల్లో ఎప్పుడూ కొనే కస్టమర్స్ కొంటారు. అందుకని ప్రెట్టీ సింపుల్.. అకౌంట్స్ మెయింటైన్ చెయ్యడం మీ పని. మీకు హరిత హెల్ప్ చేస్తుంది, మొదట్లో. ఒకటి రెండు రోజుల్లో అంతా తెలిసిపోతుంది. అంత పెద్ద సూపర్ మార్కెట్లో పని చేసిన మీకు ఇది చాలా ఈజీ. మీకు లంచ్ కూడా ఇస్తాము ఇక్కడ. కావాలంటే ఇందులోనే వేరే పనులు ఓవర్ టైమ్ కూడా చేసుకోవచ్చు.” నీరజ్ గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్ కలిపి మాట్లాడాడు.

నవ్వుతూ, స్నేహంగా ఉన్నాడు.

మొదట అతని ప్రసన్నమైన మొహం చూడగానే యమున తల నొప్పి ఎగిరిపోయింది. అందులో మొటమొటలాడే నాజీ ఫాక్స్ దగ్గర పని చేశాక.. మరీ!

“మంచి వాతావరణం ఉంటే ఎంతైనా పని చెయ్యొచ్చు” అనుకుంది.

“మరి పే గురించి..” అడిగింది. ముందే మాట్లాడేసుకుంటే నయం కదా..

“లీగల్గా అవర్లీ ఎంత ఇవ్వాలో అంతే ఇస్తాము. ఇన్స్యూరెన్స్, టాక్స్ కటింగ్స్ పోనూ..”

“ఓ.కే నీరజ్ సార్. ఇప్పుడే చేరిపోతాను.” మనకి ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడే మంచిరోజని నాన్నమ్మ చెప్పిన మాట గుర్తు పెట్టుకుని అంది యమున.

“వెల్కమ్ టు అవర్ వండర్ లాండ్.” నీరజ్ షేక్ హాండిచ్చి, యమున గది చూపించాడు. అక్కడే నీరజ్ గది చూపించిన అమ్మాయి కంప్యూటర్ ముందు కూర్చుని ఉంది.

“ఈ అమ్మాయే హరిత. ఇక్కడ పార్ట్ టైమ్ అకౌంట్స్, ఇన్ వాయిస్ అవీ చూస్తుంది. తను మీకు అన్నీ చూపిస్తుంది. ఓవర్ ఆల్ గా మా చిన్న పరిశ్రమని మీకు పరిచయం కూడా చేస్తుంది. మీరు చూస్తుండండి.. నేను బయటికి వెళ్లాలి.” నీరజ్ హడావుడిగా వెళ్లిపోయాడు.

“నమస్తే ఆంటీ!”

“నమస్తే..” హరిత చాలా చురుకుగా అన్నీ వివరించింది. ఇదివరకు పనికీ దీనికీ చాలా తేడా ఉన్నా యమున సులభంగానే

గ్రహించింది. ఇక్కడ తండోపతండాలుగా వచ్చేకస్టమర్లుండరు. ఎప్పుడూ వతనుగా తీసుకెళ్లే వాళ్లే.. చెప్పాలంటే ఆడుతూ పాడుతూ చెయ్యగలిగినట్లే ఉంది. యమునకయితే రోజు పని రెండుగంటల్లో చేసెయ్యగలననిపించింది.

"ఇక్కడ అంతా చిన్న పిల్లలే కనిపిస్తున్నారు, ప్రత్యేకమైన కారణమేదయినా ఉందా?" ఆ రోజుకి ఎంట్రీలయిపోయాక హరితని అడిగింది.

"అందరం బంధువులమే ఆంటీ. ఇక్కడ కొంచెం సెటిల్ అవగానే చుట్టాలని తీసుకొచ్చేస్తారు. వాళ్ల చేతే పని చేయించుకుంటారు. మరి మాకందరికీ గడవాలి కదా! కొంచెం నిల దొక్కుకోగానే ఏదో బిజినెస్ మొదలు పెడ్తారు. అలాగే ఇక్కడ గుజరాతీ పాపులేషన్ పెరిగింది. ఇంకా పెరుగుతోంది."

యమునకి అర్ధమయింది. ఆనంద్ వలన తనకి ఇక్కడ ఉద్యోగం ఇచ్చారు. లేకపోతే అంతా వారి కమ్యూనిటీ వాళ్లే..

"మరి ఇంత చిన్న పిల్లల చేత పని చేయిస్తే ఎటువంటి ప్రాబ్లం ఉండదా?" దూరంగా ఉన్న హాల్లో గుండ్రంగా కూర్చుని పని చేస్తున్న పిల్లల్ని చూపిస్తూ అడిగింది.

"వాళ్లంతా పన్నెండేళ్లు దాటిన వాళ్లు. కొంచెం చిన్న పిల్లలు నీరజ్ సార్ వాళ్ల ఫామిలీ వాళ్లే. బొమ్మల పని కదా.. ఆనందంగా చేస్తారు. వారి పేరెంట్స్ కి ఆదాయం.. వాళ్లకి బొమ్మలు. వారి చేతి వేళ్లు సన్నగా ఉంటాయి కదా.. స్టఫ్ చెయ్యడానికి ఈజీగా ఉంటుంది. ఒక్కొక్కళ్ల చేత నాలుగు గంటల కంటే పని చేయించరు. ఇక్కడ చెయ్యక పోయినా, నైబర్స్ ఇళ్లల్లో గార్డెనింగ్, బేబీ సిట్టింగ్ వంటివి చేస్తూనే ఉంటారు వీకెండ్స్ లో. ఏ ప్రాబ్లం ఉండదు. మీరు ఎంజాయ్ చేస్తారాంటీ, సరదాగా ఉంటుంది."

హరిత అన్నట్లుగానే యమున తొందర్లోనే అక్కడి పనికి అలవాటు పడిపోయింది.

ముఖ్యంగా అక్కడ ఇచ్చే భోజనం.. తక్కువ కారంతో, మెత్తటి రోటీలు, తియ్యని పప్పు, నూనె తక్కువేసిన కూరలు, పెరుగు.. యమున ఒక నెలలోనే ఆరోగ్యంగా కలిపించ సాగింది.

తన అకౌంట్స్ పని అనుకున్నట్లుగా రెండుగంటల లోపే అయిపోతోంది.

ఆ తరువాత.. పిల్లలతో కలిసి అసెంబ్లీ లైన్ లో కూర్చుంటుంది. స్టఫ్డ్ బొమ్మల్లో ఒక్కో భాగం ఒక్కొక్కళ్లు కూరి, పక్క వాళ్లకి అందిస్తారు. అవన్నీ కలిపి చివరగా కొందరు పూర్తి చేస్తారు. కొంత పని చెయ్యడానికి మెషిన్స్ ఉంటాయి. అస్సలు అతుకు, కుట్టు కనిపించకుండా.. మెత్తగా పట్టుకుచ్చుల్లా.. ముట్టుకుంటే జారిపోయేలా ఉన్న బొమ్మలు బయటికి వస్తాయి. టెడ్డీ బేర్లు, కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, కోలాలు.. అన్ని రకాల జంతువులూ ప్రత్యక్షం అక్కడ. ఆ పని చేస్తునంత సేపూ తను కూడా వారితో కలిసి చిన్న పిల్లైపోతుంది.

వారి అమాయకమైన మాటలు చేతలు.. కథలు, కబుర్లు.. యమునకి కొత్త ఊపిరి వచ్చినట్లయింది.

గుజరాతీ మాటలు కూడా బాగా అర్ధమయిపోతున్నాయి.

కాకపోతే వెళ్లడం, రావడం కష్టంగా ఉంది.

తమ ఇంటికి దగ్గరగా ఉన్న ట్రైన్ స్టేషన్ వరకూ కార్లో వెళ్లి, అక్కడ పార్క్ చేసి, ట్రైన్లో అరగంట ప్రయాణం చేశాక, పావుగంట నడిస్తే కానీ ఫాక్టరీ రాదు.

అయితేనేం.. చిన్న చిన్న పిల్లలతో పని చెయ్యడంతో అంత శ్రమా మర్చిపోతుంది.

ఆ రోజు..

ఫాక్టరీ అంతా నిశ్శబ్దంగా ఉంది.

యమున తడబడుతూ లోపలికి అడుగు పెట్టింది.

హరిత కొందరు ఆడవాళ్లకి సూచనలిస్తోంది, దూరంగా ఉన్న హాలులో.

"ఏమయింది?" యమున అడిగింది భయం భయంగా.

"ఏం లేదు.. నథింగ్ టు వర్రీ. పిల్లలకి స్కూల్స్ తెరిచేశారు కదా! అందుకే కలకలం లేదు. వీకెండ్స్ వస్తారు. మీరు కూడా వీక్ డేస్ ఎప్పుడైనా ఆఫ్ తీసుకుని, వీకెండ్స్ పనికి రావచ్చు. అసలు అన్ని రోజులూ వచ్చినా పని ఉంటుంది. ఇప్పుడు బొమ్మలకి బాగా డిమాండ్ పెరిగింది. నేను కూడా పగలు ఇక్కడికి వచ్చి, నైట్ కాలేజ్లో కోర్సులు తీసుకుంటున్నా."

"ఓహ్.. అంతేనా. వీళ్లంతా ఎవరు?"

"కొత్తగా పనిలోకి చేరారు. ఫ్రెష్ బాచ్ వచ్చింది ఇండియా నుంచి. వాళ్లకి ట్రైనింగ్ ఇస్తారు. రండి పరిచయం చేస్తా."

నెత్తి మీదినుంచి గూంఘట్ వేసుకున్న నలుగురు యువతులు, గోచీ పోసి చీర కట్టిన కొంచెం పెద్ద స్త్రీలు ముగ్గురు, పైజామా, లాల్చీలతో యాభై దాటిన మగవాళ్లు ముగ్గురు.. పదిమంది ఉన్నారు.

ఎవరికీ ఇంగ్లీష్ రాదు.

యువతులు, మగవారు ఫరవాలేదు.. హిందీ బాగా వచ్చు. కానీ ముగ్గురు ఆడవాళ్లకీ మాత్రం గుజరాతీ తప్ప ఇంకేం రాదు.

యమునకి కొత్త సవాలు ఎదురయింది. నీరజ్ వారి బాధ్యత పూర్తిగా యమునకే అప్పచెప్పాడు.

మొదట్లో బొట్టు పెట్టుకోని యమునని వింతగా చూశారు. వెంటనే యమున బొట్టు పెట్టేసుకుంది. పాంట్లూ, షర్టూ మానేసి, పంజాబీ డ్రస్ వేసుకోవడం మొదలు పెట్టింది. తను కూడా వచ్చీరాని గుజరాతీలో వాళ్లతో సంభాషించడం నేర్చుకుంది.

చిన్న చిన్న ఇంగ్లీష్ మాటలు నేర్పించ సాగింది.

ఒక నెల లోగా అందరికీ ఆప్తురాలైపోయింది.

ఫాక్టరీకి దగ్గర్లో అపార్ట్మెంట్ కాంప్లెక్స్ ఉంది నీరజ్ కి. ఇండియా నుంచి తీసుకొచ్చిన బంధువులని అక్కడే ఉంచుతాడు అతను. రెండు గదుల అపార్ట్మెంట్లో రెండు ఫామిలీస్ ని ఉండమంటాడు. వాళ్లు నిల దొక్కుకున్నాక విడివిడిగా ఇస్తాడు.

"ఇలా వచ్చిన వాళ్లే స్వంత ఇళ్లు కొనుక్కుని వెళ్లిపోతారు రెండు మూడేళ్లల్లో." హరిత చెప్పింది.

●●●

ఒక నెల లోగా అందరికీ ఆప్తురాలైపోయింది.

ఫాక్టరీకి దగ్గర్లో అపార్ట్మెంట్ కాంప్లెక్స్ ఉంది నీరజ్ కి. ఇండియా నుంచి తీసుకొచ్చిన బంధువులని అక్కడే ఉంచుతాడు అతను. రెండు గదుల అపార్ట్మెంట్లో రెండు ఫామిలీస్ ని ఉండమంటాడు. వాళ్లు నిల దొక్కుకున్నాక విడివిడిగా ఇస్తాడు.

"ఇలా వచ్చిన వాళ్లే స్వంత ఇళ్లు కొనుక్కుని వెళ్లిపోతారు రెండు మూడేళ్లల్లో." హరిత చెప్పింది.

"బెహెన్జీ! ఒక ఇల్లు ఖాళీ అయింది మీరు వస్తారా? అద్దె ఇవ్వనక్కర్లేదు. దాని బదులు వీకెండ్స్ పని చేస్తే చాలు." నీరజ్ ఒక రోజు పిలిచి చెప్పాడు.

యమున వచ్చినప్పట్నుంచీ అతనికి చాలా వెసులుబాటుగా ఉంది. అందులో కొత్తగా వచ్చిన వాళ్లకి మంచి స్నేహితురాలైపోయింది. వాళ్లని బజారుకి తీసుకెళ్లడం.. అన్నీ నేర్పించడం, వాళ్ల సంగతులు, ఇష్టా ఇష్టాలూ కనుక్కోవడం వంటివి చేస్తూ.

“రేపు చెప్పచ్చా సర్?”

“తప్పకుండా.”

యమున ఆలోచిస్తూ ఇంట్లోకి అడుగుపెడుతుండగా గిరి కూనిరాగాలు తియ్యడం వినిపించింది.

“ఏంటి హుషారుగా ఉన్నారు?”

“ఇందాకే మంత్రిప్రగడ ఫోన్ చేశాడు. తను అకౌంట్స్ చూసే బాంక్లో ఒక వేకెన్సీ వచ్చిందిట చేస్తారా అని.. అవర్లీ కాదు.. మంత్లీ శాలరీ. అంటే రెగ్యులర్ జాబ్.. కానీ కొంచెం దూరం. అయితేనేం ఒప్పేసుకున్నా. నువ్వు వెళ్లటంలా.. అలాగే నేను కూడా వెళ్దామని. రాడ్నీ దగ్గరికి వెళ్లి చెప్పాలి.”

“బాంక్ ఎక్కడ?”

“జెర్సీ సిటీ.” గిరి చెప్పాడు.

యమున ఆశ్చర్యంగా చూస్తుండి పోయింది.

“ఏవిటలా చూస్తున్నావ్? నీకు చెప్పకుండా చేశాననా? ఇప్పుడైనా ఫరవాలేదు.. రాడ్నీకి చెప్పలేదుకదా! ఇలాగా నడిపించచ్చు. నిజమే.. ఒక్కళ్లకయినా దగ్గర్లో ఉంటే..”

“అబ్బెబ్బే.. అది కాదు. ఇవేళ, మా బాస్ నీరజ్ పిలిచి ఒకటడిగాడు..” జరిగింది చెప్పింది.

“నిజమా? కానీ ఆనంద్ వాళ్లింటికి దూరం అయిపోతుంది. ఇప్పుడంటే సుందరక్కని చూడ్డానికి ఇట్టే వెళ్లగలుగుతున్నాం. మరి స్మిత సంగతి.. ఆలోచిద్దాం.” నీరజ్ యమునకి ఇస్తానని చెప్పిన అపార్ట్మెంట్ బాంక్ కి చాలా దగ్గరని చెప్పినప్పుడు, మనసులో సంతోషంగా ఉన్నా, పైకి మామూలుగా అన్నాడు. ఇల్లు మారడం అంటే అంత సులభం కాదు మరి.

అక్కడికి మారుతే, యమున, గిరి కూడా నడిచి వెళ్లచ్చు.

స్మిత ఆ సమస్యని ఇట్టే తేల్చి పారేసింది.

“నేనొక్క దాన్ని ఎలాగో ట్రైన్లో వెళ్లొస్తాను. లైబ్రరీలో ఆలిశ్యమైతే మామయ్య వాళ్లింట్లో ఉండిపోతాను. మీకు వీకెండ్ జాబ్స్ ఎలాగా ఇక్కడే కదా.. అప్పుడు అమ్మమ్మని చూడచ్చు.”

“కానీ వీకెండ్ పని చెయ్యాలని అన్నాడు మా బాస్”

“అదేం ప్రాబ్లం కాదమ్మా! అద్దె ఇస్తామంటే సరి. ఇక్కడివ్వట్లా? ఇంత కంటే ఎక్కువుండదు అక్కడ.” స్మిత అన్న మాట నిజమే.

“మీరు పాత ఇంటికి ఇచ్చినంతే ఇవ్వండి.” అన్నాడు నీరజ్.

ఇల్లు మారడంలో గిరి శిష్యులు ఒక సైన్యంలా వచ్చి సహాయం చేశారు. చివరికి, కొత్త ఇంట్లో ఎక్కడవక్కడ సర్దడంలో కూడా.

మారిన ఇల్లు కొంచెం పాతదే కానీ సదుపాయంగానే ఉంది. కొన్ని ఆధునిక పరికరాలు లేవు. వంటింట్లో సింక్లో కూరగాయల తుక్కులూ అవీ కత్తిరించి, వాక్యూమ్ సహాయంతో డ్రైన్ లోపలికి తోసే "గార్బేజ్ డిస్పోజల్" లేదు. మైక్రోవేవ్ ఓవెన్ లేదు. హీటింగ్ సిస్టమ్ కూడా పాతదే. హాల్ మాత్రం చాలా పెద్దగా ఉంది.

"ఇది ఈ ఇంట్లో మిగిలిన లోపాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది." స్మిత హాల్లో ఫైర్ ప్లేస్ పక్కన పడక్కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని అంది.

గిరి, యమున కొత్త ఇంటికి, కొత్త ఉద్యోగాలకి బాగా అలవాటు పడిపోయారు. శనాదివారాలు గిరికి పూజలు లేకపోతే, చెరో ఎనిమిది గంటలూ సెక్యూరిటీ పని, అంతకు ముందులాగే చేస్తున్నారు. అప్పుడే ఆనంద్ ఇంటికి వెళ్లి సుందరి దగ్గర కాసేపు కూర్చుని వెళ్తున్నారు.

"అమ్మా! నాకు కొలంబియా యూనివర్సిటీలో సీట్ వచ్చింది. పి.జి డిప్లమాలో. దానికోసమే ఇంత కాలం కష్టపడ్డా.." ఒక సంవత్సరం తరువాత స్మిత ఆనందంగా వచ్చి చెప్పింది.

"అంటే ఫీజులూ అవీ.. ఎంతవుతాయో చెప్పు. మన దగ్గర ఎంతుందో చూసుకుందాం." లోపల కొంచెం భయంగా ఉన్నా పైకి గంభీరంగా అంది యమున. కొలంబియా అంటే చాలా ఖరీదనే వింది.

"ఫరవాలేదమ్మా! లోన్ తీసుకోవచ్చు." తేలిగ్గా అనేసి లోపలికెళ్ళిపోతున్న స్మితని అపురూపంగా చూసుకుంది. తనకేం కావాలో తెలుసుకుని సాధించుకోగలిగిన పిల్ల. ఎలాగయినా జీవితంలో పైకొచ్చేస్తుంది.

"అన్నట్లు నేను అక్కడే కాంపస్లోనో, దగ్గర్లోనో ఉండాలి. ఇక్కడ్నుంచి కమ్యూట్ చెయ్యడానికి కుదరదు. టైమ్ ఉండదు." మళ్లీ వచ్చి ఒక మాటనేసింది.

"నిండా మునిగిన వాడికి చలేమిటి? ఇంకో పార్ట్ టైమ్ జాబ్ చూసుకుంటే సరి.." గుండె గుభేల్ మన్నా సర్దుకుంది యమున.

●●●

## 23

"నమస్తే గురూజీ!" బాంక్ లోనుంచి బయటికి వస్తున్న గిరిని ఒకాయన పలుకరించాడు. వయసు అరవైకి అటూ ఇటూ ఉంటుంది, సగం బట్టతల. ఉన్న కొద్ది వెంట్రుకల్నీ పొడుగ్గా పెంచి తలంతా సర్దడానికి ప్రయత్నం చేశాడు.

గిరి కూడా నమస్కారం పెట్టాడు, అయోమయంగా చుస్తూ. ఎక్కడా చూసిన గుర్తు రావట్లేదు.

"మనం నీరజ్ సాబ్ కొత్త ఇంటి గృహప్రవేశానికి కలిశాం. మీరు పూజ చాలా బాగా చేయించారు. మేం కూడా ఈ కౌంటీలోనే

ఉంటాం. మేరా నామ్.. గోపాల్ మోడి.”

“నమస్తే జీ.. ఎలా ఉన్నారు? ధన్యవాద్..” గిరి, గోపాల్ పక్కనే నడుస్తూ అన్నాడు.

“మేము ప్రతీ పున్నమికీ సత్యనారాయణ్ మహరాజ్ పూజ చేసుకుందామని అనుంటున్నాము. మీరు చేయించగలరా? అది ఈవినింగ్ ఉంటుంది కదా. మీ పనికి ఇబ్బంది ఉండదు.”

“ష్యూర్ గోపాల్జీ. తప్పకుండా చేసుకుందురు.. చాలా మంచి ఐడియా.”

“ఔర్ ఏక్ కామ్ గురూజీ.. మేం గ్రీన్ కార్డ్ కి అప్ప్లై చేద్దామనుకుంటున్నాం. మా బేటా ఇక్కడ సిటిజన్. ఆ పనిలో మీరు హెల్ప్ చెయ్యగలరా? మీరు ఇంగ్లీష్ బాగా మాట్లాడ్తారు. లెటర్స్ రాయడంలో, బాంక్ కి వచ్చిన వాళ్లకి అక్కడ మీరు హెల్ప్ చెయ్యడం చూశాము. మీకు ఫ్రీ టైమ్ ఉన్నప్పుడు చెయ్యండి.”

“అలాగే.. నమస్తే..” గిరి ఇంటికేసి నడిచాడు. ఆ ఫార్మ్స్ అవీ పూర్తి చెయ్యడం అదీ.. కావలసిన డాక్యుమెంట్స్ తెప్పించడం.. ఇటువంటివన్నీ స్మిత సహాయం తీసుకుని నేర్చుకోవాల్సిందే అనుకుంటూ.

కానీ స్మితకి అస్సలు టైమ్ ఉండటం లేదు.. ఎలాగ?

అటువంటి సహాయం చేస్తే.. అటు గుర్తింపూ, ఇటు డబ్బూ కూడా వస్తాయి. తృణమో ఫణమో చేతిలో పెట్టకుండా ఉండరు.

తలుపు తీసుకుని లోపలికి వెళ్లాడు. వెళ్తూనే సోఫాలో ఒరిగి పోయాడు.

●●●

“ఆనంద్! ఏమయింది?” అతి కష్టం మీద ఆ మాటయినా వచ్చింది యమున గొంతు లోంచి. అదృష్టవశాత్తూ, గిరి సోఫాలో కూలబడిన వెంటనే యమున ఇంట్లోకి అడుగు పెట్టింది. తక్షణం అంబులెన్స్ కి ఫోన్ చేసి హాస్పిటల్ కి తీసుకొచ్చింది, ఎగ ఊపిరి పీలుస్తున్న గిరిని.

కబురు అందిన వెంటనే వచ్చేశాడు ఆనంద్.

“ఇది ఫస్ట్ అటాక్ కాదు అక్కా! మామయ్యేమీ చెప్పలేదా?”

“లేదు. నా కేం తెలీదు.”

“చాలా సంవత్సరాలు సిగరెట్ పొగ పీల్చిన ఫలితం. లంగ్స్ దెబ్బతిన్నాయి. జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ స్ట్రైన్ అవకూడదు. జాబ్ చెయ్యగలరా అనేది అనుమానమే. అసలు ఇంత కాలం ఎలా నడిపించారా అనేదే ఆశ్చర్యంగా ఉంది. నిబులైజర్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. కేర్ఫుల్ గా ఉంటే ఫరవాలేదు. మందులు వాడుతూ ఉండాలి. రేపు ఇంటికి తీసుకెళ్లిపోవచ్చు.”

యమున గుండెల నిండుగా గాలి పీల్చుకుంది. బాధ పడుతున్న గిరిని చూస్తుంటే కాళ్లు చేతులూ ఆడలేదు. ఊల శబ్దంతో, ఊపిరి పీల్చడానికి ఇబ్బంది పడుతున్న వాళ్లని చూడడం అదే మొదటి సారి. ఆ తరువాత.. అలవాటయి పోయింది.

“ఇదివరకు ఒక సారి ఫ్లైట్లో వచ్చింది.. ఇంత ఎక్కువగా. మళ్లీ ఇప్పుడే. మధ్యలో ఎప్పుడైన కొద్దిగా ఇబ్బంది అనిపించేది కానీ..

ఇంతలా..” కోపంగా చూస్తున్న యమునని చూసి ఆపేశాడు గిరి.

“అదికాదు నాన్నా! మాకు చెప్పద్దా? అప్పట్నుంచీ మందులు వాడుతుంటే ఇంత వరకు వచ్చేది కాదేమో కదా! అమ్మ రావడం ఒక్క నిముషం ఆలశ్యమైతే..” స్మిత నిష్ఠూరంగా అంది.

“నిజమేనమ్మా! తప్పే.. కానీ ఒక్క మాట.. ఎలాగో జాగ్రత్తగా సిటిజన్ షిప్ వచ్చేవరకూ ఉద్యోగం చేస్తాను. బాంక్ లో అంత స్ట్రైన్ అయ్యే పనేం ఉండదు. మిగిలిన పనులు మానుకుంటాను. ఇండియా వెళ్లడం కూడా. అక్కడ ఆశ్రమం బాగానే నడుస్తోంది. పూజారిగారినే చూసుకోమని చెప్పేస్తాను. సరేనా..” తను ఎంతవరకూ చెయ్యగలడో తెలిసిపోయిన గిరి నీరసంగా అన్నాడు.

“చూద్దాంలెండి. ముందు ఇంటికి వెళ్లి కాస్త తేరుకున్నాక.. ఇటువంటి అవస్థ పడుతూనే మళ్లీ ఇండియా వెళ్లొచ్చారు. ఏమనాలి మిమ్మల్ని..” కాఫీ ఇచ్చి. నిష్ఠూరంగా అంది యమున.

“ఇంక వంటరిగా ఎక్కడికీ వెళ్లను. ప్రామిస్..” గిరి కళ్లు మూసుకున్నాడు, భారంగా ఊపిరి పీలుస్తూ.

●●●

జీవితం అంటే కష్ట సుఖాల కలయికే. అంతా సవ్యంగా సాగిపోతోందని ఆనంద పడుతుండగా ఉన్నట్లుండి శరీరానికో, మనసుకో దెబ్బ తగులుతుంది. హాయిగా సాగిపోతున్న రహదారి వంతెన మీద గండి పడినట్లు. ధైర్యం తెచ్చుకుని దాటుకుని ముందుకు సాగిపోతూ ఉండ వలసిందే..

యమున ఆలోచిస్తూ ముందుకెళ్లి పోయింది.

“ఆంటీ.. ఆంటీ..” హరిత పిలుపు విని వెనక్కి తిరిగింది.

“ఏద్దైనా పని మీద వెళ్తున్నారా?” హరిత ప్రశ్న విని సిగ్గుపడుతూ ఫాక్టరీలోకి వెళ్లింది.

“ఏదో పరధ్యానంలో పడి..” తన బల్ల ముందు కూర్చుని కంప్యూటర్ బూట్ చేసింది.

“యమునాజీ! నమస్తే. మీతో కొంచెం మాట్లాడాలి.” నీరజ్ అప్పుడే అడుగుపెట్టాడు.

యమున ఆందోళనగా చూసింది. ఉద్యోగానికి.. ఏం ప్రమాదం లేదు కదా! అంతా సవ్యంగానే ఉందే.. బొమ్మల తయారీకి, అమ్మకాలకీ ఏమీ ఢోకా లేదు.

“ఫికర్ మత్ జీ! గుడ్ న్యూస్ హై. కొత్త ఫాక్టరీ పెడ్తున్నాము. మిమ్మల్ని అక్కడ సూపర్వైజర్ కింద పంపిద్దామని అనుకుంటున్నాను. పే రైజ్ కూడా ఉంటుంది. మంత్లీ శాలరీ. హాలిడేస్, ఇన్ష్యూరెన్స్.. అన్నీ కవర్ చేస్తాము. ముష్కిల్ ఏమంటే.. ఇక్కడికి ట్వేంటీ మైల్స్ దూరం. రోజూ అంత దూరం కమ్యూట్ చెయ్యడం అదీ మీకు కష్టమేమో అని.. మీకు వీలు కాకపోతే ఇక్కడే కంటిన్యూ చెయ్యచ్చు.”

“అదేం ప్రాబ్లం లేదు. నేను డ్రైవ్ చేసుకుని వెళ్లగలను. థాంక్యూ నీరజ్ సాబ్!” ఒకటి పోతే, ఇంకొకటి వచ్చి జీవితం తులనాత్మకంగా నడుస్తుంటుందేమో.. గిరికి ఆదాయం తగ్గినందుకు, తనకి ఈ అవకాశం వచ్చినట్లుంది. ఉద్వేగంతో యమునకి కళల్లో

నీళ్లు తిరిగాయి.

"లేక్ హై యమునాజీ! నెక్స్ ట్ మంత్ లోపు అన్ని డీటెయిల్స్ చెప్తాను. "

యమునకి కొత్త ఫాక్టరీ ఉద్యోగం చాలా నచ్చింది. కొంచెం గట్టి ప్లాస్టిక్తో బకెట్లు, టబ్స్, చెత్త బుట్టలు, పెద్ద బాస్కెట్స్ వంటివి తయారు చేస్తారు. ఇరవై నిముషాలు డ్రైవింగ్. అయితేనేం జీతం ఐదు వందలు పెరిగింది, నెలకి.

పైగా కొత్తగా చేసిన వస్తువులు వాడి చూసి చెప్పమని తీసుకెళ్లమంటారు. ఎక్కువయినవి పంచేసేది యమున. కొన్ని రోజులకి ఆనంద్ ఇంట్లో, ప్రతాప్ వంటి సన్నిహితుల ఇంట్లో ఆ బకెట్లే వాడ్డం మొదలుపెట్టారు.

ఒక రోజు బార్బరా ఫోన్ చేసింది.

"యమునా! హౌ ఆర్ యు? జాబ్ ఎలా ఉంది?"

"ఫైన్. మీరెలా ఉన్నారు? జాబ్ చాలా బాగుంది... ఏంటి ఫాక్స్ వెళ్లిపోయాడా?" గొంతు తగ్గించి అడిగింది.

"అబ్బే.. ఎక్కడికి పోతాడు? మేమే మారిపోయాం. నీ ఇన్స్పిరేషన్ తోనే." పకపకా నవ్వింది బార్బారా.

"ఏంటి సంగతి.. నేను గుర్తుకొచ్చాను?"

"మా నైబర్ ఒకమ్మాయి ఉంది పేరు రమ.. ఇండియన్ స్టూడెంట్. మీ దగ్గర ఏమైనా దొరుకుతుందేమోనని చేస్తున్నా. వర్క్ పెర్మిట్ లేదుట. అంటే.. తెలుసు కదా! ఇల్లీగల్ గా. ఏమైనా వీలవుతుందా? చాలా ట్రబుల్లో ఉంది పాపం." బార్బరాది సహాయం చెయ్యాలనుకునే తత్వం. అమెరికాలో సాధారణంగా ఎవరూ పెద్ద పట్టించుకోరు పక్కింటి వాళ్ల గురించి.. హాయ్, బాయ్ లు తప్ప.

"కనుక్కుని చెప్తా. ఆ అమ్మాయిని నన్ను పిలవమని చెప్పు. ఇంకేంటి.. సాండీ ఎలా ఉంది?"

"అందరం ఫైన్.. మనం ఒక సాటర్ డే లంచ్ కి కలుద్దాము. బోలెడు కాచ్ అప్ ఉంది. బై."

వస్తూనే నమస్కారం పెట్టింది రమ. మొహంలో బిడియం, అమాయకత్వం కనిపిస్తున్నాయి.

"చాలా థాంక్స్ ఆంటీ! మీ వల్లనే నేను నా చదువు పూర్తి చెయ్యగలుగుతున్నా. ఈ సెమిస్టర్ కి ట్యూషన్ వైవర్ వచ్చింది కానీ.. ఉండడానికి, తినడానికీ డబ్బు లేక, తిరిగి వెళ్లిపోవాలేమో అనుకున్నా." కృతజ్ఞత అంతా కళ్లల్లో చూపిస్తూ అంది.

రమ తెలుగు అమ్మాయి అవడం యమునకి ఎంతో సంతోషం కలిగించింది.

"ఏముందమ్మా! మన చేతిలో ఉన్నది.. మాట చెప్పడమే కదా.." కంప్యూటర్ దగ్గర్నుంచి లేచి వేళ్లు నొక్కుకుంది యమున. పనిలో కూర్చుంటే తెలియలేదు కానీ, రెండు గంటలు పైనే కీ బోర్డ్ మీద వేళ్లు టకటక లాడించింది. లేస్తుంటే నడుం దగ్గర కలుక్కు మంది. ఒక వారం విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందేమో అనిపించింది. కానీ.. ఎలా? చూడాలి..

రమని తీసుకోవడం వల్ల కొద్దిగా పని తగ్గినట్లే అనిపించింది. నీరజ్ కి కూడా తృప్తిగానే ఉంది.. లీగల్ గా ఇచ్చే దాంట్లో సగం ఇస్తే చాలు.

రమ వచ్చి రెండు నెలలయింది. తనకి పని తగ్గింది కానీ.. ఏదో తెలియని, చెప్పలేని అసౌకర్యం. అన్ ఈజీగా.. టెన్షన్ గా...

ఎందుకో యమునకి అర్ధం కాలేదు మొదట్లో. ఈ మధ్యనే కొంచెం కొంచెం అర్ధమవుతోంది.

రమ పని చేస్తున్నట్లే ఉంటుంది.. పది నిముషాలకొక్కసారి బయటికెళ్తుంది. అరగంటకొకసారి ఫోన్లో పావుగంట మాట్లాడుతుంది. వస్తూనే సారీ చెప్పి వంద అనుమానాలు వెలిబుచ్చుతుంది.

ఆరోజు ఇంటికెళ్తూనే నిస్త్రాణగా సోఫాలో కూలబడిపోయింది యమున. అటూ ఇటూ కదల్లేక ఎవరైనా గ్లాసుడు నీళ్లిస్తే ..

“ఉఫ్.. ఒక్కదాన్నీ చేసుకున్నప్పుడు హాయిగా ఉండేది. రేపే నీరజ్ వచ్చి అంతా చెక్ చేస్తాడు. పెందరాళే వెళ్లి ఒకసారి చూసుకోవాలి.. అదీ ఆ పిల్ల వచ్చేలోపే! వచ్చిందంటే కాళ్లూ చేతులూ ఆడనియ్యదు.” నెమ్మదిగా నడుం పట్టుకుని లేచి కాఫీ కలుపుకుని తాగింది.

“ఇలా ఎన్నాళ్లు?” నిట్టూరుస్తూ గదిలోకి వెళ్లి మంచం మీద వాలిపోయింది.

అతి త్వరలోనే యమున సమస్య తీరిపోయే పరిస్థితులు వచ్చాయి.

●●●

ఆ రోజు ఆదివారం..

చాలా ఆర్డర్స్ వచ్చాయని, శనాదివారాలు కూడా పని చెయ్యాలని నీరజ్ చెప్పాడు. యమున, రమ శనివారం వచ్చి మూడు వంతుల పని పూర్తి చేశారు. నీరజ్ వస్తే చూపిద్దామంటే.. అతను అర్జంట్ పని మీద చికాగో వెళ్లి, ఆఫీస్ కి రాలేదు. సాయంత్రం వరకూ చూసి, వెళ్లి పోయారు ఇద్దరూ. ఫోన్ చేద్దామనుకుని, ఎందుకు బాస్ కి అనవసరంగా డిస్టర్బెన్స్ అని ఊరుకున్నారు.. అదే వాళ్లు చేసిన పొరపాటు.

ఆదివారం వస్తూనే పని మొదలు పెట్టారు కానీ అరగంటలోపే కరెంట్ పోయింది. సాధారణంగా అలా జరగదు.. ఎక్కడ ఏ సమస్య వచ్చిందో కానీ ఎంత సేపు కాచుక్కూర్చున్నా పవర్ రాలేదు. విసుగొచ్చి నాలిగింటికి ఇళ్ల కెళ్లిపోయారు.

మరునాడు వస్తూనే ముందున్న ఆఫీస్ గదిలో, తల దించుకుని తన బల్ల దగ్గర కుర్చున్న నీరజ్ని చూసి నవ్వుతూ విష్ చెయ్యబోయారు.

అంతే..

నీరజ్ ఉగ్ర నరసింహావతారం ఎత్తాడు.

“మీకు ఎంతో అర్జంట్ అని పని అప్పగిస్తే ఇలాగేనా చేసేది.. వచ్చినవాళ్లు పని చెయ్యకుండా కబుర్లు చెప్పుకుని వెళ్లి పోతారా? ఎంత ఇంపార్టెంట్ ఆర్డర్స్ పోయాయో మీ కేమైనా ఐడియా ఉందా? అసలు పోనీలే అని మిమ్మల్ని పని లోకి తీసుకున్నందుకు నన్ను నేను..” ఐదు నిముషాలు ఆపకుండా వాయించాడు.

“సర్.. నిన్న పవర్..” యమునని మాట పూర్తి చెయ్య నియ్యకుండా మళ్లీ భారతం విప్పాడు..

“ఏంటి పవర్? ఏమయింది పవర్ కి.. పని ఎగ్గొట్టడానికి ఏవో వంకలు.” నీరజ్ వచ్చిన సమయానికి కరంట్ వచ్చేసి, అన్నీ

నిక్షేపంలా పని చేస్తున్నాయి.

ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే యజమానిని చూసిన యమున నోట మాట రాక నిలబడి పోయింది. ఏదైనా చెప్పబోయినా వినిపించుకోకుండా అరుస్తున్నాడు.

ఇంక లాభం లేదని ఏం మాట్లాడకుండా ఊరుకుంది.

కానీ రమ మాత్రం ఊరుకోలేక పోయింది. మొహం ఎర్రగా చేసేసుకుని, కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా, అక్కడ బల్ల మీదున్న తెల్ల కాగితం తీసుకుని పరపరా రాసేసి, నీరజ్ చేతిలో విసురుగా పెట్టేసి.. గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లి పోయింది.

ఏదైనా చెప్పడానికి యమునకి అవకాశమే రాలేదు.

"పోనీ.. ఇట్ ఈజ్ నాట్ మై లాస్.. కమాన్! కూర్చుని, జరిగిన డామేజ్ ఎలా సరిదిద్దాలో చూద్దాం." వణుకుతున్న కాళ్లనీ చేతుల్నీ అదుపులోకి తెచ్చుకుని యమున కంప్యూటర్ దగ్గర కూర్చుంది.

కొంచెం సేపటికే నీరజ్ కి జరిగింది తెలిసిపోయింది. అతననుకున్నట్లు వచ్చిన ఆర్డర్లు వెనక్కి వెళ్లి పోలేదు. అవి పంపే వాళ్లు పవర్ లేక ఏమీ చెయ్య లేక పోయామని రాశారు.

అప్పుడు అతనికి అర్ధమయింది ఏం జరిగిందో.

"అయామ్ సారీ యమునా! నేను నిన్న వచ్చేసరికి పవర్ ఉంది. ఇక్కడ వర్కర్స్.. మీరు ఏమీ చెయ్యకుండా వెళ్లి పోయారని చెప్పారు. ట్వెంటీ థౌజండ్ డాలర్స్ ఆర్డర్స్. అందుకే అప్సెట్ అయ్యాను. ప్లీజ్.. డోంట్ ఫీల్ బాడ్. మనిద్దరం కలిసి ఈ పని పూర్తి చేద్దాం." నీరజ్ గొంతులో కొద్దిగా విచారం..

హు.. యజమాని అంటే అలాగే ఉంటారు..ఆదరించి ఉద్యోగం ఇచ్చి అన్నం పెట్టే వాళ్లు.. ఏదో టెన్షన్ లో అరుస్తే సర్దు కోవల్సిందే. ఫాక్స్ గాడి పద్ధతి వేరు.. వాడు మనసులో పగ పెట్టుకుని సాధించే వాడు. నీరజ్ అన్ని రోజులకి ఒకే ఒక సారి టెంపర్ లూజ్ చేసుకున్నాడు.

రమ అనవసరంగా ఉద్యోగం వదులు కుంది. నయం.. ఏ దేవుడో కరుణించి తనకి సంయమనం ప్రసాదించాడు. అసలే.. గిరి పరిస్థితి కూడా బాగాలేదు.

యమున గట్టిగా ఊపిరి పీల్చి పనిలో పడింది.

రమ వెళ్లి పోయాక, యమునకి ప్రశాంతంగా ఉంది. అసలు అందుకే ఆ రోజు అలా జరిగిందేమో అనుకుంది.

గిరికి మళ్లీ ఆయాసం రాలేదు. అదివరకులా దూరాలు వెళ్ళి పూజలు చేయించట్లేదు. కానీ కాలనీలోనే గుజరాతీ స్నేహితులు పిలుస్తే వెళ్తున్నాడు. అంత చాదస్తంగా కాకుండా త్వరగా పూర్తి చెయ్యమంటారు వాళ్లు. అతనికి అది కూడా బాగానే ఉంది.

మధ్యలో ఇండియా వెళ్లి వచ్చాడు. బంగారత్త ఆశ్రమం ఎలాగా అనుకుంటుంటే.. శివానందం వచ్చాడు ఒక రోజు..

"బావా! నేను కూడా ఇక్కడ ఉందామనుకుంటున్నాను. నిర్వహణలోకూడా పాలు పంచుకోవాలని.."

గిరి ఆనందంగా శివానందం దగ్గరగా వెళ్లి రెండు చేతులూ పట్టుకున్నాడు.

“నేను ఇంక తరచూ రాలేను. నా ఆరోగ్యం సహకరించట్లేదు. ఏం చెయ్యాలా అనుకుంటుంటే ఆ దేవుడు పంపినట్టే వచ్చావు బావా! చాలా థాంక్స్. నా నెత్తిన పాలు పోశావు. నెమ్మదిగా నీకు నమ్మకం ఉన్నవాళ్లకి ట్రైనింగ్ ఇవ్వు.” శివానందానికి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చేశాడు.

అంతా సవ్యంగా జరిగి పోతుంటే అనుకోవాల్సింది ఏముంది?

●●●

స్మిత చదువైపోయాక, న్యూయార్క్ లో ఉద్యోగంలో చేరింది. చదువైపోయిందికదా.. ఇంటి పట్టున ఉంటుందనుకుంది యమున. ఇంక పెళ్లి సంబంధాలు చూడాలి..

అయితే స్మిత వేరే విధంగా అనుకుంది, దూరం అయిందని అంటూ వేరే అపార్ట్మెంట్ తీసుకుని ఇద్దరు ఫ్రెండ్స్ తో కలిసి ఉంటానంది.

“అదేంట్రా! ఇంట్లోనుంచే ట్రైన్ లోనో కార్లోనో వెళ్లచ్చు కదా?” కూతురు తన నిర్ణయం చెప్పినప్పుడు నిష్ఠూరంగా అడిగింది యమున.

“కుదరదమ్మా! నాకు ఆడ్ టైమింగ్స్ ఉంటాయి. మీకు నచ్చదు. పైగా.. నేను ఇంకో డిప్లమా తీసుకోడానికి ప్రయత్నం చేస్తున్నా. అక్కడైతే అది నడిచి వెళ్లే దూరం.”

“నువ్వు నిర్ణయించేసుకుని మాకు మాట వరసకి చెప్తే ఇంకేం అంటాం?”

“అమ్మా! నాకు ఇరవై ఆరేళ్లు వచ్చాయి. ఈ దేశంలో ఉంటూ కూడా ఇంకా నన్ను కంట్రోల్ చెయ్యాలంటే ఎలా? నాకూ జీవితంలో కొన్ని ఆశయాలున్నాయి.. నేను చెడిపోతానని అనుకోకు. ఏం చేసినా నువ్వు తల దించుకునేలా చెయ్యను. సరేనా?”

స్మిత అలా అందే కానీ.. రెండేళ్లు తిరక్కుండానే పెద్ద బాంబు వేసింది.

న్యూయార్క్ లో జాబ్ లో ఉండగానే వాషింగ్టన్ డి.సి లో మంచి ఉద్యోగం.. తను కలలు కనే జాబ్ వచ్చింది. వెంటనే మారిపోయింది.

అప్పుడే క్రిస్మస్ కి వచ్చినప్పుడు తన మరో నిర్ణయం చెప్పింది.

గిరి పైకి ఏం మాట్లాడలేదు.. కానీ నిబులైజర్ వాడకం పెరిగింది.

స్మిత, ఆనంద్, శోభలని పిలిచి ఇంట్లో సమావేశం ఏర్పాటు చేసింది. చేసి.. తన మాటే నెగ్గించుకుంది.

“నా మొండితనమే వచ్చింది దీనికి.” అనుకుని యమున సర్దుకుంది.

●●●

**"యమునా!"** న్యూయార్క్ ఎయిర్ పోర్ట్ లో యమునని దగ్గరగా హత్తుకుంది కావేరి. ఇద్దరి కళ్లల్లోంచీ నీళ్లు చిప్పిల్లాయి. ఒకరినొకరు చూసుకుని ఏడేళ్లయింది. ఒక్కసారిగా పాత జ్ఞాపకాలు తెరలు తెరలుగా చుట్టుముట్టాయి ఇద్దరినీ.

కావేరి కొద్దిగా లావయింది. ముగ్గురు పిల్లలకీ పెళ్ళిళ్లయ్యాయి. అబ్బాయిలిద్దరికీ ముంబాయిలోనే ఉద్యోగాలు. ఒకడు మరాఠీ అమ్మాయిని, ఒకడు తమిళమ్మాయిని చేసుకున్నారు. అమ్మాయి మాత్రం అమ్మానాన్న తెచ్చిన సంబంధం చేసుకుంది. వాళ్లు చెన్నైలో ఉంటున్నారు. కావేరి అత్తవారి తరపున దూరపు బంధువులవుతారు.

"ఎలా ఉంది మనవలతో కాలక్షేపం?" కారులో ఆనంద్ ఇంటికి తీసుకెళ్తూ అడిగింది యమున.

“పెద్దబ్బాయికి ఒకమ్మాయి, ఆరేళ్లది. రెండో అబ్బాయికి కొడుకు, నాలుగేళ్లవాడు. ఇద్దరూ స్కూలు నుంచి కావేరి దగ్గరికి వచ్చేస్తారు. కోడళ్లు ఇద్దరూ ఆఫీసులయ్యాక ఇళ్లకి వెళ్లేటప్పుడు తీసుకెళ్తారు.”

"బాగుందే! ఒకటే ఆడిస్తారు తాతని. మనవలొచ్చాక ఆయన గారి కోపం కాస్త తగ్గింది. పాపం.. ఈ రెణ్ణెల్లూ ఏం చేస్తారో ఏమిటో!"

"ఇంకా ఇంటికెళ్లలేదు.. అప్పుడే బెంగా మనవల మీద? బావ కూడా రావలసింది, నిండుగా ఉండేది." నవ్వింది యమున.

"అవునే.. నీక్కూడా మనవలు వస్తే తెలుస్తుంది. ఇంకెంత, ఒకటి రెండేళ్లాగు. అన్నట్టు విశేషాలు చెప్పు. పెళ్లికొడుకు ఎలా ఉంటాడు? గిరి మామయ్య ఏమీ అనకుండా ఒప్పుకున్నాడా? మీ బావా.. ఇంక వచ్చే ఏడు రిటైర్ అవుతారు కదా! సెలవు పెట్టడానికి.. అదీ ఇన్నాళ్లు కుదరదుట. మళ్లీ వెళ్లాములే అన్నారు."

"నీకు నిద్ర రావట్లేదా?"

"లేదే.. ఫ్రాంక్ఫర్ట్ నుంచి బాగా నిద్రపోయాను. లాండ్ అవడానికి అరగంట ముందు బాత్రూంలోకి వెళ్లి మొహం కడుక్కున్నాను. హాయిగా ఉంది." నిజమే కావేరి తాజాగా అప్పుడే నిద్రలేచి స్నానం చేసినట్లుంది.

"మనం ఇంటికెళ్లడానికి ఎలాగా గంట పైన పడుతుంది. చెప్తాను. అదంతా పెద్ద కథ.. " తనకి తాను చెప్పుకుంటున్నట్లుగా మొదలు పెట్టింది యమున.

●●●

"స్మిత ఇండియాలో ఉన్నప్పుడు చదువు మీద పెద్ద ఆసక్తి కనబర్చేది కాదు. కానీ అమెరికా వచ్చాక, ఇక్కడ యూనివర్సిటీలో, ఉత్సాహంతో తనకి అభిరుచి ఉన్న పాఠ్యాంశాలు తీసుకుని అన్నింటిలో పది పాయింట్లకి తొమ్మిది, ఒకోసారి పది సాధించసాగింది.

నాకే ఆశ్చర్య మేసేది. మొదట్లో ఇంటి పనిలో కల్పించుకుందామని కానీ, ఏదయినా జాబ్ లో చేరి మాకు ఆర్థికంగా సహాయం చేద్దామని కానీ అనుకోవట్లేదని నేను చాలా బాధపడే దాన్ని. ఇక్కడ మేజర్ అయిన పిల్లలు ఏవో ఉద్యోగాలు చేసి, వాళ్ల ఫీజులు వాళ్లే కట్టుకుంటారు. డబ్బుకి కూడా చాలా ఇబ్బందిగా ఉండేది. పదకొండు, పన్నెండు గంటల వరకూ నిద్ర లేవకపోవడం, యువరాణీలా తండ్రి వంటా, ఇంటి పని చేస్తుంటే పట్టించుకోక, దర్జాగా ఉండడం చూసి నాకు చాలా చిరాకేసింది. ఇలా అయితే అమెరికాలో బతకడం కష్టమని గిరి మామయ్యతో అనే దాన్ని కూడా.

కానీ అతను మాత్రం దాని గురించి ఒక్కసారి కూడా విసుక్కోలేదు. అసలు అదేం చేస్తోందో, ఏమి చెయ్యదలుచుకుందో ఏమీ మాకు చెప్పలేదు. ఏదో జర్నలిజమ్ అనేది. ఎక్కువ చెప్పడానికి మాకు అర్థం అవదనుకునేదేమో మరి.

ఒక ఏడాది కోర్సులు తీసుకుని, ఇక్కడ యమ్మే ఇంగ్లీష్ డిగ్రీ తెచ్చుకుంది. అప్పుడే తనకి సృజనాత్మక శక్తి ఉందని మాకు తెలిసింది. హైద్రాబాద్ లో నిజామ్ కాలేజీలో చదివింది కదా.. చిన్నప్పట్నుంచీ స్కూల్లో చదివేటప్పుడు కూడా దానికి సాహిత్యం మీద అభిరుచి ఉండేదిట. ఇంట్లో మేం ఏమీ పట్టించుకోలేదు. సైన్సు, లెక్కలు రాకపోతే యావరేజ్ అనేదే కదా మన రేంజి. తెలుగులో, ఇంగ్లీష్ లో వ్యాసాలు రాయడం, డిబేట్స్ లో ప్రైజులు తెచ్చుకోవడం అవన్నీ ఉండేవి. అదే ఇంకే పేరెంట్స్ అయినా అవుతే ఎంతో ప్రోత్సహించేవారు.

మా ఇద్దరివీ అత్తెసరు చదువులే.. ఒక్క పిల్ల.. దాని మీద కూడా సరైన శ్రద్ధ పెట్టలేదు మేము. అలా నడిచిపోయింది. అసలు ఎలా బ్రతికామో.. ఏం చేశామో!

ఉండు.. మళ్లీ అనవసర విషయాల్లోకి వెళ్తున్నా..

యమ్మే చదువుతుండగానే అన్ని మాగజిన్స్ లోనూ దాని ఆర్టికిల్స్ పడుతుండేవి.. లైఫ్, రీడర్స్ డైజెస్ట్, సాటర్డే ఈవినింగ్ పోస్ట్, వాషింగ్టన్ పోస్ట్, మిర్రర్.. అలా మంచి వాటిల్లో. మాకే నమ్మకం కలగలేదు.. మన స్మితేనా అనిపించింది. దాని తెలివితేటలతోనే యూనివర్సిటీ ఆఫ్ కొలంబియాలో జర్నలిజంలో పి.జి డిప్లమాకి సీట్ తెచ్చుకుంది. ఫీజు ఎక్కువే..కొంత పార్ట్ టైమ్ చేసీ, కొంత అప్పు తీసుకునీ చదివింది. అంత మంచి యూనివర్సిటీలో సీటు తెచ్చుకుందని ఆనంద్ ఒక టెర్మ్ ఫీజ్ తను కట్టాడు.

అక్కడ చదువు అయి న్యూయార్క్ లో ఒక చిన్న పత్రికలో సబ్ ఎడిటర్ గా చేస్తుండగానే, వాషింగ్టన్ పోస్ట్ పత్రికలో స్టైల్ సెక్షన్ కి సబ్ ఎడిటర్ గా జాబ్ వచ్చింది. చాలా కష్టం అందులో జాబ్ రావడం. అంతే కాదు వేరే పత్రికలకి తను ఆర్టికిల్స్ రాసుకోవచ్చు టైమ్ ఉంటే. ఆ రోజు అనిపించింది నాకూ, గిరి మామయ్యకీ.. ఫరవాలేదు మనం కూడా బాధ్యత సక్రమంగా నెరవేర్చామని.

ఈలోగా మేము కూడా ఒక చిన్న ఇల్లు కొనుక్కుని సెటిల్ అయ్యాము. స్మిత వాషింగ్టన్ లోనే అపార్ట్మెంట్ తీసుకుని ఉంటోంది. ఇక్కడ అమ్మాయిలైనా అలా ఉండడం అలవాటే.

అక్కడే పరిచయమయ్యాడు స్టీవ్.. స్టీవెన్స్ స్మిత్. అతను రిపోర్టర్. రోజూ కలుసుకునేవారు. మొదట్లో చాలా ప్రొఫెషనల్ గా, బెరుగ్గా ఉండేది స్మిత. కానీ అతని చొరవ, కలుపుగోలుతనం, ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే మనస్తత్వం తనని ఆకర్షించాయి. స్నేహానికే  పరిమితమైన పరిచయం ఇద్దరూ ఒక్కరోజైనా చూసుకోకుండా ఉండలేని స్థితి వచ్చింది.

చాలా రోజులు మాకు చెప్పనే లేదు. ఏమంటామో అని భయపడి. స్టీవ్ పెళ్లి చేసుకుందామా అని అడిగాక కూడా చాలా ఆలోచించింది. తనకీ ఇరవైఎనిమిదేళ్లు నిండుతున్నాయి. ఏదో ఒకటి తేల్చుకోవాలి. మేము వెతికిన సంబంధాలు ఏదీ సరిపోలేదు. ఒకసారి మేము వాషింగ్టన్ వెళ్లినప్పుడు పరిచయం చేసింది.. ప్రొఫెషనల్ కొలీగ్ అనే!

ఒక క్రిస్మ స్ కి  స్టీవ్ ని తీసుకుని ఇంటికొచ్చి అతని చేతే అడిగించింది. తన నిశ్చయం కూడా గట్టిగా చెప్పింది."

ఆనంద్ వాళ్ల ఇంటి దగ్గర డ్రైవ్ వేలో కారు ఆపుతూ చెప్పడం ఆపేసింది యమున.

రెండు నిముషాలు అలాగే కూర్చుండి పోయారు అక్కచెల్లెళ్లిద్దరూ.

"అమెరికా వచ్చాక మా సంసారం తీరుగా సాగుతోంది అనుకుంటే ఇదేమో ఇలా చేసింది. యస్ అనక తప్పలేదు మాకు. ఇల్లు వదిలేసి వెళ్లిపోతే అది ఇంకా అప్రదిష్ట కదా!"

"మామయ్య సులభంగా ఒప్పుకున్నాడా? అందులో అతను స్మార్తం అదీ.."

"తను లోపల ఏమనుకున్నారో కానీ పైకి ఏమీ మాట్లాడలేదు. పాపాయి సంతోషంగా ఉంటే చాలు నాకు అన్నారు. రిజిస్టర్ మారేజ్ అయిపోయింది. స్మిత, హిందూ పద్ధతి ప్రకారం చేస్తే కానీ తనకి పెళ్లి అయిన భావన రాదని.. ఫ్రెండ్స్ అందరూ అడుగుతున్నారనీ, పట్టుపట్టింది. అందుకే అన్ని అరేంజ్ మెంట్స్ చేశాము. నువ్వు రావడం నాకు కొండంత ధైర్యాన్నిచ్చిందక్కా! ఇక్కడ ఇటువంటి పెళ్లిళ్లు చాలా కామన్.. మామయ్యే యాభై వరకూ చేయించి ఉంటారు." కారులోంచి దిగి తలుపు వేసి, ట్రంక్ తీసింది యమున.

"అమ్మలూ.. కావేరీ!" వీధి తలుపు తీసుకుని సుందరి బైటికొచ్చింది.

"అమ్మా!" కావేరి గబగబా నడుస్తూ వచ్చి అమ్మని గట్టిగా కౌగలించుకుంది. ఇద్దరి కళ్లల్లో నీళ్లు ధారగా కారుతున్నాయి.

"ఎన్నేళ్లయిందిరా నిన్ను చూసి.." సుందరి నోట్లోంచి మాట సరిగ్గా రావట్లేదు ఉద్వేగంతో. ఐదేళ్ల క్రితం ఒకసారి అందర్నీ చూసి

రమ్మని ఇండియా పంపించాడు ఆనంద్. అప్పుడు చూడ్డమే.. అంతకు ముందు ఆడపిల్లలిద్దరి పెళ్లిళ్లకీ వెళ్లింది.

కావేరి అమ్మని పరికించి చూసింది.. డెభ్భై మూడేళ్లు నిండాయి. సన్నగా కడ్డీలా ఉంటుంది కనుక వయసు అంత తెలీదు. ఏమంత పెద్ద మార్పు లేదు ఆవిడలో. కావేరి మాత్రం కొద్దిగా లావయింది.

యమున, కావేరి కలిసి సూట్కేసుల్ని లోపలికి తీసుకొచ్చారు. పెళ్లికి కావలసిన బట్టలన్నీ కావేరి తీసుకొచ్చింది.. మధుపర్కాలతో సహా.

"ఇంట్లో ఎవరూ లేరేమిటి? నాకు వెల్కమ్ చెప్పడానికి అందరూ గుమ్మం దగ్గరికి వస్తారనుకున్నా.. పెళ్లి కూతురేదీ?" ఇల్లంతా పరికిస్తూ అడిగింది కావేరి.

"వచ్చేస్తారు. పెళ్లి రేపే కదా! మండపం దగ్గర అన్నీ చూసుకుని వస్తామని వెళ్లారు అందరూ. ఆనంద్ హాస్పిటల్ కి వెళ్లాడు." సుందరి మాట ఇంకా పూర్తి కాకుండానే బెల్లు మోగింది.

"హాయ్ దొడ్డా!" స్మిత, తలుపు తీసిన కావేరిని పట్టుకుని గిరగిరా తిప్పేసింది.

"ఉండవే బాబూ! కళ్లు తిరుగుతున్నాయి." స్మిత ఆపేశాక, ఒక అడుగు దూరంగా నిలబెట్టి చూసింది.

"ఊ.. పెళ్లి కళ వచ్చింది. చాలా పెద్ద దాని వైపోయావే.. నాకు చాలా సంతోషంగా ఉంది. అవునూ.. మరి నా ఇంగ్లీష్ అర్ధమవుతుందా మీ స్మిత్ గారికి?"

"చాలా బాగా.. ఇప్పుడు తను కూడా మనలాగే మాట్లాడేస్తున్నాడు. ఒక గంట ఆగు వస్తాడు. చూసి చెప్పువుగాని అల్లుడెలా ఉన్నాడో. ఏవీ పెళ్లి బట్టలు.. దా. చూపించు." పక్కనే ఉన్న హాల్లోకి దారి తీసింది స్మిత.

"దొడ్డమ్మకి తినడానికేమైనా పెట్టకుండా రాగానే పని చెప్తున్నావా?" సుందరి కళ్ల నిండుగా కూతుర్ని చూసుకుంటూ అంది.

"మరేం ఫర్లేదమ్మా. ఫ్లైట్లో అస్తమానూ ఏదో పెట్తూనే ఉన్నారు. కొద్దిగా కొరికినా కడుపు నిండుగా ఉంది, కదలకుండా కూర్చున్నా కదా! నీ చేత్తో మంచి కాఫీ ఇయ్యి." కావేరి కొంగు బిగించి పెద్ద సూట్కేసు తాళం తీసి బట్టలన్నీ సోఫాల్లో పరిచింది.

●●●

"వదినగారూ! వచ్చేశారా? ప్రయాణం బాగా జరిగిందా?" శోభ వస్తూనే కావేరిని గట్టిగా పట్టేసుకుంది.

"అలిగాను పో! నేను వచ్చేసరికి ఇంట్లో ఎందుకు లేవు?". బుంగమూతి పెట్టి అంది కావేరి. కళ్లల్లో మరదల్ని చూసిన ఆనందం..

"ఆడపిల్ల పెళ్లంటే మాటలా మరీ.. మీరేమో రేపు పెళ్లనగా వచ్చారు. నేనొక్కదాన్నేగా వదినకి సహాయం.. పిల్లలంతా కులాసానా? ఇంటికి ఫోన్ చేశారా?"

"ఇదిగో ఇప్పుడు చేస్తా. ఎవరూ గుర్తు చెయ్యలేదు ఇంతవరకూ. చీరలు చూసి చెప్పు ఎలా ఉన్నాయో!"

"సూపర్! మీ సెలెక్షన్ కి ఏం వంక?"

"అత్తా!" నరేన్, సరస్వతి టకటకా చప్పుడు చేసుకుంటూ, చెప్పులు అక్కడున్న క్లాసెట్లోకి విసిరేసి, పక్కనే కూర్చుని పలకరించారు. సరస్వతికి యమున పోలికలు చాలా ఉన్నాయి. ఇద్దర్నీ దగ్గరికి తీసుకుని హత్తుకుంది కావేరి. వాళ్లు రెండు మూడేళ్లకోసారి ఇండియా వెళ్తూనే ఉంటారు. వెళ్లినప్పుడల్లా పెద్దత్త ఇంట్లో వారమైనా ఉంటారు.

అంతలో మళ్లీ బెల్లు.. తలుపు తీస్తే ఆనంద్, గిరి.

"అదేంటి.. ఎలా వచ్చారు? రాత్రి వరకూ రామన్నారు కదా?" శోభ ఆశ్చర్యంగా అడిగింది.

"పెళ్లివారమా ఇంకేవన్నానా! రెండు రోజులు డాక్టర్ రావుకి అప్పచెప్పి వచ్చేశా." ఆనంద్ కూడా కావేరి పక్కన కింద

కూర్చున్నాడు.

"మా బాస్ నాక్కూడా రెండు రోజులు సెలవిచ్చేశాడు.. జీతంతోనే. అమ్మాయి పెళ్లి పెట్టుకుని ఇక్కడేం చేస్తున్నావు అంటూ. కావేరీ! అందరూ బాగున్నారా?" గిరి ఎవరూ అడక్కుండానే చెప్పేశాడు.

"ఇప్పుడు ఇంటికి పెళ్లి కళ వచ్చింది చూశారా? రండి.. జెర్సీ సిటీలో మండీకి వెళ్లి, పూలు, తమల పాకులు తెచ్చాను. లక్కీ.. ఇవేళ మామిడాకులు కూడా ఉన్నాయి. ఫ్లారిడానుంచి అప్పుడే వచ్చాయిట. తోరణాలు కట్టి, కొన్ని ఇక్కడ, కొన్ని పెళ్లి మండపం దగ్గరా కట్టాలి. పువ్వుల మాలలు కొన్ని వచ్చిన వాళ్లకి ఇవ్వడానికి చిన్న ముక్కల కింద కట్ చెయ్యాలి.." శోభ ఆజ్ఞాపిస్తుంటే అందరూ బుద్ధిగా చేశారు.

●●●

"ఇతనా పెళ్లి కొడుకు. అమెరికన్ అంటే తెల్లగా దొరలా ఉంటాడనుకున్నా. వేరుగా ఉన్నాడే?" కావేరి ఆశ్చర్యపోయింది.

"ఈ దేశంలో అన్ని రకాల వాళ్లూ ఉంటారు ఆంటీ! మేము స్పానిష్.. సౌత్ అమెరికా నుంచి వచ్చాము. మా ఫీచర్స్ ఆఫ్రికన్స్ కీ, యూరోపియన్స్ కీ మధ్యగా ఉంటాయి. అలాగే రంగు కూడా అంతే.." స్టీవ్ వివరించాడు."

కావేరి మరింత ఆశ్చర్యపోయింది. నయం ఇంకేమీ అడగలేదు అనుకుంటూ. స్టీవ్ శరీరం చామనఛాయలోఉంది. జుట్టు ఉంగరాలు తిరిగిపోయి, నుదురు పెద్దగా ఉంది. ఎప్పుడూ నవ్వుతున్నట్లుగా ఉంటుంది మొహం.

"ఇతనికి తెలుగు బాగా అర్ధమవుతుంది దొడ్డమ్మా! మా గాంగ్తో హేంగ్ అవుతుంటాడు కద ఎప్పుడూ.. " స్మిత, స్టీవ్ చేతిమీద ఒక్కటిచ్చి అంది. మాట పూర్తవకుండానే గాంగ్ వచ్చేసింది.. గట్టిగా మాట్లాడుకుంటూ.

పొద్దున్న తొమ్మిది గంటలకి పెళ్లి. ఏడు కల్లా అంతా మండపం చేరారు. ఆనంద్ వాళ్ల లొకాలిటీలోనే ఒక కమ్యూనిటీ హాల్లో జరుగుతోంది పెళ్లి. పెళ్లవగానే బ్రంచ్ ఏర్పాటు చేశారు.

ప్రతాప్, రేణుక, మంత్రిప్రగడ.. గిరి శిష్యులంతా బిలబిల్లాడుతూ వచ్చేశారు.

పెళ్లి చెయ్యడానికి వేరే పురోహితుడు, గుళ్లో పూజలు చేయించే శాస్త్రిగారిని పిలిచారు. గిరి పీటల మీద కూర్చోవాలి కదా! స్టీవ్ తల్లిదండ్రులు ఇండియన్ డ్రెస్ వేసుకుని అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. వారి బంధువులు యాభై మంది వరకూ వచ్చారు. వారికయే ఖర్చంతా స్టీవ్ పెట్టుకుంటానన్నాడు.

స్మిత కోరినట్లుగానే శాస్త్రోక్తంగా జరిగింది పెళ్లి. ఎర్రంచు తెల్లని బనారస్ పట్టు చీరలో స్మిత మెరిసిపోతోంది. స్టీవ్ కూడా పట్టు కుర్తా పైజామాలో చూడ ముచ్చటగా ఉన్నాడు.

సుందరి మండపం మీద ఒక వారగా కూర్చుని పెళ్లి అంతా చూసింది.

"మనవరాలి పెళ్లి మరీ!" అంటూ.

అందరూ అక్షింతలు వేసే సమయంలో యమున, గిరి వచ్చి సుందరికాళ్లకి నమస్కరించి, పక్కన కూర్చున్నారు.. కళ్ల నిండుగా కూతుర్నీ అల్లుడ్నీ చూసుకుంటూ.

●●●

రెండు నెలల తరువాత న్యూయార్క్ ఎయిర్పోర్ట్ లో..

"వస్తానర్రా. పెళ్లి బాగా జరిగింది. చూడవలసినవన్నీ చూపించారు. చాలా సంతోషంగా ఉంది నాకు. ముఖ్యంగా యమునని చూస్తే కడుపు నిండిపోతోంది. ఇంత ఆరిందా అవుతుందని అనుకోలేదు నేను ఎప్పుడూ!" కావేరికి ఉద్వేగంతో కళ్లలోంచి నీళ్లు వచ్చాయి.

"అంతా తమ్ముడిదే నక్కా! వాడి సహాయంతోనే.."

ఆగమన్నట్లు చెయ్యి చూపించాడు ఆనంద్.

"మీరు కష్టపడ్డారు, అనుకున్నది సాధించారు. నేను చేసిందేమీ లేదు. ఇక్కడికి రప్పించడం తప్ప." ఎవరైనా పొగిడితే ఆనంద్ ముడుచుకు పోతాడు.

"సరే..సరే! మేం కూడా వచ్చేస్తాం చూడరా తమ్ముడూ.." కావేరి నవ్వుతూ అంది.

"అదేదో చెప్పండి.. రేపే మీ కాగితాలు, మీ కంటే ముందే ముంబాయి చేరతాయి." శోభ కావేరి చెయ్యి పట్టుకుంది.

"కొన్నాళ్లు అయితే మేమే ఇండియా వచ్చేస్తాము. యమునకి బృందావనంలో ఉండాలని కోరిక ఎప్పట్నుంచో!" గిరి అంటుంటే యమున ఆశ్చర్యంగా చూసింది.

"మీకెలా తెలుసూ? బృందావనంలో శుభ్రత లేకపోయినా సరే అక్కడే ఉండాలని నా విష్.. " ఎప్పుడో స్మితకి చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది.

"నీ మనసులో ఏముందో నాకు తెలియదా! బృందావనంలో చిన్న ఇల్లు, అందులో చిన్న కృష్ణుడి గుడీ.. ఇదేగా నీ ఊహ! సరిగ్గా ఐదేళ్లాగు. మంత్రిప్రగడతో చర్చించి ప్రణాళిక వేశాను."

"అయితే మామయ్యా.. సినిమాలకి డబ్బివ్వడమే కాక ఇలాంటి బహుమతులు కూడా ఇస్తావా యమునకి.. అలా అయితే జీవన పోరాటంలో గెలిచినట్లే నువ్వు." అల్లరిగా అంటున్న అక్కని కొట్టడానికి వస్తున్న యమునని తప్పించుకుంటూ సుందరి వెనుక చేరింది కావేరి, అందరూ నవ్వుతుండగా.

●●●

స్మిత పెళ్లి అయి, వాషింగ్టన్ వెళ్లి పోయాక రెండు సంఘటనలు జరిగాయి.

పెళ్లి అయి, పదిహేను రోజులయింది.. ఇంకా ఎవరికీ అలసట తీరనే లేదు.

ఒక ఆదివారం పొద్దున్నే సుందరి తన గదిలో నుంచి బయటికి రాలేదు. శోభ లేపడానికి వెళ్లబోతుండగా.. అప్పుడే యమున గరాజ్ లోంచి లోపలికి అడుగు పెట్టింది.

"అమ్మ ఇంకా లేవలేదు వదినా!" శోభ కేసి గాభరాగా చూసింది యమున.

ఇద్దరూ గదిలోకి వెళ్లే సరికి సుందరి కళ్లు మూసుకుని ఉంది. చెయ్యి పట్టుకుని చూసింది యమున. నాడి ఎక్కడో బలహీనంగా కొట్టుకుంటోంది.

"ఆనంద్ ని లేపుదాం శోభా! నాకేదో భయంగా ఉంది."

శోభ పరుగెత్తుకుంటూ పైకి వెళ్లి హాస్పిటల్ కి వెళ్లడానికి తయారవుతున్న ఆనంద్ ని పిల్చుకొచ్చింది.

ఆనంద్ పరీక్ష చేస్తుండగానే అంబులెన్స్ కి ఫోన్ చెయ్యబోయింది.

"వద్దు శోభా! అమ్మ వెళ్లిపోతోంది. హాస్పిటల్ కి తీసుకెళ్లినా ఏమీ ఉపయోగం ఉండదు. అంతకంటే ప్రశాంతంగా ఆవిడని పంపిస్తే మంచిది."

"అదేంటీ.. అలాగంటావు? మన ప్రయత్నం మనం చెయ్యద్దా?" ఆనంద్ మాట వినిపించుకోకుండా ఫోన్లో నంబర్లు నొక్కబోయింది

"వద్దంటుంటే వినిపించుకోవేంటి.. అక్కడా ఇక్కడా, ఒళ్లంతా తూట్లు పొడవడం తప్ప, ఇంకేం ప్రయోజనం ఉండదు. ఉండు.. అమ్మ కళ్లు తెరుస్తోంది. దగ్గరగా రండి. లాస్ట్ టాక్.. అంతే!" ఆనంద్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

శోభ అయిష్టంగానే సుందరి మంచం పక్కకి వెళ్లింది.

యమున కళ్లు పెద్దవి చేసి అంతా గమనిస్తోంది. ఉన్నట్లుండి ఇదేంటీ.. అయోమయంగా చూస్తూ అమ్మ పక్కన కూర్చుంది. అప్పుడే గిరి కూడా లోపలికి వచ్చాడు, కారు పార్క్ చేసి.

"అరే.. మా నాన్న కూడా ఇలాగే.." అంటూ, సుందరి మంచం పక్కన మోకాళ్ల మీద కూర్చుని, రెండు చేతుల్లోకి సుందరి చెయ్యి తీసుకుని నిమర సాగాడు.

సుందరి ఆయాసంతో ఊపిరి పీలుస్తూనే చిరునవ్వుతో అందర్నీ చూసింది.

●●●

"హాస్పిటల్ కి తీసుకెళ్తే బాగుండేదేమో.." శోభ కొంచెం నిష్ఠూరంగా అంది.. సుందరి పోయిన పదోరోజున.

"శోభా! ఆనంద్ డాక్టరని మర్చి పోతున్నావు. అక్కడయినా వాళ్లే కదా చూసేది! ఎంతమందిని వాడు చూడలేదూ? మనకి దగ్గర వాళ్లు కనుక ఆలా అనిపిస్తుంది. అంత ప్రశాంతంగా వెళ్లి పోయింది.. కన్నకొడుకు చేతుల మీదుగా. అమ్మ ఎంతో అదృష్ట వంతురాలు. నా గురించే ఆవిడకి బెంగ ఎప్పుడూ. మేము కూడా స్థిరపడి ఆనందంగా ఉన్నాము. అంత కంటే ఇంకేం కావాలి చెప్పు, ఆఖరికి కావేరి కూడా ఈ మధ్యనే వచ్చి వెళ్లింది." యమున, శోభని ఓదార్చింది.

గిరి దగ్గరుండి ఆనంద్ చేత శాస్త్రోక్తంగా విధులన్నీ చేయించాడు. విష్ణు ఇండియా నుంచి వార్త తెలియగానే వచ్చాడు. అతని రెండో కూతురు బోస్టన్లో ఉంటుంది. పదేళ్ల వీసా ఉంది.

సుందరి మంచితనం గురించి పదే పదే చెప్పుకున్నారు.

"వదిన ఒక్క సారికూడా ఎవరి మీదా కోపగించుకోగా చూడలేదు. అస్సలు ఎప్పుడూ పెద్దగా మాట్లాడ్డం వినలేదు. అంత మంది ఉండే వాళ్లం తన దగ్గర. అమ్మతో కూడా ఎంతో క్లోజ్ గా ఉండేది." విష్ణుకి వదిన గారంటే ఎంతో గౌరవం.

"మీరు అమ్మ లేదు కదాని రావడం తగ్గించద్దు వదినా! ఎప్పట్లాగే ప్రతీ వారం వస్తుండాలి." శోభ, యమునకి బట్టలు పెడ్తూ నెమ్మదిగా అంది.

యమున తలూపింది.. మాటలు కరవైపోగా!

ఒక నెల కూడా గడవకుండానే గిరికి మళ్లీ ఆస్త్మా అటాక్ వచ్చింది. ఈసారి చాలా ఉధృతంగా! డాక్టర్లు రిటైర్ మెంట్ తీసుకుని విశ్రాంతిగా కాలం గడపాలని చెప్పేశారు.

తప్పని సరై, గిరి రాత్రి సెక్యూరిటీ పని మానేశాడు.

వారాంతాలలో చేయించే పూజలు కూడా..

ఆర్థికమైన ఇబ్బందులేం పెద్ద లేవు. యమునకి జీతం బాగా పెరిగింది. గిరికి సోషల్ సెక్యూరిటీ వస్తోంది.. సిటిజన్ అవడంతో. అది కాకుండా ఫిజికల్లీ డిజేబుల్డ్ అలొవెన్స్ కూడా.

స్మిత అడపా తడపా వద్దన్నా కూడా బాంక్ లో కొంత వేస్తుంటుంది. ఇప్పుడు తను హైయర్ ఇన్కమ్ గ్రూప్ లో చేరి పోయింది. న్యూయార్క్ లో ఒక అపార్ట్మెంట్ కూడా కొనుక్కున్నారు.

గిరి ఎక్కువ పొగ లేకుండా చూసుకుంటూ వంట చేస్తుంటాడు. రోజూ రెండు పూటలా నడక.. ఇంటి చుట్టు పక్కల మాత్రమే..

కానీ కాలక్షేపం ఎలా?

గిరికి పిచ్చెక్కిపోతోంది. తనకి టి.వీ చూసే అలవాటు కూడా లేదు. ఇలాగే ఉంటే.. తనకి తెలియకుండానే సిగరెట్లు మొదలు

పెట్టేస్తానేమో అనిపించింది.

టి.వి లో తెలుగు ఛానల్స్ పెట్టించింది స్మిత. అస్సలు ఒక చోట కుదురుగా కూర్చునే అలవాటులేని గిరికి అది కూడా బోర్ గానే ఉంది.

"వెధవ జీవితం.. ఎందుకూ పనికి రాకుండా బతుకుతేనేం.. లే పోతేనేం.." హాయిగా గుండె నిండా సిగరెట్ పొగ.. పీల్చి, రింగులు వదుల్తూ అలా అలౌకిక స్థితిలోకి వెళ్లిపోతుంటే ఎంత బాగుంటుంది.

చెప్పులేసుకుని తలుపు తీశాడు.. అరమైలు నడుస్తే చాలు.. పెట్రోల్ బంక్. అందులో రకరకాల.. రంగు రంగుల పెట్టెల్లో అందంగా పాక్ చేసి.. తళ్ళుకుంటుంటేనే తలంతా తేలిగ్గా అయిపోతోంది.

"అయిపోతుంది నాన్నా! ఆ తరువాత తలే లేకుండా పోతుంది. సూయిసైడల్ అని తెలిసీ.. ఏదో ఒక వ్యాపకం పెట్టుకోరాదూ! వెతుకు.. మనసు పెట్టి వెతుకు. నీకు నచ్చినదేదో దొరక్క పోదు." స్మిత ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లు అనిపించి ఒకడుగు వెనక్కి వేశాడు.

తల విదిలించి, తలుపు వేసుకోబోతుండగా..

"నమస్తే గురూజీ!" గోపాల్ మోడీ ఇంకో ఇద్దరు పెద్ద మనుషుల్ని తీసుకొచ్చాడు.

గిరికి ప్రాణం లేచొచ్చినట్లయింది. మామూలుగా మాట్లాడే మనిషి కరువై పోతాడు ఈ దేశంలో.

"మాఫ్ కర్నా సాబ్! ముందుగా చెప్పకుండా వచ్చేశాం. మీకు హెల్త్ బాగా లేదని తెలిసింది. ఇంట్లోనే ఉంటున్నారంటే.. ఫరవాలేదులే అని వచ్చేశాం."

"అయ్యో! మన్లో మనకి ఆ ఫార్మాలిటీస్ ఎందుకు గోపాల్జీ! రండి. వీరు.." హాల్లో కూర్చోపెట్టి, గ్లాసుల్లో మంచి నీళ్లు అందిస్తూ అడిగాడు.

"వీరిద్దరూ ఈ మధ్యనే గ్రీన్ కార్డ్ మీద వచ్చారు.. ఫామిలీస్ కూడా! వాళ్ల పిల్లలు స్పాన్సర్ చేశారు. ఏ పనీ చెయ్యడానికి కనీసం మాట్లాడే ఇంగ్లీష్ కూడ రాదు. బాంక్ పనులకీ, బజారు పనులకీ అన్నింటికీ పిల్లల మీద ఆధారం అవుతోంది. ఇటువంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. వీరికి టైమ్ పాస్ పెద్ద ప్రాబ్లమ్. మనం ఏదైనా చెయ్యగలమా అని.. మీరు మాకందరికీ సీనియర్ కదా! పైగా వెరీ యాక్టివ్. అందుకే తీసుకొచ్చా." గోపాల్ గ్లాసుడు నీళ్లు గడగడా తాగాడు.

గిరిలో ఒక్కసారి నూతనోత్సాహం వచ్చింది.

"చాలా సంతోషం గోపాల్జీ. తప్పకుండా అందరం కలిసి ఏదో ఉపయోగపడే పని చేద్దాం. కానీ ఒక ప్రాబ్లం ఉంది. నేను ఇంట్లోనుంచి ఎక్కువ బయటికి వెళ్లడానికి లేదు. మీకు తెలుసు కదా! బయట ఎక్స్పోజ్ అయితే మళ్లీ బ్రీదింగ్ ప్రాబ్లం వస్తుంది."

"అవును విన్నా. మనం ఇంట్లోనే కంప్యూటర్ లో చెయ్యగలిగిన పనులే చేద్దాం. మొదటగా మీరు పెద్దగా చదువుకోక పోయినా ఇంగ్లీష్ ఇంతా బాగా మాట్లాడ్డం నేర్చుకున్నారు కదా! అదే అందరికీ నేర్పించండి. అది కంప్యూటర్ వాడి కూడా మీరు చెయ్యవచ్చుట. అలాగే వారానికొక్కసారి మార్కెట్ కి తీసుకెళ్లి వీళ్లకి కావలసిన షాపింగ్ కి సహాయం చెయ్యడం. బాంక్ పనులు.. పేపర్ చదివి విశేషాలు చెప్పడం.."

"ఇంకేం అర్ధమయిపోయింది. అసలు ముందుగా మనం ఒక సంఘం.. అదే, ఒక అసోసియేషన్ ఫార్మ్ చేద్దాం. దాన్ని రిజిస్టర్ చేద్దాం. ప్రతీ నెలా సభ్యులు కొంత చిన్న మొత్తాన్ని కట్టాలని చెప్దాం. ఒక ఆఫీస్ పెడదాం." గిరి మాటలు విని అందరూ చప్పట్లు కొట్టారు.

ఆ విధంగా గుజరాతీ సీనియర్ సిటిజన్ ఫోరమ్, గిరి ఆధ్వర్యంలో ఏర్పడింది.

త్వరలోనే గిరి గుజరాతీ భాష అనర్గళంగా మాట్లాడ్డం నేర్చేసుకున్నాడు. అదే పని మీద కూర్చుంటే.. మెలకువలో, నిద్రలో కూడా అదే ధ్యాస అయితే రాకేం చేస్తుంది..

గిరిని ఫౌండర్ ప్రెసిడెంట్ కింద ఎన్నుకున్నారు. అతను ఇంట్లో కూర్చునే అనుకున్నదంతా ప్లాన్ ప్రకారం చెయ్యగలుగుతున్నాడు. ప్రతీ సర్వీస్ కి నామ మాత్రం ఫీజు తీసుకుంటారు. అందులోనే ఇద్దరు స్టూడెంట్స్ ని పార్ట్ టైమ్ పనిలోకి తీసుకున్నారు.

ఆరోగ్య సమస్యల పరిష్కారం.. ఎటువంటి ఇన్స్యూరెన్స్ తీసుకోవాలో, ఏ హాస్పిటల్ కి వెళ్లాలో.. అపాయింట్ మెంట్ తీసుకోవడం మొదలైన పనులన్నీ హెల్త్ వింగ్ చేస్తుంది.

ఇమిగ్రేషన్ వ్యవహారాలు.. ప్రతీ సంవత్సరం నింపవలసిన ఫార్మ్స్ తీసుకొచ్చి, నింపించి, పంపడం.. సిటిజన్ షిప్ తీసుకోవాలనుకునే వాళ్లకి ఆ ప్రొసీజర్లో సహాయం చెయ్యడం.. తమ బంధువులకి గ్రీన్ కార్డ్ స్పాన్సర్ చెయ్యాలనుకునే వారికి శ్రీ రామ మొదలు చిత్తగించే వరకూ అన్ని పనులూ చెయ్యడం.

ప్రతీ రోజూ న్యూస్ పేపర్ చదివి ముఖ్యమైన విషయాలు చర్చించడం.

ఇండియాలో సేవా కార్యక్రమాలు చేపట్టడం.

డొమెస్టిక్ సమస్యలున్నాయని వచ్చిన వాళ్లకి సామరస్యంగా పరిష్కారం చూపడం..

ఒకటేమిటి.. ఇదీ అదీ అని లేకుండా ప్రతీ చిన్న విషయాన్నీ ఫోరమ్ తీసుకుంటుంది.

చదువుకున్న వారు కూడా ఫోరమ్ సహాయం తీసుకుంటున్నారు.. తమ సమయం వృధా అవకుండా.

గిరి, వాళ్ల ఇంట్లోనే ఫోరమ్ ఆఫీస్ పెట్టారు.. అద్దె మిగులుతుందని.

ఒక సంవత్సరం అయ్యాక.. ఫోరమ్ లో పని ఎక్కువ అవడంతో పార్ట్ టైమ్ కాకుండా ఫుల్ టైమ్ కి ఉద్యోగుల్ని తీసుకున్నారు. గిరికి అద్దె కూడా ఇవ్వడం మొదలు పెట్టారు. పని అయిన వాళ్లు వాళ్ల సంతోషం కొద్దీ ఇచ్చే బహుమానమే లెక్కించ తగినంత ఉంటోంది.

క్రమ క్రమంగా ఇమిగ్రేషన్ ఆఫీసులో, ఇండియన్ కాన్సులేట్లో కూడా గిరి పేరు వినిపించ సాగింది. గుజరాతీలే కాకుండా ఏ ఇండియన్ కి ఏ సమస్య వచ్చినా గిరినే సలహా అడుగుతున్నారు.

యమున పని మానేసి గిరి ఆఫీసులోనే చేస్తోంది.

ఇంట్లోనే ఆఫీస్. ఉరుకులూ పరుగులూ లేవు.

అందరూ తమ దగ్గరకి వచ్చే వారే. ఎందరితోనో పరిచయాలు. ఎన్నో సమస్యలకి పరిష్కారాలు.

అప్పుడప్పుడు మనవడ్నీ, మనవరాల్నీ తీసుకుని స్మిత, స్టీవ్ వస్తుంటారు. ఇద్దరికీ ఒకే ఏడాది తేడా. అచ్చు గిరిలాగే ఉండే సమీర్ తాతని ఒక ఆట ఆడిస్తుంటాడు. మనవరాలు, మాయకి యమున దగ్గర బాగా చేరిక. అప్పుడప్పుడు స్మిత కాంపు కెళ్లినప్పుడు ఇద్దర్నీ వదిలేసి వెళ్తుంటుంది.

●●●

ప్రతీ పండక్కీ ఆనంద్ ఇంట్లో అందరూ కలుస్తారు.

ర్యాలిలో బంగారత్త ఆశ్రమం శివానందం బాగా చూస్తున్నాడు." ఇంకొక ఐదేళ్ల వరకూ నడిపిస్తా.. ఆ తరువాతా.. ఆ కేశవస్వామే ఎవర్నో పంపుతాడు" అంటాడు. ఎప్పుడూ ఆశ్రమం నిండుగానే ఉంటుంది.. బంగారత్త కల ఫలించినట్లే.

సూరమ్మ ఎనభై ఏళ్లు నిండాక, ఆశ్రమానికి తన వంతు పనులు చేస్తూ.. కన్ను మూసింది. ఎవరు కనిపించినా గిరి గురించి గొప్పగా చెప్పేది.

●●●

దేశ వ్యాప్తంగా సీనియర్ సిటిజెన్ ఫోరమ్స్ ప్రెసిడెంట్స్ అందరినీ ఒక దగ్గర సమావేశ పరచారు.. న్యూజెర్సీ సీనియర్ సిటిజన్ ఫోరమ్ వాళ్లు. వంద మంది పైగా ఉన్న ఆ సభకి దేశాధ్యక్షుడు బిల్ క్లింటన్ అధ్యక్షత వహించారు.

ఎక్కువగా సోషల్ వర్క్ చేసిన ఫోరమ్ కింద గిరి వాళ్ల సంఘాన్ని గుర్తించారు.

బిల్ క్లింటన్ షేక్ హాండిచ్చిన ఫొటోలో గిరి నవ్వుతూ వాళ్ల లివింగ్ రూమ్ లో కనిపిస్తాడు ఇంటి కొచ్చిన అతిథులకి.

"యమునా! యమునా.."

"ఊ.. ఏంటీ?"

"తృప్తిగా ఉన్నావా?" గిరికి సందేహం వచ్చింది ఒక రోజు.

"ఫరవాలేదు.."

"జీవన పోరాటంలో గెలిచినట్లేనా?"

"హూ.."

●●●

*ఉపసంహారం ;*

"యమునా! ఇక్కడ.." కావేరి పిలు విని యమున వెనక్కి తిరిగి గబగబా నడుస్తూ కంపార్ట్మెంట్ తలుపు దగ్గరకు వచ్చింది.

అది మథుర రైల్వే స్టేషన్. ఏ.పి ఎక్స్ ప్రెస్ రెండు నిముషాలు మాత్రం ఆగుతుంది. అప్పటికే తలుపు దగ్గిర పెట్టిన పెట్టెని చలాగ్గా కిందికి లాగేస్తూ, కావేరికి చెయ్యి అందించింది.

"అబ్బో! ఏం రైలే బాబూ.. ఒళ్లు హూనం అయిపోయిందనుకో. ఇక్కడ్నుంచి ఎలా వెళ్లడం?"

"టాక్సీ బుక్ చేశానక్కా!"

"ఎలా ఉన్నావే యమునా? ఒక్క దానివే ఉంటున్నావని మా కందరికీ బెంగగా ఉంటుందనుకో.." చక చకా అడుగులేస్తున్న యమున పక్కన ఆయాసపడుతూ నడుస్తూ అంది కావేరి.

"సారీ.. మెల్లిగా నడుద్దాం. ఏమిటో అలవాటైపోయింది పరుగెట్టడం. నేనా.. ఎలా ఉన్నానో నువ్వే చూస్తావు కదా!"

గిరి అన్నమాట ప్రకారం, బృందావనంలో యమునకి ఏర్పాట్లు చేశాడు. కానీ యమున ఒక్కతే రాగలిగింది.

ఊపిరందకుండా ఆస్త్మా అటాక్ వచ్చి ఎంతో బాధపడే గిరి, ఒక రోజు నిద్దట్లోనే.. నిబులైజర్ ఉపయోగించే లోగానే ఆఖరి ఊపిరి వదిలాడు. అప్పటికి ఫోరమ్ స్థాపించి ఐదు సంవత్సరాలయింది.

అంతకు ముందు రోజే బృందావనం లో తను కొన్న అపార్ట్మెంట్ వివరాలన్నీ చూపించాడు గిరి, "త్వరలో ఇక్కడంతా సర్దేసి వెళ్లి పోదాం. ఒక బెడ్ రూమ్ ఉన్న ఇల్లే.. మనిద్దరికీ చాలదూ" అంటూ.

మొత్తం కౌంటీలో ఉన్న ఇండియన్ కుటుంబాల వారంతా వచ్చి సానుభూతి తెలియ జేశారు.

"మీకే కాదు యమునా బెహెన్.. మా కందరికీ కూడా పెద్ద లాస్." గోపాల్ మోడీ వెక్కుతూ అన్నాడు.

యమున ఇల్లు ఫోరమ్ వాళ్లే కొనేశారు. హాల్లో గిరి ఫొటో.. పెద్దది ఫ్రేమ్ కట్టించి పెట్టారు. వచ్చిన వాళ్లని నవ్వు మొహంతో గిరి పలకరిస్తుంటాడు.

ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు మొత్తం అంతా స్మితకి ఇచ్చేసి, బృందావనం వచ్చేసింది.

"నాదగ్గరున్న సేవింగ్స్, వచ్చే సోషల్ సెక్యూరిటీ నాకు సరిపోతుంది. అంతగా అవసరమైతే నువ్వే పంపచ్చు." ఎందుకమ్మా

ఇలా అని అడిగిన స్మితకి సమాధానం ఇచ్చింది.

●●●

"చాలా బాగుందే యమునా! నాక్కూడా ఇక్కడికొచ్చెయ్యాలనిపిస్తోంది." అపార్ట్మెంట్లోనే ఉన్న చిన్న గుడిలో భజన అయ్యాక, ఇచ్చిన ప్రసాదం తింటూ అంది కావేరి.

"రాధే.. రాధే! దాందేముంది.. వచ్చెయ్యక్కా! పక్కనే ఒకటి ఖాళీగా ఉంది. ఏ సమస్యలూ పోరాటాలూ లేకుండా హాయిగా భజన చేసుకుంటూ ఉండచ్చు."

**(సమాప్తం)**

***నవల వెనుక కథ***

*"భానూ! 'నీ రామాయణం మామయ్య' నవల చదివాను. నా కథ కూడా రాయవా?" ఒక రోజు మా దగ్గర బంధువు, రమణక్క ఇంటికొచ్చి అడిగింది.*

*సాధారణంగా బంధువుల గురించీ, స్నేహితుల గురించీ నా నవలల్లో చెప్పను.. వ్యక్తిగత స్వేచ్ఛకి ఆటంకం అని. కానీ.. రాయమని అడుగుతే.. వాళ్ల అనుభవాలు నవల రాయగలిగినంత ఉంటే.. ప్రయత్నం చేస్తాను.*

*మా సూర్యం మామయ్య అలా అడుగుతేనే పైన రమణక్క చెప్పిన నవల వచ్చింది.*

*"అయితే నీ గురించి చెప్పు మరీ.." అన్నాను.*

*అప్పటికే తను బృందావంలో స్థిరపడింది. తను ఉన్న వారం రోజులూ తన జీవన పోరాటం గురించి చెప్పింది. అదే ఇన్ని నెలలూ మీరు చదివిన కథ.*

*ఇందులో యమున, గిరిలు చాలా మటుకు రమణక్క, పురుషోత్తం బావల అనుభవాల్లోంచి పుట్టిన వారే. మిగిలిన పాత్రలలో కొందరు వారి నిజ జీవితంలో ఉన్న వారు. కొన్ని పాత్రలు, ఊహా జనితాలు.. సందర్భాను సారంగా వచ్చిన అతిథులు.*

*అదండీ మా రమణక్క కథ.. మీకు నచ్చిందనుకుంటాను.*

*ఈ నవలని ప్రచురించిన కౌముది సంపాదకులకు, ఆదరించిన పాఠకులకు కృతజ్ఞతలు.*

**మీ**

**మంథా భానుమతి.**